

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15

సంచిక: 284

బుధవారం 4-1-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

G SQUARE EPITOME
YOUR PLOT. YOUR HOME. YOUR WAY.

G SQUARE EPITOME
YOUR PLOT. YOUR HOME. YOUR WAY.

విజయవాడ హైవే
రాబోయే కాలానికి కాబోయే
గచ్చిబౌలి

ఎందుకంటే...

హైదరాబాద్ నగరం ఒక ఆధునిక నగరంగా ఉజ్వల భవిష్యత్తును ఆవిష్కరిస్తున్న సమయంలో విజయవాడ హైవే కూడా అనేక మంది కలలను నిజం చేస్తానని హామీ ఇస్తోంది. పరిశ్రమల సముదాయంగా ఉద్భవిస్తున్న ఈ హైవే, అనేక కంపెనీలకు ఎన్నో కొత్త అవకాశాలను అందిస్తోంది.

7
ప్రధాన జిల్లాలు ఈ హైవేపై విస్తరించి ఉన్నాయి తెలంగాణలో - సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి, మేడ్చల్-మల్కాజిగిరి, పోచంపల్లి, రంగారెడ్డి మరియు హైదరాబాద్; ఆంధ్రప్రదేశ్‌లో - కృష్ణా జిల్లా

5
పోర్టులు ఈ హైవేకి అందుబాటులో ఉన్నాయి నవీ ముంబై, కాకినాడ మరియు కృష్ణపట్నంతో పాటు సమీపంలో ఉన్న కొత్త పోర్టులు మచిలీపట్నం మరియు నెల్లూరు.

40
ఎకరాల HMDA (హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ట్రక్ డాక్ మరియు బాటసింగారం వద్ద లాజిస్టిక్స్ పార్క్

247
కి.మీ పొడవైన రహదారి - ఆంధ్రాలో విజయవాడని, తెలంగాణాలో హైదరాబాద్‌ని కలుపుతున్నది.

2000
ఎకరాల రామోజీ ఫిల్మ్ సిటీ ఈ రహదారికి సమీపంలో ఉంది.

2000
ఎకరాల గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్, దండుమల్కాపూర్ వద్ద.

నిపుణుల మాటే మా మాట!

"గత 4-5 ఏళ్లలో మేము చేపట్టిన కార్యక్రమాలు, పథకాలకు సానుకూల స్పందన లభించింది. హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతోంది కనుక పరిశ్రమలను రింగ్ రోడ్డు దాటి తరలించాల్సిన అవసరం ఉంది. తూర్పు బెల్ట్, విజయవాడ హైవే మార్గంలో ఉన్న నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి సున్నపురాయి నిక్షేపాలతో సమృద్ధిగా ఉన్నందున అద్భుతమైన పారిశ్రామిక అభివృద్ధికి సంకేతంగా ఈ హైవే నిలుస్తోంది. ఈ ప్రదేశాలు స్పేస్‌టెక్ స్టార్టప్‌లు మరియు ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్‌లకు తగిన అవకాశాలను అందిస్తాయి. కార్పొరేట్ అభివృధితో పాటు వరంగల్, కరీంనగర్ మరియు ఖమ్మంలోని ఐటీ కంపెనీల కోసం ప్రపంచ స్థాయి శాటిలైట్ సిటీల అభివృద్ధికి నడుం బిగించింది. అంతేకాక ఓడరేవులకు ఈ హైవే సమీపంలో ఉన్నందున పరిశ్రమలకు అనుకూలంగా ఉంటుంది."



GUMMI RAM REDDY
VP, CREDAI National; Founder & MD, ARK Group

"హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ అభివృద్ధికి తూర్పు కారిడార్ మొదటి అవెన్యూ. ప్రభుత్వం మరియు రియల్ ఎస్టేట్ పరిశ్రమ తూర్పు ప్రాంతం మరియు నగరం అభివృద్ధికి చాలా అవకాశాలను కల్పించాయి."



RAGHAVENDRA REDDY
Co-Founder, BlueCopa

"నిజానికి రియల్ ఎస్టేట్ సెగ్మెంట్ హైదరాబాద్‌లో విజయవాడ హైవే వైపు వేగంగా దూసుకుపోతోంది. బెంగుళూరు పారిశ్రామిక వ్యవస్థ రద్దీగా ఉండటంతో, చాలా మంది ప్రతిభావంతులు మరియు కంపెనీలకు హైదరాబాద్ అనుకూల ప్రదేశం కానుంది. వీరు హైదరాబాద్ వెళ్లే కొద్దీ పరిశ్రమలు ఆటోమేటిక్‌గా అభివృద్ధి చెందుతాయి. సుస్థిరమైన వ్యాపార కారిడార్‌ను నిర్మించడానికి అవసరమైన సాంకేతికత, ప్రతిభ మరియు భౌగోళిక ప్రయోజనాలు ఇప్పుడు హైదరాబాద్ వద్ద మెండుగా ఉన్నాయి."



GIPSON PAUL
Sr. Executive Director, CBRE (CB Richard Ellis) & Transaction Advisor

"విజయవాడ హైవే కారిడార్ సమీప భవిష్యత్తులో చాలా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ప్రభుత్వం ఇండస్ట్రియల్ కారిడార్‌ను ప్రకటించడంతో వృద్ధి వేగవంతం అవుతుందని అంచనా. అంతేకాకుండా, సామాజిక మౌలిక సదుపాయాల కల్పన ఈ కారిడార్ అభివృద్ధికి చేయూతనిస్తుంది."



ESHWAR N
CEO, G Square Housing

"గత 8-10 సంవత్సరాలలో విజయవాడ హైవే ఎంతో అభివృద్ధి చెందింది. ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే విజయవాడ హైవే అద్భుతమైన ROI తో అభివృద్ధి చెందుతోంది. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు కూడా ఇందుకు కారణం."

ఉజ్వల భవిష్యత్తుకు మార్గం

- 30,000 వరకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఐదు కొత్త ఐటీ పార్కులు హైదరాబాద్ ఈస్ట్ లో రానున్నాయి.
- MSMEల కోసం కొత్త ఇండస్ట్రియల్ పార్కులు దండుమల్కాపూర్ & చౌటుప్పల్ లో తెలంగాణ పారిశ్రామిక వేత్తల ఫెడరేషన్ అభివృద్ధి చేయాలని భావిస్తోంది.
- తూర్పున చౌటుప్పల్ & ఇబ్రహీంపట్నం కలుపుతూ కౌలాలంపూర్ నుండి సింగపూర్ యాక్సెస్ కంట్రోల్ ఎక్స్‌ప్రెస్‌వే తరహాలో RRRను అభివృద్ధి చేయనున్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం తూర్పు హైదరాబాద్ IT కారిడార్ అభివృద్ధి ద్వారా గ్లోబల్ టెక్నాలజీ మరియు డిజిటల్ హబ్‌గా భారతదేశం స్థానాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారిస్తోంది.
- ₹ 545 కోట్ల ఖర్చుతో రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి 65 మల్కాపూర్ వరకు విస్తరణ.
- బాటసింగారం వద్ద రెండవ HMDA ట్రక్ డాక్ లాజిస్టిక్స్ పార్క్ 40 ఎకరాలలో.
- మంగళపల్లిలో 22 ఎకరాల విస్తీర్ణంలో మొదటి లాజిస్టిక్ పార్క్.
- చౌటుప్పల్ మండలం దండుమల్కాపూర్ గ్రామంలో 354.15 ఎకరాల విస్తీర్ణంలో అన్ని గ్రీన్ కేటగిరీ పరిశ్రమలు ఉండేలా గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును TSIIC ఏర్పాటు చేసింది.

• మానసిక రుగ్మతలపై స్టడీ

పిల్లల కోసం తల్లిదండ్రుల కొత్త తీర్మానాలు



ఇంట్లో ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే రకరకాల ఉపచారాలు చేయడానికి సిద్ధపడతారు. కానీ, మానసికంగా బాగోలేదంటే మాత్రం దానికంత ప్రాముఖ్యం ఇస్తున్నట్టు ఎక్కడా కనిపించదు. ముఖ్యంగా పిల్లల విషయంలో... అంటోంది యునిసెఫ్.

పిల్లల మానసిక స్థితి ఏయే దేశాల్లో ఏవిధంగా ఉందో తెలుసుకోవడానికి గత ఏడాది యునిసెఫ్ ఓ ప్రయత్నం చేసింది. అందులో భాగంగా 21 దేశాలలో 20,000 మంది పిల్లలు- పెద్దలతో ఒక సర్వే నిర్వహించింది. మిగతా దేశాలతో పోల్చితే భారతదేశంలోని పిల్లలు మానసిక ఆరోగ్య చికిత్సను పొందేందుకు ఇష్టపడరని తేలింది. విదేశాలలో మానసిక ఆరోగ్య సమస్యల పట్ల సగటున 83 శాతం మంది స్పందిస్తే, 15 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత 41 శాతం మాత్రమే మానసిక చికిత్సకు మద్దతునిచ్చారని తేలింది.

ఇతరులను కలవాలనుకోరు..

మిగతా దేశాలతో పోల్చితే భారతీయ పిల్లలలో మానసిక రుగ్మతలను గుర్తించడం పెద్దవాళ్లకు కష్టంగా ఉంటుంది. అమ్మాయి లేదా అబ్బాయి పెరుగుతున్నప్పుడు అనేక శారీరక, మానసిక భావోద్వేగ మార్పులకు లోనవుతారు. అందుకు తగిన చికిత్స లేదా సహాయం తీసుకోవడానికి ఇష్టపడరు. 2019లో ఇండియన్ జర్నల్ ఆఫ్ సైకియాట్రీలో ప్రచురించిన ఒక అధ్యయనం, కరోనా మహమ్మారి రాకముందే 50 మిలియన్ల మంది భారతీయ పిల్లలు మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని నివేదించింది. వీరిలో 80 నుంచి 90 శాతం మంది చికిత్స తీసుకోలేదు. ఈ అసమానతలు ఉన్నప్పటికీ, ఇండియన్ జర్నల్ ఆఫ్ సైకియాట్రీ 2017 ప్రకారం, భారత దేశం తన హెల్త్ బడ్జెట్‌లో ఏటా 0.05 శాతం మాత్రమే మానసిక ఆరోగ్యం కోసం ఖర్చు చేస్తోంది.

సరైన తీర్మానాలివే!

ఎడిహెచ్‌డి, ఆందోళన, ప్రవర్తనా సమస్యలు, నిరాశ అనేవి పిల్లలు- యుక్తవయస్కులలో అత్యంత ప్రబలంగా ఉన్న న్యూరో బిహేవియరల్ డిజార్డర్‌గా చెప్పవచ్చు.

- మానసిక నిపుణులు, మీరు.. పిల్లలతో కలిసి కూర్చుని, వారి నూతన సంవత్సర తీర్మానాలుగా నిర్దేశించాలనుకుంటున్న లక్ష్యాలను చర్చించాలి.
- ప్రవర్తనలో ఆకస్మిక మార్పులను గమనించాలి. ఇలాంటప్పుడు పిల్లలకి మానసిక బలం అవసరమని సూచించే అనేక సంకేతాలు కనిపిస్తాయి. ఇందులో స్నేహితులు, కుటుంబ సభ్యుల నుండి ఒంటరిగా ఉండటం, నిత్యకృత్యాలను పాటించకపోవడం, పిల్లలు సాధారణంగా ఆనందించే కార్యకలాపాల నుండి వైదొలగడం వంటి ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు ఉంటాయి.
- పిల్లలు చెప్పేది ఓపికగా వినాలి. ఇబ్బందులు ఎదురైతే మద్దతుగా ఉంటానని భరోసా ఇవ్వాలి.
- పిల్లల పట్ల అధిక పర్యవేక్షణ, సానుభూతి చూపించడం తగ్గించాలి. అలాగే వారి మీద తక్కువ అంచనాలు ఉండాలి.
- రోజువారీ షెడ్యూల్‌లు, పనితీరు కారణంగా పిల్లలు తరచు అధిక స్థాయి ఒత్తిడి, ఆందోళనకు గురవుతారు. అందుకని, రోజువారీ దినచర్యలను అనుసరించడంలో పిల్లలకు సహాయపడాలి. చురుకైన జీవనశైలిని గడపడానికి ప్రోత్సహించాలి.
- పెద్దలు భావోద్వేగాలను వ్యక్తం చేసే విధానాన్ని పిల్లలు నిరంతరం గమనిస్తూనే ఉంటారు. ఒత్తిడిని తగ్గించుకోవడానికి తరచుగా దీర్ఘ శ్వాస తీసుకోవడం, రంగులు వేయడం, పెయింటింగ్ చేయడం, నడవడం లేదా సంగీతం వినడం వంటి కార్యకలాపాలలో పాల్గొంటాం. మన పిల్లలు ఒత్తిడిని ఎదుర్కోవడంలో, వారి జీవన నైపుణ్యాలను బలోపేతం చేయడంలో సహాయపడటానికి చిన్నప్పటినుంచే ఇలాంటి వ్యూహాలను పరిచయం చేయవచ్చు.
- ఆటలు, పాటలు, నృత్యం వంటి బృంద కార్యకలాపాలలో పాల్గొనడం ఒత్తిడిని తగ్గిస్తుంది. భావోద్వేగ, సామాజిక నైపుణ్యాలను అభివృద్ధి చేస్తుంది. విశ్వాసాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. దీనివల్ల అవకాశాలూ పెంపొందుతాయి.
- సానుకూల అభిప్రాయం, ప్రోత్సాహం సరైన ప్రవర్తనను పునరావృతం చేసేలా వారిని ప్రేరేపించడమే లక్ష్యంగా ఎంచుకోవాలి. మీరు సపోర్ట్‌గా ఉన్నారని చేతల్లో చూపడం, సురక్షితమైన వాతావరణాన్ని అందించడం కూడా అంతే ముఖ్యం.

బ్యూటీ టిప్
ట్యాన్ తొలగాలంటే...

- గిన్నెలో టేబుల్ స్పూన్ చొప్పున తేనె, కొబ్బరి నూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకోవాలి. ఐదు నుంచి పది నిమిషాల తర్వాత గోరు వెచ్చని నీటితో కడిగేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- తేనెలో ఉండే హైడ్రాక్సిల్ యాసిడ్, ఇతర ఎంజైమ్స్ చర్మం మీద ఉన్న మొటిమల కారణంగా ఏర్పడిన మచ్చలను తగ్గించి స్కిన్ టోన్‌ను మెరుగుపరచడంతో పాటు చర్మ కణాలను ఆరోగ్యంగా మారుస్తాయి. కొబ్బరి నూనెలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ముదిమి ఛాయలు రాకుండా, చర్మం ముడతలు పడకుండా కాపాడుతాయి. దీనివల్ల స్కిన్ టెక్స్చర్ సైతం మెరుగుపడుతుంది.

నేడు ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం

మునివేళ్లపై భవిష్యత్తు

అంధురాలైన రేషమ్ తల్వార్ తన భవిష్యత్తు బాగుండాలంటే బ్రెయిలీ నేర్చుకోక తప్పదని తొమ్మిదేళ్ల వయసులోనే గ్రహించింది. బ్రెయిలీలోనే ఢిల్లీ యూనివర్సిటీలో డిగ్రీ ఇగ్నోలో పి.జి చేసింది. ఆ చదువు ఆమెకు ఆత్మవిశ్వాసం ఇచ్చింది. నేడు సక్సెస్‌ఫుల్ రేడియో జాకీగా ఆమెకు ఉపాధిని ఇస్తోంది. చెన్నైకి చెందిన అంధురాలు బెనో జెఫైన్ బ్రెయిలీలో దొరికే మెటీరియల్‌లో ఐ.ఏ.ఎస్‌కు ప్రిపేర్ అయ్యి ఐ.ఎఫ్.ఎస్ సాధించిన తొలి అంధ మహిళగా రికార్డు స్థాపించింది. స్త్రీలు అంధులైతే కుటుంబాలు వారిని ఇంట కూచోబెడతాయి. కాని బ్రెయిలీ అనే అలీబాబా దీపాన్ని రుద్ది వారు అద్భుత విజయాలు సాధిస్తూనే ఉన్నారు. చీకటి తమ వెలుతురుకు అడ్డు కాదంటున్నారు.


• రేషమ్ తల్వార్



మన దేశంలో కోటీ యాభై లక్షల మంది పాక్షిక/పూర్తి అంధులు ఉన్నారు. వారిలో 2 లక్షల మంది చిన్నారులు. భారత్ వంటి వెనుకబడిన దేశాలలో అంధుల శాతం ఎక్కువ. దీనికి కారణం గర్భధారణ సమయంలో సరైన పరీక్షలు చేయించకపోవడం, పుట్టిన వెంటనే కంటి సమస్యలను గుర్తించకపోవడం, జన్మించాక వచ్చే ఐ ఇన్ఫెక్షన్స్‌కు సరైన చికిత్స చేయించకపోవడం, పిల్లల్లో వచ్చే హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టి వంటి సమస్యలకు కూడా అద్దాల వంటి సహాయక పరికరాలను ఉపయోగించకపోవడం. అంధులుగా జన్మించడం అంటే వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, సామాజికంగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొనడం. అబ్బాయిలు అంధులుగా పుడితే కుటుంబం ఏదో ఒక మేరకు వారికి తర్ఫీదు ఇవ్వడానికి ప్రయత్నిస్తుంది. కాని అమ్మాయి అంధురాలైతే చాలా మటుకు నిరుత్సాహమే ఎదురవుతుంది.

అంధుల అక్షరాస్యత

కళ్లున్న వాళ్లకు అక్షరాస్యత ఉన్నట్టే అంధులకు కూడా అక్షరాస్యత ఉంటుంది. మన దేశంలో అంధుల అక్షరాస్యత కేవలం ఒక శాతం. బ్రిటన్‌లో ఇది 4 శాతం ఉంది. అంధుల అక్షరాస్యత అంటే బ్రెయిలీని చదవడం రాయడం రావడమే. లూయిస్ బ్రెయిలీ అనే ఫ్రెంచ్ అంధ విద్యావేత్త రూపకల్పన చేసిన బ్రెయిలీ కోడ్ పుట్టి 200 ఏళ్లు అయినా 70 ఏళ్ల క్రితమే భారతీయ భాషల కోసం ఉమ్మడి 'భారతీ బ్రెయిలీ'ని మనం తయారు చేసుకున్నా నేటికీ బ్రెయిలీ అంధ విద్యార్థులకు అందని ఫలంగానే ఉంది. సంప్రదాయ బ్లైండ్ స్కూళ్లు, కాలేజీలలో బ్రెయిలీ నేర్పిస్తున్నా సమ్మిళితంగా (ఇన్‌క్లూజివ్) మామూలు పిల్లలతో కలిసి చదువుకోవాలనుకునే పిల్లలకు బ్రెయిలీ అందడం లేదు. దీనికి కారణం తగినంత మంది స్పెషల్ టీచర్లు లేకపోవడం, విద్యార్థులు ఎక్కువగా ఆడియో పాఠాల మీద ఆధారపడటం. కాని ఆడియో పాఠాలు విని సహాయకునితో పరీక్ష రాసి పాసైనప్పటికీ బ్రెయిలీ చదవడం, సొంతగా రాయడం రాకపోతే వారు నిరక్షరాస్యులు అవుతారు. తాముగా చదవగలం, రాయగలం అనే భావనే ఆత్మవిశ్వాసం ఇవ్వగలదు.

ప్రతికూలతలను దాటి

ఇన్ని ప్రతికూలతల మధ్య కూడా అంధత్వాన్ని జయించి ముందుకు సాగిన స్త్రీలు స్ఫూర్తిమంతంగా నిలుస్తున్నారు. చెన్నైకి చెందిన బెనో జెఫైన్ పుట్టుకతో అంధురాలైనా బ్రెయిలీలో చదువుకుంది. ఇంగ్లిష్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి బ్యాంక్ ఆఫీసర్ అయ్యింది. అయినప్పటికీ ఇంకా సాధించాలనే ఉద్దేశంలో ఉద్యోగం చేస్తూనే బ్రెయిలీలో దొరికిన మెటీరియల్ చదివి 2015లో ఐ.ఏ.ఎస్ పరీక్షలు రాస్తే ఇండియన్ ఫారిన్ సర్వీసెస్‌కు ఎంపిక


• బెనో జెఫైన్

అయ్యింది. ఇప్పటివరకు ఐ.ఎఫ్.ఎస్‌లో అంధులకు పోస్టింగ్ ఇవ్వలేదు. ఆ మేరకు బెనో చరిత్ర సృష్టించింది. ఇప్పుడామె ఢిల్లీ కేంద్రంగా విధులు నిర్వహిస్తోంది. వివాహం చేసుకుని భర్త, కుమార్తెతో ముందుకు సాగుతోంది. బ్రెయిలీ భాష మాత్రమే ఆమెను ఇక్కడి వరకూ చేర్చింది. అలాగే ఢిల్లీకి చెందిన పాతికేళ్ల రేషమ్ తల్వార్ అక్కడి రేడియో ఉడాన్‌లో జాకీగా పని చేస్తోంది. పూర్తి అంధురాలైన రేషమ్‌ను తల్లిదండ్రులు అలాగే వదిలేయ దలచుకోలేదు. మామూలు విద్యార్థులతోపాటు కలిసి చదివేలా చేశారు. బ్రెయిలీలో స్కూలు పాఠాలు చదివించడంలో శ్రద్ధ చూపారు. రేషమ్ ఆగలేదు. పోస్ట్ గ్రాడ్యుయేట్‌గా నిలిచింది. అంతేకాదు, ఆ ఆత్మవిశ్వాసంతో రేడియో జాకీగా చేరింది. వాయిస్ ఓవర్ ఆర్టిస్టుగా పని చేస్తోంది.

నిపుణుల సూచన

ఇవాళ అంధ విద్యార్థులకు సాయపడే యాప్స్ (టెక్స్ట్ బుక్స్‌ను ఆడియోగా మారుస్తాయి) ఉన్నప్పటికీ బ్రెయిలీలో చదవడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. పాఠ్యపుస్తకాలే కాదు సాహిత్యం, కథలు, పురాణాలు, గ్రంథాలు... ఏవి బ్రెయిలీలో అందుబాటులో ఉంటే అవన్నీ చదవడం వల్ల మాత్రమే అంధులకు తమ మీద తమకు విశ్వాసం ఏర్పడుతుందని సలహా ఇస్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో విద్యార్థులు, ముఖ్యంగా అంధ విద్యార్థినులు బ్రెయిలీ భాషను నేర్చుకోవడం గురించి, ఆ విషయంలో వారు ఎదుర్కొంటున్న ఆటంకాల గురించి విద్యాశాఖ దృష్టిపెట్టడం అవసరం.

ఛలో ఛాట్‌బోట్ వరల్డ్

• శోధించు.. అద్భుతాలు సాధించు

యూత్ ప్లస్



శోధించి సాధించు... అన్నారు. ఆ సాధనలో అద్భుతాలు సాధిస్తే ఎంత బాగుంటుంది! కృత్రిమ మేధస్సుతో కూడిన రకరకాల ఛాట్‌బోట్‌లు ఆ అద్భుతాలకు నిలయం కానున్నాయి. యువతరాన్ని అమితంగా ఆకట్టుకుంటున్న ఛాట్‌బోట్ 'ఛాట్‌బోట్‌జీపీటీ' ఎందుకు? ఏమిటి? ఎలా?

జనరల్ నాలెడ్జ్ నుంచి జటిలమైన ప్రశ్నలకు సమాధానం వరకు, మ్యూజిక్ కంపోజింగ్ నుంచి పాటలు రాయడం వరకు ఎన్నో విషయాలలో ఉపకరించే ఏఐ ఆధారిత ఛాట్‌బోట్‌ల గురించి యూత్ ఆసక్తి ప్రదర్శిస్తోంది. ఇటీవల కాలంలో యూత్ 'చాట్‌జీపీటీ' (జనరేటివ్ ప్రీ-ట్రైనడ్ ట్రాన్స్‌ఫార్మర్) గురించి అమిత ఆసక్తి ప్రదర్శిస్తోంది.

దిగ్గజ సెర్చ్ ఇంజిన్ 'గూగుల్'ను ఈ 'ఛాట్‌జీపీటీ' సవాలు చేయగలదని కొందరు, అధిగమించి అగ్రస్థానంలో నిలవనుందని కొందరు అంచనా వేస్తున్నారు. ఆ అంచనాలలో నిజానిజాల మాట ఎలా ఉన్నా 'ఆసక్తి' మాత్రం నిజం. ఇంతకీ ఏమిటి దీని ప్రత్యేకత?

కంటెంట్ క్రియేషన్‌లో ఉపయోగపడుతుంది. ఏదైనా క్రియేటివ్ ఆర్టికల్ రఫ్‌గా రాస్తే మంచి మంచి పదాలు, శైలితో సొబగులు అద్దగలదు. ఏదైనా అంశానికి సంబంధించి అస్తవ్యస్తంగా ఉన్నా డేటాను క్రమపద్ధతిలోకి తీసుకురాగలదు. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ రాయగలదు. మనుషుల సంభాషణ శైలిని సహజంగా అనుకరించగలదు.

ఏదైనా విషయం గురించి గూగుల్‌లో సెర్చ్ చేస్తున్నప్పుడు 'ఇదిగో ఈ లింకులు ఉన్నాయి' అన్నట్లుగా చూపుతుంది. 'ఛాట్‌జీపీటీ' మాత్రం లింక్‌లతో పాటు తనదైన శైలిలో విషయ వివరణ ఇస్తుంది. ఈ సాఫ్ట్‌వేర్‌ను దుర్వినియోగం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. జాత్యహంకార, సెక్సిస్ట్ ప్రాంప్ట్‌లను 'చాట్‌జీపీటీ' డిస్‌మిస్ చేస్తుంది.

శాన్‌ఫ్రాన్సిస్కో కేంద్రంగా పనిచేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ 'ఓపెన్ ఏఐ' 'ఛాట్‌జీపీటీ' సాఫ్ట్‌వేర్‌ను సృష్టించింది. కంప్యూటర్ సైంటిస్టు శామ్‌ఆల్ట్‌మన్, ఎంటర్‌ప్రెన్యూర్, ఇన్వెస్టర్, ప్రోగ్రామర్ ఇల్యా సట్స్‌కెర్వర్, ఎలాన్ మస్క్...లాంటివారు ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్న ప్రముఖులు. ఆ తర్వాత కాలంలో మస్క్ తప్పుకున్నారు.

మైక్రోసాఫ్ట్‌లాంటి దిగ్గజ సంస్థ దీనిలో పెట్టుబడి పెట్టడం విశేషంగా మారి అంచనాలు మరింతగా పెంచింది. 'ఫ్రెండ్లీ ఏఐ' ని దృష్టిలో పెట్టుకొని ఏఐ రంగంలో లోతైన పరిశోధనలు చేస్తోంది ఛాట్‌జీపీటీ.

వ్యక్తిగత సంభాషణ, సోషల్‌మీడియాలో అభిప్రాయాల కలబోత అనేది ఒక ఎత్తు అయితే, 'ది న్యూయార్క్ టైమ్స్' 'ది గార్డియన్'లాంటి పత్రికలు 'ది బెస్ట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఛాట్‌బోట్' అంటూ 'ఛాట్‌జీపీటీ'ని ప్రశంసించడం మరో ఎత్తు. మరోవైపు టెక్నాలజీ రైటర్ డాన్ గ్లిమోర్ ప్రయోగాత్మకంగా పరీక్షించి 'ఛాట్‌జీపీటీ'ని ప్రశంసించారు. అంతా బాగానే ఉందిగానీ, 'ఛాట్‌జీపీటీ'కి పరిమితులు, లోపాలు లేవా? అనే ప్రశ్నకు 'నో' అనే జవాబు మాత్రం వినిపించదు.

అప్పుడప్పుడూ తప్పుడు సమన్వయాలు, పునరావృతం అయ్యే పదాలు, తప్పుడు సమాధానాలు కనిపించవచ్చు. కొన్ని సంఘటనల గురించి పరిమిత సమాచారానికి మాత్రమే పరిమితం కావచ్చు. కొందరు ప్రముఖుల గురించి ఏమీ చెప్పలేకపోవచ్చు... ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. అయితే 'ఓపెన్ ఏఐ' ఈ పరిమితులు, లోపాలను దాచాలనుకోవడం లేదు.

యూజర్‌లు లోపాలను ఎత్తిచూపవచ్చు. సూచనలు ఇవ్వవచ్చు. వాటిని ఆహ్వానిస్తోంది ఛాట్‌జీపీటీ.

ప్రయోగదశ కాలంలో పది లక్షల మందికి పైగా సబ్‌స్క్రైబర్‌లను కలిగి ఉన్న 'ఛాట్‌జీపీటీ' పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే గూగుల్‌ను పక్కకు తప్పించగలదా? యువతరం అంచనాలకు న్యాయం చేయగలదా?... మొదలైన ప్రశ్నలకు స్పష్టత వచ్చేందుకు ఎంతో కాలం పట్టేటట్లు లేదు.

ముగ్గు ముచ్చట


బి.నారాయణమ్మ
మహబూబ్‌నగర్
29 చుక్కలు, 9 వరుసలు, 9 వచ్చే వరకు, సరి చుక్క




కోమల హరిత
కలికిరి, అన్నమయ్య జిల్లా
15 చుక్కలు, 3 వరుసలు, 7 వచ్చే వరకు, సంధు చుక్క



ముగ్గులకు ఆహ్వానం

చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్:muggulu.sakshi@gmail.com (మీ ఊరుతోపాటు కాలనీ- వీధి పేరు కూడా రాయండి)

న్యూస్ మేకర్

చీపురు పట్టి స్టార్ అయ్యింది

గత సంవత్సరం టాప్ 10 కంటెంట్ క్రియేటర్స్‌గా యూ ట్యూబ్ ప్రకటించిన వారిలో 22 ఏళ్ల అపర్ణా టాండలే ఉంది. మన దేశంలో ఇంటింటా తెలిసిన పని మనిషి పాత్రను చీపురు పట్టి హాస్యం చిలికేలా పోషించడమే అపర్ణా సక్సెస్‌కు కారణం. ఆమె చేసే 'కామ్‌వాలీ బాయి' వీడియోలకు 37 లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు. అపర్ణ చేసిన 'బారిష్ మే భీగ్‌నా' (వానలో తడవడం) అనే మూడు నిమిషాల వీడియోకు 3 కోట్ల వ్యూస్ వచ్చాయంటే ఆమె ఫాలోయింగ్ అర్థం చేసుకోవచ్చు. అపర్ణ పరిచయం.

పని మనిషి అప్పుడే ఇల్లు తుడిచి మొత్తం శుభ్రం చేసి ఉంటుంది. అంతలో కాలింగ్‌బెల్ మోగుతుంది. తలుపు కన్నం నుంచి చూస్తే వానలో పూర్తిగా తడిసి వచ్చిన అమ్మగారూ, అయ్యగారూ. పని మనిషి గతుక్కుమంటుంది.

'అమ్మో.. ఇప్పుడు వీళ్లు ఇంట్లోకి వస్తే ఇల్లంతా నీళ్లు, బురదా. మళ్లీ పనంతా చేయాలి' అనుకుంటుంది.

అంతే. తలుపుకు ఇంకో బోల్టు పెట్టేస్తుంది. అమ్మగారు కాలింగ్ బెల్ నొక్కితే బోల్ట్ తీస్తున్నట్టుగా నటిస్తూ 'అమ్మా... బోల్ట్ స్ట్రక్ అయ్యింది' అని లోపలి నుంచి అరుస్తుంది.

బయటి నుంచి అమ్మగారి పిలుపులు... లోపలి నుంచి తలుపు రావడం లేదని పని మనిషి అరుపులు. తడిసి వచ్చిన అమ్మగారిని, అయ్యగారిని ఇంటి బయటే గంట సేపు కూచోబెట్టి ఈ లోపు హాయిగా టీవీ చూస్కుంటూ వాళ్లు పూర్తిగా ఆరారు అని తేల్చుకున్నాక అప్పుడు తలుపు తీస్తుంది పని మనిషి.

ఇది అపర్ణా టాండాలె తీసిన మూడు నిమిషాల'బారిష్ మే భీగ్‌నా' షార్ట్ వీడియో. సూపర్‌హిట్ అయ్యింది. మూడు కోట్ల వ్యూస్ వచ్చాయి. పూణెకు చెందిన 22 ఏళ్ల అపర్ణ టాండాలె 2022లో యూట్యూబ్‌లో ఒక టాప్ కంటెంట్ క్రియేటర్‌గా నిలిచింది. ఆమె షార్ట్ వీడియోస్ కోసం చేసే పాత్ర పేరు షీలా దీదీ. సిరీస్ పేరు 'కామ్‌వాలీ బాయి'. కామ్‌వాలీ అంటే పని మనిషి.

పనిమనిషి లేని మధ్యతరగతి ఇల్లు ఉండదు. పని మనిషితో పేచీ పడని ఇల్లాలూ ఉండదు. పని సరిగ్గా చేయడం లేదని అమ్మగారు సణిగితే, పని ఎక్కువైందని పనిమనిషి గొణుగుతుంది. బాగా తెలివైన పని మనిషైతే 'స్మార్ట్ వర్క్' చేసి పనిని తగ్గించుకోవడమో, తప్పించుకోవడమో చేస్తుంది. అపర్ణా టాండాలె తన సిరీస్‌లో ధరిస్తున్నది ఈ స్మార్ట్ పనిమనిషి పాత్రనే.


• అపర్ణా టాండలే

ఎప్పుడూ ఆకుపచ్చని చీర, మేచింగ్ బ్లౌజ్, కొప్పు వేసిన జుట్టు, మెడలో నల్ల పూసలు, చేతిలో చీపురు... ఇది పని మనిషి షీలా ఆహార్యం. ఆమె పని చేసేది ఒక యువ జంట ఇంట్లో. చేయాల్సిన పని చేస్తుంటుంది గాని ఒక్కోసారి తేడా వచ్చిందంటే ట్రిక్స్ ప్లే చేస్తూ ఉంటుంది. ఆ ట్రిక్సే ఒకటీ ఒకటిన్నర నిమిషాల వీడియోలుగా మనం చూస్తుంటాము.

- ఒక వీడియోలో యజమాని ఒకసారి బోల్డన్ని ఇండోర్ ప్లాంట్స్ తెస్తుంది. 'దీనికి స్ప్రే చేస్తే చాలు. దానికి అరగ్లాసు నీళ్లు చాలు. ఈ దానికి రెండు రోజులకు ఒకసారి నీళ్లు పోయాలి'... ఇలా పది కుండీల లెక్క చెబుతుంది అమ్మగారు. పని మనిషి షీలా ఇంత పని చేస్తుందా? ఒక రోజు పెద్ద బకెట్టు నిండా నీళ్లు మొక్కలకు పోయబోతూ అమ్మగారికి కంగారు పుట్టిస్తుంది. మరోరోజు మొక్కల దగ్గర ఒళ్లు గీరుకుంటూ 'నాకు మొక్కలంటే ఎలర్జీ' అంటుంది. మరోరోజు అమ్మగారి మీదే తుమ్ముతూ 'మొక్కలకు నీళ్లు పోస్తే తుమ్ములు' అంటుంది. దెబ్బకు మొక్కలకు నీళ్లు పోసే పని అయ్యగారు తీసుకుంటాడు. ఇదంతా ఎంతో ఫన్నీగా ఉంటుంది.

- మరో వీడియోలో అమ్మగారు అల్మారాలోని తన బట్టలన్నీ సర్దమంటే ఒక్కదాన్నే చేయాలా అనుకున్న పని మనిషి 'అమ్మగారూ... పొరుగింట్లో ఏమయ్యిందో తెలుసా?' అని అమ్మగారిని పిలిచి మాటల్లో పెట్టి ఆమె చేతే మొత్తం బట్టలు మడత పెట్టిస్తుంది.
- ఇంకో వీడియోలో స్టోర్‌రూమ్ సర్దమంటే 'బాబోయ్ ఎలుక...' అని అరిచి యజమానిని పిలిచి 'అటు పోయింది... ఇటు పోయింది' అంటూ మొత్తం సామాను అతడే సర్దేలా చేస్తుంది.



ఈ వీడియోలు చూసే ప్రేక్షకులు యజమానుల్లో తమని, షీలా పాత్రలో తమ పని మనిషిని చూసుకోవడం వల్ల ఈ సిరీస్ పెద్ద హిట్ అయ్యింది.

పూణెకు చెందిన యూ ట్యూబర్ అపర్ణ టాండాలెకు 'షార్ట్స్ బ్రేక్' అనే యూట్యూబ్ చానల్ ఉంది. అందులో 'కామ్ వాలీ బాయి' సిరీస్ చేస్తుంది. ఈ ఒక్క యూ ట్యూబ్ చానల్ కాకుండా 'టేక్ ఏ బ్రేక్', 'మ్యాడ్ ఫర్ ఫన్' అనే ఇంకో రెండు మూడు చానల్స్ నడుపుతోంది అపర్ణ.

మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన అపర్ణకు బాల్యం నుంచి నటి కావాలనే కోరిక. స్కూల్, కాలేజీలో స్టేజ్ మీద నాటకాలు వేసేది. 2018 నుంచి యూ ట్యూబ్‌లో షార్ట్ వీడియోలు మొదలెట్టింది. పలుచటి శరీరంతో చురుగ్గా కదులుతూ హుషారైన ముఖ కవళికలతో ఆకట్టుకుంటుంది అపర్ణ. 'ప్రతి ఇంట్లో ఇంటి పని ఉంటుంది. అలాగే పని మనిషి కూడా కావాల్సిందే. ఆ పాత్రను తీసుకుంటే ఎంతో హాస్యం పండించవచ్చు. బాధగా ఉన్నవారు కూడా నా వీడియోలు చూసి నవ్వాలి' అంటుంది అపర్ణ.

అలా నవ్వుతున్నారు కనుకనే ఆమెకు పాపులారిటీ. సృజనాత్మక ఐడియాలు ఉంటే భారీగా పాపులర్ కావచ్చనేదానికి అపర్ణే ఒక పెద్ద చీపురంత ఉదాహరణ.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 284

బుధవారం 4-1-2023



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



డిజిటైజేషన్‌లో భారత్ భేష్

అన్ని వ్యాపారాల్లోనూ క్లౌడ్ వినియోగం పెరుగుతోందన్న సత్య నాదెళ్ల. - 13లో



విజయంతో మొదలు..

శ్రీలంకతో జరిగిన తొలి టి20లో రెండు పరుగుల తేడాతో నెగ్గిన భారత్. - 12లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గ్లోబల్ లీడర్లుగా ఎదగండి

భారత్‌ను స్వావలంబన దేశంగా తీర్చిదిద్దడానికి సైంటిస్టులు కృషి చేయాలని 108వ సైన్స్ కాంగ్రెస్‌లో మోదీ పిలుపునిచ్చారు.

- వివరాలు 6లో▶



నడ్డా కొనసాగింపు?

రాబోయే ఎన్నికల దృష్ట్యా బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డాను కొనసాగించాలని ఆ పార్టీ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.

- వివరాలు 6లో▶



అలుపెరగని పోరాట యోధుడు

'రాహుల్ పోరాట యోధుడు. మోదీ విద్వేష మార్కెట్లో యూపీవాసులంతా ప్రేమ అంగళ్లు తెరవాలి' అని ప్రియాంక అన్నారు.

- వివరాలు 6లో▶



అది సినిమాహాళ్ల ఇష్టమే..

'సినిమాహాల్ ప్రైవేట్ ఆస్తి. అందులోకి బయటి తినుబండారాలను అనుమతించే అంశం యాజమాన్యాల ఇష్ట'మని సుప్రీం చెప్పింది.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

మంత్రుల వ్యాఖ్యలను ప్రభుత్వానికి ఆపాదించలేం



ప్రజాప్రతినిధుల వాక్ స్వాతంత్య్రం, భావ ప్రకటన స్వేచ్ఛపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక మంత్రి చేసే విద్వేషపూరిత, వివాదాస్పద వ్యాఖ్యలను ప్రభుత్వానికి ఆపాదించలేమని పేర్కొంది. ఓ సామూహిక అత్యాచారం కేసుపై విద్వేష వ్యాఖ్యలు చేసిన అప్పటి యూపీ మంత్రి ఆజం ఖాన్‌ను అరెస్టు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ ఎస్.ఎ. నజీర్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం మంగళవారం ఈ మేరకు 4-1తో మెజారిటీ తీర్పు వెలువరించింది.

- వివరాలు 6లో▶

ఆత్మ'హత్య'లేనా?



రష్యా ప్రముఖులు అనుమానాస్పద రీతిలో మరణించడం సంచలనం రేపుతోంది. ఒకరో, ఇద్దరో మరణించారనుకుంటే ఏమో అనుకోవచ్చు. ఏడాదిలో 24 మంది మృత్యువాత పడడం చర్చనీయాంశమైంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని ప్రారంభించడానికి కాస్త ముందు నుంచే ఈ మిస్టరీ మరణాలు సంభవించడం గమనార్హం. మరణించిన ప్రముఖుల్లో కొందరు పుతిన్ యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకించినవారు ఉన్నారు.

- వివరాలు 6లో▶

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN
Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

Eggs Retail Rate	Ex Farm Live Bird	118 kg	Dressed with Skin	203 kg
₹ 70 per dozen	Retail Live Bird	140 kg	Skin Less	231 kg

Issued in the interest of consumers

ఇటు విస్తరణ.. అటు విస్తారక్

జాతీయ స్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణపై బీఆర్‌ఎస్ దృష్టి

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రంగంలోకి బీజేపీ విస్తారక్‌లు



వచ్చే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా రాజకీయ పార్టీలు కార్యాచరణ ముమ్మరం చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ప్రధానంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ జాతీయ స్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణపై దృష్టి సారించింది. ఇప్పటికే పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడిని నియమించిన బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్.. మరో రెండు సరిహద్దు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రతో పాటు ఆరేడు రాష్ట్రాల్లో కూడా కార్యకలాపాలు విస్తరింపజేయాలని భావిస్తున్నారు. ఇక ప్రధాన ప్రతిపక్షమైన బీజేపీ కూడా ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతోంది. నేతలు క్షేత్రస్థాయిలో నిత్యం టచ్‌లో ఉంటూ విజయానికి బాటలు వేసేలా తాజాగా విస్తారక్‌లను రంగంలోకి దింపింది. తెలంగాణ సహా తొమ్మిది రాష్ట్రాల్లో వీరిని నియమించింది.

సంక్రాంతి తర్వాత స్పీడ్

మరింత ముమ్మరంగా బీఆర్‌ఎస్ కార్యకలాపాలు

- మరో ఆరేడు రాష్ట్రాల్లో కార్యవర్గాల ఏర్పాటుపై కేసీఆర్ కసరత్తు
- తొలుత కర్ణాటక, మహారాష్ట్రపై దృష్టి.. ఆ తర్వాత ఒడిశా, పంజాబ్, హరియాణా
- కర్ణాటక, మహారాష్ట్రలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రకరణ్ పర్యటనలు



సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి కార్యకలాపాల విస్తరణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించిన పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంక్రాంతి తర్వాత కార్యకలాపాలను మరింత ముమ్మరం చేయాలని భావిస్తున్నారు. బీఆర్‌ఎస్‌కు గుర్తింపు దక్కిన నెల రోజుల్లోపే పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడిగా తోట చంద్రశేఖర్‌ను నియమించిన కేసీఆర్.. జనవరి నెలాఖరులోగా మరో ఆరేడు రాష్ట్రాల్లో కార్యవర్గాలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. తొలుత తెలంగాణకు మిగతా 2వ పేజీలో ▶

బీఆర్‌ఎస్, బీజేపీ ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ చతుర్ముఖ వ్యూహంతో తెలంగాణను హస్తగతం చేసుకోవాలని భావిస్తోంది. గత ఎన్నికల్లో గెలిచిన స్థానాలు.. పార్టీ బలంగా ఉన్న, బీఆర్‌ఎస్ బలహీనంగా ఉన్న సెగ్మెంట్లు.. మిగిలిన చోట్ల గెలుపు గుర్రాలు.. ఈ 4 ప్రధాన అంశాలు ప్రాతిపదికగా కసరత్తు చేస్తోంది.

..చేతిలో చతుర్ముఖం



ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ కసరత్తు

సునీల్ కనుగోలు టీం నివేదిక పక్కాగా అమలుకు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికలకు సంబంధించి సునీల్ కనుగోలు టీం ఇచ్చిన నివేదికను పక్కాగా అమలు చేయడం ద్వారా తెలంగాణలో విజయం సాధించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించుకుంది. తెలంగాణ ఇచ్చిన పార్టీగా బరిలో నిలిచినా 2014 ఎన్నికల్లో 28 శాతం, తర్వాత 2018 ఎన్నికల్లో 26 శాతం మాత్రమే ఓట్లను మాత్రమే దక్కించుకున్న కాంగ్రెస్ అధికారానికి ఆమడ దూరంలో నిలిచింది. అధికారంలోకి రావాలంటే 60 స్థానాల్లో గెలవాల్సి ఉండగా, 2014 ఎన్నికల్లో 21 చోట్ల, 2018లో 19 చోట్ల మాత్రమే మిగతా 2వ పేజీలో ▶

విజయమే లక్ష్యం

తెలంగాణ సహా 9 రాష్ట్రాల్లో బీజేపీ విస్తారక్‌ల నియామకం

- 160 ఎంపీ స్థానాలు, ప్రతి అసెంబ్లీ సీటుపై గురి
- నిత్యం పర్యటనలు.. ఎప్పటికప్పుడు నివేదికలు
- ఆయా రాష్ట్రాల్లో ప్రతి 15 రోజులకోసారి ఒక జాతీయ నేత పర్యటన
- ఈ నెలాఖరులో రాష్ట్రానికి అమిత్ షా

సాక్షి, న్యూఢిల్లీ: ఈ ఏడాదిలో ఎన్నికలు జరిగే తెలంగాణ సహా తొమ్మిది రాష్ట్రాల్లోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు, ఈ రాష్ట్రాల్లో గుర్తించిన 160 లోక్‌సభ స్థానాల్లో పార్టీ విస్తరణ, అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ విస్తారక్‌లను భారతీయ జనతా పార్టీ రంగంలోకి దింపింది. ఎంపిక చేసిన స్థానాల్లో పూర్తి సమయం కేటాయించనున్న విస్తారక్‌ల ద్వారానే పార్టీ కార్యాచరణ, ఎన్నికల వ్యూహాలు అమలు చేయడంతో పాటు ప్రచారం నిర్వహించనుంది. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు మిగతా 2వ పేజీలో ▶



సీవీ ఆనంద్ స్టీఫెన్ రవీంద్ర

భారీగా ఐపీఎస్‌ల బదిలీ

29 మందికి స్థాన చలనం

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏడీజీగా సీవీ ఆనంద్‌కు అదనపు బాధ్యతలు

సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఐజీగా స్టీఫెన్ రవీంద్రకు అదనపు బాధ్యతలు

పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా సందీప్ శాండిల్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చాలాకాలం తర్వాత భారీ సంఖ్యలో ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఒకేసారి 29 మంది సీనియర్ అధికారులను వివిధ స్థానాలకు బదిలీ చేయడంతో పాటు మరికొందరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవలే కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, తెలంగాణ మిగతా 3వ పేజీలో ▶

'కంటివెలుగు'కు 1,500 బృందాలు



ఉచితంగా 55 లక్షల కంటి అద్దాల పంపిణీ: మంత్రి హరీశ్‌రావు

"మొదటి విడత 'కంటివెలుగు' 8 నెలలు జరిగింది. రెండో విడత కార్యక్రమాన్ని వంద పనిదినాల్లో పూర్తి చేస్తాం. 1,500 బృందాలను ఏర్పాటు చేశాం. తద్వారా వంద రోజుల్లో కార్యక్రమాన్ని పూర్తిచేసి గిన్నిస్ రికార్డులో నమోదయ్యేలా కృషిచేస్తాం.

వివరాలు 3లో▶

జాతీయ అధ్యక్షుడే లేరు.. 'ఏపీ'కెలా?



బీఆర్‌ఎస్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విసుర్లు

"బీఆర్‌ఎస్‌కు జాతీయాధ్యక్షుడే లేరు. తెలంగాణకూ లేరు. అలాంటిది ఏపీ రాష్ట్ర అధ్యక్షుడినెలా ప్రకటిస్తారు?. దేశాన్ని అప్పులపాలు చేయడం, లిక్కర్ స్కాంలలో ముంచడమేనా సీఎం కేసీఆర్ 'భారత్ విజన్'?. ముందు తెలంగాణకు ఏం చేశారో చెప్పండి.

వివరాలు 2లో▶

బీజేపీ డైరెక్షన్‌లోనే బీఆర్‌ఎస్ ఏర్పాటు



అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్: పీసీసీ నేత మహేశ్‌కుమార్‌గౌడ్

"వాగ్దానాలు చేసి వదిలేయడం, ఎలాంటి ప్రణాళిక లేకుండా పథకాలు ప్రకటించడం కేసీఆర్‌కే చెల్లుతుంది. బీజేపీ డైరెక్షన్‌లోనే కేసీఆర్ బీఆర్‌ఎస్‌ను ఏర్పాటు చేశారు. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యుల ఆస్తులు పెంచుకునేందుకే ఆ పార్టీ ఏర్పాటైంది.

వివరాలు 2లో▶



గోదావరిలో నీటి లభ్యతపై అధ్యయనం..!

సీడబ్ల్యూసీతో జరిపించాలని గోదావరి బోర్డు నిర్ణయం

ఏపీ, తెలంగాణకు లభ్యతపై స్టడీతో సరిపెట్టాలన్న ఏపీ

- మళ్లీ అధ్యయనం అక్కర్లేదని తెలిపిన సీడబ్ల్యూసీ డైరెక్టర్
- గోదావరి బోర్డు సమావేశంలో నీటి లభ్యతపై వాడీవేడి చర్చ
- కడెం–గూడెం ప్రాజెక్టుపై తీవ్రంగా అభ్యంతరం తెలిపిన ఏపీ
- రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో 5 టెలిమెట్రీ స్టేషన్ల ఏర్పాటు

వివరాలు 5లో▶



కల్తీ మద్యం కలకలం?

ఒకే షాపు నుంచి మద్యం కొని తాగిన ఇద్దరు ఆకస్మిక మృతి

- కల్తీ మద్యం వల్లే చనిపోయారని కుటుంబసభ్యుల ఆరోపణ
- అనుమానంతో శాంపిల్స్ సేకరించిన ఎక్సైజ్ అధికారులు

వివరాలు 5లో▶

సీనియర్లపై సస్పెన్స్!

నేటి పీసీసీ సమావేశానికి హాజరవుతారా..? లేదా..? అనే సందేహాలు

వివరాలు 2లో▶



రక్తమోడుతున్నా ఈడ్చుకెళ్లారు

'ఢిల్లీ దారుణం'పై ప్రత్యక్ష సాక్షి వెల్లడి

అత్యాచారం జాడల్లేవన్న పోస్టుమార్టం

'డిసెంబర్ 31న రాత్రి నేను, అంజలి స్కూటీపై వెళ్తున్నాం. ఎదురుగా వచ్చిన కారు మా స్కూటీని ఢీకొట్టింది. నేను పడిపోయా. అంజలి కారు చక్రాల్లో ఇరుక్కుని రక్తమోడుతూ సాయం కోసం అరిచింది. చక్రాల్లో ఆమె ఇరుక్కుందని తెలిసీ నిర్దయగా వెళ్లిపోయారు' అని ఢిల్లీలో జరిగిన నాటి ఘటన ప్రత్యక్షసాక్షి నిధి తెలిపారు. నిధి.. అంజలికి స్నేహితురాలు. - 6లో



All chicken products contain added monosodium glutamate not recommended for infants below 12 months and pregnant women. #Limited period offer. T&Cs apply. For details refer to online.kfc.co.in/promotions. Delivery available in select restaurants. Price exclusive of taxes. All images are for illustration purposes only. Actual product may vary. *vis-à-vis same a la carte order on delivery.

యువతి గొంతు కోసిన యువకుడు

కాజీపేట కడిపికొండలో కలకలం

కాజీపేట అర్బన్: ఓ యువకుడు కత్తితో యువతి గొంతు కోసిన సంఘటన హనుమకొండ జిల్లా కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని రాంనగర్‌లో జరిగింది. పోలీసుల ప్రకారం.. కడిపికొండకు చెందిన శ్రీనివాస్ మంగళవారం రాత్రి రాంనగర్‌కు చెందిన ఓ యువతి వద్దకు వెళ్లాడు. తనతో తెచ్చుకున్న రెండు కత్తులతో ఆమె గొంతు కోయడంతో పాటు చెయ్యిపై గాయం చేశాడు. యువతి అరుపులు విని అక్కడికి వచ్చిన బంధువులు, స్థానికులు ఆమెను హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. దాడికి ప్రేమ వ్యవహారం కారణమా? లేక మరేదైనా ఉందా? అన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం యువతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

క్లుప్తంగా...


మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై

రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధిచెప్పడం ఖాయం

వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: రాబోయే ఎన్నికల్లో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి ప్రజలు బుద్ధిచెప్పడం ఖాయమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జోస్యం చెప్పారు. మంగళవారం ట్విట్టర్ వేదికగా సీఎం కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. గోదావరి వరద బాధితులకు కేసీఆర్ ప్రభుత్వం సాయం అందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వరదల్లో వేలాది రైతులు ఆగమై ఆరునెలలైనా ఒక్క రూపాయి ఇవ్వలేదని మండిపడ్డారు. గాలి మోటారులో వచ్చి గాలిమాటలు.. కారులో వచ్చి కారుకూతలు కూశారంటూ కేసీఆర్ వైఖరిపై ధ్వజమెత్తారు. పైగా ఇది క్లౌడ్ బరస్ట్ అని.. విదేశీ కుట్ర అని జనం చెవుల్లో పువ్వులు పెట్టారని షర్మిల విమర్శించారు.

మభ్యపెట్టేందుకే నోటిఫికేషన్లు: ఈటల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, నిరుద్యోగయువత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మభ్యపెట్టేందుకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తోందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ఆరోపించారు. కేసీఆర్ నీరో చక్రవర్తిలాగా వ్యవహరిస్తున్నారని ఎస్సై, కానిస్టేబుళ్ల ఎంపికలో అభ్యర్థుల గోస పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రన్నింగ్‌లో అర్హత పొందిన అభ్యర్థులందరినీ తుది పరీక్షకు అనుమతించాలని, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన 165 సెం.మీ. ఎత్తు ఉన్నవారికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2022 పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో తమకు అన్యాయం జరుగుతోందని మంగళవారం ఈటలను పలువురు అభ్యర్థులు కలిసి న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

ఢిల్లీకి రూ.100 కోట్లు తరలించారు: ప్రవీణ్‌కుమార్


దహెగాంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

దహెగాం(సిర్పూర్): ఢిల్లీ మద్యం కుంభకోణంలో సీఎం కేసీఆర్ కుమార్తె కవితను తప్పించేందుకు బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి ఓ ప్రైవేటు విమానంలో రూ.100 కోట్లను ఆమె ఢిల్లీకి తరలించారని బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. మద్యం కుంభకోణంలో రూ.7కోట్లు పెట్టుబడి పెడితే రూ.60కోట్లు ఆదాయం వచ్చినట్లు ఈడీ తన చార్జిషీట్‌లో పేర్కొందని ఆయన తెలిపారు. బహుజన రాజ్యాధికార రెండో విడత యాత్ర మంగళవారం కుమురంభీం జిల్లా దహెగాం మండల కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. రూ.1.15లక్షల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు కడితే వరదల వల్ల కూలిపోయిందని, మరమ్మతులకు రూ.1,500 కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. 1,300 మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం సాధిస్తే సిర్పూర్(టి) నియోజకవర్గం ఆంధ్రోళ్ల చేతుల్లో పెట్టారని దుయ్యబట్టారు.

సీనియర్లపై సస్పెన్స్!

నేడు పీసీసీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం

- ధరణిపై అవగాహన, హాథ్‌సే హాథ్ జోడో తదితర కీలకాంశాలపై చర్చ
- ఏఐసీసీ కార్యాలయం నుంచి పలువురు సీనియర్లకు ఫోన్లు
- భేటీకి హాజరవుతారా? లేదా? అనే సందేహాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో గందరగోళం కొనసాగుతోంది. కీలకమైన అంశాలపై బుధవారం పీసీసీ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో జరిగే సమావేశానికి సీనియర్ల హాజరుపై అస్పష్టత నెలకొంది. ధరణి పోర్టల్‌పై పార్టీ నేతలకు అవగాహన కల్పించడంతో పాటు జనవరి 26న ప్రారంభం కానున్న హాత్‌సే హాత్‌జోడ్ యాత్రలు, పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి బీమా అమలు, ఎన్నికల నిబంధనలపై చర్చించేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. అయితే రేవంత్‌రెడ్డి ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ ఆయన పాల్గొనే కార్యక్రమాలకు హాజరు కాకూడదని పలువురు సీనియర్లు నిర్ణయించుకోవడం, ఏఐసీసీ బుజ్జగింపుల నేపథ్యంలో బుధవారం నాటి సమావేశానికి ఎవరు వెళతారనే చర్చ జరుగుతోంది.

ఏఐసీసీ నుంచి కబురు

రేవంత్‌రెడ్డితో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలోని పలువురు సీనియర్లు విభేదించిన నేపథ్యంలో ఏఐసీసీ పక్షాన సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్ రాష్ట్రానికి వచ్చి వెళ్లారు. అందరి అభిప్రాయాలు తీసుకున్న ఆయన ఢిల్లీ వెళ్లి కూడా పది రోజులు దాటిపోయింది. కానీ ఇంతవరకు ఏఐసీసీ నుంచి సమస్య పరిష్కారం కోసం ఎలాంటి చర్య తీసుకున్నట్టు కనిపించలేదు. ఈ పరిస్థితుల్లోనే రేవంత్ ఐడియాలజీ సెంటర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), పార్టీ కార్యవర్గం (పీఈసీ), అనుబంధ సంఘాల చైర్మన్లు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, డీసీసీ అధ్యక్షులను ఆహ్వానించారు. ఈ సమావేశానికి సీనియర్ నేతలు కూడా హాజరు కావాలని ఏఐసీసీ కార్యాలయం నుంచి పలువురికి ఫోన్లు వెళ్లినట్టు తెలిసింది. హాత్‌సే హాత్ జోడో యాత్రలపై చర్చ జరగనున్నందున ఈ సమావేశంలో పాలుపంచుకోవాలని కోరినట్టు సమాచారం. అయితే సీనియర్లు ఇప్పటికీ మెత్తబడలేదని తెలుస్తోంది. టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఢిల్లీలో జరిగే పార్లమెంటరీ కమిటీ సమావేశానికి హాజరుకావాల్సి ఉన్నందున ఈ సమావేశానికి వచ్చే అవకాశం లేదని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. సీఎల్పీనేత భట్టితో పాటు ఇతర సీనియర్లు కూడా దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం.



నాకు సమాచారం లేదు: ఏలేటి

బుధవారం జరిగే టీపీసీసీ సమావేశం గురించి తనకు సమాచారం లేదని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. రేపటి కార్యక్రమం ఏఐసీసీ కార్యక్రమం కాదని వ్యాఖ్యానించారు. హాత్‌సే హాత్‌జోడ్ యాత్రల గురించి మాత్రం ఏఐసీసీ నుంచి సర్క్యులర్ వచ్చిందని తెలిపారు. మంగళవారం తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ..హాత్‌సే హాత్‌జోడ్ యాత్రలో భాగంగా జనవరి 26 నుంచి రెండు నెలల పాటు ప్రతి నియోజకవర్గంలో పాదయాత్ర ఉంటుందని, ఈ యాత్రల తర్వాత రాష్ట్ర రాజధానిలో జాతీయ, రాష్ట్ర నేతలు పాదయాత్ర చేస్తారని తెలిపారు. దీనికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. రేవంత్ పాదయాత్ర గురించి తనకు తెలియదన్నారు. ఆయన యాత్రకు ఏఐసీసీ అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ఏలేటి వ్యాఖ్యలను బట్టి చూస్తే సీనియర్లు బుధవారం నాటి సమావేశానికి వెళ్లబోరని అర్థమవుతోందని అంటున్నారు.

జాతీయ అధ్యక్షుడే లేరు... ఏపీ అధ్యక్షుడెలా?

బీఆర్ఎస్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విసుర్లు



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌కు జాతీయాధ్యక్షుడే లేరని, తెలంగాణ రాష్ట్రానికి కూడా లేరని, అలాంటిది ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిని ఎలా ప్రకటిస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రశ్నించారు. దేశాన్ని అప్పులపాలు చేయడం, లిక్కర్ స్కాంలలో ముంచడం సీఎం కేసీఆర్ 'భారత్ విజన్'అని ఎద్దేవా చేశారు. ధనిక రాష్ట్రాన్ని అప్పులఊబిలోకి నెట్టిన వ్యక్తి జాతీయస్థాయిలో ఏం అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణకు కేసీఆర్ ఏమి చేశారో చెప్పిన తర్వాతే దేశం గురించి మాట్లాడాలన్నారు. బీఆర్ఎస్‌లో చేరికల సందర్భంగా కేసీఆర్ చేసిన విమర్శలను మంగళవారం సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. తిప్పికొట్టారు. కేంద్రం ఇచ్చిన గ్రామ పంచాయతీ నిధులు దోచుకున్న దొంగల ముఠాకు కేసీఆర్ నాయకుడని దుయ్యబట్టారు. గతంలో ఏపీ ప్రజలను అవమానించిన కేసీఆర్ ఇప్పుడు ఆ రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏపీ వాళ్లు తయారు చేసిన బిర్యానీని పెండ బిర్యానీ అని, వారి ఉలవచారును తెలంగాణలోని ఎడ్లు, బర్లు తింటాయని గతంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను సంజయ్ గుర్తుచేశారు. పక్క రాష్ట్రాలకు క్యాబ్‌లను పంపించి మరీ బీఆర్ఎస్‌లో చేరేందుకు నేతలను పిలిపించుకున్నారని ఎద్దేవా చేశారు.

నోటిఫికేషన్ల పేరిట కుట్ర..

నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులను మోసం చేసేందుకు ఉద్యోగ నోటిఫికేషన్ల పేరిట కుట్ర చేస్తున్నారని సంజయ్ ఆరోపించారు. సింగరేణినీ కేసీఆర్ నాశనం చేశారని, అజంజాహి మిల్స్ సంగతి ఏమైందో తెలిసిందేనన్నారు. పాఠశాల విద్యలో తెలంగాణది చివరి గ్రేడ్ అని, రైతుల ఆత్మహత్యల్లో నాలుగో స్థానమని, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు 17% పెరిగాయని పేర్కొన్నారు. ఇవి కేసీఆర్ పాలనలో సాధించిన ఘనతలు అని ఎద్దేవా చేశారు.

దేశానికి ఏదో చేస్తామంటే నమ్మేదెలా?

తెలంగాణకు అందుబాటులో ఉన్న జలాలు, మిగులు జలాలను ఉపయోగించుకోలేని వ్యక్తి దేశానికి ఏదో చేస్తాడంటే ఎవరైనా ఎలా నమ్మగలరని సంజయ్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులు కట్టిన తర్వాత కూడా లక్షలాది వ్యవసాయ బోర్లు పెరిగాయని అన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరు కుంటున్నారని, రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు చైనా అంటే ప్రేమ అని ఇక్కడ భారత్ బజార్ లేదంటున్న ఆయన ముందుగా తెలంగాణ పేరుతో బజారు పెట్టాలన్నారు.

బీజేపీ డైరెక్షన్‌లోనే బీఆర్ఎస్ ఏర్పాటు

కుటుంబ ఆస్తులు పెంచుకునేందుకే కేసీఆర్ జాతీయ పార్టీ: మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: అబద్ధాలకు సీఎం కేసీఆర్ బ్రాండ్ అంబాసిడర్ అని, నిలువునా మోసం చేయడంలో ఆయన దిట్ట అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. ఎన్నికలయ్యేంతవరకు ఒక మాట, ఎన్నికలయ్యాక మరో మాట చెప్పి మోసం చేయడంలో ఆయన ఆరితేరి పోయారని విమర్శించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి, ఉపాధ్యక్షులు చెరుకు సుధాకర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ, వాగ్దానాలు చేసి వదిలేయడం, ఎలాంటి ప్రణాళిక లేకుండా పథకాలు ప్రకటించడం కేసీఆర్‌కే చెల్లుతుందన్నారు. ఇప్పుడు టీఆర్ఎస్ పోయి బీఆర్ఎస్ అనే పార్టీ పెట్టాడని, బీజేపీ డైరెక్షన్‌లోనే ఆ పార్టీని కేసీఆర్ ఏర్పాటు చేశాడని ఆరోపించారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకునేందుకే బీఆర్ఎస్ ఏర్పాటయిందని విమర్శించారు. గోల్‌మాల్ గోవిందాలను నమ్మవద్దని కేసీఆర్ తరచుగా చెపుతుంటారని, అయితే కేసీఆరే పెద్ద గోల్‌మాల్ గోవిందా అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్ వ్యాఖ్యానించారు. అమిత్‌షా డైరెక్షన్‌లోనే బీఆర్ఎస్‌ను కేసీఆర్ నడుపుతున్నారని, అసలు ఆ పార్టీ దేశానికి అక్కర రాదని, బీఆర్ఎస్ పేరుతో కేసీఆర్ చేస్తున్న కుట్రలను ప్రజల్లో ఎండగడతామని చెప్పారు.

సంక్రాంతి తర్వాత స్పీడ్

▶ మొదటి పేజీ తరువాయి

సరిహద్దుగా ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల్లో బీఆర్ఎస్ శాఖల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆ తర్వాత ఒడిశా, పంజాబ్, హరియాణ రాష్ట్రాల్లోనూ వీలైనంత త్వరగా పార్టీ కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించారు. గతంలో హైదరాబాద్ రాష్ట్రంలో అంతర్భాగంగా ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల్లోని ప్రాంతాలపై పట్టు సాధించేలా కేసీఆర్ వ్యూహానికి పదును పెడుతున్నారు. తెలంగాణకు చెందిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తూ బీఆర్ఎస్‌కు మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభించారు.

కర్ణాటకలో ఇప్పటికే చురుగ్గా..

కర్ణాటకలోని బీదర్, గుల్బర్గా, యాద్గిర్, రాయచూర్, కొప్పాల్, బళ్లారి, హోస్పేట తదితర ప్రాంతాలతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్, బీడ్, ఔరంగాబాద్, పర్బనీ, నాగపూర్, చంద్రాపూర్ తదితర ప్రాంతాల్లో పార్టీ కార్యకలాపాలకు శ్రీకారం చుడుతున్నారు. కర్ణాటకలో కల్లుగీత వృత్తిని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో జేడీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్రకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మద్దతు ప్రకటించారు. గుల్బర్గాలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘానికి చెందిన పలువురు ముఖ్య నేతలతో కలిసి పాదయాత్ర వాల్‌పోస్టర్, ఆడియో సీడీలను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి (నారాయణపేట్), భూపాల్‌రెడ్డి (నారాయణఖేడ్)లు పొరుగునే ఉన్న కర్ణాటకలో పర్యటిస్తున్నారు. అక్కడి నేతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో పరిచయాల ఆధారంగా వ్యక్తిగతంగా భేటీ అవుతున్నారు. తెలంగాణ బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్, వికారాబాద్ జెడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్ తదితరులు కర్ణాటకలోని గదగ్‌లో గత నెలలో పర్యటించారు. కిసాన్ జాగృతి వికాస్ సంఘం ప్రతినిధులతో భేటీలో బీఆర్ఎస్ విధానాలను వివరించారు. జహీరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి బృందం చించోలి, సేడం ప్రాంతాల్లో పర్యటించి బీఆర్ఎస్‌పై అభిప్రాయాలు సేకరించారు.

మహారాష్ట్రలోనూ ముమ్మరం

మహారాష్ట్రలోనూ బీఆర్ఎస్ విస్తరణకు కేసీఆర్ ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో కార్యకలాపాలు ముమ్మరం చేయనున్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, మరికొందరు ప్రజాప్రతినిధులు ఇప్పటికే నాందేడ్ జిల్లా బోకర్ నియోజకవర్గంలో పర్యటించారు. త్వరలోనే మహారాష్ట్రలోని షోలాపూర్, పుణె, గుజరాత్‌లోని సూరత్ ప్రాంతాలకు కూడా బీఆర్ఎస్ నాయకులు వెళ్లనున్నట్లు సమాచారం. మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎంపీ నగేశ్ తదితరులు పొరుగునే ఉన్న మహారాష్ట్రలో విస్తృతంగా పర్యటించి వచ్చారు.

అధినేతకు ఎప్పటికప్పుడు నివేదికలు

తెలంగాణలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలను పొరుగు రాష్ట్రాల్లో వివరిస్తూనే, మరోవైపు బీఆర్ఎస్ పట్ల వారి అభిప్రాయాలను నేతలు తెలుసుకుంటున్నారు. ఆయా రాష్ట్రాల్లో స్థానికంగా ఉండే సమస్యలను తెలుసుకోవడంతో పాటు అక్కడి సంస్కృతి సంప్రదాయాలు, రాజకీయ స్థితిగతులను అధ్యయనం చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న నాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల జాబితాను తయారు చేయడంతో పాటు వారి నేపథ్యాన్ని కూడా ఆరా తీస్తున్నారు. పొరుగు రాష్ట్రాల్లో తాము పరిశీలించిన విషయాలతో కూడిన నివేదికలను ఎప్పటికప్పుడు రూపొందించి పార్టీ అధినేత కేసీఆర్‌కు అందజేస్తున్నారు. ఇదే తరహాలో పంజాబ్, హరియాణాతో పాటు తెలుగువారు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనూ బీఆర్ఎస్ విస్తరణ కోసం ప్రత్యేక బృందాలు పని చేస్తున్నట్లు సమాచారం.

...చేతిలో చతుర్ముఖం

▶ మొదటి పేజీ తరువాయి

గెలుపొందగలిగింది. ఈసారి మాత్రం 60కి పైగా స్థానాల్లో ఎలాగైనా విజయం సాధించాలని భావిస్తోంది.

ఆ 12 నియోజకవర్గాలపై ఫోకస్

2018లో గెలిచిన 19 మందిలో 12 మంది ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరారు. రెండు స్థానాలను ఉప ఎన్నికల్లో (హుజూర్‌నగర్, మునుగోడు) కోల్పోయింది. దీంతో ఐదుగురు మాత్రమే మిగిలారు. ఈ నేపథ్యంలో హస్తం గుర్తుపై గెలిచి టీఆర్ఎస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలకు సంబంధించిన 12 స్థానాల్లో ఈసారి కూడా ఎలాగైనా గెలుపొందేలా కాంగ్రెస్ ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగానే ఆయా ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా ఆందోళనలను ఉధృతం చేయనుంది. కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లోకి వెళ్లడం ద్వారా ఆయా ఎమ్మెల్యేలు పొందిన లబ్ధికి సంబంధించి సేకరించిన ఆధారాలను ప్రజల ముందుంచాలని నిర్ణయించింది. ఎమ్మెల్యేలకు ఎర కేసులో పార్టీ పక్షాన ఇంప్లీడ్ కావడం ద్వారా.. పార్టీ మారిన 12 మందిపై సీబీఐ విచారణ జరిపించాలని చేస్తున్న డిమాండ్ కూడా, ఆయా స్థానాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టడంలో భాగమేనని తెలుస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వారు పార్టీకి చేసిన మోసాన్ని ప్రజలకు వివరించడం ద్వారా సానుభూతిని పొందాలని పార్టీ భావిస్తోంది.

సిట్టింగ్ స్థానాలతో పాటు మరో 25 సీట్లపై గురి

రాష్ట్రంలోని 30 వరకు నియోజకవర్గాల్లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా గెలిచే బలం తమకుందని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇందులో ప్రస్తుతమున్న సిట్టింగ్ స్థానాలైన మధిర, సంగారెడ్డి, ములుగు, మంథని, భద్రాచలంతో పాటు హుజూర్‌నగర్, కోదాడ, నల్లగొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, జగిత్యాల, కొడంగల్, నిర్మల్, నర్సంపేట, మహబూబాబాద్, సూర్యాపేట, ఇబ్రహీంపట్నం, మంచిర్యాల, బోధన్, కామారెడ్డి, వరంగల్ వెస్ట్, ఈస్ట్, జనగామ, కొత్తగూడెం, పినపాక, పరిగి, జడ్చర్ల తదితర స్థానాలను లెక్కగడుతోంది. ఈ స్థానాల్లో పార్టీ శ్రేణులను పూర్తిస్థాయిలో ఉత్తేజితం చేయడం ద్వారా పోలింగ్ బూత్, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో మరింత బలం పుంజుకునేలా చేయాలనే ఆలోచనలో ఉంది.

వారి బలహీనతే పార్టీకి బలం..

ముప్పై స్థానాలకు తోడు బీఆర్ఎస్ బలహీనంగా ఉన్న మరో 20 వరకు స్థానాలను కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే గుర్తించింది. ఆలేరు, పటాన్‌చెరు, అచ్చంపేట, స్టేషన్ ఘన్‌పూర్, పరకాల, కరీంనగర్, వేములవాడ, బెల్లంపల్లి, జుక్కల్, మానకొండూరు, డోర్నకల్, పాలేరు, అశ్వారావుపేట, తుంగతుర్తి, వికారాబాద్, మేడ్చల్, కంటోన్మెంట్ లాంటి చోట్ల అనేక కారణాలతో బీఆర్ఎస్ అనుకున్నంత బలంగా లేదని పార్టీ భావిస్తోంది. కొన్నిచోట్ల ఎమ్మెల్యేల పట్ల ఉన్న వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు, మరికొన్ని చోట్ల బీఆర్ఎస్‌లో ఉన్న గ్రూపు తగాదాలు, పార్టీ కేడర్‌లో నెలకొన్న నైరాశ్యం లాంటి అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ప్రజల్లోకి వెళ్లనుంది. ఆయా స్థానాల్లో పరిస్థితులను తమకు అనుకూలంగా తిప్పుకునే దిశలో కార్యాచరణను రూపొందిస్తోంది.

ఇక్కడ ఎలాంటి ప్రయోగాలూ వద్దు!

ఇక తమకు అంతగా బలం లేని హైదరాబాద్ ఉమ్మడి జిల్లాతో పాటు రాజధాని శివార్లలోని రంగారెడ్డి జిల్లా పరిధిలోనికి వచ్చే స్థానాలు, బీజేపీ కొంత బలంగా ఉన్న నియోజకవర్గాలు, ముఖ్యంగా అర్బన్ ప్రాంతాలు, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ తదితర జిల్లాల్లో అనుకూలంగా లేని చోట్ల దీటైన గెలుపు గుర్రాలను ఎంపిక చేయడమే ఉత్తమ మార్గమని సునీల్ కనుగోలు టీం ఇచ్చిన నివేదిక వెల్లడించినట్టు తెలుస్తోంది. ఈ నియోజకవర్గాల్లో విజయం సాధించగలిగిన వారినే అభ్యర్థులుగా ఎంపిక చేయాలని, అవసరమైతే ఎన్నారైలు, కొత్తవారికి టికెట్లివ్వాలని సూచించినట్టు సమాచారం. సామాజిక సమతుల్యత, ఇతర ప్రయోగాలు ఈ నియోజకవర్గాల్లో చేయవద్దని పేర్కొన్నట్టు సమాచారం.

విజయమే లక్ష్యం

▶ మొదటి పేజీ తరువాయి

ముందు పార్టీ బలాన్ని పెంపొందింపజేయడం, నేతల పనితీరును మెరుగుపరచడం లాంటి బాధ్యతలన్నింటినీ ప్రచారక్‌ల భుజాలపై మోపింది. ఎన్నికల సన్నాహాల నివేదికలను సిద్ధం చేయడంతో పాటు, పార్టీ ఆదేశించిన కార్యక్రమాల అమలును పర్యవేక్షించే బాధ్యత విస్తారక్‌లకు కట్టబెట్టింది.

అంతర్గత విభేదాలకు చెక్

విస్తారక్‌లు నియోజకవర్గంలో పర్యటిస్తూ, మండల, మున్సిపల్ నేతలతో సమన్వయం చేసుకుంటూ, పార్టీ దృష్టి సారించాల్సిన ప్రాంతాలను గుర్తిస్తారు. ఆయా ప్రాంతాల్లో నేతల మధ్య ఉండే అంతర్గత విభేదాల పరిష్కారం, బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి చొరవ తీసుకుంటారు అని బీజేపీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. ఎప్పటికప్పుడు స్థానిక పరిస్థితులను జిల్లా అధ్యక్షుడి నుంచి జాతీయ నేతల వరకు నివేదిస్తారని తెలిపారు. ఇందుకోసం విస్తారక్‌లకు రెగ్యులర్‌గా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా ప్రధాన కార్యదర్శులు విస్తారక్‌లతో నిత్యం టచ్‌లో ఉంటూ పార్టీ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని వివరించారు.

నేతల పర్యటనలపై అంతర్గత షెడ్యూల్

ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో జాతీయ నేతల పర్యటనలపై బీజేపీ అంతర్గత షెడ్యూల్‌ను రూపొందించుకుంది. ఈ 9 రాష్ట్రాల్లో 15 రోజులకో జాతీయ నేత పర్యటన ఉండేలా ప్రణాళిక రూపొందించుకుంది. మార్చిలో ఎన్నికలు జరిగే కర్ణాటకలో ఈ నెల 5, 6 తేదీల్లో నడ్డా, 12న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటిస్తారు. లోక్‌సభ ప్రవాస్ ప్రచారంలో భాగంగా ఈ ఒక్క నెలలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నికలు జరిగే 8 రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఇందులో తెలంగాణ సైతం ఉందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెలాఖరులో తెలంగాణ పర్యటన ఉంటుందని, లేనిపక్షంలో ఫిబ్రవరి తొలి వారంలో ఉంటుందని వెల్లడించాయి.

సావిత్రీబాయి పూలే స్ఫూర్తిని కొనసాగిస్తున్నాం

ఆమె జయంతి సందర్భంగా నివాళులర్పించిన సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: మహిళా హక్కులను సాధించడంతోనే మానవ హక్కుల సాధన సంపూర్ణమవుతుందనే విశ్వాసంతో సావిత్రీబాయి పూలే తన జీవితకాలం పోరాడారని సీఎం కేసీఆర్ అన్నారు. ఆ దిశగా భావజాలవ్యాప్తి కొనసాగించిన సామాజిక చైతన్యమూర్తి ఆమె అని కొనియాడారు. దేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం భారత జాతికి ఆమె అందించిన సేవలను స్మరించుకున్నారు. కుల, లింగ వివక్షతో కూడిన విలువలతో కునారిల్లుతున్న నాటి సమాజాన్ని, సమ సమాజం దిశగా నడిపించేందుకు తన జీవితాన్ని ధారపోశారన్నారు. సావిత్రీబాయి స్ఫూర్తిని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తోందని, మహిళల సమాన హక్కుల కోసం కృషి చేస్తోందన్నారు. ఈ దిశగా అనేక పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు.

విడతలవారీగా రైతుబంధు నిధుల జమ

ఆరోరోజు రూ.262.6 కోట్లు విడుదల

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం రైతుబంధు నిధులను విడతల వారీగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఆరోరోజు 1,49,970 మంది రైతుల ఖాతాల్లో రూ.262.6 కోట్ల రైతుబంధు నిధులను విడుదల చేశామని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ నిధులు దాదాపు 5,25,200.21 ఎకరాలకు చెందిన రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సరుకు రవాణాలో రైల్వే ఆల్‌టైం రికార్డు

- ఒక్క నెలలో 12.16 మిలియన్ టన్నులు తరలింపు
- 2019 మార్చి నెల రికార్డు బ్రేక్

సాక్షి, హైదరాబాద్: సరుకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే ఆల్‌టైం రికార్డు సాధించింది. ఒక నెల కాలంలో గతంలో ఏ నెలలో రవాణా చేయనంతగా సరుకును తరలించి రికార్డు నెలకొల్పింది. గత డిసెంబర్‌లో 12.16 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసింది. ఇది 2021 డిసెంబర్‌లో సరఫరా చేసిన సరుకు పరిమాణంతో పోలిస్తే 21% ఎక్కువ కావటం విశేషం. భారతీయ రైల్వేలో అన్ని జోన్లతో పోలిస్తే ఇదే అత్యధిక వృద్ధి. 2019 మార్చిలో 11.90 మిలియన్ టన్నుల సరుకును తరలించటం ఇప్పటి వరకు దక్షిణమధ్య రైల్వేలో రికార్డుగా ఉంది. ఇప్పుడు అధిగమించి కొత్త రికార్డును సృష్టించింది. గత డిసెంబర్‌లో 6,041 వ్యాగన్లను వినియోగించింది. అంతకుముందు ఏడాది డిసెంబర్‌లో ఈ సంఖ్య 4,982 మాత్రమే కావటం విశేషం. ఫలితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు మొత్తం 96.384 మిలియన్ టన్నుల సరుకును సరఫరా చేసినట్టయింది. ఇది గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే 13 శాతం ఎక్కువ కావటం విశేషం.

సీఐఎస్ఎఫ్ మాజీ కానిస్టేబుల్ ఆత్మహత్య


రవీందర్ (ఫైల్)

జవహర్‌నగర్: హైదరాబాద్ నగర శివారులోని జవహర్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)కు చెందిన ఓ మాజీ కానిస్టేబుల్ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం .. నిజామాబాద్ జిల్లా దోమకొండ మండలం బీబీపేట్ గ్రామానికి చెందిన కుమ్మరి రవీందర్ (30)కు భార్య శిరీష, మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. 2017లో సీఐఎస్ఎఫ్‌లో చేరిన రవీందర్‌ను కొన్ని కారణాలతో 2020లో తొలగించారు. అయితే ఈ విషయాన్ని ఇంట్లో చెప్పని రవీందర్ రెండేళ్లుగా నిత్యం యూనిఫాం ధరించి హకీంపేట పరిధిలోని సింగాయపల్లిలో ఉంటున్న ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తున్నాడు. మంగళవారం సైతం భార్యకు ఇలాగే చెప్పి వెళ్లిన రవీందర్ కౌకూర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అడవికి వెళ్లిన గొర్లకాపరులు ఈ విషయాన్ని జవహర్‌నగర్ పోలీసులకు చెప్పడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

మత్స్య సొసైటీల్లో 1.30 లక్షల సభ్యత్వమే లక్ష్యం

మరో 241 సొసైటీల ఏర్పాటు ప్రక్రియ: మంత్రి తలసాని



సాక్షి,హైదరాబాద్: అర్హులైన మత్స్యకారులకు కొత్త సొసైటీల్లో సభ్యత్వం కల్పిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా మరో 1.30లక్షల సభ్యత్వమే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మొదటి విడత స్పెషల్ డ్రైవ్‌లో 7,963 మంది సభ్యులతో 406 మత్స్య సొసైటీలను ఏర్పాటుచేశామని, మరో 241 సొసైటీల ఏర్పాటు ప్రక్రియ ఈ నెలాఖరు నాటికి పూర్తి అవుతుందన్నారు. సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ పూర్తయిన తర్వాత మార్కెటింగ్ సొసైటీల ఏర్పాటుకు చర్యలు చేపడతామని చెప్పారు. మంగళవారం జిల్లాల మత్స్య శాఖ అధికారులతో మంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అధర్ సిన్హా, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం పాల్గొన్నారు. మత్స్య సొసైటీలలో సభ్యత్వం డ్రైవ్-2కు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అన్ని నీటివనరులకు జియో ట్యాగింగ్ చేశామని మంత్రి చెప్పారు.

ఇదండీ సంగతి


... చెంపదెబ్బ వాళ్లిద్దరికీ కాదు.....

క్లుప్తంగా...

నేరుగా రాత పరీక్ష

పోలీస్ పోస్టుల్లో గర్భిణులకు ఊరట



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన వివిధ పోలీస్ పోస్టుల్లో పాల్గొనే గర్భిణులకు హైకోర్టు ఊరటనిచ్చింది. ఫిజికల్ టెస్టు లేకుండానే నేరుగా రాత పరీక్షలకు హాజరుకావొచ్చని స్పష్టం చేసింది. ఆ పరీక్షల్లో అర్హత పొందాక ఫిజికల్ టెస్టుల్లో పాల్గొనే వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు మార్చి 12 నుంచి ఏప్రిల్ 23 వరకు జరిగే రాత పరీక్షల్లో పాల్గొన వచ్చని సూచిస్తూ న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకారం.. ఫిజికల్ టెస్టులో అర్హత సాధించిన వారే రాత పరీక్షలకు అర్హులు. దీనిపై కొందరు గర్భిణులు హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుత పరిస్థితిలో తాము ఫిజికల్ టెస్టులకు హాజరుకాలేమని, రాత పరీక్షకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ మంగళవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. మెడికల్ రిపోర్టులను పరిశీలించిన తర్వాత వారిని రాత పరీక్షకు అనుమతించాలని ఆదేశించారు. రాత పరీక్ష తర్వాత ఫిజికల్ టెస్ట్ తప్పనిసరి అని స్పష్టం చేశారు.

సీఎంఆర్ కింద ఇక ఫోర్టిఫైడ్ రా రైసే

సాక్షి, హైదరాబాద్: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద ఇక నుంచి పూర్తి స్థాయిలో బలవర్ధకమైన ముడి బియ్యం (ఫోర్టిఫైడ్ రా రైస్) మాత్రమే సేకరించనున్నట్టు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్రంలోని ఎఫ్‌సీఐ ఏడు డివిజన్ల మేనేజర్లకు ఆదేశాలు జారీ చేసింది. 2021–22 వానాకాలం పంటకు సంబంధించి మాత్రమే ఎఫ్‌సీఐ కొంత పరిమాణంలో నాన్‌–ఫోర్టిఫైడ్ ముడి బియ్యాన్ని స్వీకరిస్తోందని సంస్థ రీజినల్ జనరల్ మేనేజర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఇప్పుడు సీఎంఆర్ జరుగుతున్న 2021– 22 యాసంగి పంటతో పాటు ప్రస్తుతం సేకరిస్తున్న 2022–23 వానాకాలం పంట నుంచి సీఎంఆర్ కింద ఫోర్టిఫైడ్ రా రైస్‌ను మాత్రమే ఆమోదించనున్నట్టు స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల దృష్ట్యా గత యాసంగి, ప్రస్తుత వానాకాలం సీజన్ ధాన్యాన్ని బలవర్ధకమైన ముడి బియ్యంగా మాత్రమే అంగీకరించాలని ఎఫ్‌సీఐ అధికారులను ఆదేశించారు. ఈ నెల 9వ తేదీ నుంచి అన్ని డివిజన్‌లలో ఈ ఆదేశాలను అమలు చేయాలని పేర్కొన్నారు. జిల్లాల అధికారులకు, రైస్ మిల్లర్లకు సమాచారం అందించాలని ఆదేశించారు.

సునీల్‌కు చుక్కెదురు

కేసు కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలుకు హైకోర్టు లో చుక్కెదురైంది. సైబర్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ కొట్టివేతకు నిరాకరించింది. 41ఏ సీఆర్‌పీసీ కింద ఇచ్చిన నోటీసులపై స్టేకు కూడా నో చెప్పింది. అయితే పోలీసులు మాత్రం ఆయనపై ఎలాంటి బలవంతమైన చర్యలు తీసుకోరాదని ఆదేశించింది. అరెస్టు కూడా చేయవద్దని స్పష్టం చేసింది.అభ్యంతర పోస్టులు పెట్టారంటూ దాఖలైన కేసులో సైబర్ క్రైమ్ పోలీసులు సునీల్ కనుగోలుకు 41ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిని సునీల్ కనుగోలు సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించగా, మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కేసు కొట్టివేతకు నిరాకరిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో 8న ఆయన సైబర్ పోలీసుల ముందు విచారణకు హాజరు కావాల్సి ఉంది.

3 నెలల్లో టీఎస్‌ఎంసీకి ఎన్నికలు నిర్వహించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్(టీఎస్‌ఎంసీ)కి ఎన్నికయ్యే సభ్యుల సంఖ్య తగ్గిస్తూ, నామినేటెడ్ సభ్యుల సంఖ్యను అలాగే ఉంచుతూ, తాత్కాలిక మండలిని ఏర్పాటు చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోలను హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికయ్యే సభ్యుల సంఖ్య తగ్గితే.. టీఎస్‌ఎంసీ అటానమస్ హోదాను కోల్పోయే ప్రమాదం ఉందన్న పిటిషనర్ల తరపు న్యాయవాది సామ సందీప్‌రెడ్డి వాదనలతో న్యాయస్థానం ఏకీభవించింది. ఎన్నికలు కూడా 3 నెలల్లో నిర్వహించాలని స్పష్టం చేసింది. కొత్త కౌన్సిల్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తాత్కాలిక మండలి రద్దవుతుందని పేర్కొంది. టీఎస్‌ఎంసీకి ఎన్నికయ్యే సభ్యుల సంఖ్య తగ్గింపుపై హెల్త్‌కేర్ రీఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై దీనిపై సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎన్నిక ద్వారా వచ్చే సభ్యుల సంఖ్యను రాష్ట్ర ప్రభుత్వం 13 నుంచి 5కు తగ్గించడం అన్యాయం, చట్టవిరుద్ధమని సందీప్‌రెడ్డి నివేదించారు. అప్పుడు ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులు ఆరుగురిదే పైచేయి అవుతుందన్నారు. రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ 'అటానమస్'హోదా కూడా దెబ్బతింటుందన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్‌లో సభ్యుల సంఖ్య దాదాపు 90 వేలకు పైగా ఉండేదన్నారు. ఇప్పుడు అది దాదాపు 37 వేలకు తగ్గిందని.. ఈ నేపథ్యంలోనే ఎన్నిక ద్వారా వచ్చే సభ్యుల సంఖ్యలను తగ్గించామన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వ జీవోలను తప్పుబట్టింది. ఆ రెండు జీవోలను కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

భారీగా ఐపీఎస్‌ల బదిలీ

▶ మొదటి పేజీ తరువాయి

స్టేట్ సైబర్ సెక్యురిటీ బ్యూరోలకు అధికారులను నియమించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సీవీ ఆనంద్‌కు యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అడిషనల్ డీజీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఐజీగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు.



సందీప్ శాండిల్య



రాజీవ్ రతన్

బదిలీలు ఇలా..

- అదనపు డీజీ ఆర్గనైజేషన్స్‌గా ఉన్న అదనపు డీజీ రాజీవ్‌రతన్‌ను తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా బదిలీ చేశారు.
- అడిషనల్ డీజీ రైల్వేస్ రోడ్ సేఫ్టీగా ఉన్న సందీప్ శాండిల్యను తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.
- గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అదనపు డీజీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిని అదనపు డీజీ ఆర్గనైజేషన్స్, లీగల్‌గా బదిలీ చేశారు.
- అదనపు డీజీ పర్సానెల్‌గా ఉన్న బి.శివధర్‌రెడ్డి రైల్వేస్, రోడ్ సేఫ్టీ అదనపు డీజీగా బదిలీ అయ్యారు.
- టీఎస్‌ఎస్పీ అదనపు డీజీగా ఉన్న అభిలాష బిస్త్‌ను అదనపు డీజీ వెల్ఫేర్, స్పోర్ట్స్‌గా బదిలీ చేశారు. అదేవిధంగా హోంగార్డ్స్ అదనపు డీజీగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు.
- ఏసీబీ డైరెక్టర్‌గా ఉన్న షికా గోయల్‌ను అదనపు డీజీ ఉమెన్ సేఫ్టీ, షీటీమ్స్, భరోసా సెంటర్స్‌గా బదిలీ చేశారు.
- టీఎస్‌ఎల్పీఆర్బీ చైర్మన్ వీరిశెట్టి వెంకట శ్రీనివాసరావుకు అదనపు డీజీ పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు.
- ఉమెన్ సేఫ్టీ వింగ్ ఇన్‌చార్జి స్వాతిలక్రాను టీఎస్‌ఎస్పీ బెటాలియన్స్ అదనపు డీజీగా బదిలీ చేశారు.
- పోస్టింగ్ కోసం వెయింటింగ్‌లో ఉన్న విజయ్ కుమార్‌ను గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అదనపు డీజీగా బదిలీ చేశారు.
- నార్త్‌జోన్ అదనపు డీజీగా ఉన్న వై.నాగిరెడ్డిని తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ సర్వీసెస్ డీజీగా బదిలీ చేశారు.
- పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న విక్రమ్ మాన్‌సింగ్‌ను హైదరాబాద్ సిటీ శాంతిభద్రతల అదనపు కమిషనర్‌గా నియమించారు.
- రాచకొండ అదనపు కమిషనర్‌గా ఉన్న జి.సుధీర్ బాబును హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ అదనపు సీపీగా బదిలీ చేశారు.
- మైనార్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ఉన్న షాహ్నావాజ్ ఖాసీంకు మల్టీజోన్ -2 ఐజీగా బాధ్యతలు అప్పగించారు.
- వెయిటింగ్‌లో ఉన్న తరుణ్ జోషిని ఐజీ ట్రైనింగ్స్‌గా నియమించారు.
- వెయిటింగ్‌లో ఉన్న వీబీ కమలాసన్‌రెడ్డికి ఐజీ పర్సానెల్‌గా బాధ్యతలు అప్పగించారు.
- రామగుండం పోలీస్ కమిషనర్‌గా ఉన్న ఎస్.చంద్రశేఖర్‌రెడ్డిని మల్టీజోన్–1 ఐజీగా బదిలీ చేశారు.
- హైదరాబాద్ సిటీ జాయింట్ సీపీగా ఉన్న ఎం.రమేశ్‌ను డీఐజీ ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్‌గా బదిలీ చేశారు.
- హైదరాబాద్ జాయింట్ సీపీగా ఉన్న కార్తికేయను డీఐజీ ఇంటిలిజెన్స్‌గా నియమించారు.
- తెలంగాణ పోలీస్ అకాడమీ జాయింట్ డైరెక్టర్ కె.రమేశ్‌నాయుడును రాజన్న జోన్ డీఐజీగా బదిలీ చేశారు.
- సీఐడీ డీఐజీగా ఉన్న ఎం.శ్రీనివాసులును హైదరాబాద్ సిటీ సీఏఆర్ జాయింట్ సీపీగా బదిలీ చేశారు.
- వెయిటింగ్‌లో ఉన్న తఫ్సీర్ ఇక్బాల్‌ను డీఐజీ ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌కు బదిలీ చేశారు.
- హైదరాబాద్ జాయింట్ కమిషనర్‌గా ఉన్న డా.గజరావు భూపాల్‌ను రాచకొండ జాయింట్ సీపీగా నియమించారు.
- నల్లగొండ ఎస్పీగా ఉన్న రెమా రాజేశ్వరిని యాదాద్రి జోన్ డీఐజీగా బదిలీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నల్లగొండ ఎస్పీగా కూడా కొనసాగుతారు.
- వెయిటింగ్‌లో ఉన్న ఎల్ఎస్ చౌహాన్‌ను జోగులాంబ జోన్ డీఐజీగా ఎస్పీ ర్యాంకులో నియమించారు.
- వెయిటింగ్‌లో ఉన్న కె.నారాయణ్ నాయక్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా నియమించారు.
- సీఐడీలో ఎస్పీగా ఉన్న జె.పరిమళ హన నూతన్‌ను హైదరాబాద్ సిటీ జాయింట్ సీపీ అడ్మిన్‌గా బదిలీ చేశారు.
- వెయిటింగ్‌లో ఉన్న ఆర్.భాస్కరన్‌ను కౌంటర్ ఇంటిలిజెన్స్ సెల్ ఎస్పీగా నియమించారు.

'కంటివెలుగు' కోసం 1,500 బృందాలు

- వందరోజుల్లో పూర్తి చేసి గిన్నిస్ రికార్డు కోసం యత్నం
- ఉచితంగా 55 లక్షల కంటిఅద్దాల పంపిణీ
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్. చిత్రంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, తలసాని

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 18 నుంచి ప్రారంభించనున్న రెండో దఫా కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కార్యక్రమం సన్నద్ధతపై మంగళవారం మంత్రులతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయనతోపాటు ఇతర మంత్రులు జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీఎస్ సోమేశ్‌కుమార్, వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇతర ఉన్నతాధికారులు శ్వేత మహంతి, డాక్టర్ శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల నుంచి పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్యాధికారులు, పంచాయతీ, మున్సిపల్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ మొదటిదఫా కంటివెలుగు కార్యక్రమంలో 1.54 కోట్ల మందికి స్క్రీనింగ్ చేసి, 50 లక్షల కళ్లద్దాలు ఇచ్చామని చెప్పారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు గ్రామం, మున్సిపల్ వార్డు కేంద్రంగా క్యాంపుల నిర్వహణ ఉంటుందని చెప్పారు. మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమం 8 నెలలు జరిగిందని, రెండోవిడత కంటి వెలుగు వంద పనిదినాల్లో పూర్తి చేస్తామన్నారు. మొదటి దఫా కంటివెలుగులో 827 బృందాలు పనిచేయగా, ఇప్పుడు 1,500 బృందాలను ఏర్పాటు చేశామని, తద్వారా గిన్నిస్ రికార్డులో నమోదయ్యేలా కృషి చేయాలని అన్నారు. ఒక్కో బృందంలో అప్టో మెట్రిస్ట్, సూపర్‌వైజర్, ఇద్దరు ఏఎన్‌ఎం, ముగ్గురు ఆశా, డీఈవో ఉంటారన్నారు.

55 లక్షల కళ్లద్దాల పంపిణీ...

పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తామని మంత్రి హరీశ్ అన్నారు. ఇందులో 30 లక్షల రీడింగ్ గ్లాసెస్, 25 లక్షల ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ ఉంటాయని, మొత్తం 55 లక్షల కళ్లద్దాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. రోజువారీ వైద్యసేవలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీలోగా అన్ని జిల్లాల్లో మంత్రుల నేతృత్వంలో కంటివెలుగు సమావేశాలు నిర్వహించాలని, అన్ని మున్సిపాలిటీలు, మండల పరిషత్‌లకు షెడ్యూల్ ఖరారు చేయాలన్నారు. రేషన్ షాపుల్లో, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో క్యాంపుల నిర్వహణ తేదీలు అందరికీ తెలిసేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రస్థాయిలో 10, జిల్లాకొక క్వాలిటీ కంట్రోల్ టీమ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కంటి వెలుగు కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని మంత్రి ఆదేశారు.

విశ్వశాంతి స్థాపనకు కృషిచేయాలి

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ్ము పిలుపు
- వర్చువల్‌లో యాదాద్రి జిల్లాలో రిట్రీట్ సెంటర్ ప్రారంభం




సైలెన్స్ రిట్రీట్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ తమిళిసై. చిత్రంలో బ్రహ్మకుమారీలు

బీబీనగర్: దేశంలోని ఎంతోమంది మహనీయులు విశ్వశాంతి స్థాపనకు పాటుపడ్డారని, వారి బాటలో శాంతిని మరింతగా విస్తరింపజేసేలా అందరూ కృషిచేయాలని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మహదేవ్‌పురం గ్రామ పరిధిలో నిర్మించిన ఆధ్యాత్మిక శాంతి కేంద్రమైన బ్రహ్మకుమారీస్ భవనంలో సైలెన్స్ రిట్రీట్ సెంటర్‌ను రాష్ట్రపతి మంగళవారం రాజస్తాన్ నుంచి వర్చువల్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచమంతా ఆధ్యాత్మిక శక్తిగల భారత్‌ను గురువుగా అంగీకరిస్తుందన్నారు. ప్రజలు శాంతిని, ఆధ్యాత్మికతను, మానవత్వాన్ని అలవర్చుకునే విధంగా బ్రహ్మకుమారీస్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలతోపాటు వివిధ వర్గాల వారిలో ఆధ్యాత్మికత, నైతిక విలువలు పెంపొందించేందుకు సైలెన్స్ రిట్రీట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ఆనందదాయకమని అన్నారు. మారుతున్న జీవన శైలిలో మానవుడు ఎన్నో ఒత్తిళ్లకు గురవుతున్నాడని, దాని నుంచి ఉపశమనం పొందేందుకు మెడిటేషన్ టెక్నిక్స్ ఎంతో అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ... జీవితంలో మానసిక మార్పులు, చక్కని మెళకువలు నేర్పించడానికి నిశ్శబ్దం అత్యంత శక్తిమంతంగా పనిచేస్తుందని చెప్పారు.

ఉత్తమ బెటాలియన్లకు ట్రోఫీలు

టీఎస్‌ఎస్పీ ఉన్నతాధికారులతో సమీక్షలో డీజీపీ అంజనీకుమార్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీఎస్‌ఎస్పీ) అత్యంత కీలకమని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. తెలంగాణ స్పెషల్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆ విభాగం పనితీరుపై టీఎస్‌ఎస్పీ అడిషనల్ డీజీ అభిలాష బిస్త్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా టీఎస్‌ఎస్పీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన అంజనీ కుమార్‌కు అభిలాష, ఇతర సీనియర్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో టీఎస్‌ఎస్పీ డీఐజీ ఎంఎస్ సిద్ధిఖీతోపాటు రాష్ట్రంలోని అన్ని పోలీస్ బెటాలియన్ల కమాండెంట్లు పాల్గొన్నారు. అంజనీకుమార్ మాట్లాడుతూ ఉత్తమ విధుల నిర్వహణ, బెటాలియన్లలో పరిపాలన అంశాలు, పరిశుభ్రమైన క్యాంపస్ నిర్వహణ, సమర్థవంతమైన పర్యవేక్షణ, సంక్షేమ కార్యక్రమాలలో పోటీ ప్రాతిపదికగా ఉత్తమంగా నిలిచిన బెటాలియన్లకు ట్రోఫీలు అందజేస్తామని వెల్లడించారు. కాలంతో పాటు శాంతిభద్రతల నిర్వహణ, భద్రతాపరమైన విధుల్లో పోలీసుశాఖ కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు అధికారులు వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలన్నారు. సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. కాగా, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని టీఎస్‌ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో డీజీపీ కేక్‌కట్ చేసి అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ వైద్య విద్య దేశానికే ఆదర్శం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- చౌటుప్పల్ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం



చౌటుప్పల్ ఆస్పత్రిలో డయాలసిస్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న హరీశ్‌రావు. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, లింగయ్యయాదవ్, ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్: తెలంగాణలోని వైద్యవిద్య దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సమైక్య పాలనలో వైద్యవిద్యను అభ్యసించాలంటే విద్యార్థులు చైనా, రష్యా, ఉక్రెయిన్ దేశాలకు వెళ్లాల్సి వచ్చేదని, సీఎం కేసీఆర్ ముందుచూపుతో ప్రస్తుతం వైద్యం, వైద్య విద్య గ్రామీణ ప్రాంతాలకే వచ్చిందన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను మంగళవారం విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 107 కళాశా లలు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఒక్కటి కూడా ఇవ్వలేదని విమర్శించారు. సమైక్య పాలనలో తెలంగాణలో ఉస్మానియా, గాంధీ, వరంగల్ ఎంజీఎం ఆసుపత్రుల్లో మాత్రమే కిడ్నీ డయాలసిస్ సెంటర్లు ఉండేవని, వీటిని 102కు పెంచామన్నారు. ప్రతి ఏడాది డయాలసిస్ సెంటర్లకు రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నామని, కిడ్నీ బాధితులపై ఒక్క పైసాకూడా భారం పడకుండా సేవలు అందిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలుస్తున్నారని చెప్పారు. తెలంగాణకు ఎయిమ్స్ ఇస్తామంటే బీబీనగర్‌లోని రూ.500 కోట్ల విలువ చేసే భూమి, భవనాలను కేంద్రానికి అప్పగించామని, నాలుగేళ్లలో అక్కడ తట్టెడు మట్టికూడా పోయలేదని ధ్వజమెత్తారు.

ఉచిత రేషన్‌కు సర్కారు గ్రీన్ సిగ్నల్

ఈనెల 5 నుంచి రేషన్ పంపిణీ



సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజనలో భాగంగా కేంద్రం ప్రకటించిన సంవత్సర కాలం ఉచితరేషన్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ జనవరి నుంచి వచ్చే డిసెంబర్ వరకు దేశవ్యాప్తంగా 5 కిలోలు బియ్యం ఉచితంగా అందించాలని కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. జాతీయ ఆహార భద్రతా చట్టం కార్డులు కలిగిన వారికి ఒక్కొక్కరికి 5కిలోల బియ్యం ఉచితంగా ఇవ్వనున్నారు. అంత్యోదయ కార్డులకు కుటుంబానికి 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోలు ఉచితంగా అందించనున్నారు. అదేవిధంగా కుమ్రంభీమ్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాలకు బియ్యానికి బదులుగా ఫోర్టిఫైడ్ రైస్ ఇవ్వనున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆహార భద్రత కార్డులున్న వారి విషయంలో ఉచిత రేషన్ గురించి ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. రాష్ట్రంలో 90 లక్షల ఆహార భద్రత కార్డులుండగా, అందులో 55 లక్షల కార్డులు కేంద్ర పరిధిలో ఉండగా, 35 లక్షల కార్డులు రాష్ట్ర పరిధిలో ఉన్నాయి.

ఎన్పీడీసీఎల్‌లో నోటిఫికేషన్ జారీచేయలేదు

టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు



హనుమకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో ఎలాంటి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయలేదని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎ.గోపాల్‌రావు స్పష్టం చేశారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో 157 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు వస్తున్న ప్రకటన, ప్రచురణతో తమకు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లు, కొన్ని పత్రికల్లో 157 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రకటనలు వచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలాంటి కథనాలను నమ్మవద్దని, నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్‌కు చెందిన వెబ్‌సైట్‌లో చూసుకుని వాస్తవాలు నిర్ధారించుకోవాలని గోపాల్‌రావు సూచించారు. సంస్థ ఉద్యోగాల భర్తీ చేపడితే అధికారికంగా పత్రికలు, చానళ్లలో నోటిఫికేషన్ ఇస్తుందన్నారు. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమాచారాన్ని నమ్మవద్దని కోరారు. చార్టర్డ్ అకౌంటెంట్ సంస్థలు 157 యూనిట్లను ఆడిట్ చేయాలని ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో పొందుపరిస్తే.. దీన్ని కొన్ని వెబ్‌సైట్లు, పత్రికలు 157 పోస్టులుగా వక్రీకరించి ప్రచారం చేస్తున్నాయని, నిరుద్యోగులు దీన్ని గమనించాలని సూచించారు.

సరస్వతీదేవిపై అనుచిత వ్యాఖ్యలు

బాసరలో ప్రజలు, అర్చకుల నిరసనలు.. యువకుడిపై కేసు నమోదు



రాజేశ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాసర ఆలయ సిబ్బంది

బాసర (ముథోల్): బాసరలోని జ్ఞాన సరస్వతీదేవిపై భారతీయ నాస్తిక సంఘం రాష్ట్ర శాఖకు చెందిన రేంజర్ల రాజేశ్ అనే గాయకుడు చేసిన అనుచిత వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మంగళవారం బాసరవ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. స్థానిక రైల్వేస్టేషన్ చౌరస్తాలో బైఠాయించి రాజేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అమ్మవారిని వ్యంగ్య పదాలతో దూషించిన రాజేశ్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాసర ఆలయ అర్చకులు, సిబ్బంది, ఆలయ తాత్కాలిక లేబర్ సొసైటీ సిబ్బంది సైతం అమ్మవారి ఆలయ ప్రధాన గోపురం ఎదుట ధర్నా చేశారు. గ్రామస్తులతో కలసి ర్యాలీగా వెళ్లి.. పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. రాజేశ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజేశ్‌పై ఐపీసీ 153, 504 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. కాగా, సరస్వతీదేవిని దూషించిన హిందూ ద్రోహి రేంజర్ల రాజేశ్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని వీహెచ్‌పీ రాష్ట్ర శాఖ ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది.

నరేశ్‌ను అరెస్ట్ చేసిన మహారాష్ట్ర పోలీసులు

కాళేశ్వరం: హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యల కేసులో ఇప్పటికే వికారాబాద్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న హనుమకొండ జిల్లాకు చెందిన బైరి నరేశ్‌ను మహారాష్ట్ర పోలీసులు ఇదే తరహా కేసులో అరెస్టు చేశారు. అతన్ని గడ్చిరోలి జిల్లా సిరొంచ కోర్టులో మంగళవారం హాజరుపరచగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. గతేడాది డిసెంబర్ 24, 25 తేదీల్లో సిరొంచలో నిర్వహించిన కార్యక్రమంలో హిందూ దేవతలపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశాడు. దీనిపై సిరొంచ, అహేరి తాలూకాల్లో అతనిపై కేసు నమోదైంది.

హిందూ దేవుళ్లను తిడితే వీపులు పగలకొట్టండి

ఎంపీ సోయం బాపూరావ్

బోథ్: హిందూ దేవుళ్లను తిట్టినా.. కించపరిచినా వారి వీపులు పగలకొట్టాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని దేవుల్‌నాయక్ తండాలో మంగళవారం నిర్వహించిన జగదాంబదేవి జాతరలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

హిందూ దేవతలను తిట్టేవారిపై చర్యలు తీసుకోండి

గవర్నర్‌కు అయ్యప్పస్వాముల జేఏసీ వినతి

పంజగుట్ట (హైదరాబాద్): హిందూ దేవతలను తిడుతూ, మతవిద్వేషాలు రెచ్చగొడుతూ రాష్ట్రం అల్లకల్లోలమయ్యేలా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ అయ్యప్ప స్వాముల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. జేఏసీ కన్వీనర్లు బుచ్చిరెడ్డి గురుస్వామి, బాలకృష్ణ గురుస్వామి, రాధాకృష్ణ గురుస్వామి, ప్రేమ్‌గాంధీ గురుస్వామి మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రులు, పోలీస్ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమని అన్నారు.

బైరి నరేశ్‌తో బండి, ఈటల భేటీ ఆంతర్యమేంటి?

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్

సాక్షి, హైదరాబాద్: హిందూ దేవుళ్లనుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం అప్రజాస్వామికమని, అయితే ఈ దూషణల వెనుక ఉన్న కుట్ర ఏంటనే విషయాలను లోతుగా అర్థం చేసుకోవాల్సి ఉంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. అయ్యప్పనుద్దేశించి అసభ్యంగా మాట్లాడిన బైరి నరేశ్‌తో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ భేటీ వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. మంగళవారం గాంధీభవన్‌లో కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నరేశ్, రాజేశ్ హిందూ దేవుళ్లనుద్దేశించి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోందన్నారు.





ఏమీ లేకపోవడం, అది ఎంత ఆనందప్రదం!
జ్ఞానోదయం అయినవారు ఏమీలేనివారు. ఏదో ఉన్నవారంటే తన మనసులో మనుష్యుల సంకెళ్లు ఉన్నవారు. వారు పడే వేదన చూడండి.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, జనవరి, 4

ఈ తోక వంకర తీసేదెట్లా?

కొత్త ఏడాది ఇలా ఆరంభమవుతుందని కశ్మీర్ ప్రజలు ఊహించలేదు. అందరూ శాంతి, సంతోషాలను కోరుకుంటున్న వేళ జమ్ములో తీవ్రవాదం జడలు విప్పి, 12 గంటల్లో ఆరుగురిని పొట్టనబెట్టుకున్న తీరు మనసును కలచివేస్తుంది. కశ్మీర్ లోయతో పోలిస్తే ప్రశాంతమైన జమ్ములో ఇలాంటి ఘటన జరగడం విషాదం. 2019లో ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసి, కేంద్ర పాలిత ప్రాంతంగా భారత్ ప్రకటించిన జమ్ము– కశ్మీర్‌లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించి, ఎన్నికల ప్రక్రియను పునరుద్ధరించకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా తీవ్రవాదులు ఈ దుశ్చర్యలకు దిగినట్టు కనిపిస్తోంది. ఇది పాక్ ప్రేరేపిత తీవ్రవాద చర్య అని అర్థం చేసుకోవడం బ్రహ్మవిద్యేమీ కాదు. కాకపోతే, భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఐక్యరాజ్య సమితిలో మాట్లాడుతూ, తీవ్రవాద కేంద్రస్థానంగా పాకిస్తాన్‌ను ప్రస్తావించి, ఈ ధోరణిని మార్చుకోవాలంటూ హితవు చెప్పిన పక్షం రోజులకే ఈ ఘాతుకం జరగడం శోచనీయం. మారని పాక్ వక్రబుద్ధికి మరో తార్కాణం.

తాజా ఘటన పూర్వాపరాలు దిగ్భ్రాంతికరం. జమ్ము–కశ్మీర్ సరిహద్దు జిల్లాలో రజౌరీ పట్నానికి 8 కిలోమీటర్ల దూరంలోని ధాంగ్రీలో జనవరి 1 సాయంత్రం 7 గంటల వేళ ఖాకీ దుస్తులు ధరించిన తీవ్రవాదులు అక్కడి అల్పసంఖ్యాక వర్గానికి చెందిన మూడు ఇళ్ళలోకి జొరబడ్డారు. విచక్షణారహితంగా కాల్పులు జరిపి, నలుగురు పౌరుల ప్రాణాలు తీశారు. పలువురిని గాయపరిచి, అక్కడ నుంచి ఉడాయించారు. ఆ తుపాకీ దాడులు ముగిసిన కొద్ది గంటల్లోనే ఆ ఇళ్ళ దగ్గరే ఒక చోట తీవ్రవాదులు ఉంచిన బాంబులు పేలి ఇద్దరు చిన్నారులు బలయ్యారు. దర్యాప్తుకు వచ్చే భద్రతాదళ ఉన్నతాధికారులే లక్ష్యంగా ఆ బాంబులు పెట్టడం, ఆధార్ కార్డుల ద్వారా గుర్తుపట్టి మరీ ఎంపిక చేసినవారినే తుపాకీ కాల్పులతో చంపడం తీవ్రవాదుల కక్షను తేటతెల్లం చేస్తోంది.

కశ్మీర్‌లో తీవ్రవాదం వైపు కొత్తగా ఆకర్షితులవుతున్నవారిని వేగంగా నిర్వీర్యం చేస్తున్నామని అక్కడి ఉన్నతాధికారుల ఉవాచ. నిన్న గాక మొన్న ముగిసిన 2022లో 100 మంది కొత్తగా తీవ్రవాద మార్గంలోకి రాగా, 65 మందిని ఎన్‌కౌంటర్ చేశామనీ, వారిలోనూ 58 మందిని (89 శాతం) చెడు దోవ తొక్కిన తొలి నెలలోనే మట్టికరిపించామనీ లెక్కలు చెబుతున్నారు. ఎంతమంది తీవ్ర వాదులు కొత్తగా వస్తున్నదీ, పోతున్నదీ మన పాలకులు, పోలీసులు ఇంత నిర్దుష్టంగా చెప్పగలగడం ఆశ్చర్యమైతే, వారి ప్రతి అడుగూ ఇంత తెలిసినవారు అడ్డుకట్ట వేయలేకపోవడం అమితాశ్చర్యం. పైగా, ఆదివారం దాడి తర్వాత ఆ రాత్రి అణువణువూ జల్లెడ పట్టామని భద్రతా దళాలు చెప్పినా, ఆ దగ్గరే దుండగులు పెట్టిన బాంబులు మర్నాడు పేలి మృతులు పెరగడం మన పనితీరును ప్రశ్నిస్తోంది.

రజౌరీ జిల్లాలో కొన్నిచోట్ల ముప్పుందని కొంతకాలంగా అనుమానిస్తున్నారు. గాలింపులూ జరిగాయి. అయినా సరే ఇలా ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు సాగడం అటు తీవ్రవాదుల తెగింపుకూ, ఇటు మన భద్రతా వైఫల్యానికీ నిలువుటద్దం. జిల్లాలో ఓ సైనిక శిబిరం బయట కాల్పుల్లో ఇద్దరు పౌరుల ప్రాణాలు పోయిన రెండు వారాల్లోనే ఈ ఘటన జరగడం గమనార్హం. సరిహద్దులోని అల్పసంఖ్యాకులే గురిగా పాకిస్తాన్ ప్రేరేపిత తీవ్రవాదులు చేస్తున్న ఈ అరాచకం దాయాది దేశం సాధించదలుచుకున్నదేమిటో చెప్పకనే చెబుతోంది. పొరుగు దేశాలన్నిటితో భారత్ సదా సత్సంబంధాలే కోరుకుంటుంది. అలాగని తీవ్రవాదాన్ని బూచిగా చూపించి మనల్ని చర్చలకు తలొగ్గేలా చేయాలనుకుంటే కుదిరేపని కాదు. ఆ మాటే ఆ మధ్య జైశంకర్ కుండబద్దలు కొట్టారు.

జైశంకర్ సోమవారం వ్యాఖ్యానించినట్టు, అనేక దశాబ్దాలుగా సీమాంతర తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ పద్ధతులను యూరోపియన్ దేశాలు సహా అంతర్జాతీయ సమాజం నిర్ద్వంద్వంగా ఖండించకపోవడం మరీ ఘోరం. తీవ్రవాదాన్ని సహించబోమని జబ్బలు చరిచే అమెరికా సైతం భారత్‌తో భుజం భుజం కలుపుతూనే, పాక్‌తోనూ మంచిగా ఉంటోంది. 2018లో ట్రంప్ హయాంలో పెట్టిన నిషేధాన్ని తొలగిస్తూ, బైడెన్ హయాంలో అమెరికా గత ఏడాది పాక్‌తో ఎఫ్16 విమానాల ఒప్పందం పునరుద్ధరించింది. తీవ్రవాద వ్యతిరేక పోరాటంలో పాక్ భాగస్వామి గనకనే ఈ సైనిక, రక్షణ సాయమన్న అమెరికా మాట అతి పెద్ద జోక్. ఇక, ఇటీవలే భారత్, పాక్‌లలో దేన్నీ తాము వదులుకోలేమంటూ విదేశాంగ ప్రతినిధి చేసిన వ్యాఖ్య అగ్రరాజ్యపు నైజానికి తార్కాణం.

మాదక ద్రవ్యాలు, అక్రమ ఆయుధాల వ్యాపారం సహా అంతర్జాతీయ నేరాలెన్నో ముడిపడిన సీమాంతర తీవ్రవాదాన్ని కేవలం ఫలానా దేశపు తలనొప్పి లెమ్మని ఊరకుంటే ముప్పు మీదకొస్తుంది. రోజూ తీవ్రవాదుల్ని భారత్‌కు ఎగుమతి చేస్తున్న పొరుగుదేశం పక్కలో పాము లాంటిదే. గతంలో హిల్లరీ క్లింటన్ అన్నట్టు, 'పెరట్లో పాములను పెట్టుకొని, అవి కేవలం పొరుగువాణ్ణే కాటేస్తాయనుకుంటే పొరపాటే!' ఆ సంగతి అమెరికా సహా అంతర్జాతీయ దేశాలన్నీ గ్రహించాలి.

భారత్ సైతం పాక్‌పై అంతర్జాతీయ వేదికలపై ధ్వజమెత్తుతూనే, అమెరికా పైనా కన్నేసి ఉంచాలి. మన పాలకులు కశ్మీర్ లోయలో పండిట్లు సహా స్థానికులపై తీవ్రవాద దాడులు 2019 తర్వాత పెరిగిన చేదునిజాన్ని గుర్తించాలి. తీవ్రవాదుల్ని కాక తీవ్రవాదాన్ని అంతం చేసే పనికి దిగాలి. స్థానికుల ఆశలు, ఆకాంక్షలకు పెద్ద పీట వేస్తూ, వారే పాలకులయ్యేలా చూడాలి. సానుకూల వాతావరణం కల్పించి, ఇప్పటికే అపరిమితంగా ఆలస్యమైన అసెంబ్లీ ఎన్నికలను జరిపించి, స్థానిక ప్రభుత్వ ఏర్పాటుతో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. ఇప్పుడు అదే మార్గం.

2023లో మన విదేశాంగం ఎటు?

విశ్లేషణ



హర్ష్ వి. పంత్

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం భారత్‌ను అనూహ్యమైన భౌగోళిక, రాజకీయ పరీక్షల వైపు నెట్టింది. రష్యా పట్ల భారత్ వైఖరిని తిరిగి పరిశీలించుకునేలా చేసింది. అదే సమయంలో యూరప్ సమస్యలు ప్రపంచ సమస్యలు అవుతాయి కానీ ప్రపంచ సమస్యలు యూరప్ సమస్యలు కావు అనే ఆలోచనలోని కపటత్వాన్ని భారత్ నొక్కి చెప్పింది. ఇండో–పసిఫిక్ వ్యవహారాలకు సంబంధించి భారత్ కేంద్ర స్థానం విషయంలో యూరప్ దేశాలు నిశ్చితాభిప్రాయానికి వచ్చేశాయి. అయితే చైనా నుండి సవాళ్లు కొనసాగుతున్నాయి. ప్రపంచం మొత్తంగా బీజింగ్ వ్యవహారాలపై అసమ్మతి వ్యక్తపరుస్తున్న తరుణంలో– జీ20 నాయకత్వం రూపంలో అంతర్జాతీయ పర్యవసానాలను రూపుదిద్దగలిగే 'నాయకత్వ శక్తి'గా భారత్ తన విశ్వసనీయతను పెంపొందించుకోవాలి.

మరొక కల్లోలభరితమైన సంవత్సరం ముగిసింది. 2022 ప్రారంభంలో యుద్ధం యూరోపియన్ తీరాలకు చేరుకుంది. కోవిడ్–19 అనంతర సాధారణ స్థితికి ప్రపంచం వస్తున్న తరుణంలోనే ఉక్రెయిన్‌ను రష్యా ఆక్రమించడంతో ప్రపంచ క్రమవ్యవస్థకు కొత్త సవాళ్లను విసిరినట్టయింది. అమెరికా–చైనా మధ్య ఘర్షణ పదునెక్కుతున్న స్థితిలో రష్యా–చైనా మధ్య బంధం మరింతగా బలపడుతోంది. ప్రతి విషయంలోనూ ఆయుధీకరణ కొత్త వ్యవస్థగా ఆవిర్భవిస్తున్నందున ప్రపంచీకరణ వ్యతిరేక క్రమం చుట్టూ చర్చ బలం పుంజుకుంటోంది. ఈ ఉపద్రవం మధ్య అంతర్జాతీయ సంస్థలు నూతన సవాళ్లను ఎదుర్కోవడానికి ఏమాత్రం సిద్ధంగా లేవు. కాబట్టి, నూతన సంస్థాగత నిర్మాణాల కోసం శోధన ముందుకు వచ్చింది.

జాతీయ వ్యూహాత్మక చింతనకు చెందిన కొన్ని మౌలిక భావనలకు బహిరంగంగా వ్యతిరేకత ఎదురవుతున్నప్పుడు భారతీయ విదేశీ విధానం ఒక సంవత్సర కాలంలో ఈ అన్ని మలుపులకూ స్పందించాల్సి వచ్చింది. 2020లో గల్వాన్ సంక్షోభం భారత ప్రభుత్వాన్ని తన చైనా విధానాన్ని తిరిగి మదింపు చేసుకునేలా ఒత్తిడికి గురిచేసింది. ఆ విధంగానే ఉక్రెయిన్ యుద్ధం భారత్‌ను తన రష్యా విధాన చోదక శక్తుల పట్ల వైఖరిని తిరిగి పరిశీలించుకునేలా చేసింది. అలాగే పాశ్చాత్య ప్రపంచంతో తన వ్యవహార శైలిని కొత్తగా రూపొందించుకునేందుకు కూడా వెసులుబాటు కల్పించింది. 2022 ఫిబ్రవరిలో రష్యన్ దురాక్రమణ ప్రారంభమైనప్పుడు, డిమాండ్ చేస్తున్న పాశ్చాత్య దేశాలు ఒకవైపు, విఘాతం కలిగించే రష్యా మరొకవైపు ఉంటున్న స్థితిలో రెండు శక్తులతోనూ సంబంధాలను భారత్ ఎంత కష్టంగా నిర్వహిస్తుందనే అంశంపై చాలా చర్చ జరిగింది. అయితే అత్యంత సంక్లిష్టమైన ప్రపంచ సమస్యపై భారత్ సమతుల్యత ప్రదర్శించడం నుంచి నూతన సంవత్సరం నాడు ప్రారంభమైంది.

ఇంధన భద్రత కోసం రష్యాతో తన సంబంధ బాంధవ్యాలను భారత్ కొనసాగించడమే కాదు, మాస్కోతో ఇంధన పొత్తులను మరింతగా పెంచుకోగలిగింది. రష్యాను బహిరంగంగా ఖండించకపోవడం ద్వారా పాశ్చాత్య ప్రపంచం పక్షాన భారత్ నిలబడలేదని పాశ్చాత్య దేశాల్లో కొంతమంది విమర్శిస్తున్న సమయంలోనే, సంవత్సరం పొడవునా పాశ్చాత్య దేశాలతో భారత్ సంబంధాలు మరింత బలపడ్డాయి. భారత్ తన వంతుగా ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టం, ప్రాదేశిక సార్వభౌమాధికారం నేపథ్యంలో రష్యన్ దురాక్రమణపై ఆరోపించడం నుంచి తన వైఖరిని మార్చుకుంది. ఈ క్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇది యుద్ధ సమయం కాదని రష్యన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌కు బహిరంగంగానే బోధ చేసేంతవరకు పోయారు. బాలి సదస్సులో జీ20 దేశాల చర్చల సమయంలో సెంటిమెంటును రంగరించి మరీ మోదీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సంవత్సరం ముగిసే సమయానికి



ఉక్రెయన్ సంక్షోభాన్ని ముగించే విషయంలో భారత్ మరింత క్రియాశీలక పాత్ర చేపట్టనుందని అంచనాలు పెరిగిపోయాయి. చివరకు ప్రధాని మోదీతో ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీ ఫోన్ చేసి మరీ మాట్లాడారు.

రష్యా పట్ల భారత్ వైఖరిని పాశ్చాత్య ప్రపంచం ప్రారంభంలో విమర్శనాత్మకంగా అంచనా వేసింది. కానీ ఉక్రెయిన్ సమస్యపై దౌత్యపరమైన ప్రయత్నాల విషయంలో భారత్ చొరవను చివరకు పాశ్చాత్య దేశాలు హేతుపూర్వకంగా గుర్తించాల్సి వచ్చింది. యూరప్ సమస్యలు ప్రపంచ సమస్యలు అవుతాయి కానీ ప్రపంచ సమస్యలు యూరప్ సమస్యలు కావు అనే ఆలోచనలోని కపటత్వాన్ని భారత్ నొక్కి చెప్పింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇండో–పసిఫిక్ వ్యవహారాలకు సంబంధించి భారత్ కేంద్ర స్థానం విషయంలో యూరప్ దేశాలు నిశ్చితాభిప్రాయానికి వచ్చేశాయి. దీంతో ఈ సంవత్సరం భారత్–యూరోప్ సంబంధాలు కొత్త పుంతలు తొక్కాయి. యూరోపియన్ స్థలపరిధుల్లో రష్యాకు ప్రధాన స్థానం ఉన్నప్పటికీ, చైనా నుండీ, దాని దూకుడు ఎత్తుగడలనుంచే తమకు దీర్ఘకాలిక వ్యూహాత్మక సవాళ్లు ఎదురు కానున్నాయని యూరప్ దేశాలకు స్పష్టంగా బోధపడింది.

వారి వ్యూహాత్మక తర్కం కారణంగా అమెరికాతో భారత్ సంబంధాలు కూడా ముందంజ వేశాయి. ఇండో–పసిఫిక్ నేడు అత్యంత కీలకంగా మారింది. పసిఫిక్ ప్రాంతంలో 'క్వాడ్', మధ్య ప్రాచ్యంలో 'ఐ2యు2' (ఇజ్రాయెల్, ఇండియా, యూఎస్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) రెండు కీలక భూభాగాల్లో సంస్థాగత వ్యాఖ్యాతలుగా ఆవిర్భవిస్తున్నాయి. న్యూఢిల్లీ, వాషింగ్టన్ ద్వైపాక్షిక సంబంధాలకు మించి, తమ వ్యవహారాలకు చెందిన ఎజెండానే పునర్నిర్వచించుకుంటున్నాయి. దాంతోపాటు తమ ఆకాంక్షల ఆకృతులను మరింతగా పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

భారతదేశం నిర్వహించే అంతర్జాతీయ పాత్రను ప్రపంచం ఇప్పుడు మరింత సీరియస్‌గా తీసుకుంటోంది. ఎందుకంటే సంక్లిష్టమైన గ్లోబల్ సమస్యలను భారత్ ఇప్పుడు మరింతగా పట్టించుకుంటూ, నాయకత్వం వహించగలుగుతోంది. ప్రపంచ సమస్యలకు అది పరిష్కారాలు అందించడానికి సిద్ధపడుతోంది. భావసారూప్యత కలిగిన దేశాలతో భాగస్వామ్యాలను ఏర్పర్చుకుంటోంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ తన అధ్యక్ష స్థానాన్ని... సంస్కరించిన బహుపాక్షికతను, శాంతిపరిరక్షణను, ఉగ్రవాద నిరోధకతను, సముద్ర భద్రతను నొక్కి చెప్పడానికి ఉపయోగించుకుంది. ఈ సమస్యలు భారత్ ప్రయోజనాలకే కాదు, ప్రపంచంలోని విశాల భాగం ప్రయోజనాలకు కూడా చాలా ముఖ్యమైనవి.

భద్రతాసమితిలో భారత్ వ్యవహరిస్తున్న తీరులో ఆచరణాత్మకతకు చెందిన కొత్త అర్థం ప్రస్ఫుటమవుతోంది. ఇంతవరకు వినపడకుండా కనిపించకుండా పోయిన విశాల మెజారిటీ దేశాల గురించి మాట్లాడేలా భారత వాణి ఉంటోంది. ఈ ప్రాధాన్యత ప్రాతిపదికపైనే అది జీ20 కూటమి అధ్యక్షత బాధ్యతను చేపడుతోంది. బహుపాక్షికత అనేది తన విశ్వసనీయతా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రపంచం ఎదుర్కొంటున్న కీలకమైన సవాళ్లు కొన్నింటికి పరిష్కారాలను అందించే విషయంలో అందరి కళ్లూ న్యూఢిల్లీ చేపట్టిన జీ20 నాయకత్వంపైనే ఉన్నాయి. ఇది అంతర్జాతీయ పర్యవసానాలను రూపుదిద్దగలిగే 'నాయకత్వ శక్తి'గా భారత్ తన విశ్వసనీయతను పెంపొందించుకోవలసిన సమయం. ప్రత్యేకించి భారత గాథ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న సమయంలో ఇది ఎంతో అవసరం.

భారత్ అంతర్జాతీయ పాత్రను మెచ్చుకునే పరిణామాలు ఏర్పడుతున్న సమయంలో ప్రముఖ ఆర్థిక శక్తిగా ఆవిర్భవించడం కీలక పాత్ర పోషించనుంది. ప్రపంచం మొత్తంగా బీజింగ్ వ్యవహారాలపై తీవ్ర అసమ్మతి వ్యక్తపరుస్తున్న తరుణంలో చైనా దూకుడును నిలువరించడంలో దృఢ వైఖరిని ప్రదర్శిస్తున్న భారత్ కొత్త అవకాశాలను సృష్టించుకుంది. 2022లో ఇలాంటి కొన్ని అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భారతీయ విదేశీ విధానం విజయవంతమైంది. మరోవైపున చైనా సవాలు సమీప భవిష్యత్తులో భారత ప్రభుత్వ సమర్థతను పరీక్షించడం కొనసాగించనుంది. శీతాకాలం తర్వాత కూడా ఉక్రెయిన్ సంక్షోభం కొనసాగినట్లయితే భారత్, రష్యా పొత్తు కూడా నిశిత పరిశీలనకు గురవుతుంది. న్యూఢిల్లీ పదేపదే చెబుతున్న 'బహుళ–అమరిక వాదం' కూడా 2023లో తీవ్రమైన ఒత్తిడి పరీక్షకు గురికాక తప్పదు. అయితే 2022 గురించి ఏమైనా చెప్పుకోవాలీ అంటే, భారత వాణి విశిష్టతను ప్రపంచం గుర్తించింది. మున్ముందు అది అంతర్జాతీయ వేదికలపై మరింతగా విస్తరిస్తుంది. ఇప్పుడప్పుడే దాని ప్రతిధ్వనులు తగ్గిపోవు.

వ్యాసకర్త ఉపాధ్యక్షుడు, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్, న్యూఢిల్లీ
('ద హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వేరేవీ కనపడవా?



ఒక పాఠకురాలిగా, పుస్తకాల ప్రచారకర్తగా అత్యధిక ఇయర్ ఎండర్స్ లోనూ, 2023లో చదవాల్సిన జాబితాల్లోనూ ఉన్న పుస్తకాలన్నీ కూడా సెలబ్రిటీలు రాసినవో, లేదా సెలబ్రిటీల మీద రాసినవో ఉండటం బాధ కలిగించింది. వీటి కన్నా అద్భుతమైన పుస్తకాలు చాలా ఉన్నాయి. కొంచెం భిన్నత్వం చూపండి.

– అమృతా తల్వార్, బుక్ పబ్లిసిస్ట్

లౌకిక భారతం



అనుకోకుండా ఫోన్లో ఒక ముస్లిమేతర కవికి సలామ్ చెప్పాను. ఆయన పూర్తి ఉత్సాహంతో వాలేకుమ్ సలామ్ అని బదులిచ్చారు. తర్వాత ఆయన తాను హిందువునని చెప్పారు. అయితే పరస్పరం ఒకరికొకరం శాంతిని కోరుకోవడంలో ఎంతమాత్రమూ హాని లేదన్నారు. చివరగా ఆయన గుర్తుంచుకుని మరీ 'ఖుదా హాఫిజ్' అన్నారు. ఇదీ భారత్!

– ఇస్మత్ అరా, జర్నలిస్ట్

విషయం అర్థమౌతోంది



చైనాతో ఘర్షణలో మోదీకి ఉన్న బలవంతుడు అన్న ఇమేజ్‌కు గంటు పడింది. చైనాకు ఇండియా తన భూభాగాన్ని వదులుకోలేదని ఆయన పదేపదే చెప్పడం ఆయన మద్దతుదారులకు ఆయుధం ఇచ్చింది. కానీ ఆయన గుడ్డి మద్దతుదారుల సంఖ్య తగ్గిపోయింది.

– అజయ్ శుక్లా, రక్షణాంశాల వ్యాఖ్యాత

జన ధోరణి



మనం ఎలా ఉన్నామంటే, లేకపోవచ్చు అనుకునే విషయం (దేవుడు) కోసమేమో చచ్చిపోయేంత నిరాశకు లోనవుతున్నాం. అదే కచ్చితంగా ఉంది అనుకునే విషయం (వాతావరణ మార్పు) కోసమేమో ఏమాత్రం నిరాశ పడటం లేదు.

– తబిష్ ఖైర్, రచయిత

ఆకాంక్ష



2023 సంవత్సరాన్ని నేను ఒకటే కోరుకుంటున్నాను – దయచేసి 2022 లాగా ఉండవద్దు.

– రానీ సేన్, ఫిలింమేకర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

రామప్పకు పొంచి ఉన్న ముప్పు

తెలంగాణకే తలమానికమైన అపురూపమైన రామప్ప దేవాలయం మళ్లీ ప్రమాదంలో పడే సూచనలు కనిపిస్తున్నాయి. అది ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందినందుకు ప్రతి తెలుగువాడూ, భారతీయుడూ ఎంతో సంతోషించారు. ఆ సంతోషాన్ని సింగరేణి కాలరీస్ ఓపెన్ కాస్టింగ్ పనులు ఆవిరి చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కింద పనిచేసే ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) పరిరక్షణ, నిర్వహణలో ఈ కట్టడం ఉంది. అది యాత్రికుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పొందటంలో చూపిస్తున్న శ్రద్ధ కట్టడ పరిరక్షణలో చూపడం లేదు. 2010లో కోస్టల్ కంపెనీ దేవాదుల సొరంగం తవ్వకాలు చేపట్టిన తరుణంలో అది పేల్చిన బాంబుల కారణంగా రామప్ప గుడి విలవిల లాడి గోడలు బీటలు వారిన విషయం సర్వదా విశదమే. ఈ విధ్వంసాన్ని అతి విషాదకరంగా పలు పత్రికలు ప్రపంచానికి వెల్లడి చేసినా ఏఎస్ఐ అంతగా ప్రతిస్పందించలేదనే విమర్శ ఉంది.

దీంతో కళాకారులు, రచయితలు, సామాజిక ఉద్యమకారులు, ప్రజాసంఘాల వారు 'రామప్ప పరిరక్షణ కమిటీ'గా ఏర్పడి ఆందోళనలు నిర్వహించారు. ఆ తర్వాత మళ్ళీ రామప్ప గుడి చుట్టూ ఇరవై కి.మీ.ల దూరంలోని వెంకటాపురం, నల్లగుంట, పెద్దాపురం తదితర గ్రామాల పరిధిలో ఓపెన్ కాస్టు తవ్వకాలు జరుపడానికి సంవత్సరానికి మూడు పంటలు పండే పంట పొలాలను సర్వేచేసి స్వాధీనం చేసుకునే దిశలో సింగరేణి ఉండగా 'రామప్ప పరిరక్షణ కమిటీ' రంగంలోకి దిగింది. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సింగరేణి కంపెనీ అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడు సద్దుమణగ చేశారు. ఇదే సమయంలో ఏఎస్ఐతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రతిపాదన పత్రాలు యునెస్కోకు వెళ్లడం, రెండు సార్లు తిరస్కరణకు గురికావడం... చివరికి ప్రపంచ వారసత్వ సంపదగా రామప్పకు గుర్తింపు పొందడం తెలిసిందే.

కాగా సంవత్సరం క్రితం 'మళ్ళీ ఓపెన్ కాస్టు తవ్వకాలు ప్రారంభం' అనే వార్త వచ్చింది. రామప్ప పరిరక్షణ కమిటీ, ఇతర ప్రజా సంఘాలూ తిరిగి ఆందోళన వ్యక్తం చేయడంతో సింగరేణి కంపెనీ యాజమాన్యం రామప్ప గుడి పరిసరాల్లో ఓపెన్ కాస్టులు తవ్వబోమని మీడియా ద్వారా హామీ ఇచ్చింది. అయితే మళ్ళీ రామప్పగుడికి ఓపెన్ ముప్పు రానున్నదనీ, పరిసర గ్రామాల్లో సింగరేణి అధికారులు ఓపెన్ కాస్టుకు సంబంధించిన సర్వేలు చేస్తున్నారనే విషయం వెలుగు చూసింది. అందుకే ఈ ప్రయత్నాలను పత్రికా ముఖంగా కమిటీ ఖండిస్తున్నది.

– నల్లెల్ల రాజయ్య తదితర 'రామప్ప పరిరక్షణ కమిటీ' సభ్యులు

ఆధునికతకు అంబేడ్కరిజాన్ని జోడించాలి

అభిప్రాయం



ఆచార్య
ఎం. జేమ్స్ స్టీఫెన్

యువతరాన్ని అంబేడ్కర్‌తో అనుసంధానం చేయాలి. వాస్తవిక సమాజ పరిస్థితులను దగ్గరగా పరిశీలిస్తూ యుక్తవయసులోనే విప్లవాత్మకమైన ఆలోచనలు చేసిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. అత్యధిక ఆదాయాన్ని సంపాదించిపెట్టే వృత్తిగా నిలచే బారిష్టర్‌ను చదివే అవకాశం ఉన్నా, సమాజానికీ, దేశానికీ ఉపయుక్తంగా నిలచే అర్థశాస్త్రాన్ని కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి పూర్తిచేసిన ఆయన వ్యక్తిత్వం నేటి తరానికి అవగతం కావాల్సిన అవసరం ఉంది. అంబేడ్కర్‌ని ఒక రివల్యూషనరీ థింకర్‌గా చెప్పవచ్చు.

అంబేడ్కర్ ఆలోచనలే పునాదిగా 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' స్థాపన జరిగింది. ప్రపంచవ్యాప్తంగా అగ్ర రాజ్యాల ఆర్థిక వ్యవస్థలు సైతం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా... భారతీయ ఆర్థిక వ్యవస్థ చెక్కుచెదరకుండా తగిన సుస్థిరత్వాన్ని కలిగి ఉందంటే అలా ఉండటానికి అంబేడ్కర్ ఆలోచనలు, ప్రయత్నాలు సఫలీ కృతం అయ్యాయనే అర్థమవుతుంది. ఎకనామిక్స్‌లో చదువు పూర్తయిన తర్వాత మాత్రమే ఆయన బారిష్టర్ చదువు కున్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి పీహెచ్‌డీని పూర్తిచేసిన ఆయన ప్రతిభను ప్రస్తుత తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.



భవిష్యత్‌ను దర్శించిన ఆలోచనలు అంబేడ్కర్ సొంతం. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత చైనా ఎప్పటికైనా భారత్‌కు ముప్పు తెస్తుందని గుర్తించిన వ్యక్తి అంబేడ్కర్. ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం చైనాకు బదులు భారత్‌కు వచ్చే విధంగా కృషిచేయాలని ఆయన చేసిన సూచనలను నాటి నేతలు పక్కన పెట్టడం అందరికీ తెలిసిందే. దీని పర్యవసానాలను చూస్తూనే ఉన్నాం. ఇప్పటికే చైనా తన వీటో అధికారాన్ని భారత్‌కు వ్యతిరేకంగా 9 పర్యాయాలు వాడుకుంది.

వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా గుర్తించడం, పారిశ్రామికీకరణతో కలిగిన మార్పులు, ఎకనామిక్ హోల్డింగ్... వంటి అంశాలు నేడు దేశవ్యాప్తంగా వినిపిస్తున్నాయి. కానీ వీటిని అంబేడ్కర్ 1927–28లోనే ప్రస్తావించారనే విషయం చాలా మందికి తెలియదు.

అంబేడ్కర్‌ను కేవలం రాజ్యాంగ నిర్మాతగా మనం పిలుస్తుంటాం. ఆయన చేసిన పనుల్లో ఒకటిగా మాత్రమే ఇది నిలుస్తుంది. దీనితో పాటు దేశ ఆర్థిక, సామాజిక పరిస్థితులూ, స్థితిగతులపై సమగ్ర అవగాహనా, ఆలోచనా భవిష్యత్ ప్రణాళిక కలిగిన ఏకైక వ్యక్తిగా ఆయన్ని పేర్కొనవచ్చు. దేశాన్ని ఆధునికత, పట్టణీకరణ, పారిశ్రామికీకరణతో కూడిన నాగరికత కలిగి స్వయం సమృద్ధి సాధించిన దేశంగా పునర్నిర్మించాలని ఆకాంక్షించిన ఏకైక తత్వవేత్త అంబేడ్కర్.

అంబేడ్కర్ ఆలోచనలు, ఆకాంక్షలు, ఆశయాలను నేటి యువతలోనికి చొప్పించి భవిష్యత్ భారతావనిని పునర్నిర్మించే ప్రయత్నం జరగాలి. ఈ ప్రయత్నం చేసే దిశగా ఆంధ్ర విశ్వ విద్యాలయంలో నెలకొల్పిన 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్' కృషిచేస్తుంది. గ్రంథాలయాలు, బ్యాంక్‌లు, తరగతులు, అభ్యసన విధానాలు, ఆర్థిక వ్యవస్థలు డిజిటల్ రూపంలోకి మారిపోయాయి. వీటినే ఆధారంగా చేసుకుని డిజిటల్ మాధ్యమాలను లాభదాయకంగా చేసుకుంటూ సమకాలీన యువతకు, సమకాలీన విధానాలతో అబేడ్కర్ ఆలోచనలు, తత్వాలను చేరువ చేసే విధంగా ఈ కేంద్రం పనిచేస్తుంది. సోషల్ సైంటిస్టులతో పాటు సోషల్ ఇంజనీర్స్‌ను సమన్వయం చేస్తూ, సమ్మిళితంగా పనిచేస్తే సమస్యలకు సాంకేతికంగా పరిష్కారాలను చూపడం సాధ్యపడుతుంది. అంబేడ్కర్‌ను కేవలం సోషల్ సైన్స్ విభాగాలకే పరిమితం చేయకుండా టెక్నాలజీకి అనుసంధానం చేయాల్సిన అవసరం ఉంది.

ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, ఫార్మసీతో పాటు ప్రొఫెషనల్ కోర్సులను అభ్యసిస్తున్న అన్ని విభాగాల విద్యార్థులను ఐక్యం చేస్తూ డిజిటల్ మాధ్యమాలు వేదికగా అంబేడ్కర్‌ను వైవిధ్యమైన కోణాలలో పరిచయం చేస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పీఠం' ప్రొఫెసర్,
ఆంధ్ర విశ్వవిద్యాలయం | 98859 50765

వేయి రేఖల వినూత్న సౌందర్యం

సందర్భం



పున్నా కృష్ణమూర్తి

పీటీ రెడ్డిగా విఖ్యాతులైన పాకాల తిరుమల రెడ్డి (1915–1996) ప్రపంచ స్థాయికి చెందిన తెలంగాణ కళాకారుల్లో అగ్రగణ్యుడు. కరీంనగర్ జిల్లా, అన్నవరం గ్రామంలో 1915 జనవరి 4వ తేదీన జన్మించారు. ప్రాథమిక విద్య చదివే రోజుల్లో ఆయన్ని ప్రోత్సహించింది ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సత్తార్ సుభాని.

తన బంధువును కలిసేందుకు ఒక రోజు రెడ్డి హాస్టల్‌కు వెళ్లాడు పీటీ. ఆ రోజు స్కౌట్స్ డే. ముఖ్య అతిథి బాడెన్ పావెల్. బాడెన్ రూపానికి 17 ఏండ్ల పీటీ కాంతి వేగంతో ప్రాణం పోస్తున్నారు. అది గమనించిన కొత్వాల్ పీటీని పిలిపించుకొని తన పెయింటింగ్ వేస్తావా అని అడిగారు! మిడాస్ టచ్!!

రెడ్డి హాస్టల్ నిబంధలను సవరించి ప్రతిభావంతులైన కళాకారులకూ స్కాలర్షిప్ ఇవ్వవచ్చని పీటీని 'సర్ జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్'లో చేర్పించారు కొత్వాల్. ముంబైలోని ఆ వినూత్న ప్రపంచంలో సూజా, కేకే హెబ్బార్, ఎమ్ఎఫ్ హుస్సేన్ తదితరులు సహ విద్యార్థులు. తన 22వ ఏట చిత్రించిన సెల్ఫ్ పోర్ట్రెయిట్ అంతర్ వ్యక్తినీ చూపిందని అధ్యాపకులు మెచ్చుకున్నారు. జేజేలో 1935 నుంచి 42 వరకు చిత్రకళను అభ్యసించి డిప్లొమా పొందారు, ఫస్ట్ క్లాస్, ఫస్ట్ ర్యాంక్‌తో!



పీటీ రెడ్డి

దేశ విభజన సందర్భంలో హైదరాబాద్ వచ్చారు. తెలంగాణ మాండలికాన్ని తన రచనలలో శాశ్వతం చేసిన యశోదా రెడ్డిని వివాహం చేసుకున్నారు. కార్పెంటరీ ఇండస్ట్రీ నెలకొల్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ హుందా తనాన్ని తెలిపే ఫర్నిచర్ పీటీ రెడ్డి సమకూర్చిందే. శిల్పి, దారుశిల్పి; ఆయిల్, వాటర్ కలరిస్ట్ అయిన పీటీ కళా ప్రపంచానికి కానుకగా ఏమి ఇచ్చారు? ఒక్క మాటలో భారతీయ సాంస్కృతిక తాత్విక సౌందర్య భరిత వేయి దళాల పరిమళ భరిత పుష్పం!

మన జ్ఞాపకాల పొరల్లో మసకబారిన ఆ కళారూపాలు చూడవచ్చా? 'స్వధర్మ'లో మూడు అంతస్తులలోని ప్రత్యేక గ్యాలరీలలో పీటీ రెడ్డి కళా రూపాలు కొలువై ఉన్నాయి. వారి కుమార్తె లక్ష్మీ రెడ్డి దంపతులు ఎంతో శ్రద్ధగా కాపాడుతున్నారు. చిరునామా సులభం. నారాయణగూడ మెట్రో పిల్లర్ 1155. కళాకారులు, చరిత్రకారులు అపాయింట్‌మెంట్ తీసుకుని సందర్శించవచ్చు.

వ్యాసకర్త ఇండిపెండెంట్ జర్నలిస్ట్ | 76809 50863
(నేడు పీటీ రెడ్డి జయంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** శు.త్రయోదశి రా.12.00 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** రోహిణి రా.7.28 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ఉ.10.58 నుండి 12.42 వరకు, తిరిగి రా.1.30 నుండి 3.14 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.44 నుండి 12.27 వరకు, **అమృత ఘడియలు:** సా.4.03 నుండి 5.45 వరకు : **రాహుకాలం** : ప.12.00 నుండి 1.30 వరకు : **యమగండం** : ఉ.7.30 నుండి 9.00 వరకు : **సూర్యోదయం** 6.36 : **సూర్యాస్తమయం** 5.35.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

గోదావరిలో నీటి లభ్యతపై అధ్యయనం!

సీడబ్ల్యూసీతో జరిపించాలని గోదావరి బోర్డు నిర్ణయం

- ఏపీ, తెలంగాణకు లభ్యతపై స్టడీతో సరిపెట్టాలన్న ఏపీ
- 1,430–1,480 టీఎంసీల లభ్యత ఉందని మా స్టడీలో తేలింది..
- మళ్లీ అధ్యయనం అక్కర్లేదని తెలిపిన సీడబ్ల్యూసీ డైరెక్టర్
- గోదావరి బోర్డు సమావేశంలో నీటి లభ్యతపై వాడీవేడి చర్చ
- కడెం–గూడెం ప్రాజెక్టుపై అభ్యంతరం తెలిపిన ఏపీ
- రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో 5 టెలిమెట్రీ స్టేషన్ల ఏర్పాటుకు నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: గోదావరిలో ఉమ్మడి ఏపీ రాష్ట్రానికి నీటి లభ్యతపై స్పష్టత లేనందున కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ)తో అధ్యయనం జరిపించాలని గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) నిర్ణయించింది. ఇందుకు సీడబ్ల్యూసీకి ప్రతిపాదనలు పంపించనుంది. గోదావరి బోర్డు చైర్మన్ ముఖేష్‌కుమార్ సిన్హా అధ్యక్షతన మంగళవారం జలసౌధలో జరిగిన గోదావరి బోర్డు సమావేశంలో ఈ మేరకు పలు నిర్ణయాలు తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఈఎన్‌సీ సి.మురళీధర్, ఏపీ రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్‌సీ సి.నారాయణ రెడ్డి, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల తరఫున వాదనలు వినిపించారు. సీడబ్ల్యూసీ డైరెక్టర్(హైడ్రాలజీ) నిత్యానంద రాయ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

మళ్లీ అధ్యయనం అనవసరం: సీడబ్ల్యూసీ హైడ్రాలజీ డైరెక్టర్

సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో 2020–21 నాటి వరకు వర్షపాతాన్ని ప్రామాణికంగా తీసుకుని అధ్యయనం జరిపించగా, గోదావరిలో 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా 1430–1480 టీఎంసీల నీటి లభ్యత ఉందని తేలిందని నిత్యానంద రాయ్ వెల్లడించారు. ఐదేళ్ల మూవింగ్ యావరేజీ ప్రకారం1,430–1,600 టీఎంసీల నీటి లభ్యత ఉందన్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ అధ్యయనం జరపాల్సిన అవసరం లేదని హైడ్రాలజీ డైరెక్టర్‌గా తన అభిప్రాయమని స్పష్టం చేశారు. ఏపీ అధికారులు ఢిల్లీకి వస్తే అధ్యయన నివేదికలు చూపిస్తామన్నారు. మళ్లీ అధ్యయనం జరపాలని ప్రతిపాదనలు పంపితే సీడబ్ల్యూసీ చైర్మన్ నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. పోలవరంతో సహా ఏపీ ప్రాజెక్టులకు 484.5 టీఎంసీల జలాలు అవసరమని, ఈ మేరకు ఏపీలోని అన్ని ప్రాజెక్టుల అవసరాలను పరిరక్షిస్తూనే తెలంగాణలోని ఒక్కో ప్రాజెక్టు క్లియరెన్స్ విషయంలో సీడబ్ల్యూసీ ముందుకు వెళ్తుందన్నారు. ఈ విషయంలో ఏపీకి ఆందోళన అవసరం లేదన్నారు. ఏపీ ప్రాజెక్టులకు ఢోకా లేదన్నారు. 75శాతం డిపెండబిలిటీ ఆధారంగా గోదావరిలో మిగులు జలాలు లేవని తేలిందన్నారు. గోదావరిలో నీటి లభ్యతపై అధ్యయనం జరిపించే అధికారం, పరిధి గోదావరి బోర్డుకు లేదని, సీడబ్ల్యూసీతో అధ్యయనం జరిపిస్తే తమకు అభ్యంతరం ఉండదని తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ తెలిపారు. కేవలం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు నీటి లభ్యతపై మాత్రమే కాకుండా గోదావరి పరీవాహకంలోని మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు నీటి లభ్యతపై సైతం అధ్యయనం చేస్తేనే సరైన ఫలితం ఉంటుందని ఆయన సూచించారు. అయితే కేవలం తెలంగాణ, ఏపీకి లభ్యతపైనే అధ్యయనం జరపాలని ఏపీ ఈఎన్‌సీ కోరారు.

అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం లేదన్న ఏపీ ఈఎన్‌సీ

'ఏ విషయాల్లో మా అభిప్రాయాలు అడగడం లేదు. అడిగినా వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. మేము లేవనెత్తిన అంశాలను తేల్చకుండానే తెలంగాణ ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లు ఇస్తున్నారు. సీడబ్ల్యూసీలోని టెక్నికల్ అడ్వైజరీ కమిటీ(టీఎంసీ) ఇటీవల సమావేశమై తెలంగాణలోని మూడు ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇచ్చింది. ఈ సమావేశానికి ఏపీని ఆహ్వానించలేదు. ఇకపై టీఏసీ సమావేశాలకు ఏపీని పిలవాలి. మేము లేవనెత్తిన ప్రతి అంశాన్ని తేల్చిన తర్వాతే ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వాలి' అని ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏపీ లేవనెత్తిన అంశాలపై సాంకేతికంగా గోదావరి బోర్డు చైర్మన్ అధ్యయనం జరపాలని, ఆ తర్వాతే తెలంగాణ ప్రాజెక్టులకు క్లియరెన్స్ విషయంలో ముందుకు వెళ్లాలని ఆయన డిమాండ్ చేయగా, గోదావరి బోర్డు చైర్మన్ అంగీకరించలేదు. ప్రాజెక్టుల డీపీఆర్‌లను మదింపు చేయడం వరకే తన బాధ్యత అని ఆయన బదులిచ్చారు.

ఏపీవి అన్నీ అపోహలేనన్న తెలంగాణ ఈఎన్‌సీ

ఏపీ లేవనెత్తిన అన్ని అంశాలనూ సీడబ్ల్యూసీ పరిగణనలోకి తీసుకుందని, ప్రతి అంశాన్ని తేల్చిందని, ఏపీ ప్రాజెక్టులపై ఎలాంటి ప్రభావం లేకుండా చూసుకున్న తర్వాతే తెలంగాణ ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లు ఇచ్చిందని తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ బదులిచ్చారు. ఏపీవి అన్నీ అపోహలే అని కొట్టిపారేశారు. ప్రాజెక్టుల డీపీఆర్‌లకు క్లియరెన్స్‌ల జారీలో జాప్యం కారణంగా ఆయా ప్రాజెక్టుల అంచనా వ్యయం 20–25 శాతం పెరిగిందని రజత్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు

జీ-5 సబ్ బేసిన్‌తో ఏపీకి సంబంధం లేదు..

రాష్ట్రంలోని కడెం–గూడెం, మొడికుంటవాగు ప్రాజెక్టుల డీపీఆర్‌లపై ఏపీ, తెలంగాణ అభిప్రాయాలతో సీడబ్ల్యూసీలోని టీఏసీ క్లియరెన్స్ కోసం పంపించాలని ఈ సమావేశంలో గోదావరి బోర్డు నిర్ణయం తీసుకుంది. కడెం ప్రాజెక్టుకు 14.75 టీఎంసీలు అవసరం కాగా 15 టీఎంసీల లభ్యత ఉన్నందున గూడెం ఎత్తిపోతల అవసరం లేదని ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి అంతకు ముందు జరిగిన చర్చలో అభ్యంతరం తెలిపారు. గోదావరిలోని జీ–5 సబ్ బేసిన్ పరిధిలో కడెం ప్రాజెక్టు వస్తుందని, ఏపీలోని ప్రాజెక్టులకు జీ–5 సబ్ బేసిన్ నుంచి నీళ్లు వెళ్లవని, తెలంగాణ అవసరాలకే సరిపోతాయని .. కడెం ప్రాజెక్టుకు ఇచ్చిన అనుమతుల్లో సీడబ్ల్యూసీ స్పష్టంగా చెప్పిందని తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ బదులిచ్చారు. జీ–1 నుంచి జీ–6 సబ్ బేసిన్‌ల నీళ్లు ఏపీకి పోవని, జీ–7 నుంచి జీ–12 సబ్ బేసిన్ల నీళ్లను ఆధారంగా చేసుకుని పోలవరం ప్రాజెక్టుకు అనుమతులిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఏపీ అభ్యంతరాలకు విలువ లేదని కొట్టిపారేశారు. అయినా, కడెం–గూడెం ఎత్తిపోతలకు అంగీకరించమని ఏపీ స్పష్టం చేసింది.

సరిహద్దుల్లో 5 టెలిమెట్రీ స్టేషన్లు

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు పెద్దవాగుకు తక్షణ మరమ్మతులు చేపట్టడానికి రెండు రాష్ట్రాలు ఈ సమావేశంలో అంగీకరించాయి. గోదావరిపై 23 చోట్ల టెలిమెట్రీ స్టేషన్లు పెట్టాలని ప్రతిపాదనలు రాగా, తొలుత ఏపీ, తెలంగాణ సరిహద్దుల్లోని పెద్దవాగు, పెద్దవాగు ఎడమ కాల్వ, పెద్దవాగు కుడి కాల్వ, కిన్నెరసానితో పాటు మరో వాగుపై మాత్రమే ఏర్పాటు చేయాలని తెలంగాణ సూచన మేరకు ఈ సమావేశంలో నిర్ణయించారు. సాధ్యమైనంత ఎక్కువ ప్రాంతాల్లో పెట్టాలని ఏపీ కోరింది. టెలిమెట్రీ స్టేషన్ల ద్వారా రెండు రాష్ట్రాల నీటి వినియోగం లెక్కలను నమోదు చేస్తారు.

కొత్తగా 8 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంగళవారం 5,182 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 8 మంది వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి ఐదుగురు కోలుకోగా, కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 67 మంది ఐసోలేషన్ లేదా చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే
టెండరు ప్రకటన నెం. WAT-TRD-24-21-22, తేదీ: 28.12.2022
పని పేరు మరియు ప్రదేశం: వాల్తేరు డివిజన్ వందు 15 నెంబర్లు ట్రాక్షన్ సబ్ స్టేషన్లు/సెక్షనింగ్ పోస్ట్‌లు / సబ్ సెక్షనింగ్ మరియు పారలాలింగ్ పోస్ట్ వద్ద ఎర్తింగ్ గ్రిడ్ రీప్లేస్‌మెంట్.
టెండరు విలువ: ₹86,00,320/-, బయానా: ₹1,72,000/-, పని పూర్తి చేయు కాలం: 10 నెలలు.
టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 19.01.2023 న 1500 గంటలకు.
పూర్తి వివరములు & టెండరు డాక్యుమెంట్ లభించు వెబ్‌సైట్ http://www.ireps.gov.in.
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (TRD), వాల్తేరు.
PR-868/N/22-23

కల్తీ మద్యం కలకలం?

- ఒకే షాపు నుంచి మద్యం కొనుగోలు చేసి.. తాగిన ఇద్దరు ఆకస్మిక మృతి
- కల్తీ మద్యం వల్లే చనిపోయారని కుటుంబసభ్యుల ఆరోపణ
- అనుమానంతో శాంపిల్స్ సేకరించిన ఎక్సైజ్ అధికారులు


నర్సింహ (ఫైల్)


ఊషన్న (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ఒకే షాపు నుంచి మద్యం కొనుగోలు చేసి తాగిన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. మృతులు కుటుంబసభ్యుల కథనం మేరకు... నాగర్‌కర్నూల్ మండలం నల్లవెల్లికి చెందిన నర్సింహ(45) సోమవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ బస్టాండ్ సమీపంలోని ఓ మద్యం దుకాణం ఎదుట అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా అర్ధరాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు గమనించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మరో ఘటనలో మండలంలోని కుమ్మెరకు చెందిన ఊషన్న(50) బ్యాంకులో నగదును తీసుకునేందుకు మంగళవారం ఉదయం జిల్లాకేంద్రానికి వచ్చాడు. డబ్బులు తీసుకున్న తర్వాత మద్యం తాగి తిరిగి వెళ్తూ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రహరీ వద్ద కిందపడి మృతిచెందాడు. పోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఊషన్న జేబులో మద్యం సీసా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. నర్సింహ, ఊషన్న ఇద్దరూ కల్తీ మద్యం తాగి మృతి చెందినట్లు వారి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

శాంపిల్స్ సేకరించిన ఎక్సైజ్ అధికారులు

జిల్లా కేంద్రంలో ఇద్దరు కల్తీ మద్యం తాగి మృతి చెందినట్లు ఆరోపణలు రావడంతో ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ పరమేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం బస్టాండ్ సమీపంలోని మోతీ వైన్స్‌లో తనిఖీలు నిర్వహించి పలు బ్రాండ్లకు సంబంధించి శాంపిల్స్ సేకరించారు. కాగా మృతులు ఇద్దరూ మద్యం కొనుగోలు చేసింది ఒకే వైన్స్ నుంచే కావడం కల్తీ మద్యం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఈ విషయమై ఎక్సైజ్ ఈఎస్ ఫయాజుద్దీన్‌ను వివరణ కోరగా మోతీ వైన్స్ నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి.. ఆపై బావిలో దూకి..

మెప్మా ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ కార్పొరేషన్‌లోని మెప్మా మిషన్ కో ఆర్డినేటర్ జలేందర్ మంగళవారం ఆత్మహత్యకు యత్నించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. జగిత్యాలకు చెందిన జలేందర్ కోరుట్లలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో కో ఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రోజూ విధులు నిర్వర్తించి జగిత్యాలకు వస్తుంటారు. అయితే, కోరుట్ల మెప్మాలోని ఓ మహిళా ఆర్పీని మహిళా సంఘాల నిధులనుంచి రూ.10 లక్షలు కాజేశారనే కారణంతో మూడురోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈక్రమంలో వివరాలు తెలుసుకునేందుకు జలేందర్‌ను సోమవారం ఠాణాకు పిలిపించారు. వివరాలు తెలుసుకున్నాక ఆయనను ఇంటికి పంపించారు. అయితే, తనకు సంబంధంలేని విషయంలో.. అనవసరంగా పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సి వచ్చిందనే మనస్తాపంతో జలేందర్ మధనపడ్డారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామ శివారులోకి వెళ్లారు. అక్కడ పురుగుల మందు తాగారు. అంతటితో ఆగకుండా సమీపంలోనే ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు యత్నించారు. సమీపంలోనే ఉన్న రైతు గంగన్న గమనించి బిగ్గరగా కేకలు వేశాడు. స్థానికుల సమాచారంతో సర్పంచ్ నాడెం రత్నమాల భర్త శంకర్, మరికొందరితో కలిసి బావి వద్దకు చేరుకున్నారు. బావిలో మోటార్ పైపును పట్టుకుని ఉన్న జలేందర్‌ను సురక్షితంగా బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. జలేందర్ జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా, తమకు ఇప్పటిదాకా ఫిర్యాదు రాలేదన్నారు.

పత్తిలో దాక్కుని.. ఊపిరందక..

బాలుడి ప్రాణం తీసిన దాగుడుమూతలు ఆట


ప్రమాదానికి కారణమైన పత్తి


అభిషేక్(ఫైల్)

కౌటాల: దాగుడుమూతలు ఆట ఓ బాలుడి ప్రాణం తీసింది. తమ్ముడు, చెల్లికి దొరక్కుండా పత్తిలో దాక్కునే ప్రయత్నంలో ఊపిరి ఆగిపోయింది. ఈ సంఘటన కుమురంభీం జిల్లా కౌటాల మండలం కన్నెపల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కన్నెపల్లికి చెందిన చెన్నూరి కైలాష్, రుమలకు ముగ్గురు సంతానం అభిషేక్, హర్షిత్, అవంతిక ఉన్నారు. అభిషేక్ (12) కౌటాలలోని ప్రైవేటు పాఠశాల్లో 4వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు కౌటాల వారసంతలో కూరగాయలు విక్రయించడానికి వెళ్లారు. పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి వచ్చిన అభిషేక్ తమ్ముడు, చెల్లితో దాగుడుమూతలు ఆడుతూ ఇంట్లో నిల్వ ఉంచిన పత్తిలో దాక్కునే ప్రయత్నం చేశాడు. దీంతో ఊపిరాడక అపస్మారక స్థితికి చేరాడు. ఇంట్లోకి వచ్చిన హర్షిత్ పత్తిలో తన అన్న తలదూర్చి కాళ్లు పైకి ఉండటం గమనించాడు. భయపడి కేకలు వేయడంతో బంధువులు వచ్చి బయటకు తీశారు. కౌటాలలోని ప్రైవేటు ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌కు తరలించారు. అప్పటికే అభిషేక్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

'ఢిల్లీ మద్యం' కేసులో ఐదుగురికి బెయిల్

తదుపరి విచారణ 24కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభ కోణం కేసులో రౌజ్ అవెన్యూ కోర్టు ఐదుగురు నిందితులకు బెయిల్ మంజూరు చేసింది. సీబీఐ దాఖలు చేసిన చార్జిషీటుపై మంగళ వారం జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ విచారించారు. అనంతరం ఎక్సైజ్‌శాఖ మాజీ అధికారులైన కుల్దీప్‌సింగ్, నరేందర్‌సింగ్, ముత్తా గౌతమ్, అరుణ్ పిళ్లై, సమీర్ మహేంద్రకు రూ.50వేలు చొప్పున వ్యక్తిగత పూచీకత్తుతో మధ్యంతర బెయిలు (సాధారణ లేదా ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ జరగడానికి ముందు స్వల్పకాలం మంజూరు చేసే బెయిల్) మంజూరు చేశారు. ఈ కేసులో ఈ ఐదుగురిని సీబీఐ ఇప్పటివరకు అరెస్టు చేయలేదు. మరోవైపు నిందితుల రెగ్యులర్ బెయిల్‌పై కౌంటరు దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణ ఈ నెల 24కు వాయిదా వేసింది.

'తునికాకు కట్టకు రూ 3.50 చెల్లించాలి'

చర్ల: తునికాకు కట్టకు రూ.3.50 చెల్లించడంతో పాటు వివక్ష లేకుండా అన్ని ప్రాంతాల్లో తునికాకు సేకరణ జరపాలని, పెండింగ్‌లో ఉన్న బోనస్ విడుదల చేయాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. ఈమేరకు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం–అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ మంగళవారం లేఖ విడుదల చేశారు. తునికాకు సేకరణలో ఓవైపు ప్రభుత్వం, మరో పక్క కాంట్రాక్టర్లు ఏటా గిరిజనులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. తునికాకు సేకరణ కొన్నిప్రాంతాల్లో టెండర్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇకనుంచి అలా కాకుండా అన్ని ప్రాంతాల్లో టెండర్లు చేపట్టడంతో పాటు మోడెం కొట్టే కూలీలకు రోజుకు రూ.700 చెల్లించాలన్నారు.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II
1st Floor, Triveni Complex, Abids, At: Hyderabad
O.A. No. 328 of 2022
Between
HDFC BANK LIMITED ...Applicant
AND
Mr. Neeraj Pandey ...Defendant
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
Mr. Neeraj Pandey, Neeraj Pandey, S/o. Bhuwan Chandra Pandey, A-205, Muppa Green Grandeur Tellapur Road, Thanda, Gopanpally, Phoenix Hero Showroom, Hyderabad, Telangana - 500089. Also at: Nanakramguda, Waverock, Gachibowli, Hyderabad, Telangana - 500008.
Please take the summons in the above O. A. No. 328/2022 filed by the Applicant for Recovery of money of Rs. 45,76,072.46/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "Sakshi Telugu Daily" and posted the matter to 10.02.2023.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application;
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the Application, pending hearing and disposal of the application for attachment of properties;
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 10.02.2023 at 10.30 a.m. at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad – 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 26th Day of December, 2022.
(By order of the Court)
REGISTRAR
Debts Recovery Tribunal – II, Hyderabad

HEAVY WATER PLANT (MANUGURU)
TENDER NOTICE
For and on behalf of President of India, General Manager, HWPM invites online item rate bids on two bid system for following work :
NIT No. : **HWPM/TS/NDT/MTA-2022-R2**
Name of the Work : **In-Services Inseptions during MTA 2022 at HWP (Manuguru).**
Estimated Cost : **Rs. 34,49,000/-** Earnest Money : **Rs. 68,980/-**
Period of completion : **45 Days**
Date of online availability of E-Tender for view and download : **From 04-01-2023 (10-00 Hrs.) To 13-01-2023 (16-00 Hrs.)**
Last Date and Time for online submission of bid : **14-00 Hrs. on 16-01-2023**
Last Date for submission of EMD : **14-00 Hrs. on 20-01-2023**
Date & Time of Technical bid Opening : **On 20-01-2023 after 14-30 Hrs.**
The bid forms and other details can be obtained from the website http://eprocure.gov.in
Sd/-
(Signature of tender inviting authority)
सं.No. भापसं (म) HWPM/ भर्ती (का) Admn/Gyanashri NIT/19/2022/2784 Dt. 30-12-2022

TRANSMISSION CORPORATION OF ANDHRA PRADESH LIMITED
AP e-Procurement TENDER NOTICE
The Chief Engineer/Transmission, APTRANSCO, VS,VJA-04, invites bids online for Hiring of a consulting organization to implement ISO 27001:2022 ISMS and provide ISO 27001 certification through an accredited certification agency. Date and time of availability of tender: from 02-01-2023 at 21:00 Hrs tender id 580972. Ph.No: 9490153140.
Sd/- Chief Engineer, Transmission
DIPR RO No. 1465PP/CL/ADVT/1/1/2021-22, Dt. : 03.01.2023

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన (పత్రికా ప్రకటన)
TSSPDCL వారు దిగువ వాటి సేకరణ కోసం టెండర్లు జారీ చేయాలని భావిస్తున్నారు: (a) MS యాంగిల్ 50x50x6mm, (b) MS ఛానల్ 75x40mm, (C) MS ఫ్లాట్ 50x6mm, (d) స్వేర్ బిర్లెడ్ మెటల్ స్ట్రాప్, (e) BIS ఎనర్జీ ఎఫిషియెన్సీ లెవెల్-2తో 11KV/433-250V, 3-Ph 315KVA కాపర్ వూండ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్ (స్టార్-2), (f) రేషియో 400-200-100/1-1A యొక్క కంట్రోల్ రిలే ప్యానెల్స్ & జాయింట్ ట్రాన్స్‌ఫార్మర్స్‌తో 33kv 24V DC ఫీడర్ VCBs, (g) రేషియో 600-300 /1-1A యొక్క కంట్రోల్ రిలే ప్యానెల్ మరియు CTలతో 11KV 24V LV VCB (h) 33KV 1Ph PTs, 10VA బర్డెన్ కేబుల్, 0.2S క్లాస్, (i) ఇ-టెండరు ప్లాట్‌ఫారంపై 1Cx120 Sq.mm LT XLPE కేబుల్, (j) GI పిన్స్‌తో 11KV పాలిమర్ పిన్ ఇన్సులేటర్. పైన తెలిపిన ప్రతి ఐటమ్ తదుపరి వివరాల కోసం దర్శించండి: www.tssouthernpower.com, www.tender.telangana.gov. మరియు www.auction.telangana.gov.in. ఫోన్: 040-23431360, 1033, 1034.
DIPR RO No.10919-PP/CL/Advt/1/2022-23, Dt: 03.01.2023 సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (P&MM)

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
రీజనల్ ఆఫీసర్ కార్యాలయం, రీజనల్ ఆఫీస్, PR నల్గొండ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
e-Proc.T.N.No PR/113 (2nd Call Recall), 210, 217 to 220, 223, 225 to 234, 236 to 246 (2nd call)/2022-23, తేది:02-01-2023
పనుల సంఖ్య (28) Pkg-SRPT-TTY-తుంగతుర్తి-సూర్యాపేట జిల్లాలోని జాజిరెడ్డి గూడెం, నాగారం, మద్దిరాల, నూతనకల్ మరియు తుంగతుర్తి మండలాలలో 9BT రెన్యువల్ రోడ్ల పనులు మరియు సూపరింటెండింగ్ ఇంజనీర్, PR నల్గొండలోని ఇతర పనుల కోసం టెండరు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ.12407.88 లక్షలు. టెండర్ల డౌన్‌లోడ్ ప్రారంభ & ముగింపు తేదీలు: 04-01-2023 నుండి 12-01-2023 వరకు. ప్రతి NIT/బిడ్‌కు ప్రచురించబడిన తేది నుండి (7) స్పష్టమైన పనిదినముల సమయం ఉంటుంది. తదుపరి వివరాల కోసం దర్శించండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అంటే www.eprocurement.gov.in
సం/- రీజనల్ ఆఫీసర్, రీజనల్ ఆఫీస్, PR నల్గొండ
DIPR RO No.2961-DP/CL/Advt/1/2022-23, Dt: 03.01.2023

పురపాలక సంఘం నార్సింగి, రంగారెడ్డి జిల్లా
నోటీసు నెం.ఇ1/446/2022 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు** తేది:03-01-2023
కమిషనర్ పురపాలక సంఘం నార్సింగి, రంగారెడ్డి జిల్లా ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా రూ.930.00 లక్షల (65) పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతుంది. టెండర్‌దారులు ఇ-మార్కెట్‌ప్లేస్ అనగా www.tender.telangana.gov.in నుండి టెండర్ షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు తదుపరి వివరాలను పొందవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 17-01-2023 ఉ.11:00 గం. వరకు.
సం/- కమిషనర్, నార్సింగి మున్సిపాలిటీ
DIPR Ro No.10914-PP/CL/Advt/1/2022-23, Dt.03.01.2023

రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ
(రైల్వేస్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం పరిధిలోని చట్టబద్ధ సంస్థ)
యూనిట్ నం.702-B, 7వ అంతస్తు, కొన్సెప్ట్ టవర్-II, DMRC బిల్డింగ్, అజ్మీరి గేట్, న్యూఢిల్లీ-110002. ఫోన్: +91-11-23232854. ఫ్యాక్స్: +91-11-23232835
ఇ-టెండరు ద్వారా ప్రతిపాదన కోసం అభ్యర్థన
(RFP Notice No.RLDA/RFP/CD-78/SRD-17 of 2022 తేది 06.12.2022)
ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ & కన్‌స్ట్రక్షన్ (EPC) విధానంలో మాడ్యులర్ కాన్సెప్ట్‌పై గుర్గావ్ రైల్వే స్టేషన్ ప్రధాన స్థాయిపెంపుదల కోసం లైట్‌హౌస్ ప్రాజెక్టు కొరకు ప్రతిపాదన కోసం అభ్యర్థన (RFP)

స్టేషన్	నిర్మాణ కాలవ్యవధి	బిడ్ డాక్యుమెంట్ ఫీజు	బిడ్ సెక్యూరిటీ
గుర్గావ్ రైల్వే స్టేషన్	15 నెలలు	రూ.88,500/- (@ 18% GST సహా)	రూ.1.00 కోటి

ప్రి-బిడ్ సమావేశం: 16.01.2023 11:30 గం. ప్రదేశం: RLDA ఆఫీస్, న్యూఢిల్లీ
ఇ-బిడ్ ఆన్‌లైన్ దాఖలుకు చివరి తేది: 28.02.2023, 15:00 గం. వరకు
టెక్నికల్ ఇ-బిడ్ల తెరుచుట: 03.03.2023, 15:30 గం.
ప్రాజెక్ట్ యొక్క తదుపరి వివరాలకు మా వెబ్‌సైట్ www.rlda.indianrailways.gov.in దర్శించండి లేదా ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ www.tenderwizard.in/RLDA లో 'e-tender' శీర్షిక క్రింద దర్శించండి.
ఏదేని స్పష్టీకరణల కోసం సంప్రదించగలరు:-

జాయింట్ జనరల్ మేనేజర్/PNDLS	డిప్యూటీ జనరల్ మేనేజర్/ టెండర్	ఇ-బిడ్ సహాయం కోసం - శ్రీ సూరజ్ సింగ్
M: 70110 61338 jgmpndls@rlda.railnet.gov.in	M: 90131 64466 dgmtender@rlda.railnet.gov.in	M: 99996 53865 suraj@etenderwizard.com

గమనిక:- సవరణ లేదా అనుబంధం ఏదైనా ఉంటే పైన తెలిపిన వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రచురించబడును
AM/Tender, (M) 87505 54811

రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ
(రైల్వే మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం పరిధిలోని చట్టబద్ధ సంస్థ)
యూనిట్ నం.702-B, 7వ అంతస్తు, కొన్సెప్ట్ టవర్-II, DMRC బిల్డింగ్, అజ్మీరి గేట్, ఢిల్లీ-110002; ఫోన్: +91-11-23232854
ఇ-టెండరు ద్వారా ప్రతిపాదన కోసం అభ్యర్థన
(RFP Notice No. RLDA/RFP/CD-86 of 2022 తేది: 29.12.2022)
విజయవాడలోని వాంబే కాలనీ సమీపాన అజిత్‌సింగ్ నగర్‌లోని 103,194.90 చ.మీటర్ల రైల్వే భూభాగంలో వాణిజ్య అభివృద్ధి కోసం 30 సంవత్సరాల కొరకు లీజు మంజూరు

భూమి	సైట్ విస్తీర్ణం	బిల్టప్ ఏరియా	బిడ్ సెక్యూరిటీ	రిజర్వు ధర
అజిత్‌సింగ్ నగర్, విజయవాడ	103,194.90 చ.మీ.	67,077 చ.మీ.	రూ.75.00 లక్షలు	రూ.20.50 కోట్లు

వెబెక్స్‌లో ఆన్‌లైన్ ప్రి-బిడ్ సమావేశం: 19 జనవరి, 2023, 11:30 గం.
(ఆన్‌లైన్ ప్రి-బిడ్ సమావేశం వివరాలను డిప్యూటీ జనరల్ మేనేజర్/మార్కెటింగ్/SC నుండి పొందవలెను)
ఆన్‌లైన్‌లో ఇ-బిడ్ దాఖలుకు చివరి తేది: 17.02.2023, 15:00 గం.వరకు
ప్రాజెక్ట్ యొక్క తదుపరి వివరాలకు మా వెబ్‌సైట్ www.rlda.indianrailways.gov.in లేదా ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ www.tenderwizard.in/RLDAలో 'e-tender' శీర్షిక క్రింద చూడవలెను.
ఏదేని స్పష్టీకరణల కోసం సంప్రదించగలరు :-

డిప్యూటీ జనరల్ మేనేజర్/ మార్కెటింగ్/SC	జాయింట్ జనరల్ మేనేజర్/ ఫైనాన్స్-1	చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్/ సికింద్రాబాద్	కన్సల్టెంట్/RLDA శ్రీ కరణ్ శర్మ
M: 73375 50024 rorldasc@gmail.com	M: 78781 82717 negi1trlda@gmail.com	M: 63054 89280 cpmrldasc22@gmail.com	M: 99996 90805 karan.sharma@enerock.com

గమనిక:- సవరణ లేదా అనుబంధం ఏదైనా ఉంటే పైన తెలిపిన వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రచురించబడును.
AM/Tender, (M) 8750554811

నవోదయ విద్యాలయ సమితి
విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తి గల సంస్థ
అక్షరాస్యత మరియు పాఠశాల విద్యా విభాగం
భారత ప్రభుత్వం

జవహర్ నవోదయ విద్యాలయాలలో 6వ తరగతికి ప్రవేశ ప్రకటన (2023–24)
జవహర్ నవోదయ విద్యాలయాలలో 6వ తరగతిలో ఎంపిక పరీక్ష ద్వారా ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరబడుచున్నవి.

ముఖ్యాంశాలు
2023-24 విద్యా సంవత్సరానికి
- ప్రతి జిల్లాలో సహవిద్యా, ఆవాసీయ పాఠశాలలు
- బాలబాలికల కొరకు ప్రత్యేకమైన హాస్టల్స్
- ఉచిత విద్యా, భోజన వసతి సదుపాయాలు
- మైగ్రేషన్ పథకం ద్వారా విస్తృతమైన సాంస్కృతిక వినిమయం
- స్పోర్ట్ & గేమ్స్ వృద్ధి
- NCC, స్కౌట్స్ & గైడ్స్ మరియు NSS





ప్రత్యేకమైన అంశాలు
నాణ్యమైన విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా ఫలితాలు
- JEE మెయిన్స్–2022: 7585 మందిలో 4296 (56.6%) విద్యార్థులు అర్హులయ్యారు.
- JEE అడ్వాన్స్‌డ్–2022: 3000 మందిలో 1010 (33.7%) విద్యార్థులు అర్హులయ్యారు.
- NEET-2022: 24807 మందిలో 19352 (78.0%) విద్యార్థులు అర్హులయ్యారు.
- X మరియు XII తరగతి బోర్డ్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు
  తరగతి X: 99.71% తరగతి XII: 98.93%

అర్హత
- అభ్యర్థులు ఏ జిల్లాలో నివసిస్తున్నారో, అదే జిల్లాలో పని చేయుచున్న జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశానికై 2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ/ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలలో 5వ తరగతి చదువుతూ ఉండాలి.
- ప్రభుత్వ/ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలలో 3, 4 తరగతులు పూర్తి విద్యా సంవత్సరాలు చదివి ఉత్తీర్ణులై ఉండాలి మరియు 01.05.2011 నుండి 30.04.2013 (రెండు దినములు కలుపుకొని) మధ్య జన్మించి ఉండాలి.

రిజర్వేషన్
- కనీసం 75% సీట్లు జిల్లాలోని గ్రామీణ విద్యార్థులతో నింపబడతాయి.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం SC, ST, OBC మరియు దివ్యాంగులైన అభ్యర్థుల కొరకు రిజర్వేషన్లు కలవు.
- బాలికల కోసం కనీసం 1/3 వంతు సీట్లు కేటాయించబడినవి

దరఖాస్తు చేయుటకు ఆఖరి తేది **31.01.2023**
పరీక్ష తేది **29.04.2023**
రిజిస్ట్రేషన్ & వివరాల కోసం లాగిన్ అవ్వండి: https://navodaya.gov.in
జారీ చేసినవారు: నవోదయ విద్యాలయ సమితి

తినుబండారాలపై నిషేధం...
సినిమా హాళ్ల ఇష్టమే: సుప్రీం

న్యూఢిల్లీ: సినిమా హాళ్లలోకి బయటి నుంచి తినుబండారాలను అనుమతించే విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. సినిమా హాల్ అనేది ప్రైవేట్ ఆస్తి అని, అందులోకి బయటి తినుబండారాలను అనుమతించాలా? లేదా? అనేది నిర్ణయంచుకొనే హక్కు యాజమాన్యానికి ఉందని తేల్చిచెప్పింది. ప్రేక్షకులు బయటి నుంచి తినుబండారాలు, పానీయాలు తీసుకురాకుండా అడ్డుకోరాదని, అందుకు అనుమతించాలని ఆదేశిస్తూ జమ్మూకశ్మీర్ హైకోర్టు గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వును సవాలు చేస్తూ థియేటర్ ఓనర్లు, మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. జమ్మూకశ్మీర్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వును కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిల్లలకు అవసరమైన ఆహారాన్ని తల్లిదండ్రులు సినిమా హాల్లోకి తీసుకొస్తే అడ్డుకోవద్దని స్పష్టం చేసింది.

'స్వలింగ వివాహాల'పై 6న విచారణ

స్వలింగ వివాహాలకు ప్రభుత్వం అధికారికంగా గుర్తింపునివ్వాలని కోరుతూ ఇప్పటికే దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లంటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేసి, విచారించాలని విజ్ఞప్తి చేస్తూ కొందరు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ఈ నెల 6వ తేదీన విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలియజేసింది.

క్లుప్తంగా...

'రెండో బూస్టర్ డోస్ అనవసరం'

న్యూఢిల్లీ: దేశ ప్రజలకు కోవిడ్ రెండో బూస్టర్ డోసు పంపిణీ విషయం ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని అధికారవర్గాలు తెలిపాయి. దేశ ప్రజలు చాలా మంది ఇంకా మూడో కోవిడ్ టీకా డోసే తీసుకోలేదని పేర్కొన్నాయి. ఈ సమయంలో నాలుగో డోస్ అనవసరమని తెలిపాయి. చైనాలో కోవిడ్ వ్యాప్తి ఆందోళనకరంగా మారిన వేళ కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఈ మేరకు స్పష్టతనిచ్చాయి.

బ్రిటన్ రాజుకు మోదీ ఫోన్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ మంగళవారం బ్రిటన్ రాజు చార్లెస్–3తో ఫోన్‌లో మాట్లాడారు. వాతావరణ మార్పులు, జీవవైవిధ్య పరిరక్షణ, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంలో వినూత్న ఆవిష్కరణలు వంటి అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయని ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో)తెలిపింది.

27న ప్రధాని మోదీ 'పరీక్షా పే చర్చా'

ఈ నెల 27వ తేదీన వార్షిక 'పరీక్షా పే చర్చా కార్యక్రమం జరగనుంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మోదీ మాట్లాడనున్నారు. ఢిల్లీలోని తల్కటోరా ఇండోర్ స్టేడియంలో 6వ విడత పరీక్షా పే చర్చా జరగనుందని కేంద్ర విద్యాశాఖ మంగళవారం ట్వీట్ చేసింది.

పాక్ ఉగ్ర కేంద్రమే: జై శంకర్

వియన్నా: భారత్‌లోకి ఉగ్రవాదులను ఎగదోస్తూ, ఉగ్రవాదాన్ని విస్తరింపజేస్తున్న పాకిస్తాన్‌పై ఇటీవల తాను చేసిన వ్యాఖ్యలను భారత విదేశాంగ మంత్రి జైశంకర్ సమర్థించుకున్నారు. ఆస్ట్రియా జాతీయ వార్తాప్రసార సంస్థ ఓఆర్ఎఫ్‌కు సోమవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో జైశంకర్ పలు అంశాలు మాట్లాడారు. ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్రస్థానం పాక్‌లో ఉందని మీరు చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ సమాజంలో ఒక భారతీయ దౌత్యవేత్త హోదాలో సమర్థించుకుంటారా అని వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు జైశంకర్ బదులిస్తూ.. 'భారత పార్లమెంట్‌పై దాడి, ముంబై వంటి నగరాల్లో దాడి చేసి భారతీయులను, విదేశీ పర్యాటకులను చంపి, రోజూ సరిహద్దు గుండా ఉగ్రవాదుల చొరబాట్లకు ప్రయత్నించే పాక్‌నుద్దేశించి ఇంకా ఏమనాలి? ఇంకాస్త పరుష పదం వాడితే బాగుండేది. ఉగ్రవాదానికి కేంద్రస్థానం అనే పదం మంచిదే' అని వ్యాఖ్యానించారు. 'పట్టపగలే నగరాల్లో ఉగ్రవాదులకు సైన్యం తరహాలో యుద్ధతంత్రాలు నేర్పిస్తున్నారు. ఈ విపరీతాలను యూరప్ దేశాలు ఎందుకు నిలదీయవు? భారత్, పాక్ మధ్య మళ్లీ యుద్ధం వస్తుందేమోననే భయం ప్రపంచానికి ఉంటే ముందుగా ఉగ్రవాదంపై ప్రపంచదేశాలు దృష్టిపెట్టాలి' అని హితవు పలికారు.

సవాళ్లను ఎదుర్కొనే సత్తా మనకుంది: రాజ్‌నాథ్

బొలెంగ్: సరిహద్దుల్లో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొని, మన భూభాగాన్ని కాపాడుకునే సత్తా మనకుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. పొరుగు దేశాలతో మంచి సంబంధాలనే కోరుతున్నామన్నారు. శ్రీరాముడి వారసత్వం, గౌతమ బుద్ధుడి బోధనల ద్వారా మనం నేర్చుకున్నది ఇదేనన్నారు. సరిహద్దు రహదారుల సంస్థ(బీఆర్‌వో) సియోమ్ వద్ద నిర్మించిన 100 మీటర్ల పొడవైన స్టీలు వంతెనను మంగళవారం మంత్రి రాజ్‌నాథ్ ప్రారంభించి మాట్లాడారు.

నెతన్యాహుకు ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డ్

జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు దంపతులను కేంద్ర ప్రభుత్వం ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డ్‌కు ఎంపికచేసింది. ఇజ్రాయెల్‌లో నెతన్యాహు స్నేహితురాలు, భారతీయ మూలాలున్న మహిళా పారిశ్రామికవేత్త రీనా వినోద్ పుష్కామాతోపాటు మరికొందరిని ఈ అవార్డ్‌కు ఎంపికచేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈనెల 8 నుంచి జరిగే ప్రవాసీ భారతీయ దివస్ వేడుకల్లో వీరికి అవార్డులను ప్రదానంచేస్తారు. సంగీత విభావరి నిర్వాహకులు జుబెన్ మెహతా, నటి సోఫియా లోరెన్, ఇజ్రాయెల్ మాజీ ప్రధాని ఐజాక్ రాబిన్, మాజీ అధ్యక్షుడు, ప్రధాని షిమోన్ పెరేస్‌సహా ఈ ఏడాది 21 మందిని ఈ అవార్డుతో సత్కరించనున్నారు.

మంత్రుల వ్యాఖ్యలను ప్రభుత్వానికి ఆపాదించలేం

ప్రజాప్రతినిధుల భావ ప్రకటనపై అదనపు పరిమితులు విధించలేం ● సుప్రీంకోర్టు ధర్మాసనం మెజారిటీ తీర్పు

- స్వీయ నియంత్రణ తప్పనిసరన్న ధర్మాసనం
- మంత్రుల వ్యాఖ్యలను ప్రభుత్వానికి ఆపాదించొచ్చు
- భిన్నమైన తీర్పు వెలువరించిన జస్టిస్ నాగరత్న



న్యూఢిల్లీ: ప్రజాప్రతినిధుల వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ''మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల భావ ప్రకటనపై ఇప్పటికే ఆర్టికల్ 19(2)లో ఉన్నవాటికి అదనంగా మరిన్ని పరిమితులు విధించలేం. సమష్టి బాధ్యత సూత్రాన్ని ఈ విషయంలో వర్తింపజేయలేం'' అని స్పష్టం చేసింది. ఒక మంత్రి చేసే విద్వేషపూరిత, వివాదాస్పద వ్యాఖ్యలను ప్రభుత్వానికి ఆపాదించలేమని పేర్కొంది. ఓ సామూహిక అత్యాచారం కేసుపై విద్వేష వ్యాఖ్యలు చేసిన అప్పటి యూపీ మంత్రి ఆజం ఖాన్‌ను అరెస్టు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ ఎస్.ఎ.నజీర్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం ఈ మేరకు 4–1తో మెజారిటీ తీర్పు వెలువరించింది. భారత్ వంటి పార్లమెంటరీ వ్యవస్థలో ఆరోగ్యకర ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛ అత్యవసరమని జస్టిస్ నజీర్‌తో పాటు న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఎ.ఎస్.బొపన్న, జస్టిస్ వి.రామసుబ్రమణియన్ పేర్కొన్నారు. ఐదో సభ్యురాలైన జస్టిస్ నాగరత్న మాత్రం, మంత్రి అధికారిక హోదాలో చేసే వ్యాఖ్యలను మొత్తం ప్రభుత్వానికి ఆపాదించవచ్చంటూ భిన్నమైన తీర్పు వెలువరించారు. వాటివల్ల నష్టం జరిగిందని భావిస్తే ఎవరైనా కోర్టును ఆశ్రయించవచ్చని కూడా స్పష్టం చేశారు. అయితే వాక్ స్వాతంత్ర్యంపై మరిన్ని పరిమితులు కష్టమేనని ఆమె అంగీకరించారు. యూపీలోని బులంద్‌షహర్‌లో 2016లో తమ కూతురు సామూహిక అత్యాచార కేసును ఢిల్లీకి బదలాయించాలంటూ ఒక వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసు రాజకీయ కుట్ర అన్నందుకు అప్పటి యూపీ మంత్రి ఆజం ఖాన్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. దీనిపై తొలుత త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ప్రజాప్రతినిధులు, మంత్రులకు సున్నితాంశాలపై తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా వ్యక్తీకరించే హక్కుందా వంటి పలు అంశాలను తేల్చాల్సిందిగా 2017 అక్టోబర్లో రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించింది. నవంబర్ 15న విచారణ పూర్తి చేసిన ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది. బాధ్యతాయుత పదవుల్లో ఉన్నవారు పౌరులను అవమానించే, వారి మధ్య విద్వేషాన్ని వ్యాప్తి చేసే, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా సంయమనం పాటించాలని సూచించింది. అయితే, ''ఇది మన రాజ్యాంగ సంస్కృతిలో భాగం. ఇందుకోసమని ప్రజాప్రతినిధులకు ప్రవర్తన నియమావళి రూపొందించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 19(2)లో పేర్కొన్న నిబంధనలు సరిపోతాయి'' అని అభిప్రాయపడింది.

రాజ్యాంగ స్ఫూర్తికే గొడ్డలిపెట్టు: జస్టిస్ నాగరత్న

విద్వేష వ్యాఖ్యలు రాజ్యాంగ మౌలిక విలువల స్ఫూర్తికే గొడ్డలిపెట్టని జస్టిస్ నాగరత్న అన్నారు. ''సమాజంలో అసమానతలకు దారి తీసే ఇలాంటి పోకడ పెరిగిపోతుండటం ఆందోళనకరం. ప్రతి పౌరునికీ తోటి పౌరుని గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉంటుంది. భిన్న నేపథ్యాలకు చెందిన పౌరుల మధ్య సౌభ్రాతృత్వ భావనలను విద్వేష వాతావరణం ఎంతగానో దెబ్బ తీస్తుంది. అందుకే మంత్రులు, ప్రజాప్రతినిధులు, సెలబ్రిటీలు ఈ విషయంలో మరింత బాధ్యతగా ఉండటం తప్పనిసరి. అది వారి విధి కూడా. తాము మాట్లాడుతున్న మాటలు, వాటి పర్యవసానాలు, ప్రజల మనోభావాలపై అవి చూపబోయే ప్రభావం, అలాంటి మాటల ద్వారా తాము నెలకొల్పుతున్న ఉదాహరణ వంటివాటిపై వారికి అవగాహన ఉండి తీరాలి'' అని అభిప్రాయపడ్డారు. ''మంత్రులు, నేతలు చేసే ప్రసంగాలను నియంత్రించడం వారి పార్టీ బాధ్యత. అవసరమైతే ప్రవర్తన నియమావళిని నిర్దేశించాలి. ప్రజాప్రతినిధులు తమ తోటి పౌరులపై రెచ్చగొట్టే, విద్వేష వ్యాఖ్యలు చేయకుండా నియంత్రించేలా రాజ్యాంగంలోని 19(1)(ఏ), 19(2) అధికరణల స్ఫూర్తికి అనుగుణంగా పార్లమెంటు చట్టం తేవాలి'' అని ఆమె సూచించారు.



గ్లోబల్ లీడర్లుగా ఎదగండి

సామాన్యులకు సైన్స్ ఫలితాలు
- సైంటిస్టులకు ప్రధాని మోదీ పిలుపు
- నాగపూర్‌లో 108వ జాతీయ సైన్స్ కాంగ్రెస్ ప్రారంభం

నాగపూర్: భారత్‌ను స్వావలంబన దేశంగా తీర్చిదిద్దడానికి సైంటిస్టులు కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. వారు తమ పరిజ్ఞానాన్ని ప్రజల రోజువారీ జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ఉపయోగించాలని కోరారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో 108వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఐదు రోజులపాటు ఈ సదస్సు జరగనుంది. శాస్త్రీయ విధానాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. క్వాంటమ్ టెక్నాలజీ, డేటా సైన్స్‌తోపాటు కొత్త వ్యాక్సిన్ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పరిశోధకులకు సూచించారు. కొత్తగా పుట్టుకొచ్చే వ్యాధులపై నిఘా పెట్టే చర్యలను వేగవంతం చేయాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నానాటికీ ఆదరణ పొందుతున్న క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో విశేష కృషి చేయడం ద్వారా గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని సైంటిస్టులకు ఉద్బోధించారు. సెమి కండక్టర్ల రంగంలో నూతన ఆవిష్కరణలతో ముందుకు రావాలని కోరారు. పరిశోధకులు తమ ప్రాధాన్యతల జాబితాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీని చేర్చుకోవాలని చెప్పారు.

ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 40వ స్థానం

సైంటిస్టులు ప్రయోగశాలల నుంచి క్షేత్రస్థాయికి రావాలని, అప్పుడే వారి ప్రయత్నాలు గొప్ప ఘనతలుగా కీర్తి పొందుతాయని ప్రధానమంత్రి వెల్లడించారు. సైన్స్ ప్రయోగాల ఫలితాలను సామాన్య ప్రజలకు అందించాలన్నారు. టాలెంట్ హంట్, హ్యాకథాన్లతో యువతను సైన్స్ వైపు ఆకర్షితులను చేయాలని కోరారు. ప్రైవేట్ కంపెనీలు, స్టార్టప్‌లను రీసెర్చ్ ల్యాబ్‌లు, విద్యాసంస్థలతో అనుసంధానిస్తే అద్భుతమైన ఫలితాలు లభిస్తాయని స్పష్టం చేశారు. క్వాంటమ్ కంప్యూటర్స్, కెమిస్ట్రీ, కమ్యూనికేషన్, సెన్సార్స్, క్రిప్టోగ్రఫీ, న్యూ మెటీరియల్స్ దిశగా మన దేశం వేగంగా ముందుకు సాగుతోందని మోదీ వివరించారు. మన దేశంలో ఇంధన, విద్యుత్ అవసరాలు రోజురోజుకీ భారీగా పెరుగుతున్నాయని, ఈ రంగంలో కొత్త ఆవిష్కరణ ద్వారా దేశానికి లబ్ధి చేకూర్చాలని సైంటిఫిక్ సమాజానికి పిలుపునిచ్చారు. దేశంలో అభివృద్ధి కోసం శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించుకుంటున్నామని తెలియజేశారు. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో మన దేశం 2015లో 81వ స్థానంలో ఉండేదని, ఇప్పుడు 40వ స్థానానికి చేరిందని అన్నారు.



తూర్పు ఢిల్లీలో రాహుల్ జోడో యాత్ర. (ఇన్‌సెట్‌లో) యూపీలో చెల్లి ప్రియాంకతో రాహుల్

అలుపెరగని పోరాట యోధుడు

- రాహుల్‌పై ప్రియాంక పొగడ్తలు
- యూపీలోకి ప్రవేశించిన జోడో యాత్ర

ఘజియాబాద్: తన సొంత ఇమేజ్‌ను, పరువు ప్రతిష్ఠలను దెబ్బతీసేందుకు మోదీ సర్కార్ వేల కోట్లు ఖర్చుచేస్తున్నా ఏమాత్రం భయపడని వ్యక్తిత్వం రాహుల్‌ది అని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. మంగళవారం ఢిల్లీ నుంచి భారత్ జోడో యాత్ర ఉత్తరప్రదేశ్‌లో అడుగుపెట్టిన సందర్భంగా యాత్రలో రాహుల్ సోదరి ప్రియాంకాగాంధీ పాల్గొని ప్రసంగించారు. 'అంబానీ, అదానీ లాంటి బడా పారిశ్రామికవేత్తలు ఎంతో మంది రాజకీయనేతలను, ప్రభుత్వరంగ సంస్థలను, మీడియాను కొనగలరేమో. కానీ నా సోదరుడు రాహుల్‌ను కొనలేరు. సత్యమనే ఆయుధాన్ని ధరించిన పోరాటయోధుడు రాహుల్' అని ప్రియాంక అన్నారు.

తొమ్మిది రోజుల విరామం తర్వాత

తొమ్మిది రోజుల విరామం తర్వాత జోడో యాత్ర మంగళవారం ఢిల్లీలోని హనుమాన్ మందిర్ నుంచి యూపీలోకి అడుగుపెట్టగానే వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా, శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది, రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్(రా) మాజీ చీఫ్ అమర్‌జీత్ సింగ్ దులత్ సైతం యాత్రలో పాల్గొన్నారు.

నడ్డా కొనసాగింపు?

16, 17ల్లో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు

న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జగత్‌ప్రకాశ్ నడ్డాను కొనసాగించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు నెల 16, 17న ఢిల్లీలో జరుగనున్నాయి. ఈ ఏడాది జరగబోయే పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటు వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఎన్నికల సన్నద్ధతపై అగ్రనేతలు సమీక్ష నిర్వహిస్తారని బీజేపీ వర్గాలు తెలియజేశాయి. ఒక రోడ్‌మ్యాప్ సైతం సిద్ధం చేయనున్నట్లు సమాచారం.

రక్తమోడుతున్నా ఈడ్చుకెళ్లారు

కారు కింద ఇరుక్కుని అరుస్తున్నా ఆగలేదు ● 'ఢిల్లీ దారుణం'పై ప్రత్యక్ష సాక్షి వెల్లడి

- ఆమె బాధితురాలి స్నేహితురాలే
- ఘటన వేళ స్కూటీపైనే కూర్చుంది
- అత్యాచారం జాడల్లేవన్న పోస్టుమార్టం



అంజలిని ఈడ్చుకెళ్తున్న కారు | అంజలి(ఫైల్) | స్కూటీ

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో యువతిని స్కూటీతో పాటు కారు కింద కిలోమీటర్ల మేరకు ఈడ్చి పొట్టన పెట్టుకున్న దారుణ ఘటనకు సంబంధించి మరిన్ని నివ్వెరపరిచే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. కారు ఢీకొనడంతో చక్రాల కింద ఇరుక్కుని, కాపాడండంటూ ఆర్తనాదాలు చేస్తున్నా కనికరం లేకుండా నిర్దాక్షిణ్యంగా ఈడ్చుకెళ్లారని నిధి అనే ప్రత్యక్ష సాక్షి వెల్లడించారు. మృతురాలు అంజలీ సింగ్‌కు ఆమె స్నేహితురాలే. ఘటన జరిగినప్పుడు అదే స్కూటీపై అంజలీ వెనక కూచొని ఉంది. స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడింది. షాక్‌తో ఘటన వివరాలను ఆమె ఇంతవరకూ బయట పెట్టలేదు. స్కూటీపై మరో మహిళ ఉన్నట్టు సీసీటీవీ ఫుటేజీలో గుర్తించిన పోలీసులు ఆరా తీసి ఆమె వాంగ్మూలం నమోదుచేశారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి జరిగిన దారుణం గురించి నిధి వెల్లడించారు. ''మా పరిచయమై 15 రోజులే అయినా మంచి స్నేహితులమయ్యాం. కొత్త ఏడాది వేడుక కల్సి చేసుకుందామనుకున్నాం. హోటల్‌లో పార్టీ తర్వాత 2 గంటలపుడు బయటకొచ్చి స్కూటీపై వెళ్తున్నాం. ఎదురుగా వస్తున్న కారు హఠాత్తుగా మమ్మల్ని ఢీకొట్టింది. నేను పడిపోయా. కానీ అంజలి కారు చక్రాల్లో ఇరుక్కుని రక్తమోడుతూ సాయం కోసం అరిచింది. అయినా వాళ్లు వేగంగా అలాగే ఆమెను కారుతో పాటుగా ఈడ్చుకెళ్లారు. వెంటనే ఆపితే ఆమె కచ్చితంగా బ్రతికేది. చక్రాల్లో ఆమె ఇరుక్కుందని తెలిసీ నిర్దయగా అలాగే వెళ్లిపోయారు. ఆ దారుణాన్ని చూసిన షాక్‌లో ఈ విషయం ఎవరికీ చెప్పలేదు'' అని నిధి చెప్పారు. అయితే స్కూటీ ఎక్కడానికి ముందు హోటల్ బయట వారిద్దరూ గొడవ పడుతున్నట్టు మరో వీడియో కూడా వైరల్ అవుతోంది. నిధి నుంచి ఏదో లాక్కోవడానికి అంజలి ప్రయత్నిస్తున్నట్టు అందులో కన్పిస్తోంది. బహుశా స్కూటీని ఎవరు నడపాలనే విషయమై వారు వాదించుకున్నారని భావిస్తున్నారు. కాగా ఈ కేసులో అత్యాచారం ఆనవాళ్లు లేవని పోస్ట్‌మార్టం ప్రాథమిక నివేదికలో వెల్లడైంది. తల, వెన్నెముక, మొండెం కింది అవయవాలకు తీవ్ర గాయాలవడంతో అంజలీ మరణించినట్టు నివేదిక పేర్కొంది. నిందితులు ఆమెను రేప్ చేసి చంపేశారనే ఆరోపణల నేపథ్యంలో మెడికల్ బోర్డు పర్యవేక్షణలో పోస్ట్‌మార్టం జరిగిందని ఢిల్లీ పోలీస్ స్పెషల్ కమిషనర్ సాగర్ ప్రీత్ హూడా చెప్పారు. ఝౌంతీ గ్రామంలో నగ్నంగా పడి ఉన్న యువతి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడం, నిందితులను అరెస్ట్ చేసి కస్టడీకి తీసుకోవడం తెల్సిందే.

కేసును నీరుగారుస్తున్నారు: ఆప్

దర్యాప్తు వేగంగా ముగించి దోషులకు కఠిన శిక్ష పడేలా చూడాలంటూ ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు 'ఆప్' ఎమ్మెల్యేల బృందం వినతిపత్రం ఇచ్చింది. మృతురాలి కుటుంబానికి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ రూ.10 లక్షల ఆర్థికసాయం ప్రకటించారు.

కేంద్రం సీరియస్

ఘటనపై కేంద్రం సీరియస్‌గా ఉంది. సమగ్ర నివేదిక ఇవ్వాలని ఢిల్లీ పోలీసులను కేంద్ర హోం శాఖ ఆదేశించింది. దాంతో స్పెషల్ కమిషనర్ శాలినీ సింగ్ నేతృత్వంలో ఢిల్లీ పోలీస్ విభాగం దర్యాప్తు సంఘాన్ని ఏర్పాటుచేసింది. ఘటన సమయంలో ఇద్దరు నిందితులు తాగి ఉన్నట్లు వార్తలొచ్చాయి. వారి రక్త నమూనాలను పరీక్షకు పంపారని, రిపోర్టులు రావాల్సి ఉందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

కుటుంబానికి ఏకైక దిక్కు

మృతురాలు అంజలి తన కుటుంబానికి ఏకైక పెద్ద దిక్కు. తండ్రి ఎనిమిదేళ్ల క్రితమే మరణించాడు. అక్కకు పెళ్లయింది. దాంతో అమ్మ, ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్లను ఆమే పోషిస్తోంది. ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తూ వారికి ఆసరాగా నిలుస్తోంది. మూత్రపిండాలు దెబ్బ తిన్న తల్లికి తరచూ డయాలసిస్ అవసరం.

ఆత్మహత్యలేనా?

మిస్టరీగా రష్యా ప్రముఖుల మరణాలు
- ఒడిశాలో 15 రోజుల వ్యవధిలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు

రష్యాకు చెందిన ప్రముఖులు అనుమానాస్పద రీతిలో మరణించడం సంచలనం రేపుతోంది. ఒకరో, ఇద్దరో మరణించారనుకుంటే ఏమో అనుకోవచ్చు. గత ఏడాది కాలంలో ఏకంగా 24 మంది మృత్యువాత పడడం చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని ప్రారంభించడానికి కాస్త ముందు నుంచే ఈ మిస్టరీ మరణాలు సంభవించడం గమనార్హం. ఇలా మరణించిన ప్రముఖుల్లో కొందరు పుతిన్ యుద్ధోన్మాదాన్ని బహిరంగంగా వ్యతిరేకించినవారు ఉన్నారు. దీంతో పుతిన్‌ను ఎదిరిస్తే ప్రాణాలు కోల్పోవాల్సిందేనా అన్న చర్చ కూడా జరుగుతోంది.


భారత్‌లో 15 రోజుల్లో ముగ్గురు

మన దేశంలోని ఒడిశా రాష్ట్రంలో గత పదిహేను రోజుల్లో ముగ్గురు రష్యన్లు ప్రాణాలు కోల్పోయారు. పారాదీప్ ఓడరేవులో ప్రయాణిస్తున్న నౌక సిబ్బందిలో ఒకరైన సెర్గీ మిల్యాకోవ్ (50) మంగళవారం తెల్లవారుజామున నౌకలో అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు విడిచారు. బంగ్లాదేశ్‌లో చిట్టగాంగ్ పోర్టు నుంచి పారాదీప్ మీదుగా ముంబై వెళుతున్న ఆ నౌకకి సెర్గీ చీఫ్ ఇంజనీర్. తెల్లవారుజామున 4.30 గంటలకు ఆయన శవమై కనిపించారు. సెర్గీ గుండె పోటుతో మరణించారని నౌకా సిబ్బంది భావిస్తున్నారు. ఒడిశాలోని రాయగడ సాయి ఇంటర్నేషనల్ హోటల్‌లో ఇద్దరు రష్యన్లు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై విచారణ కొనసాగుతుండగానే మరో మరణం సంభవించింది. రష్యా వ్యాపారి, ఎంపీ పావెల్ ఆంటోవ్ (65)డిసెంబర్ 24న హోటల్ గది కిటికీలో నుంచి కింద పడి ప్రాణాలు కోల్పోయారు. అంతకు రెండు రోజుల ముందే డిసెంబర్ 22న ఆయన స్నేహితుడు వ్లాదిమర్ బిడెనోవ్ (61) హోటల్ గదిలో అపస్మారక స్థితిలో కనిపించి ఆస్పత్రికి తీసుకువెళ్లేలోగా ప్రాణాలు విడిచారు.

ప్రాణాలు కోల్పోతున్న ప్రముఖులెవరు ?

ప్రాణాలు కోల్పోతున్న రష్యన్లలో బిలయనీర్లు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, చమురు సంస్థల అధిపతులు, పెద్ద పెద్ద పదవుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులు, మిలటరీ నాయకులు ఉన్నారు. వీరిలో అత్యంత పిన్న వయస్కుడు 37 ఏళ్లు కాగా 73 ఏళ్ల వయసు వరకు అన్ని వయసుల వారు ఉన్నారు. రష్యా యుద్ధం మొదలైన రెండో రోజే గ్యాజ్‌ప్రామ్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ అలెగ్జాండర్ ట్యూల్కోవ్ అనుమానాస్పదరీతిలో మరణించారు. యుద్ధాన్ని వ్యతిరేకించిన డాన్ రాపో పోర్ట్ గత ఆగస్టులో అనుమానాస్పద స్థితిలో మరణించారు. మన దేశంలో రాయగడలో మరణించిన ఎంపీ పావెల్ కూడా యుద్ధాన్ని వ్యతిరేకించినవారే. ఆయన మరణించిన రోజే రష్యా నావికాదళానికి చెందిన అలెగ్జాండర్ బుజెకోవ్ కూడా అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయారు. మార్చిలో వాసిలీ మెల్నికోవ్ తన భార్యా ఇద్దరు పిల్లలతో కలిసి శవమై కనిపించారు. జులైలో ప్రభుత్వ కాంట్రాక్టర్ యూరీ వోరోనోవ్ తన ఇంట్లో స్విమ్మింగ్‌పూల్‌లో రక్తపు మడుగులో శవమై తేలారు.





- సాక్షి, నేషనల్ డెస్క్

ఎలా మరణిస్తున్నారు ?

రష్యా ప్రముఖులు మరణాల్లో ఎక్కువ మంది ఆత్మహత్యలు చేసుకొని చనిపోతున్నట్టు ప్రచారంలో ఉంది. ఎత్తయిన భవనాల మీద నుంచి, గదుల్లోని కిటికీల నుంచి, నౌకల నుంచి దూకడం, తమని తాము కాల్చుకోవడం, గుండె పోట్లు వంటి ఘటనలతో మరణించడం ఎక్కువగా వెలుగులోకి వస్తోంది..లుక్ ఆయిల్ చైర్మన్ రావిల్ మాగ్నోవ్ గత సెప్టెంబర్‌లో అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి తన గది కిటికీ నుంచి కింద పడిపోయి ప్రాణాలు కోల్పోయారు. ఇలా మరణిస్తున్న వారిలో సంపన్నులే ఎక్కువ. వారి చుట్టూ అంగరక్షకులు ఉంటారు. కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. చిన్న అనారోగ్యం వచ్చినా అత్యుత్తమ వైద్య సేవలు తీసుకునే సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే వారి మరణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ''మరణిస్తున్న వారిలో అత్యధికులు కోట్లకు పడగలెత్తి రాజకీయ ప్రాబల్యం ఉన్నవారే. వారు అసహజంగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదం. పుతిన్ హయాంలో గత దశాబ్దకాలంగా విషప్రయోగాలతో చంపేయడం, హత్యాయత్నాలు విరివిగా జరుగుతూనే ఉన్నాయి. 2020లో ప్రతిపక్ష నేత అలెక్సీ నావెల్నీపై విష ప్రయోగం జరిగిన విషయం తెలిసిందే'' అని రష్యాలో పొలిటికల్ సైంటిస్ట్ ప్రొఫెసర్ జెఫ్రీ వింటర్స్ చెప్పారు.

ఆర్థిక ఒత్తిళ్లు కారణమా ?

ఉక్రెయిన్‌పై యుద్ధం కారణంగా పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షలతో వ్యాపారాలు బాగా దెబ్బతిని బిలయనీర్లందరూ ఆర్థిక కష్టాల్లో మునిగిపోయారు. గోల్డెన్ స్పూన్‌తో పుట్టిన వారంతా తమ వ్యాపారాలు మళ్లీ పుంజుకుంటాయన్న నమ్మకం లేని తీవ్రమైన నిరాశ నిస్పృహల్లోకి వెళ్లిపోతున్నారు. ఆ ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడడం, ఆరోగ్యం క్షీణించి గుండెపోట్లు రావడం జరుగుతోందన్న అభిప్రాయాలు ఉన్నాయి. గత ఏడాది కాలంలో చమురు సంస్థలకు చెందిన ఆరుగురు అనుమానాస్పద స్థితిలో మరణించారు.

ఆన్‌లైన్లో ఆధార్ అడ్రస్ మార్పుకు...
ఇంటిపెద్ద అంగీకారం చాలు

న్యూఢిల్లీ: ఆధార్ కార్డులో చిరునామాను మార్చుకోవడం మరింత సులభతరంగా మారింది. ఇంటిపెద్ద(హెడ్ ఆఫ్ ద ఫ్యామిలీ) అంగీకారంతో ఆధార్ పోర్టల్‌లో (ఆన్‌లైన్‌లో) చిరునామా సులువుగా మార్చుకోవచ్చని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ కొత్త విధానంలో ఇంటి పెద్దతో సంబంధాన్ని ధ్రువీకరించే ఏదైనా పత్రం సమర్పించాల్సి ఉంటుంది. రేషన్ కార్డు, మార్కుల షీట్, మ్యారేజ్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు తదితర ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించవచ్చు. కానీ, ఇందులో ఇంటిపెద్ద పేరు, దరఖాస్తుదారుడి పేరు, వారిద్దరి మధ్య సంబంధం గురించి తప్పనిసరిగా ఉండాలి. ఆన్‌లైన్‌లో ఓటీపీ ఆధారిత ధ్రువీకరణ ద్వారా అడ్రస్ మారుతుంది. ఇంటిపెద్ద ఫోన్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఒకవేళ



రిలేషన్‌షిప్‌ను నిర్ధారించే డాక్యుమెంట్ లేకపోతే ఇంటిపెద్ద సెల్ఫ్–డిక్లరేషన్ సమర్పించవచ్చు. ఇది యూఐడీఏఐ నిర్దేశించిన ఫార్మాట్‌లో ఉండాలి. ఆధార్ కార్డులో చిరునామా మార్చుకోవడానికి తగిన ధ్రువపత్రాలు లేని వారికి ఈ కొత్త విధానంతో ఏంతో ప్రయోజనం చేకూరుతుందని యూఐడీఏఐ తెలియజేసింది. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారినవారికి సైతం ఉపయోగకరమని వివరించింది.

సాక్షి
హైదరాబాద్
బుధవారం । 4 । జనవరి । 2023



లాంబా @ 300

ఆభరణాల వ్యాపారులను, వీటిలో పని చేస్తున్న సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దారి దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురు ఘరానా దొంగలను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో



అమెరికా అల్లుడి వికృత చేష్టలు

ఎన్ఆర్ఐ భర్త మోసం చేయడంతో బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసి యూసుఫ్ గూడలోని అత్తింటి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగింది. -8లో

మక్కాకు బయలుదేరిన యాత్రికులు



శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి మంగళవారం అల్‌మిజాన్ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 70 మంది యాత్రికులు మక్కా, మదీనాలకు తరలివెళ్లారు.

మూసీ మెరిసేలా!



చారిత్రక మూసీ నదిపై అత్తాపూర్ సమీపంలో నగర చరిత్ర, సంస్కృతీ వారసత్వాన్ని ప్రతిబింబించేలా వంతెనలు, సుందరమైన రహదారులను ప్రభుత్వం నిర్మించనుంది. ఆ నమూనా చిత్రాలే ఇవి. వీటిని ప్రముఖ ఆర్కిటెక్ట్ సంస్థ ఆస్కార్ అండ్ పొన్ని డిజైన్ చేసింది.
– సాక్షి, సిటీబ్యూరో





సందర్శకులు మురిసేలా!

బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి మొదటిరోజు మంగళవారం సందర్శకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇక్కడ ఔషధ వనంతో పాటు ఎకరంన్నర స్థలంలో వలయాకారంలో 27 నక్షత్రాలు, 9 గ్రహాల పేరుతో మొక్కలతో తీర్చిదిద్దిన నక్షత్ర వనం అలరించాయి. అందమైన పూల తోటలు, మామిడి, సపోటా, దానిమ్మ, కొబ్బరి తోటలు, భారీ వృక్షాలు, బటర్‌ఫ్లై గార్డెన్ పాఠశాల విద్యార్థులను, పెద్దలను విరివిగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 15 వరకు ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకులను అనుమతిస్తారు.
– రసూల్‌పురా



న్యూస్‌రీల్

నెల రోజుల్లో దుర్గం చెరువు ఎస్టీపీ సిద్ధం



సాక్షి, సిటీబ్యూరో: దుర్గం చెరువు వద్ద జలమండలి నూతనంగా నిర్మిస్తున్న మురుగు శుద్ధి కేంద్రాన్ని నెలరోజుల్లో అందుబాటులోకి తేనున్నట్లు జలమండలి ఎండీ దానకిశోర్ తెలిపారు. దుర్గం చెరువు, కోకాపేట్, అత్తాపూర్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఎస్టీపీలను మంగళవారం ఆయన సందర్శించారు. దుర్గం చెరువు వద్ద 7 మిలియన్ లీటర్ల శుద్ధి సామర్థ్యం, సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ ఎస్టీపీ సివిల్ పనులు 95 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఎస్టీపీల ప్రాంగణాల్లో ఆహ్లాదకర వాతావరణం, పచ్చదనం కోసం గార్డెనింగ్, అవసరమైన మొక్కలు నాటాలని సూచించారు. నగరంలో 16 చోట్ల 978 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఎస్టీపీలను ఈ ఏడాది జూలై నాటికి పూర్తి చేసి జీహెచ్ఎంసీ పరిధిలో వంద శాతం మురుగు నీటిని శుద్ధి చేయనున్నామన్నారు. మిగిలిన 11 ప్రాంతాల్లోని ఎస్టీపీలను నవంబరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించామన్నారు. ఆయన వెంట ఈడీ సత్యనారాయణ,ప్రాజెక్టు విభాగం డైరెక్టర్ శ్రీధర్‌బాబు, ఇతర ఉన్నతాధికారులున్నారు.

ఆరుగురు కొత్త ఆర్‌ఎంఓల బాధ్యతల స్వీకరణ



గాంధీ ఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో కొత్తగా ఆరుగురు రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు (ఆర్ఎంఓ) మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు, ఆర్ఎంఓ–1 జయకృష్ణలను వీరు కలిశారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహించి, రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆర్ఎంఓలు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఓ సుభాన్ హుస్సేన్, జనరల్ మేనేజర్ సంతోష్ వెంకట రమణలు పాల్గొన్నారు.

అసైన్డ్ వేట.. కాసుల మూట

భూములు సేకరించి లేఅవుట్లుగా అభివృద్ధి
- సుమారు 3 వేల ఎకరాల్లో లేఅవుట్లు..
- ఎకరాకు 600 గజాలు అసైన్డ్‌దారుకు
- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో స్థలాల గుర్తింపు
- కలెక్టర్లకు లేఖలు రాసిన రాష్ట్ర ప్రభుత్వం
- భారీగా నిధులు వస్తాయని సర్కారు అంచనా

సాక్షి, సిటీబ్యూరో: ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన రాష్ట్ర సర్కారు కాసుల వేట సాగిస్తోంది. ఖజానా నింపుకునేందుకు అసైన్డ్ భూములను అన్వేషిస్తోంది. వ్యవసాయేతర అవసరాలకు మళ్లిస్తున్న భూములను సేకరించి.. లేఅవుట్లుగా అభివృద్ధి చేసే దిశగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తోంది.

ధరలు ఆకాశాన్నంటడంతో..

- రాజధానికి చేరువలో ఉన్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. పారిశ్రామికాభివృద్ధి, ఐటీ కంపెనీల తాకిడితో ఈ రెండు జిల్లాల్లో నగరీకరణ శరవేగంగా జరుగుతోంది. దీంతో స్థిరాస్తి రంగం మూడు పూలు ఆరు కాయలుగా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే అసైన్డ్ భూములు సైతం పరాధీనమవుతున్నాయి. భూమిలేని నిరుపేదలకు జీవనోపాధి నిమిత్తం వివిధ దశల్లో రాష్ట్ర ప్రభుత్వం భూములను పంపిణీ (అసైన్‌మెంట్) చేసింది.
- ఈ భూములను వ్యవసాయ సాగుకు మాత్రమే వినియోగించుకోవాలని నిర్దేశించింది. ఒకవేళ ఇతర అవసరాలకు మళ్లించినా.. క్రయ విక్రయాలు జరిపినా చట్టరీత్యా నేరం. ఇవేమీ పట్టని కొందరు ఈ భూములను యథేచ్ఛగా విక్రయించారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే కారుచౌకగా ఈ భూములు అందుబాటులో ఉండడంతో బడాబాబులు, ప్రజాప్రతినిధులు ఇబ్బడిముబ్బడిగా కొనుగోలు చేశారు.
- ఇలా అసైన్‌మెంట్ చట్టాన్ని ఉల్లంఘించినా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ఈ భూములక్రయ విక్రయాలకు అడూ అదుపూ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే అన్యాక్రాంతమవుతున్న అసైన్డ్ భూములను గుర్తించిన ప్రభుత్వం.. వీటిని ప్లాట్లుగా అభివృద్ధి చేయడం ద్వారా నిధుల సమీకరించుకోవాలనే ఆలోచన చేసింది. నగరానికి సమీపంలో ఉన్న ఈ తరహా భూములను గుర్తించి.. వాటిని లేఅవుట్లుగా అభివృద్ధి చేసి వేలం వేయాలని నిర్ణయించింది. ఈ అభివృద్ధి చేసిన భూమిలో ఎకరాకు 600 చదరపు గజాలను అసైన్డ్‌దారులకు ఇచ్చే విధంగా ప్రణాళికను రూపొందించింది.



గజం రూ.40 వేల చొప్పున..

- ఉప్పల్ భగాయత్‌లో పట్టాదారుల భాగస్వామ్యంతో సేకరించిన హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) లేఅవుట్లుగా అభివృద్ధి చేసింది. దీంట్లో డెవలప్ చేసి ఎకరాకు వేయి గజాల చొప్పున పట్టాదార్లకు కేటాయించింది. ఇదే పద్ధతిని అసైన్డ్ భూములకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా మార్గదర్శకాలను ఖరారు చేసి భూములను గుర్తించాలని కలెక్టర్లకు లేఖ రాసింది. ఈ మేరకు చర్లపటేల్ గూడ, కుర్మల్‌గూడ, తొర్రూర్, కవాడిపల్లి, చందానగర్, మునగనూరు, కొల్లూరు, పసుమాముల, తుర్కయంజాల్, లేమూరు, కొల్లూరులలో దాదాపు 3వేల ఎకరాలను ప్రాథమికంగా ఎంపిక చేసింది.
- సేకరిస్తున్న అసైన్డ్ భూములకు ఆయా ప్రాంతాల్లో ఉన్న విలువ ఆధారంగా ఎకరాకు 600 గజాల నుంచి 800 వరకు ఇవాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ప్రైవేటు భూములతో పోలిస్తే అసైన్డ్ భూములకు ధర తక్కువ. వీటి క్రయవిక్రయాలపై నిషేధం ఉన్నందున.. ఇవి ఎకరాకు రూ.25 లక్షలు కూడా లభిస్తున్నాయి.
- ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న సర్కారు వీటిని లేఅవుట్లుగా అభివృద్ధి చేయడం ద్వారా గజాన్ని సగటున రూ.40వేల చొప్పున విక్రయించవచ్చని అంచనా వేస్తోంది. దీంతో అటు అసైన్డ్ దారులు.. ఇటు ప్రభుత్వానికి ఉభయతారకంగా లబ్ధి చేకూరుతుందని భావిస్తోంది. ఎన్నికల సంవత్సరం కావడం.. సంక్షేమ పథకాలకు నిధులు భారీగా అవసరం ఉండడంతో సాధ్యమైనంత త్వరగా అసైన్డ్ భూములను సేకరించి వెంచర్లుగా అభివృద్ధి చేసి నిధులను సమకూర్చుకోవాలనుకుంటోంది. దీంతో ఈ ప్రక్రియను వడివడిగా పూర్తి చేయాలని కలెక్టర్లకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది.

చెరువులకు ఆదరువు ఎన్నడో!

నాలుగేళ్లు గడిచినా పూర్తికాని పనులు
- నిధుల కొరత, నిర్లక్ష్యమే కారణం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని 185 చెరువుల ప్రక్షాళనతో పాటు సుందరీకణతో అభివృద్ధి చేస్తామన్న ప్రకటనలు నాలుగేళ్లు గడిచినా అమలుకు నోచుకోలేదు. అభివృద్ధి పనుల కోసం 2018లో రూ.282.62 కోట్లు మంజూరైనా పనుల జాడే లేదు. మంజూరైన నిధులు కాగితాల్లో తప్ప విడుదల కాకపోవడం అందుకు ఒక కారణం కాగా, సగానికి పైగా నిధులు ఆలస్యంగా విడుదలైనప్పటికీ శ్రద్ధ చూపని అధికారుల నిర్లక్ష్యం మరో కారణం. చెరువుల సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రక్షాళనలో భాగంగా పూడికతీత చేపట్టాలని భావించారు. ప్రక్షాళన తర్వాత తిరిగి కలుషితం కాకుండా చెరువుల్లో కలుస్తున్న మురుగును తరలించడంతోపాటు ఎస్టీపీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తీసిన పూడికను కట్టల నిర్మాణంలో ఉపయోగించాలని భావించారు.

నిధుల కొరత కొంత.. నిర్లక్ష్యం ఇంకొంత..

ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడం.. జీహెచ్ఎంసీ వద్ద సైతం నిధులు లేకపోవడంతో పూడికతీత పనులైనా మిషన్ కాకతీయ నిధులతో చేయాలని భావించారు.మిషన్ కాకతీయ కింద నిధులు విడుదలైనప్పటికీ పూడికతీత, ప్రక్షాళన పనులు జరగలేదు. ఇక ఎస్టీపీల నిర్మాణం, సుందరీకరణ పనులు కూడా పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో కార్పొరేట్ సంస్థల నుంచి సీఎస్సార్ నిధులతో కొన్ని చెరువుల పనులైనా పూర్తి చేసి అందంగా తీర్చిదిద్దాలనుకున్నారు. అవీ పూర్తికాలేదు. మొత్తం 185 చెరువులకు 50 చెరువుల్లో ఎలాంటి మురుగు నీరూ కలవడం లేదని తేల్చారు. మిగతా వాటిల్లో



21 చెరువుల్లో మురుగునీటి మళ్లింపు పనుల్ని మిషన్‌కాకతీయ, సీఎస్సార్ నిధులతో పూర్తిచేశారు. మరో 8 చెరువుల వద్ద మిషన్ కాకతీయ నిధులతో పనులు జరుగుతున్నాయి. ఇలా మిషన్ కాకతీయ, సీఎస్సార్‌ల ద్వారా నిధులు సమకూర్చుకున్నా పనులు పూర్తికాలేదు.

జీహెచ్ఎంసీ నుంచి రూ.167 కోట్లు..

ఈ నేపథ్యంలో మురుగునీటి మళ్లింపుతోపాటు చెరువు కట్టల బలోపేతం, తూముల ఏర్పాటు వంటి పనులకు జీహెచ్ఎంసీ నిధులు రూ167 కోట్లు కేటాయించారు. వీటితో 63 చెరువుల్లో మురుగునీటి మళ్లింపు పనులుచేపట్టగా పది పనులు పూర్తయినట్లు అధికారులు పేర్కొన్నారు. కోర్టు వివాదాల వంటి కారణాలతో 14 చెరువుల పనులు నిలిపివేశారు. మిగతా పనుల్ని దశలవారీగా చేస్తామని చెబుతున్నారు. అవి ఎప్పుడు పూర్తి చేస్తారో, అందుకు ఎంతకాలం పడుతుందో సంబంధిత అధికారులకే తెలియాలి. నిధుల లేమితో వాటర్‌బోర్డుకు 17 చెరువుల వద్ద ఎస్టీపీల నిర్మాణ బాధ్యతలు అప్పగించారు.

నమామి గంగే.. ఉత్సాహం ఉప్పొంగే..

మన సంస్కృతీ సంప్రదాయాలను మన కళాకారులు కాపాడుతున్నారని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. మంగళవారం రవీంద్ర భారతిలో ప్రణవ్ కూచిపూడి నృత్య శిక్షణాలయం 16వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... గంగానది విశిష్టత, ప్రయోజనాలు, జల ఆధ్యాత్మిక సంపద వంటి అంశాలపై ప్రముఖ నర్తకీమణి పద్మశ్రీ డాక్టర్ జి.పద్మజారెడ్డి అద్భుతంగా ప్రదర్శించారని కొనియాడారు. నమామి గంగే పేరుతో నృత్యగురువు పద్మజారెడ్డి శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీ టి.సుబ్బిరామిరెడ్డి, ఐఏఎస్ అధికారి యోగితారాణా, జి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
– గన్‌ఫౌండ్రీ



భయపెడుతున్న నిమోనియా

నిలోఫర్‌లో పెరుగుతున్న కేసులు
- రెండ్రోజుల్లో ఆరుగురు శిశువుల మృతి

నాంపల్లి: నవజాత శిశు సంరక్షణ కేంద్రం నిలోఫర్ ఆస్పత్రిలో నిమోనియా కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. వాతావరణంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో నిమోనియా జడలు విప్పుతోంది. నిలోఫర్‌లో ఈ కేసుల సంఖ్య భారీగా నమోదవుతోంది. ఏ వార్డులో చూసినా జ్వరం, దగ్గుతో బాధపడే రోగులే దర్శనమిస్తున్నారు. గడిచిన రెండ్రోజుల్లో వ్యాధి సోకిన అయిదేళ్ల లోపు చిన్నారులు ఆరుగురు మృతి చెందినట్లు తెలుస్తోంది. వీరంతా ఎన్ఐసీయూలో చికిత్స పొందుతూ ఆక్సిజన్ అందక చనిపోయినట్లు విశ్వసనీయ సమాచారం.

వ్యాధి లక్షణాలు ఇవీ..

ఊపిరితిత్తులకు వచ్చే వ్యాధిని నిమోనియాగా పిలుస్తారు. చిన్న పిల్లల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. తల్లి పాలు లేకుండా పెరిగే పిల్లల్లో, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే శిశువులు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నారులు, పౌష్టికాహారం లోపంతో పెరిగే పిల్లల్లో ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. నిమోనియా సోకిన వ్యక్తి దగ్గినప్పుడు వచ్చే తుంపర్ల ద్వారా కూడా చిన్నారులకు సంక్రమిస్తుంటుంది. శీతాకాలంలో వీచే చలి ప్రభావం శిశువుల ఊపిరితిత్తులను చిత్తు చేస్తోంది. కఫంతో కూడిన దగ్గు చలి జ్వరం, ఛాతి నొప్పితో శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. శిశువు బలహీనంగా, నీరసంగా శక్తి తక్కువగా బరువు ఉన్నట్లు అనిపిస్తుంది.



ఒకే వీల్‌చైర్‌పై ఇద్దరు చిన్నారులను తీసుకువెళ్తున్న సిబ్బంది

వికారం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. ముక్కు నుంచి నీరు కారుతూ.. తేలికపాటి జ్వరం, ఒళ్లు నొప్పులు కనిపిస్తే నిమోనియాగా గుర్తించాలని వైద్యులు పేర్కొంటున్నారు.

పిడియాట్రిక్ కేసులే అధికం. .

నిలోఫర్ ఓపీలో జ్వర పీడితుల సంఖ్య తగ్గుముఖం పట్టడం లేదు. ఒక్క పిడియాట్రిక్ విభాగంలోనే ఓపీ రోగుల నమోదు సంఖ్య 1,300కు చేరుకుంది. ప్రతి రోజూ గైనిక్ విభాగంలో 200. సర్జరీ విభాగంలో 100 కేసులు నమోదవుతున్నాయి. దీనికి తోడు నిలోఫర్‌ను సిబ్బంది లేమి సమస్య వెంటాడుతోంది. పరికరాల కొరత, సకాలంలో అందని రక్తం, అంబులెన్స్‌లు ఉన్నా అందుబాటులో లేని డ్రైవర్లు, అరకొర స్ట్రెచర్లు, సరిపోని వీల్‌చైర్లు.. ఒక్కో పడకపై ముగ్గురేసి చొప్పున రోగులు, వాయిదాల పద్ధతిలో ఎక్స్‌రే, స్కానింగ్ పరీక్షలు, వేళకు అందని రక్త నమూనా ఫలితాల నివేదికల వంటి సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. ఫలితంగా వైద్య సేవలు సరిగా అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిలోఫర్ నాట్కో భవనంలో చిన్నారులతో కుటుంబసభ్యులు



నృత్య వినోదం



ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో మంగళవారం ప్రారంభమైన 'గ్లోబల్ అలుమ్నీ మీట్'లో సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.



'మెట్రో'లో సమ్మె కలకలం

- అమీర్‌పేట్ స్టేషన్ వద్ద ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా
- వేతనాలు పెంచాలని టికెటింగ్ సిబ్బంది డిమాండ్

సాక్షి,సిటీబ్యూరో/అమీర్‌పేట్: ఎల్‌బీ నగర్–మియాపూర్ మెట్రో మార్గంలోని పలు స్టేషన్లలో టికెటింగ్ సిబ్బంది మంగళవారం ఆందోళనకు దిగడం కలకలం సృష్టించింది. అమీర్‌పేట్ మెట్రో స్టేషన్ కింద సుమారు 150 మంది మావిన్‌కో ప్రైవేటు సంస్థకు చెందిన ఔట్‌సోర్సింగ్ (టికెటింగ్) ఉద్యోగులు విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు. ప్రస్తుతం తమ ఏజెన్సీ అందిస్తున్న రూ.12 వేల జీతాన్ని రూ.20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. శ్రమ దోపిడీ చేస్తున్న మావిన్‌కో సంస్థపై చర్యలు తీసుకోవాలని, వేతనాల పెంపుపై మెట్రో నిర్వహణ సంస్థ కియోలిస్ సంస్థ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని మెట్రో నిర్వహణ సంస్థ కియోలిస్ సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో కియోలిస్ సంస్థ ఉన్నతాధికారులు సిబ్బంది చర్చలు జరిపారు. అనంతరం టికెటింగ్ సిబ్బంది మాట్లాడుతూ.. తాత్కాలికంగా ఆందోళన విరమిస్తున్నామని, మరోసారి చర్చలకు రావాలని యాజమాన్యం సూచించిందన్నారు.

యథావిధిగా రైళ్ల రాకపోకలు...

టికెటింగ్ సిబ్బంది ఆందోళన నేపథ్యంలో మెట్రో ప్రయాణికుల్లో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. టికెట్ల జారీ కాస్త ఆలస్యమైనప్పటికీ.. యథావిధిగా మూడు రూట్లలోనూ మెట్రో రైళ్లు రాకపోకలు సాగించాయి. ప్రపంచంలోనే అతిపెద్ద పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టిన నగర మెట్రో ప్రాజెక్టులో అన్ని కీలక విధులు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చేతుల్లోనే ఉండటం గమనార్హం. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తప్పుడు సమాచారాన్ని, వదంతులను వ్యాప్తి చేస్తున్నారని హెచ్ఎంఆర్, ఎల్అండ్‌టీ సంస్థ ఒక ప్రకటనలో ఆక్షేపించాయి.



ఆ 'పాత' మధురం

- నిరాడంబరంగా గ్లోబల్ అలుమ్ని మీట్
- ఓయూ క్యాంపస్‌లో పూర్వ విద్యార్థుల సందడి


సాంస్కృతిక కార్యక్రమాలకు సిద్ధం చేస్తున్న విద్యార్థిని


నృత్య ప్రదర్శనకు సిద్ధమైన బేగంపేట్ సెయింట్ ఆన్స్ విద్యార్థులు



గిరిజన వేషధారణలో విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: గ్లోబల్ అలుమ్ని మీట్–2023 నిరాడంబరంగా ప్రారంభమైంది. మంగళవారం ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులు డాక్టర్.సతీష్‌రెడ్డి, హెచ్‌సీయూ వీసీ ప్రొ.జగదీశ్వర్‌రావు, యూఎస్‌ఏ ప్రొ.రఘు కొల్లూరి, ప్రొ.లింబాద్రి, ఓయూ వీసీ ప్రొ.రవీందర్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి రోజు ఓయూ పూర్వవిద్యార్థులు బుర్ర వెంకటేశం, సీపీ ఆనంద్, సినీ దర్శకుడు శేఖర్‌కమ్ముల, రాజశేఖర్ తదితరులతో రెండు ప్యానెల్ డికర్షన్స్ జరిగాయి. రెండు రోజులు జరిగే అలుమ్ని మీట్‌కు దేశ విదేశాల నుంచి సుమారు 1500 మంది హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం హాస్టళ్లలో పూర్వ విద్యార్థులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ బిజినెస్ , గేమ్స్ స్టోర్స్‌ల్లో ఓయూ ఎంబ్లమ్‌తో రూపొందించిన టీ షర్ట్‌ను రూ. వెయ్యికి విక్రయించారు. ఈ సందర్భంగా నగరంలోని పలు కాలేజీలకు చెందిన విద్యార్థులు నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి.



సందడిగా ఠాగూర్ ఆడిటోరియం ప్రాంగణం

నేను ఉస్మానియా విద్యార్థినే



నేను ఉస్మానియా విద్యార్థినే, ఓయూ పరిధిలోని నిజాం కాలేజీలో డిగ్రీ, క్యాంపస్ ఆర్ట్స్ కళాశాలలో 1989–91 ఎంఏ ఎకానమిక్స్ చదివాను. క్రికెట్, బాస్కెట్ బాల్ టీమ్‌లో వర్సిటీ తరఫున ఆడాను. తర్వాత సివిల్ సర్వీస్ సాధించాను. ఓయూ ద్వారా ఎంతో లబ్ధిపొందిన మేము వర్సిటీకి ఏదైనా చేయాలకుంటున్నాం. – సీపీ ఆనంద్

దాతలు ముందుకు రావాలి



ఓయూ అభివృద్ధిలో భాగస్వామ్యం కోసం దాతలు ముందుకు రావాలి. ఉన్నత విద్య, ఉద్యమాలకు నిలయమైన ఓయూను మరింత అభివృద్ధి చేసేందుకు పూర్వ విద్యార్థులు చేయుత నివ్వాలి. ఓయూలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
– డాక్టర్ నాగయ్య సిద్దార్థ విద్యా సంస్థల యాజమాని

నగరంలో నేడు

- ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లోని భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ(బీఐపీపీ) ఆధ్వర్యంలో 'పబ్లిక్ పాలసీ డైలాగ్స్–2023' మొదటి ఎడిషన్ కార్యక్రమం ఉదయం 10.30 గంటలకు ఖేమ్కా ఆడిటోరియంలో జరుగుతుంది.
- మోటార్ రేస్‌పై ఉదయం 11.30 గంటలకు మాదాపూర్‌లోని హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్ హాల్‌లో సమావేశం జరుగుతుంది.
- తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు నాచారం అన్నపూర్ణ కాలనీ పార్క్ గ్రౌండ్‌లో ముగ్గుల పోటీలు జరుగుతాయి.

సమతావాదాన్ని చాటిచెప్పిన వ్యక్తి సావిత్రిబాయి పూలే


నివాళులర్పిస్తున్న అల్లం నారాయణ, జూలూరు గౌరీశంకర్ తదితరులు

లక్డీకాపూల్: మతమౌఢ్యం, మతాధిపత్యం, మత ఛాందసత్వం మానవ నాగరికతకు అద్దుతగిలే గండశిలలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. కులమతాలు మనుషుల మధ్య చీలికలు తెచ్చేవని, సమతావాదాన్ని, బహుజనహితాన్ని కాంక్షించిన మహనీయురాలు సావిత్రి బాయి పూలే అన్నారు. మంగళవారం తెలంగాణ సాహిత్యఅకాడమీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర, శుభప్రద పటేల్, కిషోర్ గౌడ్‌తో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో తొలి ఉపాధ్యాయినిగా అనేక సంఘర్షణలను ఎదుర్కొని నిలిచిన సావిత్రిబాయి పూలే దేశానికే తలమానికమని కొనియాడారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

నాగోలు: ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన దుశ్శాసన్ పరిద(44) మూడు నెలల క్రితం నగరానికి వలస వచ్చాడు. చింతల కుంట సమీపంలోని ఎల్‌పీటీ మార్కెట్ వెనుక నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్‌లీఫ్స్ ఇన్‌ఫ్రా అపార్ట్‌మెంట్‌లో కూలీగా పని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం అతను ఎనిమిదవ అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని సమీపంలోని ఆరేంజ్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మీ ఆప్తుల
అంత్యక్రియలు,
నిర్యాణం
వర్ధంతి,
జయంతిల
నివాళులు
ప్రకటనల కోసం
సంప్రదించండి.
✆ 9912220352

గ్యాస్ ట్యాంకర్ బోల్తా : భారీగా ట్రాఫిక్ జాం



అబ్దుల్లాపూర్‌మెట్: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై అబ్దుల్లాపూర్‌మెట్ కూడలి వద్ద గ్యాస్ ట్యాంకర్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. గుజరాత్ నుంచి హైదరాబాద్ మీదుగా చెన్నై వెళ్తున్న గ్యాస్ టాంకర్ మంగళవారం సాయంత్రం నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే హైదరాబాద్–విజయవాడ రహదారిపై రోడ్డుకు అడ్డంగా పడడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ట్యాంకర్ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది.

నగ్న దృశ్యాలు చిత్రీకరిస్తున్న యువకుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: బాత్‌రూమ్‌లో స్నానం చేస్తున్న యువతిని వెంటిలేటర్‌లో నుంచి ఓ యువకుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా గుర్తించిన ఆమె జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... యూసుఫ్‌గూడకు చెందిన యువతి(30) గత నెల 31న ఉదయం తన ఇంట్లో స్నానం చేస్తుండగా అదే ఇంటి పై అంతస్తులో ఉండే అఖిల్ తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్నాడు. దీనిని గుర్తించి ఆమె బయటికి వచ్చేలోగా అతను అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకృతి ప్రదర్శన ప్రారంభం..

సాక్షి, సిటీబ్యూరో: ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఉత్పత్తులకు పేరొందిన ఆకృతి లైఫ్ స్టైల్ ప్రదర్శన బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో ఏర్పాటైంది. సోషలైట్ శశినెహతా మంగళవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రదర్శన 3 రోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమంలో మేటి తెలంగాణ


మాట్లాడుతున్న చైర్మన్ వాసుదేవరెడ్డి, డైరెక్టర్ శైలజ

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఉత్తమ రాష్ట్రంగా తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం అవార్డు ఇచ్చిందని వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి తెలిపారు. సంస్థ ఉద్యోగులు, దివ్యాంగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం మలక్‌పేటలోని కార్యాలయంలో ఆయన వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో దివ్యాంగులకు రూ. వెయ్యికి మించి పింఛన్ ఇవ్వడం లేదని, వారికి రూ. 3016 చొప్పున అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. వికలాంగుల సంక్షేమం కోసం అన్ని రంగాల్లో 5 శాతం, ఉద్యోగాల్లో 4 శాతం, విద్యలో 3 నుంచి 4 శాతం రిజర్వేషన్లను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కల్యాణలక్ష్మితో పాటు దివ్యాంగుల కోటాతో కలిపి దివ్యాంగుల వివాహాలకు రూ. 2.55 లక్షలు అందిస్తున్నదన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా మలక్‌పేట మార్కెట్‌లో ఆయన విగ్రహాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జీఎం ప్రభంజన్‌రావు పాల్గొన్నారు.

లాంబా @ 300

కళ్లల్లో కారం కొట్టి దోపిడీలకు పాల్పడే గ్యాంగ్‌పై పీటీ వారెంట్

జైలుకు తరలించిన జూబ్లీహిల్స్ పోలీసులు


సయ్యద్ సయీర్ హుస్సేన్ అలియాస్ లాంబా | ఎస్‌కె. సలీం | ఆవారు బాలకృష్ణ | సయ్యద్ గౌస్ పాషా | సయ్యద్ ముబషిర్ హుస్సేన్

బంజారాహిల్స్: ఆభరణాల వ్యాపారులను అందులో పని చేస్తున్న సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దారికాచి దారి దోపిడీలకు పాల్పడుతున్న ఐయిదుగురు ఘరానా దొంగలను జూబ్లీహిల్స్ పోలీసులు పీటీ వారెంట్ పై అరెస్ట్ చేసి తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే...జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లో గత నవంబర్ 22న రాత్రి పంజగుట్ట కృష్ణ జ్యువెలర్స్‌కు చెందిన ఉద్యోగి తన యజమాని అంకిత్ అగర్వాల్ ఇంటికి దుకాణం తాళం చెవులు అప్పగించేందుకు వెళుతుండగా అప్పటికే రెక్కీ నిర్వహించిన ఐయిదుగురు దొంగలు అతడి కళ్లల్లో కారం కొట్టి బ్యాగుతో ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి గాలిస్తుండగానే అదే నెల 24న ఇదే గ్యాంగ్ నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నగల దుకాణం సిబ్బంది కళ్లల్లో కారం కొట్టి 25 తులాల బంగారు ఆభరణాలు లాక్కెళ్లారు. గత డిసెంబర్ 5న మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఇదే తరహాలో నగల దుకాణం సిబ్బంది కళ్లల్లో కారం కొట్టి 29 తులాల బంగారు ఆభరణాలతో ఉడాయించారు. ఆయా పోలీస్ స్టేషన్ల క్రైం పోలీసులు వీరి కోసం గాలిస్తుండగానే గత ఏడాది ఆగస్టులో సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన 30 కిలోల వెండి ఆభరణాల చోరీ కేసులో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గత నెల 14న ఈ ముఠాను అరెస్ట్ చేశారు. విచారణలో వీరు జూబ్లీహిల్స్, నారాయణగూడ, మహంకాళి పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడిన ఘరానా దొంగలుగా తేలింది.

ఈ ముఠాలో ప్రధాన నిందితుడైన సయ్యద్ సయీద్ హుస్సేన్ అలియాస్ లాంబా అలియాస్ హుస్సేన్, అలియాస్ లాంబా హుస్సేన్ ఇప్పటి వరకు 300 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తేలింది. అతడిపై పీడీ యాక్ట్‌తో పాటు సీడీఎస్ కూడా నమోదై ఉన్నాయి. మరో నిందితుడు ఎస్‌కె సలీం అలియాస్ జాబా సలీం, ఆవారి బాలకృష్ణ అలియాస్ కిషన్ అలియాస్ బాలకిషన్ అలియాస్ ఆజం, సయ్యద్ ముబాషిర్ హుస్సేన్ అలియాస్ ముజ్జు, మహ్మద్ గౌస్‌పాషా అలియాస్ గౌస్ ముఠాగా ఏర్పడి నగరంలోని ఆభరణాల దుకాణాలను లక్ష్యంగా చేసుకుని అక్కడి సిబ్బంది రాకపోకలపై రెక్కీ నిర్వహించి ఈ తరహా దొంగతనాలకుప పాల్పడుతున్నట్లుగా తేలింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసుతో లాంబాపై 300వ కేసు నమోదైంది. చోరీలకు బాలకృష్ణ, మహ్మద్ అహదుద్దీన్ అలియాస్ అహర్ పథకం రూపొందించగా, ముజ్జు, గౌస్ ఇద్దరూ రెక్కీ నిర్వహిస్తారు. లాంబా, సలీం టార్గెట్ః కళ్లల్లో కారం కొట్టి ఆభరణాలను లాక్కెళ్లేవారని పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుల్లో అహర్‌తో పాటు మిగతా నలుగురిపై ఒక్కొక్కరిపై 25కు పైగా కేసులు నమోదై ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు. దోపిడీల అనంతరం పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతూ అవకాశం వచ్చినప్పుడు మళ్ళీ పంజా విసిరేవారని తేలింది. ఈ ముఠా నెల రోజుల వ్యవధిలో ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో నాలుగు దారి దోపిడీలకు పాల్పడింది.

ఎడ్‌సెట్ కన్వీనర్‌కు వైస్ ఛాన్స్‌లర్ రీసెర్చర్ అవార్డు


అవార్డు అందుకుంటున్న ప్రొ.రామకృష్ణ

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్ ఎడ్‌సెట్‌కు మూడు సార్లు కన్వీనర్‌గా కొనసాగిన ప్రొ.రామకృష్ణ వైస్ ఛాన్స్‌లర్ రీసెర్చ్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. మంగళవారం ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సాంకేతిక సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి, హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, ఓయూ వీసీ ప్రొ.రవీందర్ తదితరులు ప్రొ.రామకృష్ణకు అవార్డు అందజేశారు. కేటగిరి–1 విభాగంలో ప్రొ.రామకృష్ణతో పాటు సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు ప్రొ.శశికాంత్, కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొ.మురళీధర్‌రెడ్డి అవార్డులు అందుకున్నారు. ప్రత్యేక విభాగంలో డా.జ్యోతి, డా.అశోక్‌కుమర్, సీబీఐటీ అధ్యాపకులు డా.సుధాకర్‌బాబు అవార్డులను అందుకున్నారు. ప్రాజెక్టు పూర్తి చేసిన పలువురు అధ్యాపకులకు అభినందన పత్రాలను అందచేశారు. రీసెర్చ్ పబ్లికేషన్స్, సదస్సుల్లో పరిశోధన పత్రాల సమర్పణ, రీసెర్చ్ ప్రాజెక్టులను పరిగణలోకి తీసుకుని అవార్డుకు ఎంపిక చేశారు. ఓయూలో 52 మంది పోటీ పడగా ముగ్గుర్ని ఎంపిక చేసినట్లు తెలిపారు.

హజ్‌హౌస్‌కు పోటెత్తిన జనం

- నగదు పంచుతున్నారని ప్రచారం
- భారీగా తరలివచ్చిన ప్రజలు
- సబ్సిడీ రుణాల దరఖాస్తుల స్వీకరణ అని తెలియక గందరగోళం


సబ్సిడీ రుణాల దరఖాస్తుల స్వీకరణ


హజ్‌హౌస్‌లో ధ్వంసమైన అద్దాలు

సాక్షి, సిటీబ్యూరో: హజ్ హౌస్ ఒక్కసారిగా వేలాది మందితో కిటకిటలాడింది. మంగళవారం భారీగా ప్రజలు తరలిరావడంతో కార్యాలయం కిక్కిరిసిపోయింది. పేద ముస్లింలకు ప్రభుత్వం నగదు పంపిణీ చేస్తుందనే ప్రచారం జరగడమే ఇందుకు కారణం. ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకాలు తీసుకుని హజ్‌హౌస్‌కు వచ్చిన వారు అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో కార్యాలయం లోపలికి చొచ్చుకెళ్లారు. ఈ సందర్భంగా తోపులాట జరగడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. అయితే, అసలు విషయమేమిటంటే.. సబ్సిడీ రుణాల కోసం మైనార్టీ శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. వీటిని హజ్‌హౌస్‌లో స్వీకరిస్తామని ఇచ్చిన ప్రకటన కాస్తా నగదు పంపిణీ ప్రచారానికి తెరలేపింది. దీంతో ఉదయమే కార్యాలయానికి చేరుకున్న ప్రజలు హంగామా చేశారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి ఏ కేటగిరిలో రూ.లక్ష, బీ కేటగిరికి రూ. రెండు లక్షలు సబ్సిడీ వ్యాపార రుణాలు అందజేయనున్నాట్లు అధికారులు తెలిపారు. రుణాల మంజూరు ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తుందని, ఆ తర్వాత బ్యాంక్ లింకేజీతో రుణాలు మంజూరవుతాయని కార్పొరేషన్ అధికారులు పేర్కొన్నారు. అయితే దీనిపై అవగాహన లేకపోవడంతో ప్రజలు హజ్‌హౌస్‌కు తరలి వస్తున్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 12 వేల మందికి వ్యాపార సబ్సిడీ రుణాలు అందించేందుకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. అయితే ఇప్పటికే దాదాపు లక్ష దరఖాస్తులు అందినట్లు అధికారుల పేర్కొన్నారు. 2018లోనూ కార్పొరేషన్ రుణాల మంజూరుపై ప్రకటన చేయగా దాదాపు 1.80 లక్షల దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తుల్లో ఒక్కరికీ రుణాలు మంజూరు చేసిన దాఖలాలు లేవు. మళ్లీ ఇప్పుడు రుణాలు అందిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో లక్షల మంది దరఖాస్తు చేసుకుంటున్నారు.

అమెరికా అల్లుడి వికృత చేష్టలు

అత్తింటి ఎదుట బాధితురాలి ఆందోళన


మహేష్, రామేశ్వరి పెళ్లి ఫొటో (ఫైల్)


ఆందోళన చేస్తున్న బాధితురాలు రామేశ్వరి

బంజారాహిల్స్: ఎన్‌ఆర్‌ఐ భర్త మోసం చేయడంతో బాధిత యువతి ఉమెన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడమే కాకుండా మంగళవారం యూసుఫ్‌గూడ ఎల్‌ఎన నగర్‌లోని అత్తింటి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగింది. వివరాల్లోకి వెళ్తే... యూసుఫ్‌గూడ ఎల్‌ఎన్‌నగర్‌కు చెందిన మారి మహేష్ 2022 మే 26న రామేశ్వరిని వివాహం చేసుకున్నాడు. అదే ఏడాది జూన్ 18న యూఎస్‌ఏలోని టెక్సాస్‌కు తీసుకెళ్లాడు. అయితే ఆ మర్నాటి నుంచే నీ వల్ల కట్నం తక్కువగా వచ్చింది మరొకరిని చేసుకుంటే ఎక్కువ కట్నం వచ్చేదంటూ గొడవ పడుతున్నాడు. రామేశ్వరిని వదిలించుకోవాలని పలుమార్లు ఆమెపై దాడి చేశాడు. హారర్ మూవీలు చూపించేవాడు. బలవంతంగా హుక్కా తాగించేవాడు. ఆ తర్వాత రెండు నెలలకే గత ఆగస్టు 18న రామేశ్వరితో పాటు ఇండియాకు వచ్చిన మహేష్ ఆమెను దోమల్‌గూడలోని పుట్టింట్లో వదిలేసి ఆ తెల్లవారే అమెరికా వెళ్లిపోయాడు. ఆమెకు తెలియకుండానే రానుపోను టికెట్లు బుక్ చేసుకున్నాడు. తనను తీసుకెళ్లాలని ఫోన్ చేస్తే టికెట్ దొరకడం లేదంటూ బుకాయించాడు. దీంతో ఆమె తల్లిదండ్రులు గత అక్టోబర్ 23న అమెరికాకు టికెట్ బుక్ చేసి రామేశ్వరిని భర్త వద్దకు పంపించారు. రామేశ్వరి ఫ్లైట్ ఎక్కగానే ఈ విషయమై ఆమె తండ్రి మహేందర్ అల్లుడికి ఫోన్ చేయగా తనకు ఏం సంబంధం లేదని ఆమె ఎవరో తనకు తెలియదంటూ అసభ్యంగా మాట్లాడి ఫోన్ పెట్టేశాడు. ఆమె అమెరికా వెళ్లాక కూడా ఘర్షణ పడటమేగాక విడాకుల నోటీసుపై సంతకం కూడా పెట్టించాడు. ఈ విషయమే రామేశ్వరి తల్లిదండ్రులు మహేష్ తల్లిదండ్రులతో మాట్లాడటానికి ప్రయత్నించగా తమపై దాడి చేయడానికి వచ్చారంటూ మహేష్ తల్లిదండ్రులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో అక్రమ కేసులు బనాయించారు. పోలీసుల సూచన మేరకు బాధితురాలు ఉమెన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పది రోజులు గడిచినా మహేష్‌ను, ఆమె తల్లిదండ్రులను పోలీసులు పిలవకపోవడంతో రామేశ్వరి తన తల్లి దండ్రులతో కలిసి అత్తమామను కలవడానికి వెళ్లగా ఇంటికి తాళం వేసి బయటికి గెంటేశారు. తన ఇంటికి తనను రావొద్దని చెప్పడానికి వారి ఏం హక్కు ఉందంటూ బాధితురాలు అత్తింటి ఎదుట ఆందోళనకు దిగింది. తనకు న్యాయం చేయాలని, తక్షణం మహేష్‌ను అమెరికా నుంచి పిలిపించాలని కోరింది.

సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

AUTOMOTIVE
■ కార్ అమ్మాలనుకుంటున్నారా? మేము అన్ని రకముల కార్లు కొంటాము, మీ ఇంటికి వచ్చి మీ కారుని సరైన ధరకు, కొని స్పాట్ క్యాష్ ఇస్తాము, ఫోన్ : 9908000076. [HA-10022]

Real Estate

HOUSE FOR SALE
■ వనస్థలిపురం FCI కాలనీలో 40" Rd. S/F 267 గజాలు Single Shop, Lift + G+3, Scm: Commercial 9000 Sft. కొత్త ఇల్లు అమ్మకం. ఫోన్. 9849688626. [HA-1482]

LAND FOR SALE
■ 40 ఎకరాల అగ్రికల్చర్ ల్యాండ్, నీళ్లు కలిగి క్లియర్ టైటిల్ తో అమ్మకానికి కలదు. నాగార్జునసాగర్ దగ్గర, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 8499870866, 9115842234. [H-776444]

PLOT FOR SALE
■ మహేశ్వరం E-City, Wipro కి 100 MTS దగ్గరలో HMDA ప్లాట్స్ కలవు. మార్కెటింగ్ టీమ్ కావలెను. జనవరి 1 లోపు ప్లాట్స్ కొన్న వారికి 10 గ్రాష్. గోల్డ్ ఉచితం. ఫోన్ : 9100048061 [H-792715]
■ యాదగిరిగుట్ట అభివృద్ధి ఒక అద్భుతం: ప్రతి కుటుంబానికి యాదాద్రి దగ్గర ఒక స్థలం ఉండాలి అన్ని డెవలప్‌మెంట్స్ గల DTCP అప్రూవ్డ్ వెంచర్‌లో ప్లాట్ కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఫ్రీ. Ph: 9177151699, 9396882299 [H-776586]
■ నారాయణఖేడ్ లో 369 ఎకరాల మెగా వెంచర్లో ఎర్ర చందనం మొక్కలతో & Free Resort తో కలిగిన 605 SQD కేవలం 5 లక్షలు, మార్కెటింగ్ టీం కావలెను. ఫోన్ : 9000838648. [H-792718]
■ HMDA అప్రూవ్డ్ ప్లాట్లు @ చౌటుప్పల్, విజయవాడ, హైవే ఫేసింగ్ చ.గజం. రూ.12000/-, & యాచారం సాగర్ హైవే ఫేసింగ్ చ.గజం. రూ. 11000/- వివరాలకు సంప్ర.: 8247505992. [H-792678]
■ మహేశ్వరం Opp: SEZ WIPRO MALBAR HMDA అప్రూవ్డ్ విల్లాప్లాట్లు కలవు జనవరి మొదటి వారంలో ప్లాట్లు కొన్నవారికి 7 గ్రామ్స్ గోల్డ్ ఉచితం సంప్ర: 9000373867 [H-792684]
■ "Iconic Infra Group" HMDA 100Ft రోడ్ ఫేసింగ్ V/a హైవే @ చౌటుప్పల్ & 200" ఫీట్ రోడ్ సాగర్ హైవే ఫేసింగ్ DTCP @ యాచారం (విత్ బ్యాంక్ లోన్) ఫోన్: 9700021777. [H-792683]

■ రాజాపూర్ @NH-44 దగ్గర 0% ఇంట్రెస్ట్ తో 30 నెలల EMIతో అన్ని డెవలప్‌మెంట్‌తో 147 గజల 'MUDA' లేఅవుట్ ఓపెన్ Plots కలవు. ఫ్రీ సైట్ విజిట్ కు సంప్ర.: 9949695027. [H-792757]
■ కాకినాడ భానుగుడి 80 అ॥లు మిలటరీ రోడ్‌లో దక్షిణం, స్ట్రెయిట్ 80 అ॥లు E/F కమర్షియల్ స్థలములు డవలప్‌మెంట్‌కు/ అమ్మకము. ఉప్పాడ బీచ్‌రోడ్‌లో DTCP స్థలములు కలవు. PA స్వామి. ✆ : 98481 07949 [R-370]
■ కోహెడ ORR అతి దగ్గరలో ఇళ్ళ మధ్యలో Survey No. 24, 75'ft Rd. E/F 200 Sq.yds. Full LRS Paid Loan Facility. ఫోన్. 9849688626. [HA-1481]

Services
■ బంగారం బ్యాంకులలో ఏ ఇతర సంస్థలలో తాకట్టులో వున్న విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్)(100% జెన్యూన్). 8897887700. [T-1735]

BUSINESS SERVICE
■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-776588]

BUSINESS OFFER
■ అర్జెంట్ మంచి ప్రాఫిట్ గల బిజినెస్ కోసం (Vegetable & Fruits) ఇన్వెస్ట్‌మెంట్ పార్ట్‌నర్స్ కావలెను. మంచి ప్రాఫిట్ రిటర్న్స్ ఇవ్వబడును. ఫోన్ : 7674990470 [H-792635]

PERSONAL CARE

CHANGE OF NAME
■ I, Pradeep Kumar Reddy Kalsani S/o. K. Damodar R/o Flat No. 201, Sai Damodara Nivas, KSR Enclave, Chandangar, Hyd - 50. Have Changed My Name as Pradeep Kumar for All Purposes. [HA-2896]
■ I, Marila D/o. Ch. Yadagiri, R/o. H.No. 20-197/96/892, Gabbilalpet, Jawaharnagar, Medchal-Malkajgiri Dist., have Changed my name from Marila to Chiluka Mary for all records purposes. [HA-90444]
■ I, Ch. Harshita, D/o. Chandu Koteswara Rao, R/o. H.No. 14-81/27, Raghavendra Colony, Ameenpur, Sangareddy Dist., T.S. 502032 my Name Ch. Harshita as per PAN & Aadhar Card records. My name was wrongly mentioned in ICICI Prudential Mutual Funds Bearing Folio No. 37520279 as Chandu Haritha. Ch. Harshita and Chandu Haritha both the names are one and the same belongs to me. [H-786815]
■ I, M S UTHKARSHA, D/o Manchala Satyanarayana, R/o H.No. 16-2-669/c/50, 212, Laxmi Apartments, Nalgonda X Road, Old Malakpet, Hyderabad - T.S.-500036 have changed my name & shall hereafter be known as Manchala Satyanarayana Uthkarsha, D/o Manchala Satyanarayana with aadt number 31AA/752867 & Dated 02-01-2023 for all purposes [W-775959]

OLD AGE HOME
■ మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులలో ఉన్నా వారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సంప్ర: 9949520296 /7981467036 / 9846129997. [H-792634]

Wanted
■ బంజారాహిల్స్, మణికొండ టిఫిన్ సెంటర్ లో (Exp.) ప్యాకింగ్ బాయ్స్, (Exp.) కిచెన్ సూ॥ వైజర్, క్యాషియర్, దోశ, పూరి & టీ మాస్టర్ కావలెను. వసతి+భో. కలదు ఫోన్.9666934949, 9573446770 [H-779931]
■ అర్జెంటుగా (తెలుగు) మాట్లాడే టెలికాలర్స్, సె॥గార్డ్స్, డే॥ ఎంట్రీ, మార్కెటింగ్ M/F స్టాఫ్ కావలెను Qly: 10th-PG (No Target) Sal: 15-20K, స్పాట్ జాయినింగ్ ఫోన్.6309433980, 7396900132. [H-787471]
■ లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీతం: 16k, ఏజెంట్ కమీషన్ 3k. ఫోన్. 9640800074. [HA-844]
■ శ్రీకృష్ణ హోమ్‌కేర్ (Govt. Reg.) Hyd లో వృద్ధులకు, పేషెంట్లకు సెవచేయుటకు బేబికేర్, ఇంటి/ వంటపనికి స్త్రీలు/ పు॥ కావలెను (ఎజెంట్లకు మంచి కమీషన్) జీ: 15,000- 25000/- రూం+భో॥ ఫ్రీ. ఫోన్ : 9000448989. [H-792638]
■ అక్షయ్ రెస్టారెంట్ @ సికింద్రాబాద్ నందు పనిచేయుటకు క్లీనింగ్ & ఫుడ్ సప్లై బాయ్స్, డెలివరీ బాయ్స్ P/F టైం. సెక్యూరిటీ గార్డ్ కావలెను. సంప్ర: 9000877008, 9000611009. [H-792902]
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776222]
■ ఇంటిదగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000 – 20,000 వరకు జీతంగా సంపాదించవచ్చు. మరిన్ని వివరాలకై సంప్ర:6301728311 [G-776235]
■ ప్రముఖ ఆఫీస్ లో సెక్యూరిటీ గార్డ్స్, ASO, ఫీల్డ్ ఆఫీసర్స్, హౌ॥కీ. బాయ్స్, (M/F) కావలెను, 8-12 గం.లు. Age:18-40y. Qly:0-డిగ్రీ, జీ.12–20 వేలు, జూబ్లీహిల్స్. ఫోన్. 9063239926, 9154219926. [H-779924]
■ అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్ RTC కార్గో సర్వీస్ కి బాయ్స్ అటెండర్స్, సెక్యూరిటీ, ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను (కన్సల్టెన్సీ కాదు) ఫోన్ 040- 66366664, 9392663777, 9246663777 [H-792901]
■ నాంపల్లి పెట్రోల్ బంక్ లో పనిచేయుటకు క్యాషియర్స్ జెంట్స్ కావలెను డే డ్యూటీ, జీతం: 12వేలు నైట్ జీతం : 14 వేలు, ESI+PF కలదు. ఫోన్: 7799352500, 9849359004, 9959157277. [HA-28453]
■ CM హోమ్‌కేర్ సర్వీస్: బేబికేర్, ఇంటి, వంట, పేషెంట్స్ చూసుకోవడానికి కేర్ టేకర్స్, ఇంటికి పంపబడును. 20-50y స్త్రీ/పు, 24/7 మా వద్దే ఉండి లాంగ్ టైమ్ డైలీ వర్కర్స్ కావలెను. జీ: 16-20K. 6309807798, 9121099519 [H-776593]
■ Wanted Security Guards to work at Varasthalipuram & Panjagutta Area's 12 Hrs Duty & Office Boys for Jeedimetla Area Qual: 10th, P.F Good Salary. Rudhraksh Security Force. 7702365554. [HA-10023]
■ Req. Recruitment Officer, M/F, Degree, Age: 45-70, Live the dream connect to society. Earn 50K, WFH, No Target. Kumud 9966001257. [HA-90439]
■ Wanted Doctor's: Female / Male MBBS Doctors Gynocologist, Diabetologist, Chaitanyapuri, Saroornagar, Hyd Call: 9381364943, 9963934801 [HA-1222064]

FACULTY TEACHERS
■ Wanted Incharge,Telugu,Hindi, English Social for Classes 6th - 10th&Telugu, English, Maths, Hindi for U.K.G - 5th Class. Nadergul, Kongara Kalan. 8790190846, 9652816990. [HA-10010]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు | జోన్ సెంటర్స్
సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	పట్నంచెరు	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

మైనర్ మందుబాబులు

'డిసెంబర్ 31' రాత్రి ట్రాఫిక్ పోలీసుల డ్రంకెన్ డ్రైవింగ్ తనిఖీలు
మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కిన 1413 మంది

ఇలా దొరికిన వారిలో 21 ఏళ్ల లోపు వాళ్లూ పెద్ద సంఖ్యలోనే
నిబంధనల ప్రకారం వీరికి మద్యం సరఫరా సైతం నేరమే
ఆ కోణాన్ని పట్టించుకోని ట్రాఫిక్, శాంతిభద్రతల విభాగాలు



సాక్షి, హైదరాబాద్: నగరంలో కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్తూ జరిగిన 'డిసెంబర్ 31' వేడుకల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 1413 మంది హైదరాబాద్ పోలీసులకు చిక్కగా... వీరిలో మైనర్లు 22 మంది ఉన్నారు. రాచకొండలో 446 మంది పట్టుబడితే... మైనర్లు ఐదుగురు ఉన్నారు. సైబరాబాద్‌లోనూ ఇలాంటి సీనే. ఇక్కడే ఓ కీలక విషయాన్ని అటు ట్రాఫిక్, ఇటు శాంతిభద్రతల విభాగంతో పాటు ప్రత్యేక విభాగాలైన టాస్క్‌ఫోర్స్, స్పెషల్ ఆపరేషన్ టీమ్‌లు మర్చిపోయాయి. అదే మైనర్లకు సైతం మద్యం లభించడం.

అక్కడితో ఆగిపోయిన సీన్

→ ఇలా పట్టుబడిన మందు'బాబుల' నుంచి ట్రాఫిక్ పోలీసులు అప్పటికప్పుడే వాహనం స్వాధీనం చేసుకుంటారు. వీరికి నిర్ణీత తేదీల్లో తల్లిదండ్రులు లేదా సంరక్షకుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తారు. ఆపై ఈ 'నిషా'చరులపై కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేయడం ద్వారా న్యాయమూర్తి ముందు ప్రవేశపెడతారు. కేసు పూర్వాపరాలు, మద్యం మోతాదు, నడిపిన వాహనం... ఇలాంటి అనేక విషయాలను పరిగణనలోకి తీసుకునే న్యాయస్థానం జరిమానా లేదా జైలు శిక్ష లేదా రెండూ విధిస్తుంది. ఈ తంతు పూర్తయిన తర్వాత ఆ వ్యక్తికి లేదా సంరక్షకుడికి ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని తిరిగి ఇచ్చేస్తారు. 'డిసెంబర్ 31' నాడు చిక్కిన డ్రంక్ డ్రైవర్ల కథ కూడా అక్కడితోనే ముగిసిపోతోంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండల్లో ప్రతి ఏడాదీ ఇలానే జరుగుతోంది. కానీ...

వారికి మద్యం ఎలా వచ్చింది?

ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం 21ఏళ్ల కంటే తక్కువ ఉన్న వారికి మద్యం అమ్మకూడదు. వీరిని బార్లు, పబ్‌లలోకి అనుమతించడమూ నిషిద్ధమే. 'డిసెంబర్ 31'న చేపట్టిన డ్రంక్ డ్రైవింగ్ పరీక్షల్లో పట్టుబడిన మైనర్లు వైన్ షాపులో ఖరీదు చేసుకుని తాగడమో, బార్‌కు వెళ్లడమో జరిగి ఉండాలి. వీటిలో ఏది జరిగినా ఆయా యాజమాన్యాలపై చర్య తీసుకోవాల్సిందే. 2016 నాటి చిన్నారి రమ్య ప్రమాదంతో పాటు నగరంలో అనేక యాక్సిడెంట్లకు మద్యం మత్తులో ఉన్న మైనర్లు కారణమయ్యారు. అలాంటి సందర్భాల్లో మాత్రమే పోలీసులు మద్యం ఎక్కడ నుంచి వచ్చిందనే అంశంపై దృష్టి పెట్టి హడావుడి చేస్తు న్నారు. డిసెంబర్ 31 నాటి డ్రంక్ డ్రైవర్ల విషయంలో మాత్రం ఈ విషయాన్ని పట్టించుకోవట్లేదు. ఇదే అనేక సందర్భాల్లో ఉల్లంఘన జరగడానికి కారణమవుతోంది.

కనిపెట్టడం పెద్ద కష్టం కాదు...

→ 'డిసెంబర్ 31'న పట్టుబడిన మందుబాబుల్లో 21 ఏళ్ల లోపు వాళ్లకు మద్యం ఎవరు విక్రయించారో తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. వీళ్లు నిర్ణీత సమయంలో కచ్చితంగా ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో (టీటీఐ) జరిగే కౌన్సెలింగ్‌కు, ఆపై ట్రాఫిక్ పోలీసులు సూచించినప్పుడు కోర్టుకు రావాల్సిందే. ఆయా సందర్భాల్లో వారిని విచారించడం ద్వారా వారికి మద్యం ఎక్కడ నుంచి వచ్చింది? ఎక్కడ తాగారు? తదితర వివరాలు తెలుసుకోవచ్చు. ఇది తెలిసినా పోలీసులు నేరుగా చర్యలు తీసుకోలేరు. ఏదైనా సంస్థపై ఇలాంటి ఉల్లంఘనలకు సంబంధించి చర్యలు తీసుకోవాలంటే లైసెన్స్ ఇచ్చిన అథారిటీకే సాధ్యం. దీంతో ఆయా వివరాలను సీసీ కెమెరా ఫుటేజ్, లోకేషన్ వంటి ఆధారాలతో సహా ఎక్సైజ్ శాఖకు అందించి, లైసెన్సు రద్దు/సస్పెన్షన్ సహా చర్యలకు సిఫార్సు చేయవచ్చు. ఇలా చేస్తే మరోసారి ఉల్లంఘన, భవిష్యత్తులో ఘోర ప్రమాదాలు తప్పే అవకాశం ఉంది. అయినప్పటికీ పోలీసులకు ఈ అంశం పట్టట్లేదనే విమర్శలు ఉన్నాయి.

మైనర్ డ్రైవింగ్ కూడా తీవ్రమైనదే..

→ డ్రంక్ డ్రైవింగ్ చేస్తూ చిక్కిన మైనర్లకు సంబంధించి మరో కీలకాంశమూ ఉంది. మోటారు వాహనాల చట్టం ప్రకారం సాధారణంగా మైనర్లకు లైసెన్సులు జారీ చేయరు. దీంతో వీళ్లు వాహనం నడపకూడదు, మైనర్ డ్రైవింగ్ చేయడమే కాదు వారికి, లైసెన్సు లేని వారికి వాహనం ఇవ్వడం కూడా నేరమే. ఇలా చేసినందుకు వాహనం ఎవరి పేరుతో రిజిస్టరై ఉందో ఆ యజమానిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. 'డిసెంబర్ 31'న చిక్కిన మైనర్ల విషయంలోనూ ఈ విధానం పూర్తి స్థాయిలో అమలు కావట్లేదు.

క్లుప్తంగా...

5న యాదగిరిగుట్టలో విద్యుత్ బీసీ ఉద్యోగుల మహాసభ

ఎంపీ ఆర్.కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభను ఈ నెల 5న మధ్యాహ్నం 2 గంటలకు యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మహా సభకు జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, డిస్కంల సీఎండీలు జి.రఘుమారెడ్డి, ఎ.గోపాల్‌రావు, జాతీయ బీసీ నాయకుడు గుజ్జ కృష్ణ హాజరవుతారని తెలిపారు. విద్యుత్ బీసీ ఉద్యోగులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సంస్థల్లో ఇచ్చిన పదోన్నతులను హైకోర్టు ఉత్తర్వులు, ప్రభుత్వ ఆదేశానుసారం సమీక్షించి నష్ట పోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమా వేశంలో బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కోడెపాక కుమారస్వామి తదితర నాయకులు పాల్గొన్నారు

పూలేకు భారతరత్న ఇవ్వాలి

మంత్రి శ్రీనివాస్ గౌడ్



సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్ తదితరులు

హైదరాబాద్: బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం రవీంద్రభారతిలో బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పార్లమెంట్‌లో మహాత్మా జ్యోతీరావు పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని, జ్యోతీరావు పూలేకు భారతరత్న ఇవ్వాలని కోరారు. దేశంలో 60 శాతం ఉన్న బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లా డుతూ హైదరాబాద్‌లో పూలే స్మృతివనం ఏర్పాటు చేయాలని, అదేవిధంగా బీసీ భవన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వివిధ రంగాలలో రాణిస్తున్నటువంటి బీసీ మహిళలకు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు విక్రమ్ గౌడ్ సావిత్రీబాయి పూలే ఉత్సవ కమిటీ చైర్మన్ మనుమంజరి తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సరం సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ రాజమౌళి

పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టాలి

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య డిమాండ్



సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కృష్ణయ్య

ముషీరాబాద్: పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టి.. మహిళలకు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో మంగళవారం బీసీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి కృష్ణయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించినప్పుడే వారికి రాజ్యాధికారం దక్కుతుందని స్పష్టం చేశారు. రాజ్య సభలో ఆమోదం పొందిన మహిళా బిల్లును లోక్ సభలో కూడా ప్రవేశపెట్టి పూర్తి చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దశలవారీగా మద్యపాన నిషేధం విధిస్తామని ప్రకటించి బెల్టు షాపులు ఎత్తివేశారని గుర్తు చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా స్పందించి మద్యపాన నిషేధం ప్రకటించాలని కృష్ణయ్య కోరారు.

కొత్త కార్పొరేషన్లు ఇవ్వొద్దు.. ప్రజాధనం వృథా చేయొద్దు

సీఎస్ సోమేశ్‌కు ఎఫ్‌జీజీ కార్యదర్శి పద్మనాభరెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖలకు కార్పొరేషన్ల చైర్మన్లను నియమించి ప్రజాధనం వృథా చేయొద్దని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) తెలిపింది. రాష్ట్రంలో కార్పొరేషన్లు, డెవలప్‌మెంట్ అథా రిటీలు కలిపి 70 వరకు ఉన్నాయని, కొన్ని మినహాయిస్తే చాలా కార్పొరేషన్లు కేవలం కళ తప్పిన రాజకీయ నాయకులను చైర్మన్లుగా నియమిండానికి మాత్రమే ఏర్పాటు చేసినట్లు ఉన్నాయని విమర్శించింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారం పడుతోందని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు ఎఫ్‌జీజీ కార్యదర్శి పద్మనాభరెడ్డి లేఖరాశారు. కార్పొరేషన్లు, డెవలప్‌మెంట్ అథా రిటీల పనితీరు ఎప్పుడు, ఎవరూ కూడా విశ్లేషణ చేయలేదని, కొన్ని అయితే శాఖల పనిని డూప్లికేట్ చేయగా, మరికొన్ని ఏ పనీ లేకుండా ఉన్నాయని ఆరోపించారు. కార్పొరేషన్ చైర్మన్లకు జీతాలు, కార్యాలయం, తగిన సిబ్బంది, ప్రభుత్వ వాహనం, డ్రైవర్, వారి జీతభత్యాలతో రూ.2 కోట్ల వరకు ప్రజాధనం వృథా అవుతోందని తెలిపారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని పని లేని కార్పొరేషన్లను మూసేయా లని, ఎలాంటి కార్పొరేషన్లు నెలకొల్పవద్దని సీఎస్‌కు రాసిన లేఖలో పద్మనాభరెడ్డి కోరారు.

మైక్రోసాఫ్ట్ హ్యాకథాన్‌లో అగ్రికల్చర్ హబ్‌కు తొలిస్థానం

డిజిటల్, క్లౌడ్ టెక్నాలజీలపై లక్షమంది డెవలపర్లకు మైక్రోసాఫ్ట్ శిక్షణ

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మరో ఘనతను సాధించింది. 'ఫ్యూచర్ రెడీ ఛాంపియన్స్ ఆఫ్ కోడ్' పేరుతో ఏకంగా లక్ష మంది డెవలపర్లకు డిజిటల్, క్లౌడ్ టెక్నాలజీలపై శిక్షణ పూర్తి చేసింది. వీరందరికీ మైక్రోసాఫ్ట్ నుంచి సర్టిఫికెట్లను అందజేయనున్నారు. 2022 డిసెంబరులో మొదలైన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్న కంపెనీల ఆధ్వర్యంలో నైపుణ్యాలలో శిక్షణ మొదలుపెట్టారు. ఇందులో పాల్గొన్న డెవలపర్లు 'ఇన్నొవేట్ ఫర్ ఇండియాస్ గ్రోత్'' పేరుతో నిర్వహించిన హ్యాకథాన్‌లోనూ భాగస్వాములయ్యారు. మైక్రోసాఫ్ట్ అజ్యూర్ ప్లాట్‌ఫామ్ సాయంతో స్మార్ట్ సిటీ, సుస్థిర సాఫ్ట్‌వేర్, ఇండస్ట్రీ ఇన్నొవేషన్ వంటి రంగాల్లోని సమస్యలకు వినూత్నమైన పరిష్కారాలు ఆవిష్కరించారు. ఈ హ్యాకథాన్‌లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో, ఇండస్‌నెట్‌లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. జనవరి ఐదవ తేదీన బెంగళూరులో నిర్వహించనున్న ఫ్యూచర్ రెడీ టెక్నాలజీ సమ్మిట్‌లో వీరికి నగదు బహుమతులు అందించనున్నారు.

విప్రో, ఇండస్‌నెట్‌లకు ద్వితీయ, తృతీయ స్థానాలు

మైక్రోసాఫ్ట్ నిర్వహించిన హ్యాకథాన్‌లో టీసీఎస్ ఉద్యోగి అంబరీష్ గంగూలీ సిద్ధం చేసిన అగ్రికల్చర్ హబ్ అప్లికేషన్‌కు తొలిస్థానం లభించింది. అజ్యూర్ కాగ్నిటివ్ సర్వీసెస్, కృత్రిమమేధలను ఉపయోగించుకుని రైతులకు అన్ని రకాల సాయం అందించేందుకు ఈ అగ్రికల్చర్ హబ్‌ను డిజైన్ చేశారు. ఉద్యోగుల ఉత్పాదకత పెంచేందుకు, ఉద్యోగులతో మరింత సులభంగా సంప్రదింపులు జరిపేందుకు అవసరమైన టెక్నాలజీలను సిద్ధం చేసిన విప్రో బృందం రెండోస్థానంలో నిలవగా వాణిజ్య వాహనాల ఆనుపానులను తెలుసుకునేందుకు స్మార్ట్ ట్రాకింగ్ సిస్టమ్‌ను తయారు చేసిన ఇండస్‌నెట్ మూడోస్థానాన్ని సాధించింది.

ముఖ్య కార్యదర్శులుగా ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లు

సీఎస్ సోమేశ్‌కుమార్ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: సీనియర్ ఐఏఎస్ అధికారులు సందీప్‌కుమార్ సుల్తానియా, అనితా రాజేంద్రలకు ముఖ్య కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. 1998 బ్యాచ్‌కు చెందిన ఈ ఇద్దరు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శిగా ఉన్న సందీప్ కుమార్ సుల్తానియాకు ముఖ్య కార్యదర్శిగా పదోన్నతి కల్పించి.. అదే శాఖలో కొనసాగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న అనిత రాజేంద్రకు పదోన్నతి కల్పిస్తూ అక్కడే అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విశ్వవేదికపై చెదరని ఖ్యాతి ఓయూ సొంతం

- వందేళ్ల చరిత్రే ఉస్మానియా ఘనత
- అంతర్జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు
- ఉద్యమాల గడ్డ ఉద్యోగాల అడ్డాగా మారింది.. వేలాదిమందికి ఉద్యోగావకాశాల కల్పన
- జీఏఎం–2023లో ఉస్మానియా వర్సిటీ వైస్ చాన్స్‌లర్
- అపూర్వ కలయికగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఉస్మానియా యూనివర్సిటీ గ్లోబల్ అలుమ్ని మీట్-2023'లో మాట్లాడుతున్న సీవీ ఆనంద్. చిత్రంలో బుర్రా వెంకటేశం, శేఖర్ కమ్ముల. (ఇన్‌సెట్‌లో) వర్సిటీ వైస్ చాన్స్‌లర్ రవీందర్

సాక్షి, హైదరాబాద్: వందేళ్లు దాటిన మహోన్నత చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం తనకు తానే ఒక బ్రాండ్ ఇమేజ్ అని, ప్రపంచ ప్రసిద్ధి చెందిన విశ్వవిద్యాలయాల్లో చెక్కుచెరదరని స్థానం కలిగి ఉందని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.రవీందర్ అన్నారు. గతేడాది రూపొందించిన ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాల యాల జాబితాలో ఉస్మానియా 22వ స్థానంలో ఉందని చెప్పారు. ఇటీవల వరకు ఉద్యమాల గడ్డగా ఉన్న ఉస్మానియా వర్సిటీ ఇప్పుడు ఉద్యోగాల అడ్డాగా మారిందని పేర్కొ న్నారు. 'ఉస్మానియా యూనివర్సిటీ గ్లోబల్ అలుమ్ని మీట్–2023' వేడుకలు మంగళవారం వర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మినారాయణ స్వాగతోపన్యా సం చేశారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ వేడుకలలో పాల్గొనేందుకు దేశ, విదేశాల్లో స్థిరపడిన వేలాదిమంది 'ఉస్మానియన్స్' తరలివచ్చారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ టీచింగ్, లెర్నింగ్ మెథడ్స్, రీసెర్చ్ రంగంలో అత్యున్నత ప్రమాణాలను అభి వృద్ధి చేసినట్లు, అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి నట్లు పేర్కొన్నారు. ఇటీవల ఓయూ నిర్వహించిన 'నిపుణ'కార్యక్రమంలో 250 క్యాంపస్‌లు పాల్గొన్నా యని, 55 వేలమంది విద్యార్థులు హాజరయ్యారని, సుమారు 16 వేలమందికి ఉద్యోగాలు లభించా యని వివరించారు. ఉస్మానియా ఫౌండేషన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వర్సిటీ పూర్వ విద్యా ర్థులను ఒక వేదికపైకి తీసుకురాగలిగినట్లు చెప్పా రు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వవిద్యా ర్థుల సహాయ సహకారాలతో అనేక అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టినట్లు వివరించారు. కార్య క్రమంలో ఆయన ఉస్మానియా టీవీని లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం 46 చానళ్లతో త్వరలోనే ప్రత్యక్ష ప్రసారాలు ప్రారంభం కానున్నట్లు చెప్పారు.

చదువులమ్మ చెట్టు నీడలో...

పూర్వవిద్యార్థుల ప్యానెల్ సమావేశంలో బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సినీ దర్శకులు శేఖర్ కమ్ముల, ఫ్యూజీ సీఈవో మనోహర్‌రెడ్డి, ఓఎస్‌డీ రాజశేఖర్ వర్సిటీతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎక్కడో నల్లమల అటవీ ప్రాంతంలో పుట్టి పెరిగిన తనను ఉస్మానియా కన్నతల్లిలా చేరదీసి ఆదరించిందని చెప్పారు. ఆర్ట్స్ కళాశాలలో 1989–91లో ఎంఏ ఎకనామిక్స్ చదువుకున్న తాను ఉస్మానియన్‌గా చెప్పుకొనేందుకు గర్విస్తున్నానని సీవీ ఆనంద్ అన్నారు. ఉస్మానియా వర్సిటీకి సైతం అలుమ్నిలు బలమైన వెన్నుదన్నుగా నిలవాలని బుర్ర వెంకటేశం అభిప్రాయపడ్డారు. శేఖర్ కమ్ముల మాట్లాడుతూ ఉస్మానియా గాలిలోనే ఒక వైబ్రేషన్ ఉందన్నారు. అమ్మకు, ఆవకాయకు ప్రత్యేకమైన బ్రాండ్ ఇమేజ్ అవసరం లేనట్లుగానే ఉస్మాని యాకు అవసరం లేదన్నారు, ఉస్మానియా ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ దేవరకొండ, సీఏబీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ తదితరులు ప్రసంగించారు.

ఆ దాడి వెనుక తెలంగాణ మావోలు!

- ఛత్తీస్‌గఢ్ టేకల్‌గుడియం ఘటనలో 23మందిపై ఎన్‌ఐఏ చార్జ్‌షీట్
- ఉమ్మడి వరంగల్‌కు చెందిన 8మంది మావోయిస్టుల నేతలపై అభియోగాలు
- ఆ ఘటనలో 22మంది పోలీసుల మృతి, 35మందికిపైగా గాయాలు
- చర్చనీయాంశంగా మారిన ఎన్‌ఐఏ చార్జ్‌షీట్



సాక్షిప్రతినిధి, వరంగల్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా టార్రెమ్ పోలీస్‌స్టేషన్ పరిధి టేకల్‌గుడియం సమీపంలో పోలీసులపై జరిగిన దాడి ఘటన వెనుక తెలంగాణకు చెందిన మావోయిస్టు నేతలే కీలకంగా వ్యవహరించారని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) తేల్చింది. ఈ ఘటనకు సూత్రధారులుగా 23మంది పేర్లను పేర్కొన్న ఎన్‌ఐఏ.. తెలంగాణ జిల్లాలకు చెందిన ఎనిమిది మంది పేర్లను చార్జిషీట్‌లో చేర్చింది. 2021 ఏప్రిల్ 3న జరిగిన ఈ దాడి ఘటనలో డీఆర్‌జీ, కోబ్రా, సీఆర్‌పీఎఫ్‌లకు చెందిన పోలీసులు 22మంది మృతి చెందగా, 35మందికిపైగా గాయపడ్డారు. సుమారు 21 నెలలపాటు విచారణ జరిపిన ఎన్‌ఐఏ అధికారులు... దాడిలో 350 నుంచి 400 మంది వరకు సాయుధ మావోయిస్టులు పాల్గొన్నప్పటికీ కేసులో (ఆర్‌సీ–02/2021/ఎన్‌ఐఏ/ఆర్‌పీఆర్) 23మందిపైన చార్జిషీట్‌ను దాఖలు చేశారు.

సంచలనం కలిగించిన తారెం ఘటన

పోలీస్ సాయుధ బలగాలపై మెరుపుదాడి చేసిన ఆ ఘటన కేసును మొదట బీజాపూర్ జిల్లాలోని టార్రెమ్ పోలీస్‌స్టేషన్ ఎఫ్‌ఐఆర్ నం.06/2021 ప్రకారం నమోదు కాగా, తర్వాత ఎన్‌ఐఏ ద్వారా 2022 జూన్ 5వ తేదీన తిరిగి నమోదు చేశారు. భద్రతా దళాలు సీఆర్‌పీఎఫ్, కోబ్రా, డీఆర్‌జీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసులపై బారెల్ గ్రెనేడ్ లాంచర్(బీజీఎల్)లు, ఆటోమేటిక్ ఆయుధాలతో కాల్పులు జరిపి రాకేశ్వర్ సింగ్ మన్హాస్ అనే కోబ్రా జవాన్‌ను కూడా అపహరించారు. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది.

తెలంగాణ అగ్రనేతలే సూత్రధారులు...

21 నెలల విచారణ తర్వాత ఎన్‌ఐఏ తన దర్యాప్తులో దాడి వెనుక సీపీఐ(మావోయిస్ట్) సీనియర్ నేతల పాత్ర ఉందని తేల్చింది. ఐపీసీలోని సెక్షన్లు– 120 రెడ్‌విత్/302 – 307, 396, 149, 121 మరియు 121ఎలతో పాటు భారతీయ ఆయుధ చట్టం, 1959లోని సెక్షన్లు– 25(1ఏ) – 27, ఈ చట్టం 1908లోని సెక్షన్ – 3, 4 – 6 మరియు సెక్షన్లు– 16, 18, 18బి, 20, యుఏ(పీ) చట్టం, 1967లోని 38ల కింద కేసులు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఇందులో కేంద్ర కమిటీ సలహాదారుడు ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతితోపాటు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబళ్ల కేశవరావు అలియాస్ గంగన్న, కేంద్ర నాయకులు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్, మల్లోజుల వేణుగోపాలరావు అలియాస్ సోను, సుజాత అలియాస్ పోతుల కల్పన (మల్లోజుల కోటేశ్వర్‌రావు భార్య), ఉమ్మడి వరంగల్‌కు చెందిన సాగర్ అలియాస్ అన్నే సంతోష్, రఘు రెడ్డి అలియాస్ వికాస్, నిర్మల అలియాస్ నిర్మలక్కలు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పొడియం హిద్మా అలియాస్ హిడ్మన్న, మద్నా అలియాస్ జగ్గ దాదాలతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర, దండకారణ్యం, ఏరియా కమిటీలకు చెందిన 15 మంది పేర్లను ఎన్‌ఐఏ ప్రధానంగా పేర్కొంది.

నేడు స్లీపర్ బస్సులు ప్రారంభం

తొలివిడతగా 4 స్లీపర్, మరో 6 స్లీపర్ కమ్ సీటర్ బస్సులను ప్రవేశపెట్టనున్న టీఎస్‌ఆర్టీసీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నాన్ ఏసీ స్లీపర్ బస్సులను తొలిసారి అందుబాటులోకి తీసుకువ స్తోంది. మొదటి విడతలో 4 స్లీపర్, మరో 6 స్లీపర్ కమ్ సీటర్ బస్సులను ప్రవేశపెట్టనుంది. ప్రైవేట్ బస్సులకు దీటుగా అత్యాధునిక హంగులతో రూపొందించిన ఈ బస్సులు బుధవారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్–కాకినాడ, హైదరాబాద్– విజయవాడ మార్గాల్లో అద్దె ప్రతిపాదికన ఆర్టీసీ ఈ బస్సులను నడపనుంది. హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీ బస్టాప్ దగ్గర బుధవారం సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమంలో సంస్థ చైర్మన్, బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ వీసీ సజ్జనర్ ఈ కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభించనున్నారు.

బస్సుల వేళలు....

కాకినాడ వైపు వెళ్లే బస్సులు హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్ నుంచి ప్రతీ రాత్రి 07.45, 8.30 గంటలకు బయల్దేరుతాయి. కాకినాడ నుంచి తిరిగి రాత్రి 07.15, 07.45 గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరుతాయి. విజయవాడ వైపు వెళ్లే బస్సులు ప్రతీరోజు మియాపూర్ నుంచి ఉదయం 9.30, 10.45, 11.45, రాత్రి 9.30, 10.15, 11.15 గంటలకు బయల్దేరుతాయి. విజయవాడ నుంచి తిరిగి హైదరాబాద్‌కు ఉదయం 10.15,11.15 మధ్యాహ్నం 12.15 గంటలకు అర్ధరాత్రి 12.00, 12.45 గంటలకు బయల్దేరుతాయి.

ప్రవీణ్... ఎ డ్రగ్ డిస్ట్రిబ్యూటర్!!

- నగరం నుంచి ఏజెన్సీకి పెట్రోలియం ఈథర్ సరఫరా
- హష్ ఆయిల్ తయారీలో ఈ రసాయనం వినియోగం
- అది తీసుకువచ్చి స్థానికంగా ఉన్న పెడ్లర్లకు విక్రయం
- సిటీతో పాటు బెంగళూరులోనూ నిందితునికి నెట్‌వర్క్
- మొత్తం నలుగురిని పట్టుకున్న హెచ్–న్యూ బృందం



సాక్షి, హైదరాబాద్: నగరంలోని కెమికల్ షాపుల నుంచి అక్రమంగా పెట్రోలియం ఈథర్ ఖరీదు చేయడం... దీన్ని విశాఖ ఏజెన్సీకి తరలించి హష్ ఆయిల్ తయారీదారులకు విక్రయించడం... వాళ్ల నుంచి హష్ ఆయిల్ కొనుగోలు చేసి హైదరాబాద్‌తో పాటు బెంగళూరులో ఉన్న పెడ్లర్లకు సరఫరా చేయడం... కొన్నాళ్లుగా ఈ పంథాలో రెచ్చిపోతున్న 'డ్రగ్ డిస్ట్రిబ్యూటర్' ఎన్.ప్రవీణ్ కుమార్ హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) అధికారులకు చిక్కాడు. ఇతడితో పాటు ముగ్గురు పెడ్లర్స్‌ను పట్టుకు న్నట్లు డీసీపీ చక్రవర్తి గుమ్మి మంగళవారం వెల్లడించారు.

మూడేళ్ల క్రితం పెడ్లర్‌గా మొదలెట్టి...

కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన ప్రవీణ్ కుమార్ దాదాపు మూడేళ్ల క్రితం గంజాయి పెడ్లర్‌గా మారాడు. ఇతడికి విశాఖ ఏజెన్సీలోని గూడెం మాడుగుల మండలం అలగాం ప్రాంతానికి చెందిన గంజాయి పండించే గిరిజనులతో పరిచయమైంది. కొన్నాళ్లుగా వాళ్లు గంజాయి నుంచి తీసే హష్ ఆయిల్ ఉత్పత్తి చేస్తున్నారు. దీంతో ప్రవీణ్ అదే దందా చేశాడు. హష్ ఆయిల్ తయారీకి పెట్రోలియం ఈథర్ అవసరం. ఇది ఏజెన్సీలో దొరకట్లేదనే విషయం తెలుసుకున్న ఇతగాడు తాను సరఫరా చేస్తానంటూ గిరిజనులతో ఒప్పందం చేసుకున్నాడు. దాన్ని వినియోగించి తనకు హష్ ఆయిల్ తయారు చేసి ఇవ్వాలంటూ షరతు పెట్టాడు.

రెండు ఏజెన్సీల నుంచి అక్రమంగా...

పెట్రోలియం ఈథర్‌ను పారిశ్రామిక అవసరాల కోసం మాత్రమే విక్రయించాలి. అదీ అధీకృత పత్రాలు సేకరించిన తర్వాతే అమ్మాలి. అయితే నగరంలోని కూకట్‌పల్లి ప్రశాంతినగర్‌కు చెందిన నర్మద ట్రేడర్స్, మహాలక్ష్మీ కెమికల్ ట్రేడర్స్ ఈ నిబంధనను తుంగలో తొక్కాయి. ఎలాంటి పత్రాలు లేకుండా ప్రవీణ్‌కు భారీ మొత్తంలో విక్రయిస్తున్నాయి. దీని రవాణా కోసం ఓ వాహనం ఖరీదు చేసిన ఇతను డ్రైవర్‌ను నియమించుకున్నాడు. ఈథర్‌ను ఇక్కడ లీటర్ రూ.100కు కొని, అలగాం తరలించి అక్కడి వారికి రూ.400కు అమ్ముతున్నాడు. ఇలా ఇప్పటి వరకు ఈ రెండు ఏజెన్సీల నుంచి 1400 లీటర్లు కొనుగోలు చేశాడు.

హష్ ఆయిల్ 'డిస్ట్రిబ్యూటర్'గా మారి...

పెట్రోలియం ఈథర్‌తో తయారు చేసిన హష్ ఆయిల్‌ను ప్రవీణ్ గిరిజనుల నుంచి తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నాడు. లీటర్ గరిష్ఠంగా రూ.30 వేలకు కొని, తీసుకువచ్చి హైదరాబాద్‌లోని 15 మంది పెడ్లర్స్‌తో పాటు బెంగళూరులో ఉన్న వారికీ సరఫరా చేస్తున్నాడు. నగరంలో లీటర్ రూ.70 వేల నుంచి రూ.80 వేలకు, బెంగళూరులో రూ.1.2 లక్షలు నుంచి రూ.1.4 లక్షలకు విక్రయిస్తున్నాడు. చిన్న చిన్న డబ్బాల్లో ప్యాక్ చేసి డబ్బాల్లో అమ్మితే ప్రవీణ్‌కు లీటర్‌కు రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఇలా అటు ఇథనాల్, ఇటు హష్ ఆయిల్ రెండింటి దందా చేస్తూ కొన్నాళ్లుగా రెచ్చిపోతున్న ఇతడికి గోవాలో కూడా నెట్‌వర్క్ ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

చిక్కడపల్లిలో సరఫరా చేస్తుండగా...

ప్రవీణ్ కుమార్‌కు నగరంలో ఉన్న పెడ్లర్లలో పటాన్‌చెరు, కూకట్‌పల్లి ప్రాంతాలకు చెందిన పి.మోహన్ యాదవ్, పి.కళ్యాణ్, బి.సురేష్ కీలకం. ఇటీవల ఏజెన్సీ నుంచి హష్ ఆయిల్ తెచ్చిన ఇతడు దాన్ని చిన్న డబ్బాల్లో ప్యాక్‌చేసి పెడ్లర్స్‌కు సరఫరా చేస్తున్నాడు. మంగళవారం చిక్కడపల్లి వద్దకు ఈ ముగ్గురికీ ఇచ్చేందుకు 60 డబ్బాలు తీసుకువచ్చాడు. దీనిపై హెచ్–న్యూ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్‌రెడ్డికి సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్సై సి.వెంకటరాములు నేతృత్వంలోని బృందం వలపన్ని నలుగురినీ పట్టుకుంది. వీరి నుంచి హష్ ఆయిల్‌తో పాటు 400 లీటర్ల ఈథర్, వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పెట్రోలియం ఈథర్‌ను విక్రయించిన కూకట్‌పల్లి ప్రశాంతినగర్‌కు చెందిన నర్మద ట్రేడర్స్, మహాలక్ష్మీ కెమికల్ ట్రేడర్స్‌పై కేసులు నమోదు చేశారు.

ప్రవీణ్‌పై గతంలోనూ కేసులు

కాగా, ప్రవీణ్‌పై గతంలో రెండు కేసులు నమోదైనట్టు పోలీసులు గుర్తించారు. 2015లో కూకట్‌పల్లిలో ఓ చిన్నారిని కిడ్నాప్ చేసి డబ్బు డిమాండ్ చేసిన ముఠాలో సభ్యుడిగా కేసు నమోదైంది. 2020లో కూకట్‌పల్లిలోనే గంజాయి అమ్ముతూ పట్టుబడిన కేసు విచారణలో ఉంది.

ఆర్బీకేల్లో 7,384 పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: విత్తు నుంచి విక్రయం వరకు అన్నదాతలకు విశేష సేవలందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆర్బీకేల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం చర్యలు చేపట్టింది. 660 మండలాల్లో 10,778 ఆర్బీకేలు ఏర్పాటు చేయగా వీటిలో 14,347 మంది సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో ఇంకా శాఖల వారీ ఖాళీగా ఉన్న 7,384 పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ఆర్బీకేల ఏర్పాటు సమయంలో మంజూరు చేసిన పోస్టుల సంఖ్యను బట్టి శాఖల వారీగా ఖాళీలను గుర్తించారు. అత్యధికంగా 5,188 పశుసంవర్ధక సహాయక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి తర్వాత 1,644 ఉద్యాన, 467 వ్యవసాయ, 63 మత్స్య, 22 పట్టు సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్టుగా లెక్కతేల్చారు. ఏపీపీఎస్సీ ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటికి త్వరలో నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ పోస్టులను కూడా భర్తీ చేస్తే ఆర్బీకేల్లో పనిచేసేవారి సంఖ్య 21,731కి చేరుతుంది.

రోడ్ షోలు, సభల నిషేధం మంచిదే

బీజేపీ ఎంపీ జీ.వి.ఎల్.నరసింహారావు



ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): రాష్ట్రంలో రోడ్ షోలు, సభలపై ప్రభుత్వం నిషేధం విధించడం మంచి పరిణామమని బీజేపీ ఎంపీ జీ.వి.ఎల్.నరసింహారావు చెప్పారు. విశాఖలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రోడ్ షోలు, సభలను నిషేధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు సభల్లో చోటుచేసుకున్న విషాదాల నేపథ్యంలో ప్రజలకు మంచి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుని ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ పేరుతో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏపీ ప్రజలను ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజనప్పుడు, అనేక సందర్భాల్లో కేసీఆర్ ఏపీ ప్రజలను అవమానించారని చెప్పారు.



రాజమహేంద్రవరంలో నిర్వహించిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

మరో మాట నిలబెట్టుకున్నా

- రాజమహేంద్రవరంలో పెన్షన్ వారోత్సవాల్లో ముఖ్యమంత్రి జగన్
- దేశంలో ఈ స్థాయిలో పెన్షన్ డబ్బులిస్తున్న ఏకైక రాష్ట్రం మనదే



> పేదలకు ఇచ్చిన మరో మాటను నిలబెట్టుకున్నా. అవ్వాతాతలు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు.. అర్హులందరికీ దశలవారీగా పెన్షన్ పెంచుకుంటూ పోతానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. పింఛన్లు రూ.2,750 నుంచి రూ.10 వేల వరకు దేశంలో ఎక్కడైనా ఉన్నాయా? మీ బిడ్డ ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో మాత్రమే ఉన్నాయి.
>
> – ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాజమహేంద్రవరం నుంచి సాక్షి ప్రతినిధి: 'ఇవాళ రాష్ట్రంలో జరుగుతోంది కులాల యుద్ధం కాదు.. క్లాసుల మధ్య యుద్ధం. ఒకవైపు పేదవాడు మరోవైపు పెత్తందారీ వ్యవస్థ మధ్య జరుగుతున్న యుద్ధమిది. పేదల వ్యతిరేక శక్తులతో పోరాటం చేస్తున్నాం. జాగ్రత్తగా ఆలోచన చేయండి. విషయాన్ని గుర్తించాలి. పొరబాటు జరిగితే పేదవాడు నాశనమైపోతాడనేది మరిచిపోవద్దు. కుట్రలు, కుతంత్రాలతో వస్తున్న చంద్రబాబు, దత్తపుత్రుడు, గజదొంగల ముఠా విషయంలో అప్రమత్తంగా ఉండాలి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి, దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పింఛన్ లబ్ధిదారులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. 64,06,240 మంది లబ్ధిదారులకు రూ.1,765.04 కోట్ల నమూనా చెక్‌ను ఎలుగొండ చెల్లాయమ్మకు అందచేశారు. గత సర్కారు అరకొరగా 39 లక్షల మందికి మాత్రమే పింఛన్లు ఇస్తే ఇప్పుడు ఏకంగా 64.06 లక్షల మందికి పెన్షన్లు అందచేస్తున్నామని సీఎం జగన్ చెప్పారు. చంద్రబాబు పింఛన్ల కోసం నెలకు రూ.400 కోట్లిస్తే ఇప్పుడు నెలకు రూ.1,765 కోట్లకుపైగా వ్యయం చేస్తూ అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో ప్రయోజనం చేకూరుస్తున్నట్లు తెలిపారు. నాడు కత్తిరింపులే లక్ష్యమని, జన్మభూమి కమిటీలకు 3 నెలల పెన్షన్ లంచమిస్తేనేగానీ మంజూరు కాని దుస్థితి నెలకొందన్నారు. గత సర్కారు అరకొరగా రూ.వెయ్యి పెన్షన్ ఇస్తే ఇప్పుడు నెలకు రూ.2,750 చొప్పున ఇస్తూ మిగిలిపోయిన అర్హులను సైతం గుర్తించి ఏటా రెండుసార్లు లబ్ధి చేకూరుస్తున్నట్లు చెప్పారు. గత మూడున్నరేళ్లలో ఒక్క పింఛన్ల కోసమే రూ.62,500 కోట్లు వెచ్చించామన్నారు. పింఛన్ల పెంపు వారోత్సవాల సందర్భంగా రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో భారీగా హాజరైన జనసందోహాన్ని ఉద్దేశించి జగన్ ప్రసంగించారు. ఆ వివరాలివీ..

39 లక్షల పింఛన్లు ఎక్కడ?.. 64 లక్షల పింఛన్లు ఎక్కడ?

2019 ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు పెన్షన్ కేవలం రూ.వెయ్యి మాత్రమే ఇచ్చేవారు. చంద్రబాబు పాలనలో పెన్షన్లు ఎలా కోత పెట్టాలా? అనే ఆలోచన చేశారు. నాడు ఎవరైనా చనిపోతేనే మరొకరికి పెన్షన్ మంజూరు చేసే దుస్థితి. పెన్షన్ కావాలంటే జన్మభూమి కమిటీల దగ్గరకు వెళ్లాల్సిందే. అరకొరగా ఇచ్చే పింఛన్లు సైతం మూడు నెలల సొమ్మును లంచంగా ఇస్తే కానీ మంజూరయ్యేవి కావు. గత సర్కారు దిగిపోయే ఆరు నెలల ముందు వరకు కేవలం 39 లక్షల మందికి మాత్రమే పింఛన్లు ఇవ్వగా మీ బిడ్డ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 64.06 లక్షల మందికి పెన్షన్లు అందచేస్తోంది. గత సర్కారు హయాంలోని 39 లక్షలు ఎక్కడ? మన ప్రభుత్వం ఇస్తున్న 64 లక్షల పెన్షన్లు ఎక్కడ? మీరే ఆలోచన చేయండి.

మనుషులను చంపి మానవతావాదినంటాడు

కందుకూరులో ఎక్కువ మంది వచ్చినట్లు చూపించేందుకు విశాలమైన ప్రదేశంలో మీటింగ్ జరగనివ్వకుండా ముందుకు తీసుకెళ్లి సందులోకి ప్రజలను తరలించారు. ఆ తర్వాత ఆ పెద్ద మనిషి తన వాహనాన్ని అక్కడికి తీసుకెళ్లడం ద్వారా 8 మందిని చంపేసిన పరిస్థితి చూశాం. తన డ్రోన్ షాట్స్, ఫొటో షూట్ కోసం 8 మందిని చంపేశాడు. ఆ వెంటనే ఆ పెద్దమనిషి అక్కడే.. మౌనం పాటించాలంటాడు. పక్కనే ఉన్న ఆసుపత్రికి వెళ్లాలంటాడు. షూటింగ్ కోసం ఐదు నిమిషాల్లో ఆసుపత్రి నుంచి మళ్లీ తిరిగి వచ్చేశాడు. చనిపోయిన కుటుంబాలకు తానే చెక్కులు పంపిణీ చేశానంటాడు. తానే మనుషులను చంపేస్తాడు.. చనిపోయిన వారిపట్ల తాను ఒక మహోన్నత, మానవతావాదిలా మళ్లీ డ్రామాలాడుతున్నాడు.

చీరల పంపిణీ పేరుతో

ఇంత దారుణమైన రాజకీయాలు జరుగుతున్నా ఈనాడు రాయదు. ఆంధ్రజ్యోతి చూపించదు. టీవీ 5 అడగదు. దత్తపుత్రుడు అంతకన్నా ప్రశ్నించడు. పేదలను చంపేసి చివరికి టీడీపీ కోసం త్యాగం చేశారంటారు. చనిపోయిన వారిలో ఎస్సీలుంటే తన కోసం త్యాగం చేశారని దాన్ని కూడా వాడుకునే దారుణమైన ఆలోచనలు చేస్తాడు. ఈ పెద్ద మనిషి రక్త దాహం తీరక మళ్లీ గుంటూరులో సభ పెట్టాడు. కొత్త ఏడాది రోజు మరో ముగ్గురిని ఫొటో షూట్లు డ్రోన్ షాట్ కోసం బలి తీసుకున్న పరిస్థితిని మనమంతా చూశాం. తన సభకు ప్రజలు రారనే భయంతో చీరల పంపిణీ పేరుతో మరో ముగ్గురుని బలిగొన్నాడు.

బాబు బేఖాతరు!

- ఐదు రోజుల్లో 11 మంది మృతిచెందినా మారని తీరు
- నేటి నుంచి కుప్పంలో చంద్రబాబు మూడ్రోజుల పర్యటన

సాక్షి, అమరావతి/చిత్తూరు అర్బన్/కుప్పం: తన ప్రచారార్భాటం ప్రజల ప్రాణాలు హరిస్తున్నా ప్రతిపక్ష నేత చంద్రబాబు తీరు ఏమాత్రం మారడం లేదు. లేని జనాదరణను ఉన్నట్లుగా చూపించేందుకు ఆయన వేస్తున్న చీప్‌ట్రిక్స్‌తో కేవలం ఐదురోజుల వ్యవధిలోనే 11 మంది మరణించినా.. ఇంకా ఎంతోమంది గాయపడినా సరే 40 ఇయర్స్ ఇండస్ట్రీ చంద్రబాబు మనసు కరగడంలేదు. ప్రజల భద్రత కోసం రోడ్లపై సభలు, ర్యాలీలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీచేసినా సరే ఆయన బేఖాతరు చేస్తున్నారు. నిజానికి.. శాంతిభద్రతల దృష్ట్యా చిత్తూరు జిల్లా పలమనేరు డివిజన్ పరిధిలో కొన్ని నెలలుగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నాసరే పట్టించుకోవడంలేదు. చట్టానికి వ్యతిరేకంగా, నిబంధనలకు విరుద్ధంగా కుప్పంలో మూడ్రోజుల పర్యటన షెడ్యూల్‌ను ఖరారుచేశారు. అలాగే, ప్రభుత్వం తాజాగా ఇచ్చిన జీఓ ప్రకారం ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో సభలు నిర్వహించాలన్న పోలీసుల నోటీసుపైనా స్పందించలేదు. మూడ్రోజుల్లో నాలుగు రోడ్‌షోల నిర్వహణకు సిద్ధపడుతుండటం ద్వారా ఉద్రిక్త పరిస్థితులు సృష్టించి శాంతిభద్రతల విఘాతానికి ఉద్దేశపూర్వకంగా కుట్ర పన్నుతున్నారన్నది వారి చర్యలుబట్టి స్పష్టమవుతోంది.

టీడీపీకి నోటీసులు జారీచేశాం

పలమనేరు డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంది. రోడ్లపై సభలు, ర్యాలీలను నిషేధిస్తూ ప్రభుత్వం జీఓ జారీచేసింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు పర్యటన షెడ్యూల్‌లో మార్పులు చేయాలని సూచిస్తూ టీడీపీకి నోటీసులు జారీచేశాం. ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో సభల ఏర్పాటుకు అనుమతి కోరితే పూర్తిగా సహకరిస్తామని చెప్పాం. ఇప్పటివరకు టీడీపీ సమాధానం ఇవ్వలేదు. ప్రజల భద్రత కోసం చట్టాన్ని కచ్చితంగా అమలుచేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. అందుకు సహకరించాల్సిందిగా అందరినీ కోరుతున్నాం.

– రిశాంత్‌రెడ్డి, ఎస్పీ, చిత్తూరు జిల్లా

అన్ని పార్టీలకు ఒకటే నియమం

- రహదారులపై సభలు, రోడ్‌షోల నిర్వహణపై నిషేధం అన్ని పార్టీలకు వర్తిస్తుంది
- బీఆర్ఎస్ పోటీచేస్తే ఆహ్వానిస్తాం
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రహదారులపై బహిరంగ సభలు, రోడ్‌షోలను నిషేధిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు (జీవో) వైఎస్సార్‌సీపీతోపాటు అన్ని పార్టీలకు వర్తిస్తాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. అధికారంలో ఉన్న తమ వైఎస్సార్‌సీపీకి ఒకలా.. ప్రతిపక్షంలో ఉన్న వారికి మరోరకంగా నిబంధనలు పెట్టాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. ప్రజల ప్రాణాలను పరిరక్షించడమే ప్రభుత్వానికి ముఖ్యమని తేల్చిచెప్పారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రహదారులపై బహిరంగ సభలు, రోడ్‌షోలు నిషేధిస్తూ జీవో జారీచేయడానికి ప్రధాన కారణం టీడీపీ వైఖరేనని చెప్పారు. ఈ జీవోను ఉల్లంఘించి రహదారులపై సభ, రోడ్‌షో నిర్వహిస్తే తర్వాత పరిణామాలను వారే ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. గుంటూరులో చంద్రన్న సంక్రాంతి కానుకల ఆశ చూపి.. టోకెన్లు ఇచ్చి అమాయక పేద మహిళలను సభకు తీసుకొచ్చి.. అందరికీ సరుకులు పంపిణీ చేయకుండా టీడీపీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ ఎక్కడైనా పోటీచేసుకోవచ్చునని విలేకరుల ప్రశ్నకు సమాధానంగా సజ్జల చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పోటీచేస్తే ఆహ్వానిస్తామన్నారు. రాజకీయాల్లో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని సీఎం వైఎస్ జగన్ కోరుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్‌లో చేరబోతున్నది టీడీపీలో ఉన్న ఆ 23 మంది ఎమ్మెల్యేలా అని మరో ప్రశ్నకు సమాధానంగా ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకూడదన్నదే తమ అభిమతమని, దీనికి ఇతర పార్టీలు మద్దతు పలికితే మంచిపరిణామమేనని ఇంకో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నగర వార్తలు

ఔటర్‌పై అంబులెన్స్ సేవలు

ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద ట్రామాకేర్ సెంటర్‌లు

- ప్రమాద బాధితులకు క్షణాల్లో వైద్యసదుపాయం
- గతేడాది 1098 మందికి చికిత్సలు
- టెలిమెడిసిన్ ద్వారా వైద్య నిపుణుల పర్యవేక్షణ



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉన్న 158 కిలోమీటర్ల అవుటర్ రింగురోడ్డు పైన ప్రమాదాల నియంత్రణకు హెచ్ఎండీఏ అనేక చర్యలు చేపట్టింది. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్)ఆధ్వర్యంలో ఔటర్‌పైన ప్రతి 8 కిలోమీటర్‌లకు ఒక అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సు(ఏఎల్ఎస్) అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాట్లు చేశారు. అలాగే 16 ఇంటర్‌ఛేంజ్‌ల అత్యవసర వైద్యసేవల కోసం ట్రామాకేర్ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. ఈ ట్రామాకేర్ సెంటర్‌లలో గతేడాది 1098 మంది రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యసేవలను అందజేసినట్లు అధికారులు తెలిపారు. అపోలో, యశోద ఆసుపత్రులు ఈ అంబులెన్సులను, ట్రామాకేర్ సెంటర్‌లను నిర్వహిస్తున్నాయి. గత సంవత్సరం అందజేసిన సేవలకు సంబంధించిన వివరాలను అధికారులు తాజాగా విడుదల చేశారు. పెద్దఅంబర్‌పేట్, బొంగులూరు, తుక్కుగూడ, శంషాబాద్, టీఎస్‌పీఏ ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద అపోలో ఏఎల్ఎస్ అంబులెన్సులు ఉండగా, తారామతిపేట్, రావిర్యాల, పెద్ద గోల్కొండ ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద ట్రామాకేర్ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. కోకాపేట్, పటాన్‌చెరు, దుండిగల్, శామీర్‌పేట్, ఘట్కేసర్‌లలో యశోద ఆసుపత్రికి చెందిన ఏఎల్ఎస్ అంబులెన్సులు 24 గంటల పాటు సేవలందజేస్తున్నాయి. కొల్లూరు,సుల్తాన్‌పూర్,మేడ్చెల్‌లో ట్రామాకేర్ సెంటర్‌లను నిర్వహిస్తున్నారు.

ప్రతి ట్రామాకేర్ సెంటర్‌లో 2 పడకలు, అవసరమైన వైద్య పరికరాలు, ఆక్సిజన్ సిలిండర్, అత్యవసర ప్రాణాధార మందులు ఉంటాయి. అలాగే విపత్తు నివారణ కిట్‌లను కూడా అందుబాటులో ఉంచారు.మరోవైపు టెలిమెడిసిన్ సదుపాయం ద్వారా వైద్యనిపుణులు సలహాలు, సూచనలను,వైద్యసేవలను అందజేస్తారు.పారామెడికల్ సిబ్బందితో కూడిన అంబులెన్సులను అన్ని కీలకమైన కేంద్రాలలో అందుబాటులో ఉంచారు. ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని ట్రామాకేర్ సెంటర్‌లకు తరలించేవిధంగా ఈ అంబులెన్సులు సేవలను అందజేస్తాయి. ఈ వైద్య సేవలన్నీ పూర్తిగా ఉచితం.

ఏ నెలలో ఎంతమంది బాధితులకు వైద్యం లభించిందంటే...

జనవరి -66, ఫిబ్రవరి – 82, మార్చి – 92, ఏప్రిల్ -101, మే -120, జూన్ -101, జూలై- 76, ఆగస్టు – 125, సెప్టెంబర్ – 99, అక్టోబర్ -86, నవంబర్ -88, డిసెంబర్ – 62

మొత్తం 1098

జనవరి నుంచి డిసెంబర్ (2022) వరకు ఔటర్‌లోని ట్రామాకేర్ సెంటర్‌లలో అందజేసిన సత్వర వైద్యసేవలు...

ట్రామాకేర్ సెంటర్	సత్వర వైద్య సేవలు
పటాన్‌చెరు	79
దుండిగల్	143
శామీర్‌పేట్	85
ఘట్కేసర్	77
పెద్దఅంబర్‌పేట్	127
బొంగులూరు	55
తుక్కుగూడ	57
శంషాబాద్	91
టీఎస్‌పీఏ	157
కోకాపేట్	91
తారామతిపేట్	25
రావిర్యాల	3
పెద్దగోల్కొండ	9
కొల్లూరు	48
సుల్తాన్‌పూర్	39
మేడ్చల్	12

జాతీయ కవి సమ్మేళనానికి రామిరెడ్డి ఎంపిక

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్యం సాధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని గుంటూరు జిల్లా పెదపరిమి గ్రామానికి చెందిన ఎంవీ రామిరెడ్డి రాసిన అమృతోపనిషత్ కవితను తెలుగు భాష నుంచి ఎంపిక చేశారు. ఈ కవితను అన్ని భారతీయ భాషల్లోకి అనువదించి ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారం చేయనున్నారు. ఆకాశవాణి ఏటా నిర్వహించే జాతీయ కవి సమ్మేళనానికి తెలుగు భాష నుంచి రామిరెడ్డి ఎంపికయ్యారు. భారతీయ భాషలకు సంబంధించి 23 మంద కవితలను ఆకాశవాణి ఈనెల 10న ఢిల్లీలో రంగ్‌భవన్‌లో రికార్డు చేయనుంది. ఈనెల 25వ తేదీన ఆకాశవాణిలో ఈ కవితలు ప్రసారం కానున్నాయి.

ఈ నెల 8న ఉత్తర్ దక్షిణ్ జుగల్‌బందీ

సాక్షి, సిటీబ్యూరో: ప్రఖ్యాతిగాంచిన ఉత్తర్ దక్షిణ్ జుగల్‌బందీ శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహించడానికి బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్ వేదిక కానుంది. వివిధ్ ఆర్ట్స్, సూర్మండల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 8న ఆదివారం 12వ ఎడిషన్ సంగీత కచేరీని నిర్వహిస్తున్నారు. ఈ కచేరీలో ప్రముఖ వేణు విద్వాంసుడు పండిట్ ప్రవీణ్ గోడ్ఖిండితో పాటు కర్ణాటిక్ ఓకల్‌లో అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన మల్లాది బ్రదర్స్ విద్వాన్ రాంప్రసాద్, డా.రవి కుమార్‌లు తమ ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు మోహన్ హెమ్మడికి 'అనుపమ్ జీవిత సాఫల్య పురస్కారాన్ని' అందించనున్నారు. ఈ ప్రదర్శనలో ఆదిత్య కళ్యాణ్‌పూర్ (తబలా), విద్వాన్ బీవీఎస్ ప్రసాద్ (మృదంగం) తదితర కళాకారులు పాల్గొననున్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు నగర విద్యార్థులు



మోహిత్ కుమార్



వైశాలి

పంజగుట్ట: ఈ నెల 26వ తేదీన ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు చింతల్‌బస్తీ లోని ఖైరతాబాద్ ప్రభుత్వ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎన్‌సీసీలో జూనియర్ అండర్ ఆఫీసర్ (జేయూఓ) మోహిత్ కుమార్ మిశ్రా, సార్జంతో (ఎస్‌జీటీ) టి.శ్రీవైశాలిలు ఎంపికై నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేంద్ర కుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ పి.విజయ తెలిపారు. మోహిత్ కుమార్ బీకాం కంప్యూటర్స్ రెండవ సంవత్సరం చదువుతుండగా, వైశాలి బీజెడ్‌సీ రెండవ సంవత్సరం చదువుతోంది. న్యూఢిల్లీ రాజ్‌పథ్‌లో జరగనున్న గణతంత్ర వేడుకలకు ఎన్‌సీసీ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. ఎన్‌సీసీ కార్యక్రమాలైన ఫైరింగ్, మ్యాప్‌రీడింగ్, నేషనల్ ఇంటిగ్రేషన్, ఫ్లాగ్ ఏరియా, పెరేడ్, కల్చర్ పోటీల్లో అత్యధిక ప్రతిభ కనబర్చిన మోహిత్, వైశాలిలు ఈ అవకాశం దక్కించుకున్నారన్నారు.

ఆర్టీసీ బస్సులపై స్పెషల్ డ్రైవ్

– నేటి నుంచి నిర్వహించనున్న ట్రాఫిక్ కాప్స్

సాక్షి, సిటీబ్యూరో: సాధారణ ప్రజలకు, వాహనచోదకులకు ఇబ్బంది కలిగేలా, ప్రమాదహేతువుగా మారే ఉల్లంఘనలకు పాల్పడుతున్న ఆర్టీసీ బస్సులనూ ఉపేక్షించకూడదని నగర ట్రాఫిక్ విభాగం అధికారులు నిర్ణయించారు. గతేడాది వీటి ఉల్లంఘనలు, ప్రమాదాలకు దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక డ్రైవ్ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. బుధవారం నుంచి ఇది మొదలవుతుందని నగర ట్రాఫిక్ విభాగం అధికారులు మంగళవారం ప్రకటించారు. ఈ ఏడాది ప్రారంభం రోజేనే బోయిన్‌పల్లి ఠాణా పరిధిలో ఓ ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం ఇద్దరు వృద్ధుల ప్రాణాలు బలిగొందని, ఈ నేపథ్యంలోనే స్పెషల్ డ్రైవ్‌కు నిర్ణయించామని స్పష్టం చేశారు. గతేడాది ఆర్టీసీ బస్సులపై మొత్తం 3909 చలాన్లు జారీ అయ్యాయి. వీటిలో డేంజరస్ డ్రైవింగ్, ఓవర్ స్పీడింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి తీవ్రమైన ఉల్లంఘనలకు సంబంధించినవీ ఉన్నాయి. 2022లో ఆర్టీసీ బస్సుల వల్ల జరిగిన ప్రమాదాల్లో 41 మంది చనిపోగా... వీరిలో 21 మంది పాదచారులే. ట్రాఫిక్ అధికారులు 82 అవగాహన శిబిరాలు నిర్వహించి 4303 మంది ఆర్టీసీ డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వీటితో పాటు అనేక చర్యలు తీసుకున్నా కొందరు డ్రైవర్ల తీరులో మార్పు రాకపోవడంతో బుధవారం నుంచి స్పెషల్ డ్రైవ్‌కు నిర్ణయం తీసుకున్నారు.

క్రీడల మంత్రిని కలిసిన 'శాట్స్' కొత్త చైర్మన్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) కొత్త చైర్మన్‌గా డాక్టర్ ఇ. ఆంజనేయ గౌడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా మంగళవారం రాష్ట్ర ఎక్సైజ్ ,యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. క్రీడాభివృద్ధి, క్రీడా సంక్షేమ కార్యక్రమాల్లో మంత్రి ఆశీస్సులు, సహకారం ఉండాలని మంత్రిని కోరారు. 'శాట్స్' చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ గౌరవాన్ని ఇనుమడించేలా కృషి చేయాలని, క్రీడల్లో తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తెచ్చేలా క్రీడాప్రాధికార సంస్థను తీర్చిదిద్దాలని ఆంజనేయులు గౌడ్‌కు మంత్రి సూచించారు. గురువారం ఎల్బీ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో ఆంజనేయ గౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు.

ట్రాఫిక్ కంట్రోల్ చేసిన నిర్మాత సురేష్‌బాబు



బంజారాహిల్స్: సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు ఓ సామాన్య వ్యక్తిలా మారి జూబ్లీహిల్స్‌లోని ఫిలింనగర్ ప్రధాన రహదారిపై అడ్డదిడ్డంగా వస్తున్న వాహనాలను కంట్రోల్ చేస్తూ ట్రాఫిక్‌ను సజావుగా వెళ్లేలా చేశారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. సోమవారం రాత్రి ఈ దారిగుండా వెళ్తున్న సురేష్‌బాబు కారు ఆగిపోయింది. అడ్డదిడ్డంగా వాహనాలు వెళ్తుండటంతో అక్కడ ట్రాఫిక్ పోలీసులు ఎవరూ లేనట్లు గుర్తించిన సురేష్‌బాబు వెంటనే ఆయన తన కారు నుంచి కిందికి దిగి ట్రాఫిక్‌ను సజావుగా వెళ్లేలా చేశారు. తనకెందుకులే అని వెళ్లిపోకుండా అంత పెద్ద సినీ ప్రొడ్యూసర్ అయి ఉండగా కూడా రోడ్డుపైకి వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న సురేష్‌బాబును చూసి స్థానికులు కూడా సహకరించారు. ఈ వీడియోతో చూసిన ఎంతో మంది నిర్మాత సురేష్‌బాబును పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

కేకేతో ఏపీ బీఆర్ఎస్ నేతల భేటీ



భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, నాయకుడు రావెల కిషోర్‌బాబు మంగళవారం బంజారాహిల్స్‌లో రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కే.కేశవరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, దాసోజు శ్రవణ్ కూడా వారి వెంట ఉన్నారు. గంటసేపు వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారని తెలిసింది.

– బంజారాహిల్స్

క్లుప్తంగా...

5న యాదగిరిగుట్టలో విద్యుత్ బీసీ ఉద్యోగుల మహాసభ

ఎంపీ ఆర్.కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభను ఈ నెల 5న మధ్యాహ్నం 2 గంటలకు యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మహా సభకు జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, డిస్కంల సీఎండీలు జి.రఘుమారెడ్డి, ఎ.గోపాల్‌రావు, జాతీయ బీసీ నాయకుడు గుజ్జ కృష్ణ హాజరవుతారని తెలిపారు. విద్యుత్ బీసీ ఉద్యోగులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సంస్థల్లో ఇచ్చిన పదోన్నతులను హైకోర్టు ఉత్తర్వులు, ప్రభుత్వ ఆదేశానుసారం సమీక్షించి నష్ట పోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమా వేశంలో బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కోడెపాక కుమారస్వామి తదితర నాయకులు పాల్గొన్నారు

పూలేకు భారతరత్న ఇవ్వాలి

మంత్రి శ్రీనివాస్ గౌడ్



సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్ తదితరులు

హైదరాబాద్: బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం రవీంద్రభారతిలో బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పార్లమెంట్‌లో మహాత్మా జ్యోతీరావు పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని, జ్యోతీరావు పూలేకు భారతరత్న ఇవ్వాలని కోరారు. దేశంలో 60 శాతం ఉన్న బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లా డుతూ హైదరాబాద్‌లో పూలే స్మృతివనం ఏర్పాటు చేయాలని, అదేవిధంగా బీసీ భవన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వివిధ రంగాలలో రాణిస్తున్నటువంటి బీసీ మహిళలకు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు విక్రమ్ గౌడ్ సావిత్రీబాయి పూలే ఉత్సవ కమిటీ చైర్మన్ మనుమంజరి తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సరం సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ రాజమౌళి

పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టాలి

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య డిమాండ్




సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కృష్ణయ్య

ముషీరాబాద్: పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టి.. మహిళలకు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో మంగళవారం బీసీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి కృష్ణయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించినప్పుడే వారికి రాజ్యాధి కారం దక్కుతుందని స్పష్టం చేశారు. రాజ్య సభలో ఆమోదం పొందిన మహిళా బిల్లును లోక్ సభలో కూడా ప్రవేశపెట్టి పూర్తి చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దశలవారీగా మద్యపాన నిషేధం విధిస్తామని ప్రకటించి బెల్టు షాపులు ఎత్తివేశారని గుర్తు చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా స్పందించి మద్యపాన నిషేధం ప్రకటించాలని కృష్ణయ్య కోరారు.

మైనర్ మందుబాబులు

‘డిసెంబర్ 31’ రాత్రి ట్రాఫిక్ పోలీసుల డ్రంకెన్ డ్రైవింగ్ తనిఖీలు
మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కిన 1413 మంది

ఇలా దొరికిన వారిలో 21 ఏళ్ల లోపు వాళ్లూ పెద్ద సంఖ్యలోనే
నిబంధనల ప్రకారం వీరికి మద్యం సరఫరా సైతం నేరమే
ఆ కోణాన్ని పట్టించుకోని ట్రాఫిక్, శాంతిభద్రతల విభాగాలు



సాక్షి, హైదరాబాద్: నగరంలో కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్తూ జరిగిన ‘డిసెంబర్ 31’ వేడుకల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 1413 మంది హైదరాబాద్ పోలీసులకు చిక్కగా... వీరిలో మైనర్లు 22 మంది ఉన్నారు. రాచకొండలో 446 మంది పట్టుబడితే... మైనర్లు ఐదుగురు ఉన్నారు. సైబరాబాద్‌లోనూ ఇలాంటి సీనే. ఇక్కడే ఓ కీలక విషయాన్ని అటు ట్రాఫిక్, ఇటు శాంతిభద్రతల విభాగంతో పాటు ప్రత్యేక విభాగాలైన టాస్క్ ఫోర్స్, స్పెషల్ ఆపరేషన్ టీమ్‌లు మర్చిపోయాయి. అదే మైనర్లకు సైతం మద్యం లభించడం.

అక్కడితో ఆగిపోయిన సీన్

→ ఇలా పట్టుబడిన మందు‘బాబుల’ నుంచి ట్రాఫిక్ పోలీసులు అప్పటికప్పుడే వాహనం స్వాధీనం చేసుకుంటారు. వీరికి నిర్ణీత తేదీల్లో తల్లిదండ్రులు లేదా సంరక్షకుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తారు. ఆపై ఈ ‘నిషా’చరులపై కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేయడం ద్వారా న్యాయమూర్తి ముందు ప్రవేశపెడతారు. కేసు పూర్వాపరాలు, మద్యం మోతాదు, నడి పిన వాహనం... ఇలాంటి అనేక విషయాలను పరిగణనలోకి తీసుకునే న్యాయస్థానం జరిమానా లేదా జైలు శిక్ష లేదా రెండూ విధిస్తుంది. ఈ తంతు పూర్తయిన తర్వాత ఆ వ్యక్తికి లేదా సంరక్షకుడికి ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని తిరిగి ఇచ్చేస్తారు. ‘డిసెంబర్ 31’ నాడు చిక్కిన డ్రంక్ డ్రైవర్ల కథ కూడా అక్కడితోనే ముగిసిపోతోంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండల్లో ప్రతి ఏడాదీ ఇలానే జరుగుతోంది. కానీ...

వారికి మద్యం ఎలా వచ్చింది?

ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం 21ఏళ్ల కంటే తక్కువ ఉన్న వారికి మద్యం అమ్మకూడదు. వీరిని బార్లు, పబ్‌లలోకి అనుమతించడమూ నిషిద్ధమే. ‘డిసెంబర్ 31’న చేపట్టిన డ్రంక్ డ్రైవింగ్ పరీక్షల్లో పట్టుబడిన మైనర్లు వైన్ షాపులో ఖరీదు చేసుకుని తాగడమో, బార్‌కు వెళ్లడమో జరిగి ఉండాలి. వీటిలో ఏది జరిగినా ఆయా యాజమాన్యాలపై చర్య తీసుకోవాల్సిందే. 2016 నాటి చిన్నారి రమ్య ప్రమాదంతో పాటు నగరంలో అనేక యాక్సిడెంట్లకు మద్యం మత్తులో ఉన్న మైనర్లు కారణమయ్యారు. అలాంటి సందర్భాల్లో మాత్రమే పోలీసులు మద్యం ఎక్కడ నుంచి వచ్చిందనే అంశంపై దృష్టి పెట్టి హడావుడి చేస్తు న్నారు. డిసెంబర్ 31 నాటి డ్రంక్ డ్రైవర్ల విషయంలో మాత్రం ఈ విషయాన్ని పట్టించుకోవట్లేదు. ఇదే అనేక సందర్భాల్లో ఉల్లంఘన జరగడానికి కారణమవుతోంది.

కనిపెట్టడం పెద్ద కష్టం కాదు...

→ ‘డిసెంబర్ 31’న పట్టుబడిన మందుబాబుల్లో 21 ఏళ్ల లోపు వాళ్లకు మద్యం ఎవరు విక్రయించారో తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. వీళ్లు నిర్ణీత సమయంలో కచ్చితంగా ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో (టీటీఐ) జరిగే కౌన్సెలింగ్‌కు, ఆపై ట్రాఫిక్ పోలీసులు సూచించినప్పుడు కోర్టుకు రావాల్సిందే. ఆయా సందర్భాల్లో వారిని విచారించడం ద్వారా వారికి మద్యం ఎక్కడ నుంచి వచ్చింది? ఎక్కడ తాగారు? తదితర వివరాలు తెలుసుకోవచ్చు. ఇది తెలిసినా పోలీసులు నేరుగా చర్యలు తీసుకోలేరు. ఏదైనా సంస్థపై ఇలాంటి ఉల్లంఘనలకు సంబంధించి చర్యలు తీసుకోవాలంటే లైసెన్స్ ఇచ్చిన అథారిటీకే సాధ్యం. దీంతో ఆయా వివరాలను సీసీ కెమెరా ఫుటేజ్, లోకేషన్ వంటి ఆధారాలతో సహా ఎక్సైజ్ శాఖకు అందించి, లైసెన్సు రద్దు/సస్పెన్షన్ సహా చర్యలకు సిఫార్సు చేయవచ్చు. ఇలా చేస్తే మరోసారి ఉల్లంఘన, భవిష్యత్తులో ఘోర ప్రమాదాలు తప్పే అవకాశం ఉంది. అయినప్పటికీ పోలీసులకు ఈ అంశం పట్టట్లేదనే విమర్శలు ఉన్నాయి.

మైనర్ డ్రైవింగ్ కూడా తీవ్రమైనదే..

→ డ్రంక్ డ్రైవింగ్ చేస్తూ చిక్కిన మైనర్లకు సంబంధించి మరో కీలకాంశమూ ఉంది. మోటారు వాహనాల చట్టం ప్రకారం సాధారణంగా మైనర్లకు లైసెన్సులు జారీ చేయరు. దీంతో వీళ్లు వాహనం నడపకూడదు, మైనర్ డ్రైవింగ్ చేయడమే కాదు వారికి, లైసెన్సు లేని వారికి వాహనం ఇవ్వడం కూడా నేరమే. ఇలా చేసినందుకు వాహనం ఎవరి పేరుతో రిజిస్టరై ఉందో ఆ యజమానిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ‘డిసెంబర్ 31’న చిక్కిన మైనర్ల విషయంలోనూ ఈ విధానం పూర్తి స్థాయిలో అమలు కావట్లేదు.

కొత్త కార్పొరేషన్లు ఇవ్వొద్దు.. ప్రజాధనం వృథా చేయొద్దు

సీఎస్ సోమేశ్‌కు ఎఫ్‌జీజీ కార్యదర్శి పద్మనాభరెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖలకు కార్పొరేషన్ల చైర్మన్లను నియమించి ప్రజాధనం వృథా చేయొద్దని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) తెలిపింది. రాష్ట్రంలో కార్పొరేషన్లు, డెవలప్‌మెంట్ అథా రిటీలు కలిపి 70 వరకు ఉన్నాయని, కొన్ని మినహాయిస్తే చాలా కార్పొరేషన్లు కేవలం కళ తప్పిన రాజకీయ నాయకులను చైర్మన్లుగా నియమిండానికి మాత్రమే ఏర్పాటు చేసినట్లు ఉన్నాయని విమర్శించింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారం పడుతోందని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు ఎఫ్‌జీజీ కార్యదర్శి పద్మనాభరెడ్డి లేఖరాశారు. కార్పొరేషన్లు, డెవలప్‌మెంట్ అథా రిటీల పనితీరు ఎప్పుడు, ఎవరూ కూడా విశ్లేషణ చేయలేదని, కొన్ని అయితే శాఖల పనిని డూప్లికేట్ చేయగా, మరికొన్ని ఏ పనీ లేకుండా ఉన్నాయని ఆరోపించారు. కార్పొరేషన్ చైర్మన్లకు జీతాలు, కార్యాలయం, తగిన సిబ్బంది, ప్రభుత్వ వాహనం, డ్రైవర్, వారి జీతభత్యాలతో రూ.2 కోట్ల వరకు ప్రజాధనం వృథా అవుతోందని తెలిపారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని పని లేని కార్పొరేషన్లను మూసేయా లని, ఎలాంటి కార్పొరేషన్లు నెలకొల్పవద్దని సీఎస్‌కు రాసిన లేఖలో పద్మనాభరెడ్డి కోరారు.

మైక్రోసాఫ్ట్ హ్యాకథాన్‌లో అగ్రికల్చర్ హబ్‌కు తొలిస్థానం

డిజిటల్, క్లౌడ్ టెక్నాలజీలపై లక్షమంది డెవలపర్లకు మైక్రోసాఫ్ట్ శిక్షణ

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మరో ఘనతను సాధించింది. ‘ఫ్యూచర్ రెడీ ఛాంపియన్స్ ఆఫ్ కోడ్’ పేరుతో ఏకంగా లక్ష మంది డెవలపర్లకు డిజిటల్, క్లౌడ్ టెక్నాలజీలపై శిక్షణ పూర్తి చేసింది. వీరందరికీ మైక్రోసాఫ్ట్ నుంచి సర్టిఫికెట్లను అందజేయనున్నారు. 2022డిసెంబరులో మొదలైన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న కంపెనీల ఆధ్వర్యంలో నైపుణ్యాలలో శిక్షణ మొదలుపెట్టారు. ఇందులో పాల్గొన్న డెవలపర్లు ‘ఇన్నొవేట్ ఫర్ ఇండియాస్ గ్రోత్’’ పేరుతో నిర్వహించిన హ్యాకథాన్‌లోనూ భాగస్వాములయ్యారు.అజ్యూర్ ప్లాట్‌ఫామ్ సాయంతో స్మార్ట్ సిటీ, సుస్థిర సాఫ్ట్‌వేర్, ఇండస్ట్రీ ఇన్నొవేషన్ వంటి రంగాల్లోని సమస్యలకు వినూత్నమైన పరిష్కారాలు ఆవిష్కరించారు. మైక్రోసాఫ్ట్ నిర్వహించిన హ్యాక థాన్‌లో టీసీఎస్ ఉద్యోగి అంబరీష్ గంగూలీ సిద్ధం చేసిన అగ్రికల్చర్ హబ్ అప్లికేషన్‌కు తొలిస్థానం లభించింది. అజ్యూర్ కాగ్నిటివ్ సర్వీసెస్, కృత్రిమమేధలను ఉపయోగించుకుని రైతులకు అన్ని రకాల సాయం అందించేందుకు ఈ అగ్రికల్చర్ హబ్‌ను డిజైన్ చేశారు. ఉద్యోగుల ఉత్పాదకత పెంచేందుకు అవసరమైన టెక్నాలజీలను సిద్ధం చేసిన విప్రో బృందం రెండో స్థానంలో నిలవగా వాణిజ్య వాహనాల ఆనుపానులనుతెలుసుకునేందుకు స్మార్ట్ ట్రాకింగ్ సిస్టమ్‌ను తయారు చేసిన ఇండస్‌నెట్ మూడోస్థానాన్ని సాధించింది.

ముఖ్య కార్యదర్శులుగా ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లు

ఏడుగురు ఐఏఎస్‌లకు పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లను ముఖ్య కార్యదర్శులుగా, ఏడుగురు ఐఏఎస్ అధికారులకు జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ స్కేల్ పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ ఐఏఎస్ అధికారులు సందీప్‌కుమార్ సుల్తానియా, అనితా రాజేంద్రలకు ముఖ్య కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శిగా ఉన్న సందీప్ కుమార్ సుల్తానియాకు ముఖ్యకార్యదర్శిగా పదోన్నతి కల్పించి.. అదే శాఖలో కొనసాగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డాక్టర్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ జాయింట్ డైరెక్టర్ అనిత రాజేంద్రను పదోన్నతి కల్పిస్తూ అక్కడే అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. మైనారిటీల సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రెటరీ మొహమ్మద్ అబ్దుల్ అజీమ్‌ను అదే శాఖ జాయింట్ సెక్రటరీగా, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రెటరీ సందీప్ కుమార్ ఝాను అదే శాఖ జాయింట్ సెక్రటరీగా, నల్లగొండ, నిర్మల్, ములుగు, ఖమ్మం జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ముషారఫ్ అలీ ఫారుఖీ, కృష్ణా ఆదిత్య, వీపీ గౌతం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ కె.స్వర్ణలతలకు అవే పోస్టుల్లో పదోన్నతి కల్పించారు.

విశ్వవేదికపై చెదరని ఖ్యాతి ఓయూ సొంతం

- వందేళ్ల చరిత్రే ఉస్మానియా ఘనత
- అంతర్జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు
- ఉద్యమాల గడ్డ ఉద్యోగాల అడ్డాగా మారింది.. వేలాదిమందికి ఉద్యోగావకాశాల కల్పన
- జీఏఎం–2023లో ఉస్మానియా వర్సిటీ వైస్ చాన్స్‌లర్
- అపూర్వ కలయికగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఉస్మానియా యూనివర్సిటీ గ్లోబల్ అలుమ్ని మీట్–2023’లో మాట్లాడుతున్న సీవీ ఆనంద్. చిత్రంలో బుర్రా వెంకటేశం, శేఖర్ కమ్ముల. (ఇన్‌సెట్‌లో) వర్సిటీ వైస్ చాన్స్‌లర్ రవీందర్

సాక్షి, హైదరాబాద్: వందేళ్లు దాటిన మహోన్నత చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం తనకు తానే ఒక బ్రాండ్ ఇమేజ్ అని, ప్రపంచ ప్రసిద్ధి చెందిన విశ్వవిద్యాలయాల్లో చెక్కుచెదరని స్థానం కలిగి ఉందని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.రవీందర్ అన్నారు. గతేడాది రూపొందించిన ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాల యాల జాబితాలో ఉస్మానియా 22వ స్థానంలో ఉందని చెప్పారు. ఇటీవల వరకు ఉద్యమాల గడ్డగా ఉన్న ఉస్మానియా వర్సిటీ ఇప్పుడు ఉద్యోగాల అడ్డాగా మారిందని పేర్కొ న్నారు. ‘ఉస్మానియా యూనివర్సిటీ గ్లోబల్ అలుమ్ని మీట్–2023’ వేడుకలు మంగళవారం వర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ స్వాగతోపన్యా సం చేశారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ వేడుకలలో పాల్గొనేందుకు దేశ, విదేశాల్లో స్థిరపడిన వేలాదిమంది ‘ఉస్మానియన్స్’ తరలివచ్చారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ టీచింగ్, లెర్నింగ్ మెథడ్స్, రీసెర్చ్ రంగంలో అత్యున్నత ప్రమాణాలను అభి వృద్ధి చేసినట్లు, అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి నట్లు పేర్కొన్నారు. ఇటీవల ఓయూ నిర్వహించిన ‘నిపుణ’కార్యక్రమంలో 250 క్యాంపస్‌లు పాల్గొన్నా యని, 55 వేలమంది విద్యార్థులు హాజరయ్యారని, సుమారు 16 వేలమందికి ఉద్యోగాలు లభించా యని వివరించారు. ఉస్మానియా ఫౌండేషన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వర్సిటీ పూర్వ విద్యా ర్థులను ఒక వేదికపైకి తీసుకురాగలిగినట్లు చెప్పా రు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వవిద్యా ర్థుల సహాయ సహకారాలతో అనేక అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టినట్లు వివరించారు. కార్య క్రమంలో ఆయన ఉస్మానియా టీవీని లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం 46 చానళ్లతో త్వరలోనే ప్రత్యక్ష ప్రసారాలు ప్రారంభం కానున్నట్లు చెప్పారు.

చదువులమ్మ చెట్టు నీడలో...

పూర్వవిద్యార్థుల ప్యానెల్ సమావేశంలో బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సినీ దర్శకులు శేఖర్ కమ్ముల, ఫ్యూజీ సీఈవో మనోహర్‌రెడ్డి, ఓఎస్‌డీ రాజశేఖర్ వర్సిటీతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎక్కడో నల్లమల అటవీ ప్రాంతంలో పుట్టి పెరిగిన తనను ఉస్మానియా కన్నతల్లిలా చేరదీసి ఆదరించిందని చెప్పారు. ఆర్ట్స్ కళాశాలలో 1989–91లో ఎంఏ ఎకనామిక్స్ చదువుకున్న తాను ఉస్మానియన్‌గా చెప్పుకొనేందుకు గర్విస్తున్నానని సీవీ ఆనంద్ అన్నారు. ఉస్మానియా వర్సిటీకి సైతం అలుమ్నిలు బలమైన వెన్నుదన్నుగా నిలవాలని బుర్ర వెంకటేశం అభిప్రాయపడ్డారు. శేఖర్ కమ్ముల మాట్లాడుతూ ఉస్మానియా గాలిలోనే ఒక వైబ్రేషన్ ఉందన్నారు. అమ్మకు, ఆవకాయకు ప్రత్యేకమైన బ్రాండ్ ఇమేజ్ అవసరం లేనట్లుగానే ఉస్మాని యాకు అవసరం లేదన్నారు, ఉస్మానియా ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ దేవరకొండ, సీఏబీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ తదితరులు ప్రసంగించారు.

ఆ దాడి వెనుక తెలంగాణ మావోలు!

- ఛత్తీస్‌గఢ్ టేకల్‌గుడియం ఘటనలో 23మందిపై ఎన్‌ఐఏ చార్జిషీట్
- ఉమ్మడి వరంగల్‌కు చెందిన 8మంది మావోయిస్టుల నేతలపై అభియోగాలు
- ఆ ఘటనలో 22మంది పోలీసుల మృతి, 35మందికిపైగా గాయాలు
- చర్చనీయాంశంగా మారిన ఎన్‌ఐఏ చార్జిషీట్



సాక్షిప్రతినిధి, వరంగల్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా టార్రెమ్ పోలీస్‌స్టేషన్ పరిధి టేకల్ గుడియం సమీపంలో పోలీసులపై జరిగిన దాడి ఘటన వెనుక తెలంగాణకు చెందిన మావోయిస్టు నేతలే కీలకంగా వ్యవహరించారని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) తేల్చింది. ఈ ఘటనకు సూత్రధారులుగా 23మంది పేర్లను పేర్కొన్న ఎన్‌ఐఏ.. తెలంగాణ జిల్లాలకు చెందిన ఎనిమిది మంది పేర్లను చార్జిషీట్‌లో చేర్చింది. 2021 ఏప్రిల్ 3న జరిగిన ఈ దాడి ఘటనలో డీఆర్‌జీ, కోబ్రా, సీఆర్‌పీఎఫ్‌లకు చెందిన పోలీసులు 22మంది మృతి చెందగా, 35మందికిపైగా గాయపడ్డారు. సుమారు 21 నెలలపాటు విచారణ జరిపిన ఎన్‌ఐఏ అధికారులు... దాడిలో 350 నుంచి 400 మంది వరకు సాయుధ మావోయిస్టులు పాల్గొన్నప్పటికీ కేసులో (ఆర్‌సీ–02/2021/ఎన్‌ఐఏ/ఆర్‌పీఆర్) 23మందిపైన చార్జిషీట్‌ను దాఖలు చేశారు.

సంచలనం కలిగించిన తార్రెం ఘటన

పోలీస్ సాయుధ బలగాలపై మెరుపుదాడి చేసిన ఆ ఘటన కేసును మొదట బీజాపూర్ జిల్లాలోని టార్రెమ్ పోలీస్‌స్టేషన్ ఎఫ్‌ఐఆర్ నం.06/2021 ప్రకారం నమోదు కాగా, తర్వాత ఎన్‌ఐఏ ద్వారా 2022 జూన్ 5వ తేదీన తిరిగి నమోదు చేశారు. భద్రతా దళాలు సీఆర్‌పీఎఫ్, కోబ్రా, డీఆర్‌జీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసులపై బారెల్ గ్రెనేడ్ లాంచర్(బీజీఎల్)లు, ఆటోమేటిక్ ఆయుధాలతో కాల్పులు జరిపి రాకేశ్వర్ సింగ్ మన్హాస్ అనే కోబ్రా జవాన్‌ను కూడా అపహరించారు. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది.

తెలంగాణ అగ్రనేతలే సూత్రధారులు...

21 నెలల విచారణ తర్వాత ఎన్‌ఐఏ తన దర్యాప్తులో దాడి వెనుక సీపీఐ(మావోయిస్ట్) సీనియర్ నేతల పాత్ర ఉందని తేల్చింది. ఐపీసీలోని సెక్షన్లు– 120 రెడ్‌విత్/302 – 307, 396, 149, 121 మరియు 121ఎలతో పాటు భారతీయ ఆయుధ చట్టం, 1959లోని సెక్షన్లు– 25(1ఏ) – 27, ఈ చట్టం 1908లోని సెక్షన్ – 3, 4 – 6 మరియు సెక్షన్లు– 16, 18, 18ఏ, 20, యుఏ(పీ) చట్టం, 1967లోని 38ల కింద కేసులు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఇందులో కేంద్ర కమిటీ సలహాదారుడు ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతితోపాటు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబళ్ల కేశవరావు అలియాస్ గంగన్న, కేంద్ర నాయకులు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్, మల్లోజుల వేణుగోపాలరావు అలియాస్ సోను, సుజాత అలియాస్ పోతుల కల్పన (మల్లోజుల కోటేశ్వర్‌రావు భార్య), ఉమ్మడి వరంగల్‌కు చెందిన సాగర్ అలియాస్ అన్నే సంతోష్, రఘు రెడ్డి అలియాస్ వికాస్, నిర్మల అలియాస్ నిర్మలక్కలు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పాడియం హిడ్మా అలియాస్ హిడ్మన్న, మద్నా అలియాస్ జగ్గు దాదాలతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర, దండకారణ్యం, ఏరియా కమిటీలకు చెందిన 15 మంది పేర్లను ఎన్‌ఐఏ ప్రధానంగా పేర్కొంది.

నేడు స్లీపర్ బస్సులు ప్రారంభం

తొలివిడతగా 4 స్లీపర్, మరో 6 స్లీపర్ కమ్ సీటర్ బస్సులను ప్రవేశపెట్టనున్న టీఎస్‌ఆర్టీసీ


సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నాన్ ఏసీ స్లీపర్ బస్సులను తొలిసారి అందుబాటులోకి తీసుకువ స్తోంది. మొదటి విడతలో 4 స్లీపర్, మరో 6 స్లీపర్ కమ్ సీటర్ బస్సులను ప్రవేశపెట్టనుంది. ప్రైవేట్ బస్సులకు దీటుగా అత్యాధునిక హంగులతో రూపొందించిన ఈ బస్సులు బుధవారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్–కాకినాడ, హైదరాబాద్– విజయవాడ మార్గాల్లో అద్దె ప్రతిపాదికన ఆర్టీసీ ఈ బస్సులను నడపనుంది. హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీ బస్టాప్ దగ్గర బుధవారం సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమంలో సంస్థ చైర్మన్, బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ వీసీ సజ్జనర్ ఈ కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభించనున్నారు.

బస్సుల వేళలు....

కాకినాడ వైపు వెళ్లే బస్సులు హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్ నుంచి ప్రతీ రాత్రి 07.45, 8.30 గంటలకు బయల్దేరుతాయి. కాకినాడ నుంచి తిరిగి రాత్రి 07.15, 07.45 గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరుతాయి. విజయవాడ వైపు వెళ్లే బస్సులు ప్రతీరోజు మియాపూర్ నుంచి ఉదయం 9.30, 10.45, 11.45, రాత్రి 9.30, 10.15, 11.15 గంటలకు బయల్దేరుతాయి. విజయవాడ నుంచి తిరిగి హైదరాబాద్‌కు ఉదయం 10.15,11.15 మధ్యాహ్నం 12.15 గంటలకు అర్ధరాత్రి 12.00, 12.45 గంటలకు బయల్దేరుతాయి.

ప్రవీణ్... ఏ డ్రగ్ డిస్ట్రిబ్యూటర్!!

- నగరం నుంచి ఏజెన్సీకి పెట్రోలియం ఈథర్ సరఫరా
- హష్ ఆయిల్ తయారీలో ఈ రసాయనం వినియోగం
- అది తీసుకువచ్చి స్థానికంగా ఉన్న పెడ్లర్లకు విక్రయం
- సిటీతో పాటు బెంగళూరులోనూ నిందితునికి నెట్‌వర్క్
- మొత్తం నలుగురిని పట్టుకున్న హెచ్–న్యూ బృందం



సాక్షి, హైదరాబాద్: నగరంలోని కెమికల్ షాపుల నుంచి అక్రమంగా పెట్రోలియం ఈథర్ ఖరీదు చేయడం... దీన్ని విశాఖ ఏజెన్సీకి తరలించి హష్ ఆయిల్ తయారీదారులకు విక్రయించడం... వాళ్ల నుంచి హష్ ఆయిల్ కొనుగోలు చేసి హైదరాబాద్‌తో పాటు బెంగళూరులో ఉన్న పెడ్లర్లకు సరఫరా చేయడం... కొన్నాళ్లుగా ఈ పంథాలో రెచ్చిపోతున్న ‘డ్రగ్ డిస్ట్రిబ్యూటర్’ ఎస్.ప్రవీణ్ కుమార్ హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) అధికారులకు చిక్కాడు. ఇతడితో పాటు ముగ్గురు పెడ్లర్స్‌ను పట్టుకు న్నట్లు డీసీపీ చక్రవర్తి గుమ్మి మంగళవారం వెల్లడించారు.

మూడేళ్ల క్రితం పెడ్లర్‌గా మొదలెట్టి...

కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన ప్రవీణ్ కుమార్ దాదాపు మూడేళ్ల క్రితం గంజాయి పెడ్లర్‌గా మారాడు. ఇతడికి విశాఖ ఏజెన్సీలోని గూడెం మాడుగుల మండలం అలగాం ప్రాంతానికి చెందిన గంజాయి పండించే గిరిజనులతో పరిచయమైంది. కొన్నాళ్లుగా వాళ్లు గంజాయి నుంచి తీసే హష్ ఆయిల్ ఉత్పత్తి చేస్తున్నారు. దీంతో ప్రవీణ్ అదే దందా చేశాడు. హష్ ఆయిల్ తయారీకి పెట్రోలియం ఈథర్ అవసరం. ఇది ఏజెన్సీలో దొరకట్లేదనే విషయం తెలుసుకున్న ఇతగాడు తాను సరఫరా చేస్తానంటూ గిరిజనులతో ఒప్పందం చేసుకున్నాడు. దాన్ని వినియోగించి తనకు హష్ ఆయిల్ తయారు చేసి ఇవ్వాలంటూ షరతు పెట్టాడు.

రెండు ఏజెన్సీల నుంచి అక్రమంగా...

పెట్రోలియం ఈథర్‌ను పారిశ్రామిక అవసరాల కోసం మాత్రమే విక్రయించాలి. అదీ అధీకృత పత్రాలు సేకరించిన తర్వాతే అమ్మాలి. అయితే నగరంలోని కూకట్‌పల్లి ప్రశాంతినగర్‌కు చెందిన నర్మద ట్రేడర్స్, మహాలక్ష్మీ కెమికల్ ట్రేడర్స్ ఈ నిబంధనను తుంగలో తొక్కాయి. ఎలాంటి పత్రాలు లేకుండా ప్రవీణ్‌కు భారీ మొత్తంలో విక్రయిస్తున్నాయి. దీని రవాణా కోసం ఓ వాహనం ఖరీదు చేసిన ఇతను డ్రైవర్‌ను నియమించుకున్నాడు. ఈథర్‌ను ఇక్కడ లీటర్ రూ.100కు కొని, అలగాం తరలించి అక్కడి వారికి రూ.400కు అమ్ముతున్నాడు. ఇలా ఇప్పటి వరకు ఈ రెండు ఏజెన్సీల నుంచి 1400 లీటర్లు కొనుగోలు చేశాడు.

హష్ ఆయిల్ ‘డిస్ట్రిబ్యూటర్’గా మారి...

పెట్రోలియం ఈథర్‌తో తయారు చేసిన హష్ ఆయిల్‌ను ప్రవీణ్ గిరిజనుల నుంచి తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నాడు. లీటర్ గరిష్ఠంగా రూ.30 వేలకు కొని, తీసుకువచ్చి హైదరాబాద్‌లోని 15 మంది పెడ్లర్స్‌తో పాటు బెంగళూరులో ఉన్న వారికీ సరఫరా చేస్తున్నాడు. నగరంలో లీటర్ రూ.70 వేల నుంచి రూ.80 వేలకు, బెంగళూరులో రూ.1.2 లక్షలు నుంచి రూ.1.4 లక్షలకు విక్రయిస్తున్నాడు. చిన్న చిన్న డబ్బాల్లో ప్యాక్ చేసి డబ్బాల్లో అమ్మితే ప్రవీణ్‌కు లీటర్‌కు రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఇలా అటు ఇథనాల్, ఇటు హష్ ఆయిల్ రెండింటి దందా చేస్తూ కొన్నాళ్లుగా రెచ్చిపోతున్న ఇతడికి గోవాలో కూడా నెట్‌వర్క్ ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

చిక్కడపల్లిలో సరఫరా చేస్తుండగా...

ప్రవీణ్ కుమార్‌కు నగరంలో ఉన్న పెడ్లర్లలో పటాన్‌చెరు, కూకట్‌పల్లి ప్రాంతాలకు చెందిన పి.మోహన్ యాదవ్, పి.కళ్యాణ్, బి.సురేష్ కీలకం. ఇటీవల ఏజెన్సీ నుంచి హష్ ఆయిల్ తెచ్చిన ఇతడు దాన్ని చిన్న డబ్బాల్లో ప్యాక్‌చేసి పెడ్లర్స్‌కు సరఫరా చేస్తున్నాడు. మంగళవారం చిక్కడపల్లి వద్దకు ఈ ముగ్గురికీ ఇచ్చేందుకు 60 డబ్బాలు తీసుకువచ్చాడు. దీనిపై హెచ్–న్యూ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్‌రెడ్డికి సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్సై సి.వెంకటరాములు నేతృత్వంలోని బృందం వలపన్ని నలుగురినీ పట్టుకుంది. వీరి నుంచి హష్ ఆయిల్‌తో పాటు 400 లీటర్ల ఈథర్, వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పెట్రోలియం ఈథర్‌ను విక్రయించిన కూకట్‌పల్లి ప్రశాంతినగర్‌కు చెందిన నర్మద ట్రేడర్స్, మహాలక్ష్మీ కెమికల్ ట్రేడర్స్‌పై కేసులు నమోదు చేశారు.

ప్రవీణ్‌పై గతంలోనూ కేసులు

కాగా, ప్రవీణ్‌పై గతంలో రెండు కేసులు నమోదైనట్టు పోలీసులు గుర్తించారు. 2015లో కూకట్‌పల్లిలో ఓ చిన్నారిని కిడ్నాప్ చేసి డబ్బు డిమాండ్ చేసిన ముఠాలో సభ్యుడిగా కేసు నమోదైంది. 2020లో కూకట్‌పల్లిలోనే గంజాయి అమ్ముతూ పట్టుబడిన కేసు విచారణలో ఉంది.



కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో మనిక బత్రా

అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ మనిక బత్రా కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకుంది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో మనిక మూడు స్థానాలు ఎగబాకి 35వ ర్యాంక్‌కు చేరుకుంది. జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ నాలుగు స్థానాలు పురోగతి సాధించి 72వ ర్యాంక్‌లో నిలిచింది. పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ కుర్రాడు స్నేహిత్ 136వ ర్యాంక్‌లో ఉన్నాడు. సత్యన్ 39వ ర్యాంక్‌తో భారత నంబర్‌వన్‌గా కొనసాగుతున్నాడు.

క్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్

జాతీయ సీనియర్ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ (57 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టాడు. హిసార్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ప్రీక్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్ 5-0తో లాలామావ్మా (మిజోరం)పై నెగ్గాడు. 51 కేజీల ప్రీక్వార్టర్ ఫైనల్లో యడ్ల ప్రభుదాస్ (ఆంధ్రప్రదేశ్) 0-5తో బిశ్వామిత్ర (సర్వీసెస్) చేతిలో ఓడిపోయాడు.



ఆంధ్ర 135 ఆలౌట్


రవితేజ

సాక్షి, విజయనగరం: హైదరాబాద్ మీడియం పేసర్లు తెలుకుపల్లి రవితేజ (5/34), కార్తికేయ కక్ (3/31) హడలెత్తించడంతో... మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 51.1 ఓవర్లలో 135 పరుగులకే కుప్పకూలింది. ఆంధ్ర జట్టులో ఓపెనర్ అభిషేక్ రెడ్డి (135 బంతుల్లో 81; 15 ఫోర్లు), నితీశ్ కుమార్ రెడ్డి (13; 1 ఫోర్, 1 సిక్స్) మినహా మిగతా బ్యాటర్లు రెండంకెల స్కోరు కూడా దాటలేదు. కెప్టెన్ హనుమ విహారి (2), రికీ భుయ్ (6), కోన శ్రీకర్ భరత్ (5), కరణ్ షిండే (3) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి 30 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (35; 4 ఫోర్లు), ప్రజ్ఞయ్ రెడ్డి (17; 3 ఫోర్లు), రోహిత్ రాయుడు (6; 1 ఫోర్) అవుటయ్యారు.

పీలే అంత్యక్రియలు పూర్తి



సాంటోస్: బ్రెజిల్ దిగ్గజ ఫుట్‌బాలర్ పీలే అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. కేవలం కుటుంబసభ్యుల మధ్యే ఈ లాంఛనం ముగించారు. అంతకుముందు విలా బెల్మిరో స్టేడియంలో పీలే భౌతికకాయాన్ని వేల మంది బ్రెజిలియన్లు సందర్శించుకొని కడసారి వీడ్కోలు తెలిపారు. బ్రెజిల్ దేశాధ్యక్షుడు లూయిస్ ఇనాసియో లులా తమ దిగ్గజానికి శ్రద్ధాంజలి ఘటించారు. నివాళులు అర్పించేందుకు అభిమానులు పోటెత్తడంతో అంతిమ యాత్ర నిర్ణీత షెడ్యూల్‌కు కాస్త ఆలస్యంగా మొదలైంది. సాంటోస్ వీధుల గుండా పీలే అంతిమ యాత్ర సాగుతుండగా 'పీలే జెర్సీ నంబర్ 10'ను అభిమానులు ప్రముఖంగా ప్రదర్శించారు. ప్రజలంతా భారమైన హృదయంతో తమ ఆరాధ్య ఫుట్‌బాలర్‌ను తలచుకొని విలపించారు. తమ దేశాన్ని మూడుసార్లు ప్రపంచకప్ చాంపియన్‌గా నిలిపిన హీరోకు విషణ్ణ వదనంతో వీడ్కోలు పలికారు. అనంతరం మెమోరియల్ నెక్రొపొలె ఎక్యుమెనిక వద్దకు తీసుకొచ్చారు. క్రిస్టియన్ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు ముగించారు.

విజయంతో మొదలు...

హార్దిక్ పాండ్యా నాయకత్వంలోని టీమిండియా కొత్త ఏడాదిని విజయంతో మొదలు పెట్టింది. బ్యాటింగ్‌లో సాధారణ స్కోరుకే పరిమితమైనా చివరకు ఉత్కంఠను అధిగమించి దానిని కాపాడుకోగలిగింది. ఆఖరి బంతికి 4 పరుగులు చేయాల్సిన లంక సింగిల్ మాత్రమే తీయడంతో గెలుపు టీమిండియా పరమైంది. బ్యాటింగ్‌లో దీపక్ హుడా ఆదుకోగా, తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన శివమ్ మావి ఓవర్‌కు ఒక్కో వికెట్ చొప్పున నాలుగు వికెట్లు తీసి గెలుపులో కీలక పాత్ర పోషించాడు.

- తొలి టి20లో భారత్ గెలుపు
- 2 పరుగులతో ఓడిన శ్రీలంక
- రాణించిన హుడా, హార్దిక్
- శివమ్ మావికి 4 వికెట్లు


దీపక్ హుడా

3 ప్రజ్ఞాన్ ఓజా, బరీందర్ శరణ్ తర్వాత కెరీర్ తొలి మ్యాచ్‌లోనే 4 వికెట్లు తీసిన మూడో భారత బౌలర్‌గా శివమ్ మావి నిలిచాడు.


శివమ్ మావి

ముంబై: శ్రీలంకతో టి20 సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 2 పరుగుల తేడాతో గెలిచి 1-0తో ముందంజ వేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీపక్ హుడా (23 బంతుల్లో 41 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (29 బంతుల్లో 37; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (20 బంతుల్లో 31 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం లంక 20 ఓవర్లలో 160 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ షనక (27 బంతుల్లో 45; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా, శివమ్ మావి (4/22) ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. రెండో టి20 రేపు పుణేలో జరుగుతుంది.

కీలక భాగస్వామ్యం...

రజిత వేసిన తొలి ఓవర్లో ఇషాన్ కిషన్ ఒక సిక్స్, 2 ఫోర్లు కొట్టగా, మొత్తం 17 పరుగులతో భారత్ ఇన్నింగ్స్ జోరుగా మొదలైంది. అయితే ఆ తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. లంక బౌలర్లు చక్కటి బంతులతో భారత్‌ను కట్టిపడేశారు. అరంగేట్ర మ్యాచ్‌లో శుబ్‌మన్ గిల్ (7) విఫలం కాగా, సూర్యకుమార్ (7), సంజు సామ్సన్ (5) విఫలమయ్యారు. పవర్‌ప్లేలో జట్టు 41 పరుగులకే పరిమితమైంది. మరోవైపు రజిత ఓవర్లోనే వరుస బంతుల్లో 6, 4 కొట్టిన కిషన్ మళ్లీ భారీ షాట్‌కు ప్రయత్నించి వెనుదిరిగాడు. 11-15 ఓవర్ల మధ్య 26 పరుగులే చేయగలిగిన భారత్ హార్దిక్ పాండ్యా (27 బంతుల్లో 29; 4 ఫోర్లు) వికెట్ కూడా చేజార్చుకుంది. అయితే చివర్లో హుడా దూకుడు టీమిండియాకు మెరుగైన స్కోరు అందించింది. తీక్షణ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టిన హుడా... హసరంగ, రజిత ఓవర్లలో ఒక్కో సిక్స్ బాదాడు. మదుషంక ఓవర్లో అక్షర్ కూడా సిక్స్, ఫోర్‌తో తన వంతు సహకారం అందించాడు. హుడా, అక్షర్ ఆరో వికెట్‌కు అభేద్యంగా 35 బంతుల్లోనే 68 పరుగులు జోడించారు.

షనక మినహా...

తన తొలి మ్యాచ్ తొలి ఓవర్లోనే వికెట్‌తో మావి ఆకట్టుకున్నాడు. నిసాంక (1)ను బౌల్డ్ చేసిన అతను, తన తర్వాతి ఓవర్లో ధనంజయ (8)ను వెనక్కి పంపాడు. మొదటి 6 ఓవర్లలో లంక 32 పరుగులే చేయగలిగింది. ఆ తర్వాత నాలుగు పరుగుల వ్యవధిలో మరో 2 వికెట్లు కోల్పోయిన లంక సగం ఓవర్లు ముగిసేసరికి 66 పరుగులకే పరిమితమైంది. అయితే కెప్టెన్ షనక, హసరంగ దూకుడుతో జట్టు కొంత పోరాడగలిగింది. చహల్ ఓవర్లో హసరంగ వరుసగా రెండు సిక్సర్లు బాదగా, హర్షల్ ఓవర్లో షనక 6, 4 కొట్టాడు. అయితే 21 బంతుల్లో 34 పరుగులు చేయాల్సిన దశలో షనకను ఉమ్రాన్ అవుట్ చేయడంతో లంక గెలుపు ఆశలు కోల్పోయింది.

మావి, గిల్ అరంగేట్రం

తొలి టి20 ద్వారా భారత్ ఇద్దరు కొత్త ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. అర్ష్‌దీప్ అనారోగ్యం నుంచి కోలుకోకపోవడంతో పేసర్ శివమ్ మావి జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్‌తో శుబ్‌మన్ గిల్ కూడా అంతర్జాతీయ టి20ల్లో అడుగుపెట్టాడు. భారత్ తరఫున ఇప్పటికే 13 టెస్టులు, 15 వన్డేలు ఆడిన గిల్‌కు ఇదే తొలి టి20 మ్యాచ్.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి) ధనంజయ (బి) హసరంగ 37; గిల్ (ఎల్బీ) (బి) తీక్షణ 7; సూర్యకుమార్ (సి) రాజపక్స (బి) కరుణరత్నే 7; సామ్సన్ (సి) మదుషంక (బి) ధనంజయ 5; హార్దిక్ (సి) మెండిస్ (బి) మదుషంక 29; హుడా (నాటౌట్) 41; అక్షర్ (నాటౌట్) 31; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 162. వికెట్ల పతనం:** 1-27, 2-38, 3-46, 4-77, 5-94. **బౌలింగ్:** రజిత 4-0-47-0, మదుషంక 4-0-35-1, తీక్షణ 4-0-29-1, కరుణరత్నే 3-0-22-1, ధనంజయ 1-0-6-1, హసరంగ 4-0-22-1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) మావి 1; మెండిస్ (సి) సామ్సన్ (బి) హర్షల్ 28; ధనంజయ (సి) సామ్సన్ (బి) మావి 8; అసలంక (సి) కిషన్ (బి) ఉమ్రాన్ 12; రాజపక్స (సి) హార్దిక్ (బి) హర్షల్ 10; షనక (సి) చహల్ (బి) ఉమ్రాన్ 45; హసరంగ (సి) హార్దిక్ (బి) మావి 21; కరుణరత్నే (నాటౌట్) 23; తీక్షణ (సి) సూర్యకుమార్ (బి) మావి 1; రజిత (రనౌట్) 5; మదుషంక (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 160. వికెట్ల పతనం:** 1-12, 2-24, 3-47, 4-51, 5-68, 6-108, 7-129, 8-132, 9-159, 10-160. **బౌలింగ్:** హార్దిక్ 3-0-12-0, శివమ్ మావి 4-0-22-4, ఉమ్రాన్ 4-0-27-2, చహల్ 2-0-26-0, హర్షల్ 4-0-41-2, అక్షర్ 3-0-31-0.

జైదేవ్ ఉనాద్కట్ అరుదైన రికార్డు

రంజీ ట్రోఫీ మ్యాచ్ మొదటి ఓవర్లోనే 'హ్యాట్రిక్' సాధించిన తొలి బౌలర్‌గా ఘనత



రాజ్‌కోట్: క్రికెట్‌లో 'హ్యాట్రిక్'లు, ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లు కొత్తేం కాదు... కానీ ఆట మొదలైన ఓవర్లోనే వరుసగా మూడు వికెట్లు (హ్యాట్రిక్) తీస్తే... ఆ ముగ్గురు డకౌట్ అయితే అది చరిత్ర! అలాంటి ఘనమైన రికార్డును సౌరాష్ట్ర సీమర్ జైదేవ్ ఉనాద్కట్ (8/39) ఢిల్లీతో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో లిఖించాడు. 88 ఏళ్ల రంజీ చరిత్రలో తొలిసారి ఈ రికార్డు సృష్టించాడు. ఎలైట్ గ్రూప్ 'బి'లో మంగళవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన ఢిల్లీ బ్యాటింగ్‌కు దిగింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్ వేసిన ఉనాద్కట్ మూడో బంతికి ధ్రువ్ శోరే (0)ను, నాలుగో బంతికి వైభవ్ (0)ను, ఐదో బంతికి యశ్ ధుల్ (0)ను అవుట్ చేశాడు. తన మరుసటి ఓవర్ వేసిన ఉనాద్కట్ మళ్లీ పంజా విసిరాడు. జాంటీ సిద్ధు (4)తోపాటు లలిత్ యాదవ్ (0)నూ స్కోరు చేయనివ్వలేదు. మూడు ఓవర్లు ముగిసేసరికి ఢిల్లీ స్కోరు 5/6. మళ్లీ ఐదో ఓవర్ వేసిన ఉనాద్కట్ లక్ష్యయ్ (1)ను పెవిలియన్ చేర్చాడు. 10 పరుగులకే 7 వికెట్లను కోల్పోయిన ఢిల్లీని టెయిలెండర్లు హృతిక్ షోకీన్ (68 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శివాంక్ వశిష్ఠ (38; 5 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకున్నారు. శివాంక్‌తో పాటు కుల్దీప్ యాదవ్ (0)ను కూడా ఉనాద్కటే అవుట్ చేసి ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌ను 133 పరుగుల వద్ద ముగించాడు. అనంతరం సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ నష్టానికి 184 పరుగులు చేసింది. హర్విక్ దేశాయ్ (104 బ్యాటింగ్; 15 ఫోర్లు) అజేయ శతకం సాధించాడు.

న్యూజిలాండ్ 449 ఆలౌట్

కరాచీ: టెయిలెండర్లు మ్యాట్ హెన్రీ (68 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఎజాజ్ పటేల్ (35; 4 ఫోర్లు) అసాధారణ పోరాటంతో న్యూజిలాండ్ భారీస్కోరు చేసింది. పాకిస్తాన్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఓవర్‌నైట్ స్కోరు 309/6తో మంగళవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 449 స్కోరు వద్ద ఆలౌటైంది. 345/9 స్కోరు వద్ద కివీస్ పతనం అంచున నిలిచింది. ఈ దశలో హెన్రీ, ఎజాజ్ ఆఖరి వికెట్‌కు 104 పరుగులు జోడించారు. తర్వాత తొలి ఇన్నింగ్స్ మొదలు పెట్టిన పాకిస్తాన్ రెండో రోజు ఆట ముగిసేసరికి 3 వికెట్లకు 154 పరుగులు చేసింది. ఇమామ్ (74 బ్యాటింగ్; 9 ఫోర్లు, 1 సిక్స్), షకీల్ (13 బ్యాటింగ్; 1 ఫోర్) క్రీజులో ఉన్నారు.

రామ్‌కుమార్‌కు మిశ్రమ ఫలితాలు



పుణే: టాటా ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో భారత ప్లేయర్ రామ్‌కుమార్ రామనాథన్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రామ్‌కుమార్ 3-6, 7-5, 3-6తో ప్రపంచ 62వ ర్యాంకర్ పెడ్రో మార్టినెజ్ (స్పెయిన్) చేతిలో ఓడిపోయాడు. అయితే డబుల్స్ తొలి రౌండ్‌లో రామ్‌కుమార్-మిగెల్ వరేలా (మెక్సికో) జోడీ 7-6 (7/5), 6-7 (4/7), 11-9తో రోహన్ బోపన్న (భారత్)-జాండ్‌షుల్ప్ (నెదర్లాండ్స్) ద్వయంపై 'సూపర్ టైబ్రేక్'లో నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరింది. ఇతర మ్యాచ్‌ల్లో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ 7-6 (7/1), 5-7, 7-10తో మూడో సీడ్ సాదియో దుంబియా-రిబూల్ (ఫ్రాన్స్) జంట చేతిలో... పురవ్ రాజా-దివిజ్ శరణ్ (భారత్) ద్వయం 4-6, 3-6తో జీవన్-శ్రీరామ్ బాలాజీ (భారత్) జోడీ చేతిలో ఓడిపోయాయి.

లంకతో వన్డే సిరీస్‌కు బుమ్రా



ముంబై: భారత జట్టు టాప్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా మళ్లీ మైదానంలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. శ్రీలంకతో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం బుమ్రాను ఎంపిక చేశారు. భారత్, శ్రీలంక మధ్య ఈ నెల 10, 12, 15 తేదీల్లో మూడు వన్డేలు జరగనున్నాయి.వెన్ను నొప్పి గాయంతో బాధపడుతూ అతను గత సెప్టెంబర్ నుంచి జట్టుకు దూరంగా ఉన్నాడు. జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో చికిత్స అనంతరం రీహాబిలిటేషన్ పూర్తి చేసుకొని బుమ్రా ఇప్పుడు పూర్తి ఫిట్‌గా తయారయ్యాడు. 'బుమ్రా గత వారం రోజులుగా పూర్తి స్థాయిలో బౌలింగ్ చేయడంతో పాటు ఫిజికల్ ట్రైనింగ్ కూడా చేస్తున్నాడు. ఎన్‌సీఏ అతడిని ఫిట్‌గా ప్రకటించింది. అందుకే వన్డేల కోసం ఎంపిక చేశాం. త్వరలోనే బుమ్రా భారత జట్టుతో చేరతాడు' అని బీసీసీఐ ప్రకటించింది.

సినిమా

ఏప్రిల్‌లో ఉగ్రం

'నాంది' వంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత హీరో 'అల్లరి' నరేష్, డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందుతున్న ద్వితీయ చిత్రం 'ఉగ్రం'. ఇందులో మిర్నా హీరోయిన్. షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాని ఏప్రిల్ 14న విడుదల చేయనున్నట్లు ఒక స్పెషల్ గ్లింప్స్ ద్వారా మేకర్స్ ప్రకటించారు. అలాగే తన తుపాకీని నరేష్ వేరొకరిపై గురిపెట్టిన పోస్టర్‌ను కూడా విడుదల చేసింది యూనిట్. ''నరేష్ అద్భుతమైన పాత్రలో కనిపించనున్న చిత్రం 'ఉగ్రం'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: సిద్.


● 'అల్లరి' నరేష్

పెళ్లికి ముహూర్తం కుదిరిందా?

ఈ కొత్త సంవత్సరం తొలిరోజు వార్తల్లో నిలిచినవారిలో హీరో సిద్ధార్థ్ మల్హోత్రా, హీరోయిన్ కియారా అద్వానీ జంట ఒకటి. ఈ జంట దుబాయ్ వెళ్లి, అక్కడే సంబరాలు జరుపుకున్నారు. ఈ ఇద్దరూ కొంత కాలంగా ప్రేమలో ఉన్నారనే వార్త ప్రచారంలో ఉన్న విషయం తెలిసిందే. గత ఏడాది 'షేర్షా' చిత్రంలో నటించినప్పుడు ప్రేమలో పడ్డారని ప్రచారం జరిగింది. ప్రస్తుతం ఈ ఇద్దరూ తమ పెళ్లి పనులతో బిజీగా ఉన్నారని సమాచారం. ఫిబ్రవరి 6న పెళ్లికి ముహూర్తం కుదిరిందని బాలీవుడ్ టాక్. మెహందీ, సంగీత్, పెళ్లి.. ఈ మూడు వేడుకలు రెండు రోజుల పాటు జరగనున్నాయట. మెహందీ, సంగీత్ ఒకే రోజున, ఆ మర్నాడు వివాహ వేడుకను ప్లాన్ చేశారని భోగట్టా. రాజస్థాన్‌లోని జైసల్మేర్ ప్యాలేస్ వివాహ వేదిక కానుందనీ, పంజాబీ సంప్రదాయంలో పెళ్లి జరగనుందనీ టాక్. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య పెళ్లి చేసుకుని, సినీ ప్రముఖులకు ముంబయ్‌లో గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయాలని సిద్ధార్థ్, కియారా అనుకున్నారట. ఇక సినిమాల విషయానికి వస్తే.. సిద్ధార్థ్‌కి హిందీలో నటుడిగా మంచి పేరుంది. కియారా తెలుగులో మహేశ్‌బాబు సరసన 'భరత్ అనే నేను', రామ్‌చరణ్‌తో 'వినయ విధేయ రామ' చిత్రాల్లో నటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో ఆమే హీరోయిన్. హిందీ చిత్రాల్లోనూ కియారా నటిస్తున్నారు.


● కియారా, సిద్ధార్థ్

మైఖేల్ డేట్ ఫిక్స్

సందీప్ కిషన్ హీరోగా నటించిన తొలి పాన్ ఇండియా చిత్రం 'మైఖేల్'. రంజిత్ జయకొడి దర్శకత్వం వహించారు. నారాయణ్ దాస్ కె. నారంగ్ సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ, కరణ్ సి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ పతాకాలపై భరత్ చౌదరి, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 3న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, ఓ పోస్టర్‌ని రిలీజ్ చేసింది చిత్రబృందం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీలో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, కెమెరా: కిరణ్ కౌశిక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కె. సాంబశివరావు.


● దివ్యాంశ కౌశిక్, సందీప్ కిషన్

గీత రచయిత పెద్దాడ మూర్తి కన్నుమూత




సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్, ప్రముఖ పాటల రచయిత పెద్దాడ మూర్తి ఇకలేరు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా భీముని పట్నంలో జన్మించారు పెద్దాడ మూర్తి. తన తండ్రి పెద్దాడ వీరభద్రరావు నుంచి సాహిత్యాన్ని వంటబట్టించుకున్నారాయన. కాళీపట్నం రామారావు వంటి ప్రముఖుల రచనలతో స్ఫూర్తి పొందిన పెద్దాడ మూర్తి డిగ్రీ చదువుతున్న సమయంలోనే 'పతంజలి' అనే పత్రికలో జర్నలిస్టుగా చేశారు. వేటూరి స్ఫూర్తితో గేయ రచయితగా మారాలనుకున్నారు. దర్శకుడు కృష్ణవంశీతో పరిచయం ఉండడంతో హైదరాబాద్‌కి వచ్చిన మూర్తి సినీ జర్నలిస్ట్‌గా కెరీర్‌ను ప్రారంభించారు. పలు సినీ వార పత్రికలు, దినపత్రికల్లో పని చేశారు. మూర్తికి దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తొలిసారి 'కూతురు' (1996) సినిమాలో పాట రాసే అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత రవితేజ 'ఇడియట్' (చెలియా చెలియా..), 'అమ్మా నాన్న ఓ తమిళమ్మాయి' (నీవే నీవే..), చిరంజీవి 'స్టాలిన్' (సిగ్గుతో ఛీ ఛీ..), కృష్ణవంశీ 'చందమామ' (బుగ్గే బంగారమా..), మధుమాసం, పౌరుడు, కౌసల్య సుప్రజ రామ, అది నువ్వే, నాకూ ఓ లవర్ ఉంది' వంటి పలు సినిమాలకు పాటలు రాశారు పెద్దాడ మూర్తి. పలు టీవీ సీరియల్స్‌కీ పాటలు రాశారు. అలాగే 'ఇష్ట సఖి, హాస్‌ఫుల్' అనే ప్రైవేట్ ఆల్బమ్స్ చేశారు. 'తారా మణిహారం' అనే పుస్తకాన్ని రచించారు. మూర్తి మాటలు, పాటలు అందించిన 'నాగలి' సినిమా త్వరలో విడుదల కానుంది. మూర్తి మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, జర్నలిస్టులు సంతాపం తెలియజేశారు. కాగా పెద్దాడ మూర్తికి భార్య సంధ్య, కుమార్తె సుగాత్రి, కుమారుడు అభిజిత్ ఉన్నారు. హైదరాబాద్‌లోని ఈఎస్ఐ స్మశాన వాటికలో నేడు ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

ఓం నమశ్శివాయ


● శివ, రాశీ సింగ్

శివ కందుకూరి, రాశీ సింగ్ హీరో హీరోయిన్‌గా నటించిన చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'. పురుషోత్తం రాజ్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ స్నేహల్ జంగాల, శశిధర్ కాశీ, కార్తీక్ ముడుంబై నిర్మించారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్ విడుదలైంది. 'ఓం నమశ్శివాయ' అనే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ మోషన్ పోస్టర్‌లో వినబడుతుంది. ''ఇటీవలే షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం ఎడిటింగ్ జరుగుతోంది. శ్రీ చరణ్ పాకాల, విజయ్ బుల్గానిన్ మంచి సంగీతం అందించారు. త్వరలో టీజర్, ట్రైలర్‌ను విడుదల చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: గౌతమ్ జి.

వారసుడు పండగలాంటి సినిమా - శ్రీకాంత్



''నా కెరీర్‌లో తొలి తమిళ చిత్రం 'వారసుడు'. ఇందులో విజయ్‌కి బ్రదర్‌గా కీలకమైన పాత్ర చేశాను. అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. సినిమా ఒక దృశ్యకావ్యంలా ఉంటుంది'' అని హీరో శ్రీకాంత్ అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వారసుడు'. తమిళంలో 'వారిసు'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, పీవీపీ సినిమా పతాకాలపై 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, తమిళంలో ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర చేసిన శ్రీకాంత్ చెప్పిన విశేషాలు.

- తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా చేసినప్పటికీ పక్కా తెలుగు మూవీలానే ఉంటుంది. జయసుధగారు, నేను, కిక్ శ్యామ్, శరత్ కుమార్, రష్మిక, సంగీత, ప్రభు.. ఇలా అందరూ తెలుగు సినిమాలు చేసిన వారే ఉండటంతో పూర్తి తెలుగు నేటివిటీ సినిమాలానే ఉంటుంది. వంశీ పైడిపల్లి సినిమాల్లో గ్రేట్ ఎమోషన్స్ ఉంటాయి. ఆ కోవలోనే ఈ మూవీలో బ్రదర్స్ మధ్య జరిగే భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. విజయ్‌గారు ఎక్కువగా మాట్లాడరు. సెట్‌లో అడుగు పెడితే ప్యాకప్ చెప్పేవరకూ అక్కడే ఉంటారు. క్యారవాన్ వాడరు.. సెల్ ఫోన్ కూడా దగ్గర పెట్టుకోరు. ఒక మంచి సినిమా, విజయ్‌లాంటి స్టార్ హీరోతో తమిళంలో అడుగుపెడుతుండటం హ్యాపీ.
- ఇప్పుడు వస్తున్న సినిమాలన్నీ పాన్ ఇండియా అయిపోయాయి. మన తెలుగు సినిమాలు ఇతర భాషల్లోనూ హిట్ సాధిస్తున్నాయి. సంక్రాంతి అనేది సినిమాల పండగ కూడా.. అన్ని సినిమాలనీ ప్రేక్షకులు ఆదరిస్తారు. 'వారసుడు' పండగ లాంటి సినిమా. ఈ సంక్రాంతికి విడుదలవుతున్న సినిమాలన్నీ బాగా ఆడాలి.. అదే హ్యాపీ సంక్రాంతి. 'దిల్' రాజుగారి ప్రొడక్షన్‌లో చేయడం ఇదే తొలిసారి. 'వారసుడు'కి తమన్ అద్భుతమైన మ్యూజిక్, రీ రికార్డింగ్ ఇచ్చాడు.
- 'అఖండ' తర్వాత డిఫరెంట్‌గా ఉండాలని 'వారసుడు'లోని పాత్ర చేశాను. అలాగే రామ్‌చరణ్- శంకర్‌గారి సినిమాలోనూ మంచి పాత్ర చేస్తున్నాను. కథ, క్యారెక్టర్ నచ్చితే వైవిధ్యమైన పాత్రలు కచ్చితంగా చేస్తాను.

త్వరలో రాజా

రోషన్ హీరోగా, పూజా డే, అమీక్ష పవర్ హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'మన్మథరాజా'. యం.డి. అభిద్ దర్శకత్వంలో యండీ అహ్మద్ ఖాన్ నిర్మించారు. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నగేష్, అడిషనల్ డీఎస్‌పీ లక్ష్మణ్ రావ్, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్, డైరెక్టర్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''మన్మథరాజా' మూవీ బాగా వచ్చింది. త్వరలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు యండీ అహ్మద్ ఖాన్. ''నన్ను నమ్మి ఈ అవకాశం ఇచ్చిన అహ్మద్ ఖాన్‌గారికి థ్యాంక్స్'' అన్నారు అభిద్. ''మా అల్లుడు ప్రారంభించిన 'సినిమా ఆడెంట్' అనే హాస్పిటల్‌లో ఇండస్ట్రీలోని సాంకేతిక నిపుణులకు ఉచితంగా వైద్యం అందిస్తాం.. ఇందుకు గుర్తింపు కార్డులు ఇస్తాం'' అన్నారు ప్రతాని రామకృష్ణ గౌడ్.


● రామకృష్ణ గౌడ్, అహ్మద్ ఖాన్

సరిహద్దు ప్రేమ

అంజన్ రామచంద్ర, శ్రావణీ రెడ్డి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'లవ్ రెడ్డి'. స్మరన్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ హేమలతా రెడ్డి, మదన్ గోపాల్ రెడ్డి, ప్రభంజనం రెడ్డి, నాగరాజు బీరప్ప నిర్మించారు. ఈ చిత్రం గ్లింప్స్‌ను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో దర్శకుడు ప్రశాంత్ వర్మ విడుదల చేసి, మాట్లాడుతూ- ''లవ్ రెడ్డి' గ్లింప్స్ చాలా ఫ్రెష్ గా ఉంది. ఈ గ్లింప్స్ చూశాక నాకు కూడా ఒక లవ్‌స్టోరీ చెయ్యాలనిపిస్తోంది. యంగ్ టీమ్ చేసిన ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. ''ఆంధ్ర , కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో జరిగే స్వచ్ఛమైన ప్రేమకథగా ఈ చిత్రాన్ని రూపొందించాం'' అన్నారు స్మరన్ రెడ్డి. ''ఒక మంచి సినిమాలో నటించినందుకు ఆనందంగా ఉంది అన్నారు'' అంజన్ రామచంద్ర.


● రామచంద్ర, శ్రావణి

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	126	61,294
నిఫ్టీ ▲	35	18,233

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	10,318	▼ 148
డోజోన్స్	32,942	▼ 205
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,554	▲ 102
డాక్స్	14,182	▲ 112
షాంఘై	3,117	▲ 27
నికాయ్	26,094	▲ 1

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	55,581	▲ 714
బంగారం (99.5 స్వచ్ఛత)	55,359	▲ 712
వెండి (కేజీ)	69,227	▲ 1,135

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.95	83.62
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.82	89.91
€	యూరో	ఎస్‌బీఐ	98.29	101.62
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.75	64.79
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.39	57.75
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.90	62.91
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.11	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.67	23.46
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.87	12.90

ఏపీలో రూ.2,000 కోట్లతో గ్రాన్యూల్స్ ప్లాంట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ గ్రాన్యూల్స్.. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద భారీ ప్లాంటును ఏర్పాటు చేయనుంది. వచ్చే అయిదేళ్లలో ఈ కేంద్రానికి కంపెనీ రూ.2,000 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. 100 ఎకరాల విస్తీర్ణంలో దశలవారీగా ఈ ఫెసిలిటీ కార్యరూపం దాల్చనుంది. ఔషధాల ఉత్పత్తికి కావాల్సిన కీ స్టార్టింగ్ మెటీరియల్స్, ఇంటర్మీడియేట్స్, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్, ఫెర్మెంటేషన్ ఆధారిత ఉత్పత్తులను ఇక్కడ తయారు చేస్తారు. కాగా, గ్రాన్యూల్స్ తాజాగా గ్రీన్‌కో జీరోసీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఉద్గార రహిత విద్యుత్‌ను గ్రీన్‌కో ఈ ప్లాంటుకు సరఫరా చేస్తుంది. అలాగే డీసీడీఏ, పీఏపీ, పారాసీటమాల్, మెట్‌ఫార్మిన్, ఏపీఐలు, ఇంటర్మీడియేట్స్ తయారీలో వాడే రసాయనాలను సైతం అందిస్తుంది. గ్రాన్యూల్స్ ఇండియా సీఎండీ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి, గ్రీన్‌కో గ్రూప్ ఫౌండర్ మహేశ్ కొల్లి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.

జీపీఎఫ్‌పై 7.1% వడ్డీ...

న్యూఢిల్లీ: జనరల్ ప్రావిడెంట్ ఫండ్(జీపీఎఫ్), ఇదే మాదిరి ఇతర ఫండ్స్ రేటును 7.1 శాతంగా కొనసాగిస్తూ కేంద్ర సర్కారు నిర్ణయం తీసుకుంది. డిసెంబర్‌తో ముగిసిన 3 నెలల కాలానికి కూడా 7.1% రేటు అమల్లో ఉంది. అదే రేటును జనవరి–మార్చి త్రైమాసికానికి అమలవుతుందంటూ కేంద్ర ఆర్థిక శాఖ ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-1-2023	
విశాఖ	555–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	78.00
3-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	541–00
వరంగల్	543–00
రిటైల్ ధర	6.00

ఎలక్ట్రిక్ వాహనాలకు సబ్సిడీలను పొడిగించాలి

కేంద్రానికి ఎస్‌ఎంఈవీ విజ్ఞప్తి • ఫేమ్–2 పథకం గడువు పొడిగింపునకు అభ్యర్థన

న్యూఢిల్లీ: ఫేమ్–2 (ఎఫ్‌ఏఎంఈ) పథకం కింద ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవీ) సబ్సిడీలను పొడిగించాలని ఎలక్ట్రిక్ వాహనాల తయారీదారుల సంఘం (ఎస్‌ఎంఈవీ) కేంద్రాన్ని కోరింది. అలాగే ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రోత్సహించడానికి తేలికపాటి నుండి భారీ వాణిజ్య వాహనాలను కూడా ఈ పథకం కిందకు తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు 2023–24 ఆర్థిక బడ్జెట్‌లో చర్యలు తీసుకోవాలని కోరింది. ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలపై 5% ఏకరీతి వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)విధానాన్ని అవలంభించాలని కూడా తన బడ్జెట్ ముందస్తు సిఫారసుల్లో అభ్యర్థించింది. ఈ మేరకు వెలువడిన ప్రకటనలో కొన్ని ముఖ్యాంశాలు..



- ఫేమ్–2 గడువు 2024 మార్చి 31న ముగుస్తుంది. సబ్సిడీల ప్రయోజనం ఇంకా పరిశ్రమ పురోగతిపై కనిపించలేదు. అందువల్ల పథకం గడువును కేంద్రం మరోసారి పొడిగిస్తుందని భావిస్తున్నాం.
- సబ్సిడీని నేరుగా వినియోగదారులకు బదిలీ చేయడానికి వీలుగా పథకం నిబంధనలు ఉండాలి.
- ఫేమ్ 2 సబ్సిడీని ట్రాక్టర్లకూ విస్తరించాలి.
- దేశంలో లిథియం–అయాన్ సెల్స్ తయారీ ఇప్పటికీ ప్రారంభ దశలోనే ఉంది. కనుక వీటి తయారీ సామర్థ్యం దేశంలో పెరిగేంతవరకూ సెల్స్‌పై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయాలి.
- ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రోత్సహించడం కోసం రూపొందించిన పీఎల్ఐ (ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్) స్కీమ్ 'స్టార్టప్‌లు–ఎంఎస్‌ఎంఈలకు' ప్రయోజనం చేకూర్చేలా రూపొందించలేదు. స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఈలను పరిధిలోకి తేవాలి.
- పీఎల్ఐ పథకం పెద్ద కార్పొరేట్‌లు, బహుళజాతి కంపెనీలకే అనుకూలం. మూలధనం కోసం ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఈలకూ ఈ ప్రయోజనం అందాలి.
- దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీని మరింత వేగవంతం చేయడానికి ఈ రంగం రుణాలను ''ప్రాధాన్యతా'' రుణాలుగా పరిగణించాలి. దీనివల్ల ఈ రంగానికి తగిన మూలధనం అందుబాటులోకి వస్తుంది. ఎలక్ట్రిక్ వాహన కస్టమర్లకు విధించే వడ్డీ రేట్ల తగ్గుదలకూ ఇది దోహదపడుతుంది.

ఓయో ఐపీవోకు సెబీ బ్రేక్

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ.. ఒరావెల్ స్టేస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ప్రణాళికలకు తాత్కాలికంగా బ్రేక్ వేసింది. తగిన తాజా సమాచారంతో ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను తిరిగి దాఖలు చేయవలసిందిగా ఒరావెల్‌ను ఆదేశించింది. వెరసి దరఖాస్తును తిప్పి పంపించింది. ట్రావెల్ టెక్ సంస్థ ఓయోకు ఒరావెల్ మాతృ సంస్థకాగా.. యూనికార్న్ హోదాలో కంపెనీ 2021 సెప్టెంబర్‌లో ఐపీవో బాట పట్టింది. రూ. 8,430 కోట్ల సమీకరణకు వీలుగా సెబీకి దరఖాస్తు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 7,000 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేసేందుకు ప్రణాళికలు వేసింది. వీటికి జతగా మరో రూ.1,430 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. తొలి ప్రాస్పెక్టస్‌లో ఓయో ఈ ఏడాది (2022–23) తొలి అర్ధభాగ ఫలితాలను జత చేసింది. వీటి ప్రకారం ఏప్రిల్–సెప్టెంబర్‌లో రూ. 63 కోట్ల లాభం ఆర్జించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 280 కోట్ల నష్టం ప్రకటించింది. ఆదాయం 24% వృద్ధితో రూ. 2,905 కోట్లకు చేరింది.



టెలికంలో కొలువులకు 5జీ దన్ను

స్టాఫింగ్ సంస్థ ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ వెల్లడి



న్యూఢిల్లీ: అత్యంత వేగవంతమైన 5జీ సర్వీసుల ప్రారంభంతో ఈ ఏడాది (2023) టెలికం రంగంలో కొలువులకు ఊతం లభించగలదని అంతర్జాతీయ స్టాఫింగ్ సేవల సంస్థ ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ తెలిపింది. ఇటు సాంకేతిక, అటు సామాన్య నైపుణ్యాలు ఉన్న వారికి కూడా ఉద్యోగావకాశాలు లభించగలవని ఒక ప్రకటనలో పేర్కొంది. రాబోయే రోజుల్లో హైరింగ్ డిమాండ్ కేవలం టెలికం రంగానికి మాత్రమే పరిమితం కాకుండా హెల్త్‌కేర్, రిటైల్, తయారీ, ఆటోమోటివ్ తదితర రంగాలు కూడా 5జీకి అనుగుణంగా తమ సర్వీసు సామర్థ్యాలను పెంచుకునేందుకు గణనీయంగా రిక్రూట్ చేసుకునే అవకాశం ఉందని ఎన్‌ఎల్‌బీ వివరించింది. టెలికంయేతర రంగాల్లో డేటా సైంటిస్టులు, సైబర్‌సెక్యూరిటీ ప్రొఫెషనల్స్ మొదలైన వారికి డిమాండ్ ఉండగలదని పేర్కొంది. 2021తో పోలిస్తే 2022లో టెలికం టెక్నాలజీలో ప్రత్యేక నైపుణ్యాలున్న వారికి డిమాండ్ 20 శాతం పెరిగిందని తెలిపింది. ప్రస్తుతం సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, డేటా అనలిటిక్స్ వంటి ఉద్యోగాలకు మంచి డిమాండ్ ఉందని, 10–12 శాతం మెరుగైన ప్యాకేజీలు లభిస్తున్నాయని ఎన్‌ఎల్‌బీ వివరించింది. దిగ్గజ టెల్కోలు వచ్చే రెండేళ్లలో దేశవ్యాప్తంగా చాలా మటుకు ప్రాంతాల్లో 5జీ సేవలను అందుబాటులోకి తేనున్నాయని, దీని ప్రభావంతో నియామకాలకు కూడా తోడ్పాటు లభించగలదని పేర్కొంది.

సూచీలకు స్వల్ప లాభాలు

ముంబై: ఆద్యంతం లాభ, నష్టాల మధ్య కదలాడిన స్టాక్ సూచీలు చివరికి స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. బ్యాంకింగ్, ఐటీ, ఫార్మా షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 126 పాయింట్లు పెరిగి 61,294 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 35 పాయింట్లు బలపడి 18,233 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే అంశాలేవీ లేకపోవడంతో సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. రోజంతా పరిమిత శ్రేణిలో తీవ్ర ఒడిదుడుకులతో ట్రేడయ్యాయి. ఒక దశలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. అయితే చివరి గంట కొనుగోళ్లతో ఇంట్రాడే గరిష్టం వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 93 పాయింట్ల నష్టంతో 61,075 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 339 పాయింట్ల పరిధిలో 61,004 వద్ద కనిష్టాన్ని, 61,344 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 34 పాయింట్ల నష్టంతో 18,163 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 18,150 – 18,252 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. కమోడిటీ, ఎఫ్‌ఎంసీజీ, ఆటో, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.22%, స్మాల్ క్యాప్ సూచీ 0.18 శాతం పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.628 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.351 కోట్ల షేర్లను కొన్నారు. రూపాయి విలువ జీవితకాల కనిష్ఠ స్థాయి వద్ద ముగిసింది. డాలర్ మారకంలో 22 పైసలు పతనమై 83.00 స్థాయి వద్ద స్థిరపడింది.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- జొమాటో సహ వ్యవస్థాపకులు, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ గుంజన్ పాటిదార్ రాజీనామాతో కంపెనీ షేరు 2 శాతం నష్టపోయి రూ.58.90 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నాలుగుశాతానికి పైగా నష్టపోయి రూ.57.65 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.
- స్వల్ప శ్రేణి ట్రేడింగ్‌లోనూ బీమా కంపెనీల షేర్లకు డిమాండ్ లభించింది. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ 4.50%, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 4%, ఎల్ఐసీ 3.50%, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ రెండుశాతం చొప్పున లాభపడ్డాయి.

ఎన్‌డీటీవీ వాటాదారులకు జోష్

ఎన్‌డీటీవీ వాటాదారులకు బోనస్‌లాంటి వార్త. ఇటీవలే ఎన్‌డీటీవీని చేజిక్కించుకున్న అదానీ గ్రూప్.. మీడియా సంస్థ వాటాదారులకు షేరుకి రూ. 48.65 చొప్పున అదనంగా చెల్లించేందుకు నిర్ణయించింది. ఓపెన్ ఆఫర్‌లో భాగంగా నవంబర్ 22 నుంచి డిసెంబర్ 5 మధ్య షేర్లను టెండర్ చేసిన ఎన్‌డీటీవీ వాటాదారులకు తాజా చెల్లింపు వర్తించనున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ పేర్కొంది.

డిజిటైజేషన్‌లో భారత్ భేష్

- ఆర్థిక వృద్ధికి క్లౌడ్, ఏఐ ఊతం
- మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల వెల్లడి

ముంబై: డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన విషయంలో భారత్ అసాధారణ రీతిలో కృషి చేస్తోందని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల ప్రశంసించారు. టెక్నాలజీ ఆధారిత ఆర్థిక వృద్ధి సాధనలో క్లౌడ్, కృత్రిమ మేధ (ఏఐ) గణనీయంగా తోడ్పాటు నివ్వగలవని ఆయన తెలిపారు. నాలుగు రోజుల భారత పర్యటనలో భాగంగా మైక్రోసాఫ్ట్ ఫ్యూచర్ రెడీ లీడర్‌షిప్ సమిట్‌లో పాల్గొన్న సందర్భంగా నాదెళ్ల ఈ విషయాలు వివరించారు. 2025 నాటికి చాలా మటుకు అప్లికేషన్లు ..క్లౌడ్ ఆధారిత మౌలిక సదుపాయాలతో రూపొందుతాయని, సుమారు 90 శాతం డిజిటల్ పని అంతా క్లౌడ్ ప్లాట్‌ఫామ్స్‌పైనే జరుగుతుందని ఆయన చెప్పారు. 'ఈ నేపథ్యంలోనే మేము ప్రపంచవ్యాప్తంగా 60 పైగా రీజియన్లు, 200 పైగా డేటా సెంటర్లపై ఇన్వెస్ట్ చేస్తున్నాం. భారత్‌లో మరింతగా విస్తరిస్తున్నాం. హైదరాబాద్‌లో మా నాలుగో రీజియన్ ఏర్పాటు చేస్తున్నాం. క్లౌడ్‌ను అంతటా అందుబాటులోకి తేవాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాం' అని నాదెళ్ల చెప్పారు. భారత్‌లో క్లౌడ్ వినియోగానికి భారీ అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. క్లయింట్ సర్వర్ శకంతో పోలిస్తే ప్రస్తుతం అంతా మారిపోయిందని .. అన్ని వ్యాపారాల్లోనూ క్లౌడ్ వినియోగం పెరుగుతోందని నాదెళ్ల వివరించారు. 2020 ఫిబ్రవరి తర్వాత తొలిసారిగా భారత్‌లో పర్యటిస్తున్న సత్య నాదెళ్ల .. హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, బెంగళూరు నగరాలను సందర్శించనున్నారు. కస్టమర్లు, స్టార్టప్‌లు, డెవలపర్లు, విద్యావేత్తలు, విద్యార్థులు మొదలైన వారితో సమావేశం కానున్నారు.



కృత్రిమ మేధ హవా..

ఆటోమేషన్ గురించి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కృత్రిమ మేధ చాలా కీలకంగా మారగలదని నాదెళ్ల చెప్పారు. 'ముందుగా మనకు భారీ డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉండాలి. అది లేకుండా ఏఐ ప్రయోజనాలను పొందలేము. అందుకే మేము మౌలిక సదుపాయాలపై ఇన్వెస్ట్ చేస్తున్నాం' అని ఆయన తెలిపారు. ఉద్యోగులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ ఉండటం, మార్కెట్ శక్తులు దానికి తగ్గ ప్రోత్సాహాన్ని అందిస్తుండటం వంటి అంశాలు భారత్‌కు సానుకూలమైనవని నాదెళ్ల అభిప్రాయపడ్డారు. రీసెర్చ్ సంస్థ ఐడీసీ గణాంకాల ప్రకారం దేశీయంగా పబ్లిక్ క్లౌడ్ సర్వీసుల మార్కెట్ 2026 నాటికి 13 బిలియన్ డాలర్లకు చేరనుంది. 2021–26 మధ్య కాలంలో ఏటా 23.1 శాతం వృద్ధి నమోదు చేయనుంది. భారత్‌లోని టాప్ క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీసు ప్రొవైడర్లలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), గూగుల్ క్లౌడ్, మైక్రోసాఫ్ట్ అజూర్ ఉన్నాయి.

భవిత
• ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ రాష్ట్రంలో 5204 స్టాఫ్ నర్సు పోస్టులు

తెలంగాణ రాష్ట్రంలో మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ (ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ).. స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 5204
- **పోస్టుల వివరాలు:** డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్/డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్–3823, తెలంగాణ వైద్య విధాన పరిషత్–757, ఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ–రీజనల్ క్యాన్సర్ సెంటర్–81, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ–08, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–127, మహాత్మా జ్యోతిబా పులే తెలంగాణ వెనుకబడిన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ–197, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(గురుకులం)–74, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–124, తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషనల్ సొసైటీ–13.
- **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ▪ **వేతనం:** నెలకు రూ.36,750 నుంచి రూ.1,06,990 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఒప్పంద/ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేసిన పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 25.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.02.2023
- **వెబ్‌సైట్:** mh-srb.telangana.gov.in

తెలంగాణ రాష్ట్రంలో 1365 గ్రూప్-3 పోస్టులు

తెలంగాణ రాష్ట్రంలో 26 ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్–3 పోస్టులకు దరఖాస్తులకు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 1365
- **పోస్టుల వివరాలు:** వ్యవసాయ శాఖ–27, పశుసంవర్ధక శాఖ–02, బీసీ సంక్షేమం–27, ఇంధన శాఖ–02, పర్యావరణ శాఖ, అటవీ శాఖ–07, ఆర్థిక శాఖ–712, పౌర సరఫరాల శాఖ–16, సాధారణ పరిపాలన శాఖ–46, వైద్య, ఆరోగ్య శాఖ–39, ఉన్నత విద్య శాఖ–89, హోం శాఖ–70, పరిశ్రమలు, వాణిజ్య శాఖ–25, నీటిపారుదల శాఖ–01, కార్మిక శాఖ–33, మైనార్టీ సంక్షేమ శాఖ–06, పురపాలక శాఖ–18, పంచాయతీరాజ్ శాఖ–29, ప్రణాళిక శాఖ–03, రెవెన్యూ శాఖ–73, ఎస్సీ సంక్షేమ శాఖ–36, మాధ్యమిక విద్య శాఖ–56, రవాణా శాఖ–12, గిరిజన సంక్షేమ శాఖ–27, మహిళా శిశు సంక్షేమ శాఖ–03, యువజన సర్వీసుల శాఖ–05, గిరిజన సహకార ఆర్థిక సంస్థ(ట్రైకార్)–01.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 24.01.2023
- **దరఖాస్తులకు చివరి తేది:** 23.02.2023

గమనిక: ఖాళీల విభజన,వయస్సు,జీత భత్యాలు, కమ్యూనిటీ, విద్యార్హతలు తదితరాలతో కూడిన వివరణాత్మక ప్రకటన జనవరి 24న టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది.

- **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

తెలంగాణ రాష్ట్రంలో 113 ఏఎంవీఐ పోస్టులు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ)పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ▪ **మొత్తం పోస్టుల సంఖ్య:** 113

- **అర్హత:** ఇంజనీరింగ్ డిగ్రీ(మెకానికల్ ఇంజనీరింగ్/ఆటోమొబైల్) లేదా డిప్లొమా(ఆటోమొబైల్ ఇంజనీరింగ్)ఉత్తీర్ణతతోపాటు హెవీ మోటార్ వెహికల్(ట్రాన్స్‌పోర్ట్ వెహికల్) డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.**వయసు:** 01.07.2022 నాటికి 21 నుంచి 39ఏళ్ల మధ్య ఉండాలి. ▪ **వేతనం:** నెలకు రూ.45,960 నుంచి రూ.1,24,150 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్)పేపర్–1,పేపర్–2,ధ్రువపత్రాల పరిశీలన,రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 12.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**01.02.2023
- **పరీక్ష తేది:** 23.04. 2023.
- **వెబ్‌సైట్:** tspsc.gov.in

ఆర్ఆర్‌సీ-సెంట్రల్ రైల్వేలో 2422 అప్రెంటిస్‌లు

ముంబైలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ సెంట్రల్.. రైల్వే పరిధిలోని వర్క్‌షాప్‌లు /యూనిట్లలో.. వివిధ ట్రేడుల్లో 2422 అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 2422
- **ట్రేడులు:** ఫిట్టర్, మెషినిస్ట్, షీట్ మెటల్ వర్కర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, మెకానిక్ మెషిన్ టూల్స్ మెయింటెనెన్స్, కంప్యూటర్ ఆపరేటర్–ప్రోగ్రామ్ అసిస్టెంట్, మెకానిక్, పెయింటర్.
- **అర్హత:** పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 15.12.2022 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- **శిక్షణ కాలం:** ఒక ఏడాది.
- **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.01.2023.
- **వెబ్‌సైట్:** www.rrccr.com

డిగ్రీతో.. డిఫెన్స్ ఆఫీసర్

» సీడీఎస్(1)-2023 నోటిఫికేషన్ విడుదల
» త్రివిధ దళాలకు చెందిన 5 అకాడమీల్లో 341 పోస్టులు
» డిగ్రీ, బీటెక్ అర్హతలతో పోటీ పడే అవకాశం
» శిక్షణ సమయంలోనే నెలకు రూ.56,100 స్టయిఫండ్

సీడీఎస్‌ఈ.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్!! త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్ ర్యాంకులో..ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష. ఇందులో విజయం సాధిస్తే.. కొలువు ఖరారు కావడమే కాకుండా.. శిక్షణ సమయంలోనే నెలకు రూ.56వేలకు పైగా స్టయిఫండ్ పొందొచ్చు. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతోనే సీడీఎస్‌కు పోటీపడొచ్చు. ఇటీవల యూపీఎస్సీ.. సీడీఎస్(1)-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో..సీడీఎస్ పరీక్ష వివరాలు, భర్తీ చేయనున్న పోస్టులు, అర్హతలు, ఎంపిక విధానం, సిలబస్ విశ్లేషణ..



దేశ సేవ చేయాలనే తపన, దేశ రక్షణకు పాటుపడాలనే తెగువ ఉన్నవారికి చక్కటి అవకాశం.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేసన్. ఈ పరీక్షలో విజయంతోపాటు తదుపరి ఎంపిక ప్రక్రియలో నెగ్గితే.. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ, విభాగాల్లో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు హోదాతో కొలువు సొంతం చేసుకోవచ్చు.

అయిదు విభాగాలు.. 341 పోస్టులు

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(1)–2023 ద్వారా త్రివిధ దళాలకు చెందిన అయిదు విభాగాల్లోని 341 పోస్టులను భర్తీ చేయనున్నారు. అవి.. ఇండియన్ మిలటరీ అకాడమీ(డెహ్రాడూన్): 100; ఇండియన్ నేవల్ అకాడమీ(ఎజిమలా):22; ఎయిర్‌ఫోర్స్ అకాడమీ(హైదరాబాద్): 32; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(చెన్నై) (పురుషులు): 170; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(చెన్నై)(మహిళలు): 17.

అర్హతలు

- **ఇండియన్ మిలటరీ అకాడెమీ, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ: అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఇండియన్ నేవల్ అకాడమీ: అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూప్ చదివుండాలి. డీజీసీఏ జారీచేసిన కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉన్నవారికి రెండేళ్ల సడలింపు ఉంటుంది.
- నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

- **ఇండియన్ మిలటరీ అకాడమీ:** జనవరి 2, 2000–జనవరి1, 2005 మధ్యలో జన్మించి ఉండాలి.
- **నేవల్ అకాడమీ:** జనవరి 2, 2000–జనవరి 1, 2005 మధ్యలో జన్మించి ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ:** జనవరి 2, 2000– జనవరి 1, 2004 మధ్యలో జన్మించి ఉండాలి(డీజీసీఏ కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉన్న వారికి రెండేళ్ల సడలింపు ఇస్తారు).
- **ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ:** జనవరి 2,1999 – జనవరి 1, 2005 మధ్యలో జన్మించి ఉండాలి.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

సీడీఎస్‌ఈ ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుంది. మొదట యూపీఎస్సీ సీడీఎస్ రాత పరీక్ష నిర్వహిస్తుంది. ఇందులో నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించి.. మెరిట్ జాబితాలో నిలిస్తే.. మలి దశలో ఆయా దళాలకు చెందిన సర్వీస్ సెలక్షన్ బోర్డ్‌లు నిర్వహించే ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియలోనూ విజయం సాధించి తుది జాబితాలో నిలిస్తే.. అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న విభాగంలో కెరీర్ ఖరారవుతుంది.

రాత పరీక్ష ఇలా

- ఇండియ మిలటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అభ్యర్థులకు 300 మార్కులకు; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ అభ్యర్థులకు 200 మార్కులకు రాత పరీక్ష జరుగుతుంది. బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ తరహాలో జరిగే రాత పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి మూడో వంతు మార్కులు కోత విధిస్తారు.
- ఐఎంఏ, నేవల్, ఎయిర్‌ఫోర్స్ అకాడమీలకు జరిగే రాత పరీక్షలో.. మూడు విభాగాలు.. ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ 100 మార్కులకు చొప్పున ఉంటాయి. ప్రతి విభాగానికి పరీక్ష సమయం రెండు గంటలు.
- ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ జరిగే పరీక్షలో.. రెండు విభాగాలు ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్ వంద మార్కులకు చొప్పున ఉంటాయి. వీటికి ప్రతి విభాగానికి పరీక్ష సమయం రెండు గంటలు.
- పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది.
- రాత పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన అభ్యర్థులకు సర్వీస్ సెలక్షన్ బోర్డ్(ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. అన్ని అకాడమీల అభ్యర్థులకు ఉమ్మడిగా అయిదు రోజులపాటు ఈ టెస్ట్ జరుగుతుంది. ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి టెస్టులను 6 రోజులపాటు నిర్వహిస్తారు.

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

- సర్వీస్ సెలక్షన్ బోర్డ్‌ల ఆధ్వర్యంలో జరిగే ఎంపిక ప్రక్రియ 300 మార్కులకు ఉంటుంది. పలు రకాల పరీక్షలు, చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- మొదటి దశ స్టేజ్–1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్(ఓఐఆర్) టెస్ట్‌లు, స్టేజ్–2లో సైకాలజీ టెస్ట్‌లు, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్కులు, ఇంటర్వ్యూలు, కాన్ఫరెన్స్‌లు ఉంటాయి. వీటిని నాలుగు రోజుల పాటు నిర్వహిస్తారు.
- స్టేజ్–1, స్టేజ్–2ల తర్వాత వర్డ్ అసోసియేషన్ టెస్ట్(డబ్ల్యూఏటీ), సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్ (ఎస్ఆర్‌టీ)ల ద్వారా అభ్యర్థుల సమయస్ఫూర్తిని పరీక్షిస్తారు.
- చివరగా సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్(ఎస్‌డీ)లో అభ్యర్థి తన కుటుంబం, స్నేహితులు, కాలేజీ, ఉపాధ్యాయుల గురించి రాయాలి. ఈ టెస్టుల తర్వాత రెండు రోజుల పాటు 9 రకాల గ్రూప్ టాస్కులు నిర్వహిస్తారు.

చివరగా ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలోని రెండు దశల్లోనూ విజయం సాధించిన అభ్యర్థులకు చివరగా.. ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ ఇంటర్వ్యూను బోర్డ్ ప్రెసిడెంట్ లేదా సీనియర్ సభ్యుడి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఇంటర్వ్యూలోనే ఒక ప్రక్రియగా కాన్ఫరెన్స్ ఉంటుంది. ప్యానెల్ ముందు అభ్యర్థులు వేర్వేరుగా హాజరవ్వాలి. ఫ్లయింగ్ బ్రాంచ్ వారికి పీఏబీటీ ఉంటుంది. వీటిలో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిస్ట్ లిస్ట్ రూపొందిస్తారు.ఈ జాబితాలో చోటు సంపాదించుకున్న విద్యార్థులకు మరోసారి శారీరక, వైద్య పరీక్షలు నిర్వహించి.. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ టెస్టుల్లో ప్రతిభ ఆధారంగా ఫైనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తారు.

శిక్షణ, స్టయిఫండ్

సీడీఎస్ ఎంపిక ప్రక్రియలో నెగ్గిన అభ్యర్థులకు ఆయా అకాడమీల్లో శిక్షణ ఉంటుంది. ఇండియన్ మిలటరీ అకాడమీ(డెహ్రాడూన్)లో 18 నెలలు; నేవల్ అకాడమీలో 17 నెలలు; ఎయిర్ ఫోర్స్ అకాడమీలో 18 నెలలు; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో 11 నెలలు శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణ సమయంలో వీరికి నెలకు రూ.56,100 స్టైపెండ్ అందిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత లెఫ్టినెంట్ హోదాలో పర్మనెంట్ కొలువు సొంతమవుతుంది. నేవీలో మాత్రం ప్రారంభంలో సబ్–లెఫ్టినెంట్ హోదా లభిస్తుంది.ఎయిర్‌ఫోర్స్‌లో శిక్షణ పొందినవారు ప్రారంభంలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా విధులు చేపడతారు. ఇలా ఆయా హోదాల్లో సదరు విభాగాల్లో అడుగుపెట్టిన వారు కొన్ని నెలలు ప్రొబేషన్‌లో ఉంటారు.

విజయం సాధించాలంటే

- **ఇంగ్లిష్:** 120 ప్రశ్నలతో వంద మార్కులకు జరిగే ఇంగ్లిష్ విభాగంలో.. ఇంగ్లిష్ భాషపై పట్టును, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు. యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్, ఆర్డరింగ్ ఆఫ్ సెంటెన్సెస్, సెంటెన్సెస్‌లో పదాల ఆర్డరింగ్, ప్యాసేజ్‌లు, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్స్, ఇడియమ్స్, ఫ్రేజెసెస్, క్లోజ్డ్ టెస్టు, ఫిల్‌అప్స్, అనాలజీస్ సెక్షన్ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, స్పాటింగ్ ద ఎర్రర్స్ విభాగాల్లో మార్కులు సాధించేందుకు గ్రామర్ రూల్స్ తెలుసుకోవాలి.
- **జనరల్ నాలెడ్జ్:** అభ్యర్థుల్లో సామాజిక అంశాల పట్ల ఉన్న అవగాహనను పరీక్షించే విభాగమిది. 100 మార్కులకు–120 ప్రశ్నలకు ఈ పరీక్ష ఉంటుంది. ఇందులో కరెంట్ అఫైర్స్, జాగ్రఫీ, హిస్టరీ,ఇండియన్ పాలిటీ, ఎకనామిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ తదితర అన్ని సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. కరెంట్ అఫైర్స్ నుంచి ఎక్కువగా ప్రశ్నలు ఎదురవుతున్నాయి.
- **ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్:**ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీకి మినహా మిగతా పోస్టులకు మ్యాథమెటిక్స్ విభాగం ఉంటుంది. వంద ప్రశ్నలు–వంద మార్కులకు పరీక్ష జరిగే విభాగం ఇది. పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. టైమ్ అండ్ డిస్టెన్స్,స్టాటిస్టిక్స్ అండ్ ప్రాబబిలిటీ,వాల్యూమ్ అండ్ సర్ఫేస్ ఏరియా, లీనియర్ అండ్ క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, ట్రిగనామెట్రీ, ఫ్యాక్టరైజేషన్ తదితర చాప్టర్ల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. ముందుగా యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో వన్ టైమ్ రిజిస్ట్రేషన్ ద్వారా ప్రొఫైల్ రిజిస్టర్ చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:**జనవరి10,2023
- **సీడీఎస్‌ఈ(1)–2023 పరీక్ష తేదీ:**ఏప్రిల్16,2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, అనంతపురం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **వెబ్‌సైట్:** https://upsconline.nic.in, www.upsc.gov.in

క్లుప్తంగా...

వేణుగోపాలస్వామిగా యాదాద్రీశుడు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో అధ్యయనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు మంగళవారం ఉదయం స్వామివారు వేణుగోపాలస్వామి, రాత్రి గోవర్ధనగిరిధారి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కాగా, స్వామివారికి గత 20 రోజుల వ్యవధిలో రూ.2.12 కోట్ల నగదు, 167 గ్రాముల మిశ్రమ బంగారం, 2.6 కిలోల మిశ్రమ వెండి వచ్చినట్లు ఈవో గీతారెడ్డి వెల్లడించారు.

విద్యార్థుల కోసం సీసీఎంబీ బస్సుయాత్ర



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. స్టార్టప్‌లకు ఊతమిచ్చే అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ (ఏఐసీ)తో కలిసి తెలంగాణ మొత్తం బస్సుయాత్రను నిర్వహించనుంది. ఏఐసీ-సీసీఎంబీ గ్రాన్ టూరిస్మో అని పిలుస్తున్న ఈ యాత్ర విద్యార్థి ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుంది. వరంగల్, సిద్దిపేట జిల్లాల్లోని కాలేజీల్లో బుధ, గురు వారాల్లో ఈ బస్సుయాత్ర సాగనుంది. చిన్న నగరాల్లోనూ ఔత్సాహికులకు ప్రోత్సాహం అందించాలని, మరీ ముఖ్యంగా బయో టెక్నాలజీ, ఫార్మసీ, బయాలజీ విద్యార్థులు లక్ష్యంగా ఈ యాత్ర చేపట్టామని అటల్ ఇంక్యుబేషన్-సీసీఎంబీ సీఈవో మధుసూదన్‌రావు తెలిపారు.

ఆన్‌లైన్‌లో 8,694 మంది వైకుంఠ ఏకాదశి పూజలు

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ-తపాలా శాఖల సహకారంతో దేవాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా అర్చనలు చేయించుకునేవారి సంఖ్య పెరుగుతోంది. సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాష్ట్రంలోని మూడు ప్రధాన వైష్ణవాలయాల్లో 8,694 మంది భక్తులు ఆన్‌లైన్ ద్వారా గోత్రనామాలు తెలియపరిచి పూజలు చేయించుకున్నట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా యాదాద్రిలో 5,051 మంది, భద్రాచలంలో 2,773 మంది, ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 870 మంది ఆన్‌లైన్ ద్వారా పూజలు నిర్వహించుకున్నారు. ఇందుకు వారు రూ.210 చొప్పున రుసుము చెల్లించారు. వారందరికీ స్వామివారి అక్షింతలు, పసుపు, కుంకుమ, మిశ్రీతో కూడి డ్రైఫ్రూట్స్ ప్రసాదం, స్వామివారి లామినేటెడ్ చిత్రం ప్రసాదంగా ఇంటికి స్పీడ్ పోస్టు ద్వారా పంపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పేలిన వాషింగ్ మెషీన్..



సిద్దిపేట జోన్: విద్యుదాఘాతంతో ఒక వాషింగ్ మెషీన్‌లో పేలుడు సంభవించింది. సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన ఈ సంఘటనపై బాధితులు తెలిపిన వివరాలివి. మారుతీనగర్‌లో టీవీ మెకానిక్ పోలోజు వెంకటచారి ఎప్పట్లాగే తన దుస్తులను వాషింగ్ మెషీన్‌లో వేసి ఆన్ చేశారు. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా పేలిన పెద్ద శబ్దంతో వాషింగ్ మెషీన్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే మంటలను ఆర్పివేశారు. మెషీన్ ఆరుబయట ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంకటచారి టీవీ మెకానిక్ కావడంతో.. మరమ్మతులకు వచ్చిన రెండు టీవీలు కూడా ఈ ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ప్రమాదానికి విద్యుదాఘాతమే కారణమని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్టు తెలిపారు.

ఈడీ విచారణకు నౌహీరా



సాక్షి, హైదరాబాద్: హీరాగోల్డ్ కేసు దర్యాప్తులో భాగంగా హీరా గ్రూప్ అధినేత్రి నౌహీరా షేక్ మంగళవారం ఈడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. ఆస్తుల అటాచ్‌మెంట్‌కు సంబంధించి సుప్రీం కోర్టు ఇటీవల జారీ చేసిన ఆదేశాల మేరకు పలు డాక్యుమెంట్లను ఈడీ అధికారులకు సమర్పించినట్లు తెలుస్తోంది.

పొద్దస్తమానం.. ఫోన్‌లోనే!

కంచర్ల యాదగిరిరెడ్డి

టెక్నాలజీ అనేది రెండువైపులా పదునున్న కత్తి అంటారు... ఇదీ చాలా పాతకాలపు సామెతే కానీ, సోషల్ మీడియా ఈ తరానికి ముఖ్యంగా యువతరానికి చేస్తున్న చేటును దృష్టిలో పెట్టుకుంటే దానిని తరచూ గుర్తుచేసుకోవడంలో తప్పేమీ లేదు. ఇందుకు తగ్గట్టుగానే ట్విట్టర్, టిక్‌టాక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల లాభనష్టాల గురించి వివరించే అధ్యయనాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. తాజాగా లివింగ్ సర్కిల్స్ అనే సంస్థ దేశంలోని 287 జిల్లాల్లో 9–13 ఏళ్ల వయసున్న పిల్లలు గల తల్లిదండ్రులతో, అలాగే 13–17 సంవత్సరాల వయసున్న బాలబాలికలతో ఒక అధ్యయనం నిర్వహించింది. సామాజిక మాధ్యమాల వాడకాన్ని అనుమతించడంపై తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకుంటే సోషల్ మీడియా ఖాతాలను కలిగి ఉండటం దాని వాడకం తీరుతెన్నులపై టీనేజర్లను అడిగి తెలుసుకుంది. దేశవ్యాప్తంగా దాదాపు 65 వేల మంది ఈ అధ్యయనంలో పాల్గొన్నారు.

మాటలు లేవు...
మాట్లాడుకోవడాలు లేవు...
బంధుమిత్రులు ఇంటికొస్తే
పలకరింపులూ లేవు...
తలోక దిక్కున సెల్‌ఫోన్‌తో
ఎవరి పనిలో వారు బిజీ...
ఆ ఫోన్లతో సోషల్ మీడియా
సముద్రంలో ఈదుతుంటాం...
ఏ ఇంటికెళ్లినా
ఈ కాలంలో కనిపించే దృశ్యం
దాదాపు ఇదే!
ఏదో కాలక్షేపానికి కొద్దిసేపు సోషల్
మీడియాను వాడితే తప్పలేదు కానీ...
గంటలు కరిగిపోయే స్థాయిలో
దానికి కట్టుబానిసలైతే మాత్రం
డేంజర్.. డేంజర్.. డేంజర్!!!



జరుగుతోంది తప్పే...

అధ్యయనంలో పాల్గొన్న తల్లిదండ్రుల్లో 40 శాతం మంది పిల్లలు వీడియో గేమ్‌లకు, సామాజిక మాధ్యమాలకు బానిసలైనట్లు ఈ సర్వేలో వెల్లడైన భయంకరమైన సత్యం. కాగా, ఇది సరి కాదని వారు కూడా అంగీకరించడం కొసమెరుపు. హైస్కూల్లో చేరే వయసు కూడా లేని పిల్లలకు స్మార్ట్ ఫోన్లు నిత్యం అందుబాటులో ఉన్నాయని 55 శాతం మంది తల్లిదండ్రులు అంగీకరించారు. టీనేజర్ల తల్లిదండ్రుల దగ్గరకు వచ్చే సరికి ఈ సంఖ్య 71 శాతం ఉంది. అయితే, కోవిడ్ కారణంగా విద్యాసంస్థలు సక్రమంగా పని చేయకపోవడం వల్లనే తాము పిల్లలకు స్మార్ట్‌ఫోన్లు కొనివ్వాల్సి వచ్చిందని మెజారిటీ తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు. ఈ కారణంగానే పిల్లలు సామాజిక మాధ్యమాలకు పరిచయమయ్యారని, అది కాస్తా వ్యసనంగా మారుతోందన్నారు. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే సామాజిక మాధ్యమాల్లో ఖాతా తెరిచేందుకు కనీస వయసు కేవలం 13 ఏళ్లు మాత్రమే కావడం. దీనిని కనీసం 15 సంవత్సరాలకు పెంచితే సమస్య కొంతవరకైనా తగ్గుతుందని 68 శాతం మంది తల్లిదండ్రులు తమ ఆవేదన చెప్పుకున్నారు.

తమని తాము తక్కువ చేసుకుంటారు..

పిల్లలంటేనే వారికి ఎల్లల్లేని ఆత్మవిశ్వాసం. ప్రపంచంలో దేనినైనా అవలీలగా సాధించగలమన్న నమ్మకం కలిగి ఉంటారు. అయితే, సామాజిక మాధ్యమాల మితిమీరిన వాడకం కారణంగా వీరిలో ఈ లక్షణం క్రమేపీ సన్నగిల్లుతోందని, వారు తమని తాము తక్కువ చేసుకుని చూసుకుంటున్నారని లోకల్ సర్కిల్స్ అధ్యయనం తేల్చింది. ఆ సర్వే మాత్రమే కాదు ఇప్పటికే జరిగిన పలు శాస్త్రీయ పరిశోధనలు కూడా ఈ విషయాన్ని తేల్చి చెప్పాయి. ప్రతి చిన్న విషయానికీ సోషల్ మీడియాపై ఆధారపడటం వల్ల పిల్లలతోపాటు పెద్దవారిలోనూ కొన్ని శారీరక, మానసిక మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఈ పరిశోధనలు చెబుతున్నాయి. నిద్రలేమి, తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన, మనోవ్యాకులత, ప్రతిదానికీ చికాకుపడటం వంటివి వీటిల్లో కొన్ని. పైగా పిల్లలు ఏ అంశంపైనా సరైన దృష్టిని కేంద్రీకరించలేని పరిస్థితి ఉంటోంది. లోకల్ సర్కిల్స్ అధ్యయనం ప్రకారం 13–17 మధ్య వయస్కులు రోజుకు మూడు గంటల కంటే ఎక్కువ సమయం సోషల్ మీడియాపై ఖర్చు చేస్తున్నారు. నగరాల్లోనైతే 9–13 మధ్య వయస్కులైన పిల్లలు కూడా ఇదే రకంగా ఉన్నట్లు 49 శాతం మంది తల్లిదండ్రులు అంగీకరించారు.



మానసిక సమస్య కాదు

టీనేజీ లేదా అంతకంటే తక్కువ వయసులో సామాజిక మాధ్యమాలకు అలవాటు పడిపోవడం మానసిక సమస్య కాదన్నది నిపుణుల అభిప్రాయం. కాకపోతే మార్చుకోదగ్గ బిహేవియరల్ డిజార్డర్ అని చెప్పకతప్పదని ప్రముఖ మానసిక నిపుణుడు డాక్టర్ ఎంఎస్ రెడ్డి చెప్పారు. టీనేజీ వారైనా, పెద్దలైనా రోజుకు కనీసం 150 సార్లు తమ ఫోన్లు చెక్ చేసుకుంటారని సర్వేలు చెబుతున్నాయి. మరీ ఎక్కువగా ఆధారపడ్డ వారైతే నిత్యం ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండటం గ్యారంటీ అంటున్నారు నిపుణులు. సామాజిక మాధ్యమాల వల్ల సమస్యలున్నాయని కోవిడ్‌కంటే ముందు కూడా చాలా అధ్యయనాలు స్పష్టం చేశాయి. అతి వాడకం వల్ల ఇవి మరిన్ని వ్యసనాలకు పాల్పడే అవకాశాలూ ఎక్కువని ఈ అధ్యయనాలు తెలిపాయి. పెద్దలకు మాత్రమే పరిమితం కావాల్సిన కంటెంట్ సులువుగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండటమూ టీనేజీ వారికి అంత మంచిది కాదన్నారు మానసిక నిపుణులు డాక్టర్ వీరేంద్ర. ఇటీవల కాలంలో తమ వద్దకు వచ్చిన కేసుల్లో అధికం ఇలాంటివేనని మానసిక నిపుణులు అంటున్నారు. పైగా, సోషల్ మీడియాలో ఎవరు ఎవరన్నది ఏమాత్రం తెలిసే అవకాశం లేదు. ఈ కారణంగా ఆడ పిల్లలు ప్రమాదాల బారిన పడేందుకూ అవకాశాలు పెరిగాయంటూ ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ డిప్యూటీ కమిషనర్ జాయ్ ఎన్ టిర్కీ సైబర్ క్రైమ్ విభాగానికి సమర్పించినలో నివేదికలో వెల్లడించారు.

జామా సైకియాట్రీ అధ్యయనం ప్రకారం రోజుకు మూడు గంటల కంటే ఎక్కువ సమయం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి మాధ్యమాల్లో గడపడం టీనేజర్లకు ఏ మాత్రం సరి కాదు. అర గంట కంటే ఎక్కువ సమయం గడిపే వారికి అసలు వాడని వారితో పోల్చినప్పుడు మానసిక సమస్యలు ఎదుర్కొనే అవకాశాలు ఎక్కువ. టీవీ, సోషల్ మీడియా, వీడియో స్ట్రీమింగ్, మ్యూజిక్ వంటి అన్ని రకాల వినోదాలను పరిగణనలోకి తీసుకుంటే కొంతమంది టీనేజర్లు రోజుకు తొమ్మిది గంటల వరకూ గడుపుతున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి.

ఇలా గుర్తించండి..



- సోషల్ మీడియాలో గడిపే సమయం క్రమంగా ఎక్కువవుతుంటే... లైకులు ఎన్ని వచ్చాయి? ఎలాంటి కామెంట్లు వచ్చాయో... అని మామూలు సమయంలోనూ ఆలోచిస్తుంటే...
- ఫ్రెండ్స్‌తో ముచ్చట్లు తగ్గిపోయినా... ఇతర అలవాట్ల నుంచి దూరంగా తొలగుతున్నా... స్మార్ట్‌ఫోన్ లేదా ల్యాప్‌టాప్ అందుబాటులో లేకపోతే తెగ ఆందోళన చెందుతున్నా....
- చదువులు దెబ్బతింటున్నా.... బంధుమిత్రులు, తల్లిదండ్రులు తిడుతున్నా.. నచ్చచెబుతున్నా సోషల్ మీడియాను వదలకుండా ఉంటే...

పైన చెప్పుకున్న విషయాలన్నీ మీకు లేదా మీకు తెలిసిన టీనేజీ వారికి వర్తిస్తున్నాయా? అయితే సామాజిక మాధ్యమం ఉచ్చులో చిక్కినట్లే!!!

వెల్‌కం చెప్పారు విభిన్నంగా..



అందరూ న్యూఇయర్‌కు వెల్‌కం చెప్పేశాం.. ఒక్కొక్కరూ ఒక్కో టైపులో... చాలామందికి కొత్త సంవత్సరం తొలిరోజున ఫలానా పని చేస్తే.. ఆ ఏడాదంతా కలిసి వస్తుందని నమ్మకాలు ఉంటాయి. అందులో భాగంగానే చాలామంది ఆలయాలకు వెళ్తుంటారు. మన సంగతి సరే.. మరి విదేశాల్లోని సంగతేంటి? వాళ్ల సంప్రదాయాలు ఏంటి? సెంటిమెంట్లు ఏంటి? తెలుసుకుందామా..

ఆ 12 ద్రాక్షలు..



'నోచె వీజా'.. అంటే స్పానిష్ భాషలో పాత రాత్రి అని అర్థం. స్పెయిన్‌లో ఏటా న్యూఇయర్ సందర్భంగా ప్రజలు ఇంటిపట్టునే ఉంటూ సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలు కాగానే కొత్త ఏడాది తమకు అదృష్టం తెచ్చిపెట్టాలని కాంక్షిస్తూ 12 ద్రాక్షపండ్లను తినడం ఆనవాయితీ.

లక్‌ను తెచ్చే లోదుస్తులు..



బ్రెజిల్ పౌరులది మరీ విచిత్రమైన సంప్రదాయం.. కొత్త సంవత్సరం తమకు అదృష్టాన్ని, శ్రేయస్సును తీసుకురావాలని కోరుకుంటూ ప్రజలు రంగురంగుల లోదుస్తులు ధరించారు. ఒక్కో లోదుస్తుల రంగు ప్రేమ, వాత్సల్యం, ఆరోగ్యం మొదలైన వాటికి చిహ్నంగా నిలుస్తాయని వారి నమ్మకం.

ఆలూ ఏం చెబుతోంది..



కొలంబియన్లు కొత్త ఏడాది సందర్భంగా తమ దిండ్ల కింద పూర్తిగా చెక్కు తీసిన, సగం చెక్కు తీసిన, చెక్కు తీయని మూడు ఆలుగడ్డలను పెట్టుకున్నారు. ఒక్కో ఆలుగడ్డను ఆర్థిక సమస్యలు, సమృద్ధి, శ్రేయస్సు-నిరాశకు మధ్య సమతూక సంకేతంగా పరిగణించారు. న్యూఇయర్ రాత్రి దిండ్ల కింద పెట్టిన మూడు ఆలుగడ్డల్లోంచి ఒకదాన్ని కళ్లు మూసుకొని తీశారు. ఒక్కో వ్యక్తి తీసుకొనే ఆలుగడ్డ ఆ సంవత్సరమంతా అతని లేదా ఆమె తలరాతను సూచిస్తుందని భావిస్తున్నారు.

ఉల్లి చేసే మేలు..



గ్రీస్‌లో న్యూఇయర్‌ను పురస్కరించుకొని ప్రజలు 'వసిలోపిటా' అనే సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. కేక్‌ను శిలువ ఆకారంలో మూడుసార్లు కోసి సెయింట్ బేసిల్ అనే తొలినాళ్లకు చెందిన బిషప్‌కు అంకితమిచ్చారు. అలాగే ఏడాదంతా తమకు అదృష్టం తెచ్చిపెట్టాలని ఇళ్ల తలుపులకు కొన్ని ఉల్లిగడ్డలను వేలాడదీశారు. ఉల్లిని నిరంతర వృద్ధి, ఎదుగుదలకు చిహ్నంగా భావిస్తూ ఇలా చేశారు.

108 సార్లు వాయిస్తే..



కొత్త ఏడాది నూతన ప్రారంభానికి సూచికగా జపనీయులు గుళ్లలో 108సార్లు గంటలను మోగించారు. మనిషిలోని కోరికలు, ఆందోళనలను పరిశుద్ధం చేసుకొనేందుకు సంకేతంగా 108సార్లు గంటలు వాయిస్తారు.

ఉప్పుతో స్వాగతం...



టర్కీవాసులు సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలకు ఇంటి తలుపులపై ఉప్పును చల్లుతూ కొత్త ఏడాదంతా తమకు శాంతి, శ్రేయస్సును తీసుకురావాలని కోరుకున్నారు.

గోడకేసి కొట్టేద్దాం..



ఐర్లాండ్‌లో కొందరు ప్రజలు దుష్టశక్తులు, దురదృష్టాన్ని పారద్రోలేందుకు క్రిస్మస్ బ్రెడ్‌ను తమ ఇళ్ల గోడలపై విసిరి కొట్టారు. తద్వారా వారు కొత్త ఏడాదిని స్వచ్ఛంగా ప్రారంభిస్తున్నట్లు భావిస్తారు.

గిన్నెలు, గ్లాసులు బద్దలుకొట్టి...



డెన్మార్క్ ప్రజలు న్యూఇయర్‌ను పురస్కరించుకొని తమ పాత ప్లేట్లు, గ్లాసులను ఇరుగుపొరుగు, స్నేహితులు, కుటుంబ సభ్యుల ఇళ్ల తలుపులకేసి పగలగొట్టారు. తలుపుల వద్ద ఎన్ని పగిలిన ముక్కలు పడితే కొత్త ఏడాదంతా తమకు అంత బాగుంటుందని వారు విశ్వసిస్తారు.

రంగురంగులతో కొత్త కళ...



మెక్సికోవాసులు కొత్త ఏడాది రాక సందర్భంగా తమ ఇళ్లను సరికొత్త రంగులతో తీర్చిదిద్దారు. ప్రేమ కోసం పరితపించే వారికి ఎరుపు, కొత్త ఉద్యోగాన్వేషణ చేసే వారికి పసుపు.. ఇలా వివిధ రంగులు ప్రత్యేక సందేశాలను చాటుతాయని వారు భావిస్తారు.

గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌తో 300 ప్రాణాలు కాపాడాం

త్వరలో ప్రతి ఆర్టీసీ డిపోలో హెల్త్ వాలంటీర్ల నియామకం: సజ్జనార్

సాక్షి, హైదరాబాద్: తీవ్రమైన హృద్రోగ సమస్యలతో బాధపడుతున్న 300 మంది ఆర్టీసీ ఉద్యోగులను సకాలంలో గుర్తించి వైద్యం అందించడం ద్వారా వారి ప్రాణాలు రక్షించగలిగామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. గత నవంబర్‌లో ఆర్టీసీలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్ పేరుతో 46,340 మంది సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించినప్పుడు 300 మందికి తీవ్ర గుండె సమస్యలున్నట్టు తేలిందన్నారు. మంగళవారం తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రిని సందర్శించిన ఆయన మాట్లాడుతూ సిబ్బందికి వైద్యం అందించేందుకు త్వరలోనే ప్రతి డిపోలోనూ హెల్త్ వాలంటీర్ల నియామకాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఆసుపత్రిలో చల్లా చారిటబుల్ ట్రస్ట్, టీఎస్‌ఆర్టీసీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన నూతన బ్లడ్ బ్యాంక్‌ను సజ్జనార్ ప్రారంభించారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మెషీన్‌ను ప్రారంభించారు. ఆస్పత్రి భవన విస్తరణ పనులను పరిశీలించారు.



రక్తనిధిని ప్రారంభిస్తున్న సజ్జనార్

పశువుల కాపరికి రూ.7,500 జరిమానా

మంగపేట: రోడ్డువెంట అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను పశువులు ధ్వంసం చేయడంతో.. అందుకు బాధ్యుడైన పశువుల కాపరికి అధికారులు రూ.7,500 జరిమానా విధించారు. ములుగు జిల్లా మంగపేట మండలం బోరునర్సాపురం వద్ద ఏటూరునాగారం-బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై మంగళవారం అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను పశువులు ధ్వంసం చేశాయి. అదే సమయంలో మణుగూరు నుంచి ములుగుకు వస్తున్న కలెక్టర్ కృష్ణ ఆదిత్య దీన్ని గమనించి పశువుల కాపరులకు సూచనలు చేయగా బోయిన యాకయ్య అనే కాపరి పట్టించుకోలేదు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో స్థానిక అధికారులు యాకయ్యకు రూ.7,500 జరిమానా రశీదు ఇచ్చారు. అయితే అతను డబ్బులు చెల్లించకపోవడంతో అతని సెల్‌ఫోన్‌ను తమవద్ద ఉంచుకున్నారు. మరోసారి ఇలా జరగకుండా చూసుకోవాలని కాపరి బోయిన యాకయ్యను అధికారులు మందలిస్తూ అతని సెల్‌ఫోన్‌ను తిరిగి అప్పగించారు.



పశువుల కాపరికి పంచాయతీ అధికారులు ఇచ్చిన జరిమానా రశీదు

ఆరోగ్యం ముసుగులో ఉగ్రవాదం!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాడ్లు.. కర్ర..కత్తి ఏ ఆయుధాన్ని ఎలా వాడాలి..? ఎలా దాడి చేయాలి? మనిషి శరీరంలో ఎక్కడెక్కడ సున్నిత ప్రాంతాలు ఉంటాయి..? ఎక్కడ కొడితే ప్రాణాలు పోతాయి..? ఇవీ.. ఆరోగ్య పరిరక్షణ ముసుగులో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్‌ఐ) రహస్యంగా నిర్వహించిన కార్యకలాపాలు. శారీరక, మానసిక ఆరోగ్యం ముసుగులో పీఎఫ్‌ఐ చేసిన సంఘ వ్యతిరేక చర్యలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. యోగా.. కరాటే పేరుతో ఆయుధాల వినియోగం, మనుషులను సులువుగా చంపడం ఎలా..? తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారని తేలింది. ఈ వ్యవహారంపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) విచారణలో అనేక కీలక విషయాలు వెలుగుచూశాయి. ఇవే విషయాలను ఎన్‌ఐఏ ఇటీవల దాఖలు చేసిన చార్జిషీటులోనూ పేర్కొంది. శారీరక ఆరోగ్యానికి, ఆత్మరక్షణ పేరిట నడిపిన కరాటే శిబిరాలు, యోగా పేరిట నడిపిన ధ్యానకేంద్రాలన్నీ ఉగ్ర కార్యకలాపాలకు నిలయంగా మారాయని చార్జిషీటులో పేర్కొంది.

ఎలా బయటపడిందంటే..?

పీఎఫ్‌ఐ కీలక సభ్యుడు, నిజామాబాద్‌కు చెందిన (స్వస్థలం జగిత్యాల) అబ్దుల్‌ఖాదర్‌ను పోలీసులు నిజామాబాద్‌లో అరెస్టు చేయడంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది. ఇతను నిజామాబాద్‌లో దాదాపు 200 మంది ముస్లిం యువకులకు శిక్షణ ఇచ్చినట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు. గతేడాది జూలై 4న పోలీసులు అబ్దుల్ ఖాదర్, అతని అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. అతను ఇచ్చిన సమాచారంతో సాదుల్లా, ఇమ్రాన్, మొబిన్‌ను మరుసటి రోజు అరెస్టు చేశారు. వీరి నెట్‌వర్క్‌ను ఏపీలోని కడప, కర్నూలు నుంచి పీఎఫ్‌ఐ సభ్యులు ఆపరేట్ చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో నిజామాబాద్ 4వ టౌన్‌లో పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసులో నిందితుడు అబ్దుల్‌ఖాదర్ విదేశాలకు వెళ్లి రావడం, పలు దేశాల నుంచి పీఎఫ్‌ఐకి నిధులు తెచ్చినట్టు కూడా పోలీసులకు సమాచారం ఉంది. దీంతో ఎన్‌ఐఏ రంగంలోకి దిగి సెక్షన్ 120 (బి), 153(ఎ), ఐపీసీ సెక్షన్లు 17, 18, 18(ఎ), 18(బి) యూఏ(పి) యాక్ట్ కింద ఆగస్టు 26న తిరిగి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసులో అబ్దుల్ ఖాదర్ (ఆటోనగర్, నిజామాబాద్), అబ్దుల్ అహ్మద్ (ముజాహెద్‌నగర్, నిజామాబాద్), షేక్ ఇలియాస్ అహ్మద్ (ఖాజానగర్, నెల్లూరు), అబ్దుల్ సలీమ్ (ఇస్లాంపూర్, జగిత్యాల), షేక్ షాదుల్లా (గుండారం, నిజామాబాద్), ఫిరోజ్ ఖాన్ (శాంతినగర్, ఆదిలాబాద్), మహమ్మద్ ఉస్మాన్ (తారకరామనగర్, జగిత్యాల), సయ్యద్ యాహియా సమీర్ (ఆటోనగర్, నిజామాబాద్), షేక్ ఇమ్రాన్ (ముజాహెద్‌నగర్, నిజామాబాద్), మొహమ్మద్ అబ్దుల్ ముబీన్ (హబీబ్‌నగర్, నిజామాబాద్), మొహమ్మద్ ఇర్ఫాన్ (హుస్సేన్‌పురా, కరీంనగర్)పై చార్జీషీటు దాఖలు చేసింది.

హింసలో సుశిక్షితులు

నిజామాబాద్‌లో శిక్షణ పొందిన 200 మంది యువతను పథకం ప్రకారం ముందుగా ఆరోగ్యం, ధ్యానం పేరిట యోగా, కరాటే అంటూ పోగుచేశారు. ఆపై వారిలో దేశ వ్యతిరేక భావజాలం నింపుతూ వారి మనసులను కలుషితం చేసేందుకు యత్నించారు. యోగా క్యాంపుల ముసుగులో విద్వేషాలు రెచ్చగొట్టడం, కరాటే పేరిట దాడి చేయడంలో తర్ఫీదు ఇచ్చారని ఎన్‌ఐఏ చార్జిషీటులో పేర్కొంది. గొంతు, తల, ఉదరం తదితర సున్నిత ప్రాంతాలపై దాడి చేయడం, ఎక్కడ కొడితే మనిషి త్వరగా మరణిస్తాడన్న విషయాలపైనా తరగతులు ఇచ్చినట్లు కూడా ఎన్‌ఐఏ ఛార్జిషీటులో స్పష్టం చేసింది.

సులువుగా ఎలా చంపాలి?

- యువతను ఉగ్రవాదంపై నడిపేందుకు క్యాంపులు
- పీఎఫ్‌ఐ రహస్యంగా నిర్వహించిన కార్యకలాపాలివే..
- పీఎఫ్‌ఐ చార్జిషీటులో విస్మయకర అంశాలు
- 11 మంది నిందితుల్లో నలుగురు ఉమ్మడి జిల్లావాసులు
- మారణాయుధాల వినియోగంలో ప్రత్యేక తరగతులు
- మనిషిని చిటికెలో చంపడంలో సుశిక్షితులు
- ప్రధాన నిందితుడు, శిక్షితుడి స్వస్థలం జగిత్యాల



సోదాలు నిర్వహిస్తున్న ఎన్‌ఐఏ అధికారులు (ఫైల్)

కొనసాగుతున్న నిఘా..

ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాపై ఎన్‌ఐఏ నిఘా కొనసాగుతోంది. గతంలో క్రియాశీలకంగా ఉన్న సిమి (స్టూడెంట్ ఇస్లామిక్ మూమెంట్ ఆఫ్ ఇండియా) నిషేధానికి గురవడంతో పీఎఫ్‌ఐ ముసుగులో తిరిగి కార్యకలాపాలు మొదలు పెట్టినట్టు గుర్తించింది. అందుకే దేశవ్యాప్తంగా దీని కార్యకలాపాలకు కళ్లెం వేసేందుకు గతేడాది సెప్టెంబర్ 18న పీఎఫ్‌ఐ స్థావరాలపై దాడులు చేసింది. అందులోభాగంగా జగిత్యాల, కరీంనగర్ ప్రాంతాల్లోనూ సోదాలు నిర్వహించింది. పలువురి నుంచి కీలక డాక్యుమెంట్లు, పీఎఫ్‌ఐ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకుంది. సంస్థకు సంబంధించి ఇంకా ఎవరైనా సానుభూతిపరులు, స్లీపర్‌సెల్స్ ఉన్నారా? అన్న కోణంలో నిరంతర నిఘా కొనసాగుతూనే ఉంది.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.